# బహుళ

త్రైమాసిక అంతర్జాతీయ అంతర్జాల మహిళా పత్రిక

సంపుటి - 2 సంచిక 3 https://www.bahulabyjwalitha.com ఏప్రిల్ - జూన్ 2023



## రమాబాయి అంబేద్కర్

జననం : 07-02-1898 - మరణం : 27-05-1935

(88వ వర్ధంతి)

కవిత

# దేహచింతన



ఆచార్య చల్లపల్లి స్వరూపా రాణి

నిజానికి
మీకో దేశాన్నే యివ్వాలనుకున్నా
దేహాన్నిచ్చి పాఠ్య పుస్తకం అవుతున్నా
చచ్చినాక పూడ్చుకోడానికి
ఆరడుగుల నేలకోసం
యుద్ధాలు చేసే సంతతిని
వైద్య విద్యార్థీ!
యిది దేహం కాదు, దేశం
ఈదేహాన్ని జాగ్రత్తగా చదువు!
దేశం అర్ధమౌతాది
పేగుల్లో అర్ధశాస్త్రముంది చూడు
చర్మం సుకుమారి కాదు
వెన్నపూసల మర్దనా
నలుగుపిండి స్నానం యెరగదు
అయినా కళ్ళల్లో ఆకాంతి యెక్కడిదో
ఆరా తియ్ !
యిక గుండెకాయ గురించి యేమి చెప్పను!
యెన్ని కొంచెపు మాటలు
రంపంతో కోశాయో!
ఆగాయాలే సాక్ష్యం
వూపిరితిత్తులు నవనాడులు
కాసింత గౌరవం కోసమే కొట్టుకునేవి
ఈదేహానికి తలకంటే పాదాలే పవిత్రం

రాళ్ళూ రప్పల్లో చెప్పుల్లేకుండా
తిరుగాడిన కాళ్ళు
యెదురు దెబ్బలతో  నెత్తురు చిమ్మినా
నడక ఆపని కాళ్ళు
మొరటు చేతులు
యింకా మట్టి వదల్లేదు కదూ!
పైకి తేలిన నరాలు తప్ప
కాస్త నునుపైనాలేని
ఆచేతి వేళ్ళు లేడీస్ ఫింగర్స్ కావు
ఎండుకట్టె పుల్లలు
పిల్లలూ,
యెడమ చెయ్యి జాగ్రత్తరో !
వరినాటు, కవిత్వం అల్లిన చెయ్యి
అర్థంపర్థం లేని నీతుల్ని
కుడికాలితో తన్నిన చెయ్యి
పువ్వుల్నీ నవ్వుల్నీ వర్ణించుకోక
యెప్పుడూ ఆ దిక్కుమాలిన
మట్టీ మాశానం చెమటల్ని
యెందుకు రాయాల్సి వచ్చిందో అడుగు
I met the king
in the capacity of an opponent
not as slave

# 'ఆ సమాజపు ఆత్మ నిబ్బరపు మేరు పర్వత్వం'



మాయి రమా బాయి అంబేద్కర్ కు శతకోటి ఆత్మ విశ్వాసపు వందనాల మందార మాలలతో నేటి నీ 119వ పుట్టన రోజున (07-02-2017న) నీకొక లేఖ రాయాలని నా మనసు ఆరాట పడింది.

తల్లీ స్త్రీలు విద్యకు, స్వేచ్ఛకు అర్హులు కాదని, పాపాత్ములని అన్ని పాపాలకు కారణమని, వారి నాలుకలు ఆకురాతితో సమానమని ప్రచారం చేసి స్త్రీలను అణిచి వేసి అన్ని రకాలుగా దోచుకుంటున్న సమాజంలో పుట్టిన ఆత్మ నిబ్బరపు మేరు పర్వతానివి నీవు.

"ప్రతి పురుషుని విజయం వెనుక ఒక స్త్రీ ఉన్నది" అనే మాటకు సజీవ సాక్ష్యానివి. ప్రచండ కాంతి పుంజమై అణగారిన వర్గాలకు యుగాల నాటి చీకటిని తొలగించి జ్ఞానభిక్ష నందించిన బాబా సాహెబ్ భీమ్ రావ్ అంబేద్కర్ జీవన సహచరిగా నీవందించిన సహకారము, ప్రోత్సాహము ప్రతి మహిళకు మార్గదర్శకము తల్లీ. చదువు కంటే సౌశీల్యమే ముఖ్యమని పాటించి చూపిన మహామహిళవు తల్లీ నీవు.

తొమ్మిది ఏళ్ల పసిప్రాయంలోనే ఐదోవ తరగతి చదువుతున్న అంబేద్కర్ ను వివాహమాడిన బాల వధువువే అయినా నీ భర్త చదువు కోసం అనుక్షణం సహకరించిన గొప్ప సహన శీలివమ్మ నీవు.

సంసార బాధ్యతలు లేని నీ భర్తకు భారం కాకుండా జాగ్రత్త పడిన జీవన నౌకా సారంగివి కదా. దాదాపు వంద సంవత్సరాల క్రితమే తినడానికి తిండి లేక సమాజ వివక్షను ఎదుర్కొంటూ నలుగురు పిల్లల పోషణ భారాన్ని ఒక్కదానివే తలకెత్తుకుని, నీ భర్త విదేశాలకు వెళ్ళి విదేశీ చదువుల కోసం డబ్బులు పంపినావట గదా. పేడ తట్టను నెత్తిన మోసి, పిడకలు చేసి అమ్మిన డబ్బుతో, ఒక జ్ఞాన పర్వతానికి విద్యార్జనకు వెచ్చించినావంటే నీ వెంతటి బాధ్యత తెలిసిన తల్లివమ్మా. నీలాంట వారి గురించి ఈ భారత దేశ చరిత్రలో ఎప్పుడు రాస్తుందో విద్యార్థులు పాఠ్య పుస్తకాలలో నీ గురించి చదువుకునే రోజు అతి త్వరలో రావాలని కోరుకుంటున్నానమ్మా! నా ఆశ అత్యాశ కాదు కదా తల్లీ. తండ్రి అంబేద్కరుడు నీ గురించి స్వయంగా "నేను అమెరికాలో చదువుకునే సమయంలో నన్ను చదివించడం కోసం నా భార్య ఒక పూట తిని ఒక పూట పస్తులుండి ఆ డబ్బుల కూడబెట్టి నాకు పంపేది" అని రాశారంటే నీవెంత అదృష్టవంతురాలివో, నీ సేవ ఎంత గొప్పదో అర్ధమవుతున్నదమ్మా.

అవమానాల అంధకారంలో మగ్గుతున్న తన జాతిని అభివృద్ధి పరిచేందుకు తండ్రి అంబేద్కరుడు చేసిన దీక్షలో నీవు కనిపించని కాంతి కదమ్మా. పండరీపురం ఆలయం దర్శించాలన్న నీ కోరికను దళితులకు ఆలయ ప్రవేశము లేని ఆ రోజుల్లో తీర్చలేనందుకు నీ భర్త ఎంత తల్లడిల్లినాడో కదా. నీ మరణానంతరం అంబేద్కర్ 'బహిష్కృత భారత్' అనే పత్రికలో 1928 ఫిబ్రవరి 3న రాసిన వ్యాసంలో తన ఆవేదనను వ్యక్తపరిచాడు కదమ్మా. "నేను స్వదేశానికి తిరిగి వచ్చిన తర్వాత కూడా ఆపత్కాలంలో తలపై పెట్టుకున్న పేడ తట్టను ఆమె వదలాలని కాని, వెనక్కి ముందుకు చూడాలని కాని ఎన్నడు తలంచలేదు. అటువంటి మమతల మూర్తి సామాన్య స్త్రీతో రోజులోని 24 గంటల్లో అరగంట కూడా గడపలేకపోయాను" అని రాశారు కదమ్మా. నీ సంతానాన్ని నీవు ఎంత ప్రేమగా పిల్లల కోడిలా నీ రెక్కల కింద కాపాడేందుకు ప్రయత్నించినా నీ తొలి సంతానం రమేష్ మరణం నిన్నెంత కుంగ దీసిందో కదా. నీ మరో పుత్రుడు యశ్వంత్ రావుకు పోలియో రావడం నీ సంతానం ఒక్కొక్కరు గంగాధర్, ఇందు, రాజరత్న అనారోగ్యంతో చాలి చాలని తిండితో నిస్సహాయంగా మరణించడం చూచిన నీ మనసెంత కదిలిపోయిందో కదా. ఆ కుంగుబాటు చివరికి నిన్ను 1935 మే 27వ తేదీన ఈ లోకానికి దూరం చేసింది కదా తల్లీ. సంతానం ఎడబాటును తట్టుకోలేని నీ దుఃఖ సాగరం ఈదలేక పోయావు కదమ్మా. బాపుజ్యోతిరావు పూలేను అనుసరించిన సావిత్రిబాయి పూలే వలెనే నీవు కూడా బాబా అంబేద్కర్ ను అనుసరించిన సహధర్మ, సమ న్యాయం కోసం జరిపిన సంఘర్షణా మార్గంలో అడుగులో అడుగేశావు కదా తల్లీ. శతాబ్దాల తరబడి వర్గ, వర్ణ వివక్షను ఎదుర్కొనే ప్రయత్నంతో నీవు కూడా సమిధవే అని అర్థమయిందమ్మానాకు. అమ్మా రమాబాయి నీవు మరణించిన ఏడు సంవత్సరాల తర్వాత 1942 జులై 26న నాగపూర్ లో జరపబడిన నిమ్న జాతుల మహిళా సభలో బాబా అంబేద్కర్ చేసిన ఉపన్యాసంలో నీ ప్రభావం స్పష్టమవుతున్నదమ్మా. మహిళల పట్ల అంబేద్కర్ అంత గౌరవంగా ఉన్నారంటే నీ త్యాగ పటిమ, నీ సహనశీలతే కారణం అనుకుంటున్నాను నేను. మాటల సారం సంక్షిప్తంగా గుర్తు చేస్తున్నాన్నమ్మా. మహిళలు సంఘటితంగా కావాలని తమ పిల్లలను బాగా చదివించాలని, పిల్లలకు పరిపక్వత నేర్పాలని, మగవారిని తాగుడు మాన్పించాలని, బాల్య వివాహాలు చేయకూడదని, ఎక్కువ మంది బిడ్డలను కనవద్దని, భార్య భర్తకు బానిసకాకుండా, స్నేహతురాలిగా ఉండాలని చెప్పారు. నేటిక ఆ మాటలు ప్రతి ఒక్కరికి శిరోధార్యాలే కదమ్మా. ఈనాటి మహిళ పరిస్థితి దుర్భరంగా ఉన్నదమ్మ సమస్యల రూపం మారింది కాని పరిష్కారాలు పూర్తిగా సాధింపలేదమ్మా. బాల్య వివాహాలు ఇంకా జరుగుతూనే ఉన్నాయమ్మా, ఆడ పిల్లలు, మహిళల అక్రమ తరలింపు కొనసాగుతూనే ఉన్నదమ్మా. లైంగిక బానిసలుగా విదేశాలకు భారత మహిళలు తరలిస్తున్నారమ్మ, మహిళలపై నేరాల సంఖ్య గతం కంటే పెరిగాయి. నేరాల తీరు మారింది. మహిళల పరిస్థితి హృదయ విదారకంగా ఉన్నదమ్మా.

తల్లీ రమాబాయి... నీవు సావిత్రిబాయి పూలే మీరు మళ్లీ పుట్టాలమ్మా. నేటి మహిళలకు మీ వంటి వారి అవసరమెంతో ఉన్నదమ్మా, బహుజన రచయితల వేదిక "బేబీ కాంబ్లే రచనకు అనురాధ అనువాదం చేసిన "మా బతుకులు" పుస్తకం చదివితే స్త్రీల పరిస్థితి ఇంకా బాగా అర్థమవుతుందట. నేను కూడా చదువుతానమ్మా.

– జ్వలిత, ప్రధాన సంపాదకురాలు 9989198943.


## సంపాదక వర్గం

**ప్రధాన సంపాదకురాలు**
జ్వలిత

**సంపాదక వర్గం**
డా. తిరునగరి దేవకీదేవి
అనిశెట్టి రజిత
డా. కొమర్రాజు రామలక్ష్మి
ఆచార్య సూర్య ధనుంజయ
ఆచార్య కె. ఆశాజ్యోతి
డా. వంగరి త్రివేణి
జి. విజయలక్ష్మి
డా. షాజహానా
కొల్లాపురం విమల
డా. గోగు శ్యామల
డా. నందిగామ నిర్మల కుమారి
డా. మారోజు దేవేంద్ర
నస్రీన్ ఖాన్
నాంపల్లి సుజాత
నిరుపమ
లావణ్య
రమాదేవి బాలబోయిన

**సాంకేతిక వర్గం**
చందన్ కలిత
టి. నరేష్ చైతన్య
కె. ప్రకాష్

**కార్యనిర్వాహక వర్గం**
జయింతి వాసరచెట్ల
సరోజన బోయిని
యడవల్లి శైలజ
సిస్టర్ అనసూయ
పోతన జ్యోతి


**బహుళ బహుజనస్త్రీలసమస్యలన్నింటినీ చర్చించే అవకాశం కల్పిస్తుంది. పత్రికలో ప్రచురించే రచనలతో సంపాదక వర్గం ఏకీభవించినట్టు కాదు.**

రచనలు పంప వలసిన చిరునామా :
జ్వలిత, సాహితీవనం, 15-21-130/2, బాలాజీనగర్, కూకట్పల్లి, హైదరాబాద్ - 500072, తెలంగాణ editorbahula@ gmail.com

## విషయ సూచిక


| | | | |
|---|---|---|---|
| 1. | ముఖచిత్రం | మాయి రమాబాయి అంబేద్కర్ | – జ్వలిత........................................1 |
| 2. | కవిత | దేహచింతన | – ఆచార్య చల్లపల్లి స్వరూపా రాణి .........2 |
| 3. | వ్యాసం | 'ధరణీరుహ' ప్రేమ పరిచయం | – డాక్టర్ వాడ్రేవు వీరలక్ష్మీ దేవి..............5 |
| 4. | కథ | అజ్ఞాత సూర్యుళ్ళు | – కాంతి నల్లూరి ............................ 12 |
| 5. | కవిత | చీకటి కన్నీళ్లు | – సరసిజ పెనుగొండ కవిత .............. 18 |
| 6. | సాహిత్య వ్యాసం | తెలంగాణ ఉద్యమ సాహిత్యంలో కవయిత్రులు/రచయిత్రుల పాత్ర | – డా. వంగరి త్రివేణి...................... 19 |
| 7. | కథ | జీవన గంగ | – వనజ తాతినేని .......................... 27 |
| 8. | కవిత | సంజె వేళ  వాళ్ళు | – హిమజ  ................................. 32 |
| 9. | వ్యాసం | ఓల్గా గారి 'స్వేచ్ఛ' నవల స్త్రీల ఐడెంటిటీ స్ట్రగుల్ కు ప్రతిరూపం | – డాక్టర్ కొండపల్లి నీహారిణి ............. 33 |
| 10. | కథ | జర్నీ | – సరోజన బోయిని......................... 35 |
| 11. | కవిత | మహికే వెలుగు మహిళ | – డా.శ్రీభాష్యం అనూరాధ................ 38 |
| 12. | వ్యాసం | వంటంటే చిన్న చూపేందుకు? | – డాక్టర్ కందేపి రాణీప్రసాద్ ............ 39 |
| 13. | కవిత | మనుషుల గతీ అంతే | – తిరునగరి దేవకీదేవి ..................... 41 |
| 14. | కథ | విక్టరీ ఇస్ యువర్స్ | – సిస్టర్ అనసూయ  ...................... 42 |
| 15. | వ్యాసం | ఎంతమంది ఉసురు పోసుకుంటారు ? | – ఎస్. పుణ్యవతి ............................ 46 |
| 16 | వచన కవిత | దుప్పటి | – డాక్టర్ దాసోజు పద్మావతి .............. 48 |
| 17. | కథ | అనుమానం | – చల్లా. సరోజినీ దేవి...................... 49 |
| 18. | కథ | స్వార్థమే సౌఖ్యం | – డా. బండారి సుజాత ..................... 54 |
| 19. | వ్యాసం | దృశ్యచిత్రాల కూర్చే ఈ అక్షర నేత్రాలు..!! | – నాంపల్లి సుజాత ......................... 57 |
| 20. | కథ | మరో అమ్మ | – వై. సుజాత ప్రసాద్ ...................... 59 |
| 21. | వ్యాసం | రాజ్యాంగ నిర్మాత | – జి. విజయలక్ష్మి,......................... 63 |
| 22. | సమీక్ష | అత్యాచారాలపై గొంతెత్తిన మహిళారుద్రి – యుద్ధనారి | – శైలజామిత్ర................................ 65 |
| 23. | కథానిక | వాళ్ళ ఇంట్లోనో...? | – ఎం. వి. ఉమాదేవి ....................... 69 |
| 24. | గేయం | మాతృదేవోభవ | – ఆళ్ల నాగేశ్వరరావు ...................... 71 |
| 25. | వ్యాసం | ప్రకృతితో ప్రయాణం | – E.శ్రావణి.................................. 72 |
| 26. | వ్యాసం | ఇంట గెలిచి రచ్చ గెలడం... | – డా. ప్రతిభా లక్ష్మి ......................... 73 |
| 27. | కవిత | ప్రియ నేస్తం | – వకుళ వాసు ............................. 73 |
| 28. | వ్యాసం | తోడు చెవులే నాకు తోడూనీడ | – దేవరకొండ సుప్రియ .................... 74 |
| 29. | కవిత | దిగులు వర్ణం | – రోహిణి వంజారి ......................... 75 |
| 30. | సమీక్ష | అబ్బూరి ఛాయాదేవి కథల్లో స్త్రీ | – శాంతిశ్రీ బెనర్జీ ........................... 76 |
| 31. | కవితా సంకలనం | పరివ్యాప్త | – జాన్ హైడ్ కనుమూరి ................. 78 |
| 32. | వార్తావాహిని | ప్రపంచంలో అత్యంత అందమైన స్త్రీ | – సేకరణ జ్వలిత .......................... 81 |
| 33. | వ్యాసం | M C C | – మద్దూరి నరసింహమూర్తి,  ............. 82 |
| 34. | వ్యాసం | అసలేమి జరుగుతుంది | – డాక్టర్ విరించి విరివింటి ................ 85 |
| 35. | బాల బహుళ | | ................................................. 87 |

వ్యాసం

# 'ధరణీరుహ' ప్రేమ పరిచయం



- డాక్టర్ వాడ్రేవు వీరలక్ష్మీ దేవి




ధరణీరుహ అంటే చెట్టు అనే కదా. బహుశా అరణ్యపు అందాల గురించి సౌందర్యాత్మక మైన దృష్టితో ఈమె రాసి ఉంటారని అనుకున్నాను. నిజానికి వీరభద్రుడు అందులో ఏముందో సవివరంగా చెప్పినా నేను ఎందుకో అరణ్య సౌందర్యం ఉంటుందన్నట్టుగా మొదలుపెట్టాను.

కానీ ఈ పుస్తకంలో ఉన్న ఒక్కొక్క వ్యాసమూ చదువుతూ ఉంటే అడవి గురించి మనకి ఏమీ తెలియదు అనిపించింది. మనకి అంటున్నానని ఏమీ అనుకోవద్దు. మనలాంటి సాహిత్యపాఠకులంతా ఈ పుస్తకం చదివేక అదే మాట అంటారు.

నిజానికి పుట్టాక పదేళ్ల వయస్సు వచ్చే దాకా నేను గిరిజన ప్రాంతంలో, అడవుల మధ్య ఉన్న గ్రామం లోనే ఉన్నాను. ఊరికే రకరకాల చెట్లు, కాలిబాటలు, ఏర్లు, వెన్నెలలు, గిరిజన పాటలు తప్ప ఇంక వేటి మీదకి దృష్టి పోలేదు. ఇప్పటికీ ఈ పుస్తక చదివే దాకా కూడా ఇంతే.

దేవనపల్లి వీణా వాణి గారు తెలంగాణా రాష్ట్ర అటవీశాఖలోవన్య సంరక్షక సంబధిత అధికారి. అడవితో తన కాలాన్ని పెను వేసుకుని ప్రతి చిన్న విషయాన్ని కుతూహలంతో, ఆసక్తితో గమనిస్తూ దాని తాలూకు మూలాలను ప్రాక్, పశ్చిమ శాస్త్రాల నుంచి, ఆయా శాస్త్రజ్ఞుల నుంచి తెలుసుకుంటూ వచ్చారు. వాటి వివరాల కోసం చరిత్రను ఆసరాగా చేసుకుంటూ తవ్వుకుంటూ వచ్చారు.

ఇందులో ఉన్న 15 పెద్ద వ్యాసాలు చదువుకుంటూ వెళుతున్నప్పుడు అడవి గురించి మనకు ఎవరికీ కూడా ఏమీ తెలీదు అని మరొకసారి గట్టిగా అనిపించింది.

అడివే కాదు అసలు పర్యావరణం అనే మాటను ఎంత విరివిగా వాడుతున్నామూ, కానీ దాని గురించి ఎంత తక్కువ తెలుసు అని కూడా అనిపించింది. బహుశా వీణావాణి గారు ఈ లోటు పూరించడం కోసమూ, నా వంటి వారికి సంపూర్ణమైన పర్యావరణ జ్ఞానాన్ని అందించడం కోసం ఈ పుస్తకాన్ని రాసి ఉంటారు. అందుకే ముందుమాటలో ఇలా రాశారు.

"నేటి పరుగుల యుగంలో తనకూ ప్రకృతికి, ప్రకృతికి సంస్కృతికి, సంస్కృతికి నాగరికతకు ఉన్న సంబంధం, వాటి మధ్య ఉన్న అవినాభావపు లంకెలు గుర్తించగలిగే తీరుబడి లేకపోవడం ఒక కారణమైతే, ఒక అవగాహన కలిగించే రచనలు లేకపోవడం మరొక కారణం. సాహిత్యకారులు ప్రకృతి సౌందర్యాన్ని ఆరాధిస్తూ, పరిశోధకులు రహస్యాలు అన్వేషిస్తూ విడివిడిగా ప్రకృతి గురించి రాస్తూ వచ్చారు. కానీ వాటి మధ్య ఒక వారధి నిర్మించటం, తెగిన సున్నితపు లంకెలను కలుపుకోవటం, జీవ నైతిక నియమాలు పాటించటం చెప్పనవసరం లేని లక్ష్యాలు. వాటి కోసమే ఈ రచన చేస్తున్నాను" అని చెప్పారు.

"ఇంకా ఈ అడవిలో వచ్చే వ్యాసాలు అడవిని, వృక్ష, జంతు, జాలాలని వాటితో మానవునికి గల సంబంధాలను,

పరిశోధనలను, చరిత్రను, వికాసాన్ని, వారసత్వాన్ని కలగలుపుతూ ఆయా అంశాలను ఆవిష్కరిస్తూ ఒక సామాన్యునికి అడవిపట్ల, తమ ప్రాకృతిక బాధ్యతల పట్ల, జీవన నైతిక నియమాల పట్ల కనీస అవగాహన కలిగించటమే బాధ్యతగా పెట్టుకుని రాసినవి"

ఇవి ఆమె మాటలు. మనం ఈ 15 వ్యాసాలు చదువుతున్నప్పుడు అక్షరాక్షరంలోనూ ఆమె తీసుకున్న ఈ బాధ్యత నూటికి రెట్టింపు శాతం సాధించినట్లు గా మనకు అనుభవం అవుతుంది. నేను ఈ వ్యాసాలన్నీ చదువుతూ చెప్పలేని విభ్రాంతికి లోనవుతూ, ఒకింత సిగ్గుపడుతూ వచ్చాను.

ఇవి 15 వ్యాసాలు. వీటి గురించి టూకీగా నాలుగు మాటలు చెప్పటం ఇష్టం లేదు. అందువల్ల నాకు తోచిన ఒక్కొక్క వ్యాసం గురించి ఇక్కడ రాయాలన్నది నా ప్రయత్నం.

ప్రతీ వ్యాసం వెనుకా ఆమె పరిశోధన, క్షేత్రస్థాయి పరిశీలన తో పాటు ఆమె ఆవేదన నన్ను బాగా కదిలించింది.

ఒకరకంగా ఆమె అడవి లో భాగమైపోయారని అనిపించింది.

అడవి అంటేఅక్కడ మనం గమనించని ప్రతీదీ ఆమె కళ్లముందు కు వచ్చి నిలబడింది.

అవి కప్పలు, పుట్టగొడుగులు, శిధిలాలయాలు, గడ్డిపరకలు ఇలా అన్నీ మనకి కొత్తవి కానివి,కానీ నిర్లక్ష్యం చేయబడినవి. పర్యావరణ రక్షణకు మిక్కిలి అవసరమైనవి.ఆమె ఇందులో వాటినే సర్వ సమగ్రంగా మనకి చూపెట్టారు.

**ధరణీరుహ- 3**

ధరణీరుహ పుస్తకం లోని పదిహేను వ్యాసాల గురించీ నేను వరసగా రాయబోవడం లేదు. రుచి చూపించడమే నా ఉద్దేశం.

అందుకని ఇందులోని పలు కోణాల్లోని ముఖ్యమైన కోణాలు చెప్పడం కోసం మరో రెండు వ్యాసాలను ఎన్నుకున్నాను.

అందులో ఆమె చాలా ప్రత్యేకంగా రాసిన వ్యాసం పేరు వ్యథశాల. సరిగానే రాశాను. వధ్యశాల కాదు. వ్యథశాలే.

వీణావాణి గారు ప్రతీ వ్యాసాన్ని తనతో పాటు మనని అడవిలోకి తీసుకెళ్తూ మొదలుపెడతారు. అడవిలో అటవీ శాఖకు సంబంధించిన అనేక విషయాలతోపాటు, రాత్రి అయితే ఆ శరత్కాలపు వెన్నెలని గాని, లేదా శుక్లపక్ష రాత్రి అయితే నీలాస్మిక వర్ణం పులుముకున్న తనదైన ఒక మార్మిక సౌందర్యం గల రాత్రి అని గాని ఆ అందాలను చెప్పడం మానరు. అలాగే నిశ్శబ్దాన్ని కూడా అక్షరాల్లోకి తెస్తారు కవి కనుక.

అలా ఈ వ్యాసాన్ని అడవి ప్రయాణంతో మొదలుపెట్టారు. అక్రమ కలప రవాణా పట్టుకోవడం ఉద్యోగంలో భాగంగా ఒక ఫోన్ వార్త ఆధారంగా అర్ధరాత్రి అడవికి బయలుదేరి కాపు కాయడంతో వ్యాసం మొదలవుతుంది. నిజానికి తెల్లవార్లూ ఎదురుచూసినా ఆ అక్రమ కలప వాహనం కనిపించదు. కానీ — ఖాళీ సమయం లో తనకన్నా ఉద్యోగపు అనుభవంలో సీనియర్స్ అయిన వ్యక్తుల ద్వారా అనేక సంగతులు అనేక విషయాలు తెలుసుకుంటూ అవన్నీ రాస్తారు.

అడవి జంతువులు, వాటిని వేటాడే విధానాలు, మనుషులు అందుకోసం వాటిని చేసే మోసాలూ ఇవన్నీ వింటూ ఉండగానే తెల్లవారిపోతుంది. తాము ఎదురుచూసిన ఆ కలప వాహనం మాత్రం దొరకదు.

కానీ ఇలాంటి ఒక మాట రాస్తారు. ఎప్పుడైనా ఒకరోజు నిశ్శబ్దంగా ఉన్న అడవిలో ఒక శరత్కాలపు వెన్నెల మాత్రం జీవితాన్ని ముగించటం ఒక విలుప్త నదీ ప్రవాహమే అవుతుందని చెప్పగలను అంటూ.

ఇక తెల్లవారగానే తిరిగి వెనక్కి బయలుదేరుతారు నిష్ఫల ప్రయాస తో, అలా భావించకుండానే.

అటవీ శాఖ నిర్వహిస్తున్న వారోత్సవాల్లో భాగంగా మధ్యాహ్నం వరంగల్ కాకతీయ జూ పార్కుకి వెళ్లవలసి ఉంది. అక్కడ సంరక్షణ విధానంలో జంతు సంరక్షణ శాల ఒకటి ఉంది. అందరూ అనుకున్నట్టు అది ఊరికే జంతువులను ప్రదర్శించే చోటు కాదు. సహజ ఆవాసాలలో బతకలేని జాతులను సంరక్షించి, కొంతకాలం తర్వాత తిరిగి ఆయా జాతులను వాటి ఆవాసాలలో వదిలిపెడుతుంటారు. ఆ విధంగా మానవులు తమ వల్ల జరిగిన ప్రాకృతిక నష్టాన్ని పూరించే ప్రయత్నం చేస్తుంటారు.

అలా ఆరోజు మధ్యాహ్నం జూ పార్క్ కి వెళ్ళేటప్పటికి పలు విద్యాసంస్థల నుంచి విద్యార్థులు వచ్చి చూస్తూ ఉన్నారు. ఇంతకుముందు ఇక్కడ ఉన్న జంతువుల పరిరక్షణ పాఖాల అభయారణ్యం లోనే జరిగేది. ఇక్కడికి మార్చాక ఇది

పూర్తిస్థాయి జంతు సంరక్షణ శాలగా మారింది.

ఇంతలో ఒక అమ్మాయి వచ్చి మేడం ఈ జూ కన్జర్వేషన్ సెంటర్ అయితే ఎందుకు దీన్ని ఎగ్జిబిషన్ సెంటర్ అంటున్నారు తెలుగులో అనిఅడిగింది (Madam if zoo is coservation centre, why do our lesson has mentioned as exbition centre in telugu) అవును కదా జంతు ప్రదర్శనశాల అని కదా రాస్తున్నాం. ఆ చిన్న పిల్ల సూక్ష్మ బుద్ధి అది.ఇది విన్నాక ఇలాంటి లోపాలు దిద్దుకోవాలని గ్రహించాను అంటారు ఆమె.

అయితే ఆ మాట నుంచి ఆమె రాత్రంతా ఆలోచిస్తూనే ఉన్నారు ఇక్కడికి వచ్చిన జంతువులు దాహంతో దారి తప్పో, ఏ కారణంతోనో తమ ప్రపంచం నుంచి విడిపోయో, ఇక్కడికి వస్తుంటాయి. వాటిని ఇక్కడి వనపాలకులు ఎంత బాగా చూసినా అవి ఇంటి బెంగతోనే ఉంటాయి. అవి ఈ సంరక్షణశాల వాతావరణానికి అలవాటు పడాలంటే కొంత సమయం పడుతుంది. దానికోసం ప్రత్యేక శిక్షకులు, నిపుణులు ఉంటారు కానీ తిరిగి వాటికి అడవిలో ఉండే జీవనాన్ని ఇవ్వలేం కదా అంటారు వాణి గారు.

అలాఆలోచిస్తూ ఒక బెంచి మీద కూర్చున్న ఆమెకు ఎంక్లోజర్ లోఉన్న ఒక చిరుత కనిపిస్తూ ఉంది. దాని పేరు దేవా. దానికి తయారుచేసిన చెట్టు లాంటి నిర్మాణం మీద శరీరాన్ని వేలాడేసి తల ఒక పక్కగా పెట్టి ద్వేషము, ఆక్రోశమూ నిండిన కళ్ళతో చూసి మళ్లీ కళ్ళు మూసుకుంటేంది. మరొకవైపున ఉన్న ఎలుగుబంటి గుహలోంచి బయటకే రావటం లేదు. బయట పిల్లలు ఎంత శబ్దం చేస్తున్న వాటికి ఏమి సంబంధం లేనట్టు ఉన్నాయి. ఇలాంటి సందడి, హడావిడి వాటి జీవితంలో లేదు. ఉత్కృష్ట అరణ్యాలలో నిశ్శబ్ద లయగా కలిసిపోయిన జీవితం వాటిది.

మరి దానికి జీవితమంతా ఇక్కడే గడపబోతున్నానని అర్థమై ఉంటుందా? వదిలి వచ్చిన అడవి గురించి వేదన పడుతూ ఉంటుందా? దాని కళ్ళ నిండా నిండిన ఆ భావమే ఆమె కనిపిస్తోందంటారు. ఇప్పుడు ఆ చిరుత తనకు గాని, తనదంటూ లేని ఒక మానవ నిర్మిత ఇరుకు కల్మషకారాగాలలో బందీగా ఉంది. అని చెప్తూ ఆమె పదేపదే ఆ చిరుత గురించే ఆలోచిస్తూ ఎప్పుడో చదివిన ఒక కథను గుర్తు చేసుకుంటారు.

వాణి గారు ఇక్కడే నాకు ఎంతో ప్రత్యేకంగా అనిపిస్తారు. ఆమె అడవిలో తిరిగినా, జూలో తిరిగినా, అక్కడి నుంచి ఆమె ఆలోచనలు ప్రపంచమంతా విస్తరిస్తాయి. ఆమె చదివిన పుస్తకాల లోంచి దానికి సరిపోయే విషాదకరమైన సంగతులు గుర్తొస్తాయి. అవి ఆమె సున్నితానికే కాకఅపారమైన చైతన్యానికి, విశాలమైన ప్రపంచ దృక్పథానికి గుర్తుగా కనిపిస్తాయి.

ఆ రాత్రి కళ్ళు మూత పడినప్పుడు ఆమెకు దయానా ఫెర్రోస్ ( Internationally renowned South African poet, writer, and activist for marginalised groups) ఐ హావ్ కం టు టేక్ యు హోమ్ i have to come to take home) అన్న కవిత గుర్తుకొస్తుంది. ఆ కవితను తెలుగులో అనువదిస్తూ, దాని నేపథ్యాన్ని ఇలా చెప్తారు.

ఇది చదివి నేను నీరు కారిపోయాను. ఈ గాథ ను చదివిన ఎవరైనా ఇలాగే అయిపోతారు. దయానా ఫెర్రీస్ ఈ కవితను సారా బార్ట్ మాన్ కోసం రాసిందిట. సారా బార్ట్ మాన్ ఆఫ్రికా మూలవాసి. దయానాఫెరస్ ఆ గడ్డమీద పుట్టిన మనిషి, కవి. ఆమె తనలాంటి మనిషి 150 ఏళ్లకు పైగా ప్రదర్శనకు పెట్టబడిన స్త్రీ అని గుర్తు చేసుకుంటూ 'ఐ హేవ్ టూ కంక టు టేక్ హోం' అనే పద్యం రాస్తుంది. ఇది ఆఫ్రికన్ మూలవాసుల అస్తిత్వ ఉద్యమాలలో ఒక మేలుకొలుపు వంటి కవిత.

సారా బార్ట్ మాన్ కథని వీణావాణి గారు ఇలా చెప్తారు.

ఆఫ్రికాలో గడ్డి భూముల మీద ఆధారపడి జీవించే ఖోయి ఖోయి జాతి తెగలో సారా 1789లో పుడుతుంది. ప్రపంచ దేశాలు యూరోపియన్ హస్తగతమవుతున్న సంధి కాలంలో దక్షిణాఫ్రికా డచ్ వారి చేతిలో చిక్కుకుంటుంది. కేప్ టౌన్ చేరిన ఆటుపోట్ల గురైన అనే కుటుంబాల్లో సారా కుటుంబం ఒకటి. అందర్నీ పోగొట్టుకున్న ఆమె తన యజమాని ద్వారా లండన్ చేరుతుంది . అక్కడ ఆమె చేసే పని ఫ్రీక్ షో. అంటే వివిధ రకాల జీవులను ప్రదర్శించే ఒక షోలో ప్రదర్శనకు నిలబడ్డం. అంటే జంతువులతో పాటు మనుషులను కూడా ప్రదర్శనకు నిలబెట్టడం.

ఘోరమైన విషయమేమిటంటే ఇలా ప్రదర్శనకు నిలబెట్టడానికి ఆమెలోని ప్రధాన ఆకర్షణ ఆమెకు ఉన్న ఎత్తైన పిరుదులు. నిజానికి అది వారి జాతి లక్షణం. ఇలా ఆమె నాలుగేళ్ల పాటు నిత్యమూ ప్రదర్శనకు నిలబడుతూనే ఉంది.

ఆ తర్వాత వాళ్ళు ఆమెను ఫ్రాన్స్ కు చెందిన సర్కస్

కంపెనీకి అమ్మేశారు. అలా ఇంగ్లాండ్ నుంచి పారిస్ చేరుకుంది. చివరకు చేతులు మారుతూ ఒక జీవ శాస్త్రవేత్త కంట పడుతుంది.

ఆయన తన పరిశోధనలో ఖాళీలు పూరించే ఆశతో ఈమను చూస్తాడు. ఎత్తయిన పిరుదుల వెనుక ఉన్న ఎముకల నిర్మాణం ఆయన ఊహకు ప్రాతిపదిక. ఈ ప్రాతిపదికన ప్రయోగాలు జరుగుతున్న కాలంలోనే 1815లో ఆమె మరణిస్తుంది. అప్పటికే ఆమె వయసు పాతికేళ్ళు మాత్రమే.

ఎక్కడి నుంచి ఎక్కడిదాకా ప్రయాణం చేసిందో ఆమె ఊహించి ఉండదు. భాష రాదు. తన ప్రపంచం కాదు. కానీ ఆమెకు ఉన్న దేహాభిమానం గురించి లజ్జ గురించి ఆలోచిస్తేఅవి ఈ వికృత ప్రదర్శన మందు ఓడిపోయాయిఅంటారు .

మరణానంతరం సారా దేహం నిలవచేయబడుతుంది. జార్జెస్ క్యువియర్ అన్న ఆ శాస్త్రవేత్త కారణంగా ఆమె దేహపు భాగాలు ప్లాస్టర్ ఆఫ్ పారిస్ నమూనా మారి ప్రదర్శించబడతాయి.

పారిస్ నగరంలో ఇలా 2002 వరకు మ్యూజియంఆఫ్ మేన్ – యాంత్రోపాలజీ మ్యూజియం ఇన్ పారిస్ లోఈమె 150 సంవత్సరాలు ప్రదర్శనకు నిలబడింది.

కానీ ఆఫ్రికన్ ప్రజలు, స్వతంత్రులై, చైతన్యవంతులైన తరువాత ఆమె దేహాన్ని తిరిగి స్వదేశానికి తీసుకొచ్చారు.

ఆ క్రమంలోనే డయానా ఈ కవిత రాసింది.

ఆఫ్రికన్ ప్రజలు ఆమె దేహాన్ని స్వదేశానికి రప్పించేదాకా వారు శాంతించలేదు.

డయానా సారాబార్ట్ మన్ కోసం రాసిన కవిత లో “నేను నిన్ను ఇంటికి తీసుకు వెళ్ళటానికి వచ్చాను” అని పాడుతుంది. ఆనాడు వారంతా కలిసి పోరాడారు. తమ దేహమే ప్రదర్శనకు ఉన్నట్టు గా బాధపడ్డారు.

అది వారి ఆత్మగౌరవానికి మేలుకొలుపు గీతం. ఇలా 192 సంవత్సరాల తర్వాత ఆమె దేహం స్వస్థలానికి చేరింది. అప్పుడు ఆ దేహం ఆగస్టు 9న ఆఫ్రికన్ జాతీయ మహిళా దినోత్సవం రోజున ఒక కొండమీద శాశ్వతంగా నిద్రించింది.

ఆమె పేరు మీదుగా అక్కడి పర్యావరణ పరిరక్షణకు సారా బార్ట్ మాన్ పేరు పెట్టారు

ఇదంతా చెప్తూ ఆమె” సారా ఆనాడు విచిత్ర జంతువుల మధ్య తన ఉనికే తెలియకుండా ప్రదర్శించబడిందని, చూసేవాళ్ళు అత్యుత్సాహంగా విసిరిన రాళ్లదెబ్బలను, టిక్కెట్టు కన్నా ఎక్కువ ధర చెల్లించి తనను తాకాలని కోరుకున్న వాళ్లను తట్టుకుందని చెప్తూ ఇవాళ నేను చూసిన చిరుత మొహం ఆమెనే గుర్తు చేసింది” అంటారు.

పిల్లలకేరింతల మధ్య ముడుచుకుపోయిన ఇందాకటి ఎలుగుబంటి లాగే ఆమె ము. దుచుకుపోయి ఉంటుంది అని సారా గురించి ఆమె చెబుతున్నప్పుడు మనం జంతువుల కన్నా ఇంకా కిందిస్థాయిలో ఉన్నామని స్పష్టంగా తెలుస్తూ ఉంటుంది.

కానీ ఆమె అంటారు” సారా కోసం పోరాడినట్టు ఈ చిరుత కోసం మిగిలిన చిరుతల సమూహం రాలేదుకదా. ప్రకృతి వారికి సమాజాన్ని ఏర్పరచుకునే తెలివి మాత్రమే ఇచ్చింది తప్ప మరోలాంటి తెలివి ఇవ్వలేదు. ఇచ్చుంటే డయానా ఫెర్రస్ లా ఆత్మాభిమానంతో తనకోసం తనవాళ్ళు వచ్చేవారు. అని ప్రకృతి మానవుడు ఒక్కడికే ఇంత మేధను ఇచ్చింది. వెనక్కి తీసుకోలేదు కానీ అవసరం అయితే ముందుకు వెళ్ళకుండా ఆపగలదు. తనను తాను అదృశ్యం చేసుకొని అంతర్ధానమై అంతులేని ఎడారి మధ్య నిలబెట్టగలదు”

అంటూ ఆగ్రహంతో, ఎడతెగని ఆలోచనలతో ఎప్పటికో నిద్రపోయాను అంటారు. కానీ తెల్లవారి చూస్తే మిమ్మల్ని అందరినీ నిలదీస్తాననే భావంతో ఆమె రాసుకున్న కవిత కాగితం మీద కనిపిస్తుంది.

“ తనకుతానుగా మరణశాసనం రాసుకునే

మానవజాతివైపు సూటిగా

చూపుడు వేలెత్తి హెచ్చరిస్తుంటాను

విశ్వాత్మ ను నేను”

చివరిగా ఆమె ఈ రాసింది నేనా? లేక చిరుతనా? అని పూర్తిచేస్తారు.

ఈ వ్యాసంలో ఆమెకు ప్రదర్శనకు పెట్టిన చిరుతను చూడగానే ఎలాంటి కథ గుర్తొచ్చింది!! మనని అక్కడ నుంచి ఎక్కడికి తీసుకెళ్లారు!! మనకి తెలిసిన కాలంలోనే అభివృద్ధి చెందిన దేశాల నేతలు స్త్రీలను ఎలా వాడుకున్నారు? మనం జంతువులను ఎలా వాడుకుంటున్నామో సరిగ్గా అలాగే ఉంది

కదా!

అంటూ ఈ వ్యాసాన్ని అరణ్యం నుంచి, వరంగల్ దాటి, ఆఫ్రికా, ఇంగ్లాండ్, ఫ్రాన్స్ దాకా తీసుకుపోయి మళ్లీ ఆ జాతుల పోరాట విజయాలతో వెనక్కి తీసుకొస్తారు. కానీ ఆమెకు మరింత బాధ, జంతువుల కోసం ఇలా ఎవరు చేస్తారు?? ఎవరు ముందుకు వస్తారు? అని.

అసలు ఒక వ్యాసాన్ని ఇలా ఎక్కడో మొదలుపెట్టి, ఎక్కడెక్కడో తిప్పి గుండెను మెలిపెట్టి, మనను పలు విధాలుగా ఆలోచింపజేసి, గడ్డకట్టిన కోణాలను మెత్తబరిచిన వీణావాణి గారిని మరోసారి అభినందిస్తున్నాను.

కింద ఉన్న ఫోటో 1953 లో పుట్టిన దక్షిణాఫ్రికా కవి డయానా ఫెర్రస్, అడవిని వదిలిన ఒక చిరుత

**ధరణీరుహ 4**

రాత్రి మళ్లీఅంటే రెండోసారి ఈ పుస్తకం లోని 'తరుఘోష' వ్యాసం చదివాను. విభ్రాంతి కంటే పెద్ద మాట ఏదైనా ఉంటేబావుండును అనిపిస్తోంది దాని గురించి చెప్పాలంటే.

ఆమె ఈ వ్యాసం ఎక్కడ మొదలుపెట్టారు?? ఎన్ని విషయాలు దాంట్లో రాసుకుంటూ వచ్చారు!! దానికి వెనకాల ఎన్ని పుస్తకాలు చదివిన జ్ఞానం!! దానితోపాటు ఆ మొత్తం అంతటి మీద ఏర్పడిన స్పష్టమైన ఎంతటి అవగాహన ఉన్నాయో చదువుతుంటే ప్రతి వాక్యానికి ఆశ్చర్యపోతూనే వచ్చాను.

అడవి గురించి ఆమెకు తెలిసినంత స్పష్టంగా, లోతుగా మరి కొంతమందికి తెలిసి ఉండవచ్చేమో కానీ, అడవిపట్ల అంత మమేకమైన సహానుభూతి తోటి తానే అడవిలో ఒక భాగం అయినట్టుగా మారి రాయటం ఆమెకే చెల్లింది.

ఈ పుస్తకంలో ఇది 11వ వ్యాసం. ఇంతవరకు ఆమె ప్రతి వ్యాసం కూడా తాను తమ సిబ్బందితో కలిసి రాత్రి పగలు తేడా లేకుండా అడవిలో తిరగడమే చెప్తూ వచ్చారు. ఎక్కడ ఏం తిన్నారో, ఆ భోజనాల ప్రసక్తే లేదు.

నిజానికి భోజనం చేసి, నిద్ర పోవలసిన సమయాలవి.

కానీ ఒకచోట రాస్తూ భోజన సమయం అయింది, అక్కడ ఏమి దొరకవు, ఆ పొలంలో కాసిని మొక్కజొన్న పొత్తులు దొరికితే ఆ రాత్రికి అవి తిన్నాం అంటారు. మరొకచోట మంచినీళ్లు, అరటి పళ్ళు తీసుకుని బయలుదేరాం, లేదా కాసిన్ని బిస్కెట్లు తిన్నాము అని రాస్తారు.

మామూలుగా నాతో సహా అడవుల్లోనూ నగరాల్లోనూ ప్రయాణాలు చేస్తున్నామని రాసేటప్పుడు అక్కడ ఏవేవో రకరకాలు తిన్నామని చదివే వాళ్ళకి నోరూరేలాగా రాస్తాం. ఇది ఎంత చాపల్యమో ఈ వ్యాసాలు చదువుతుంటే అర్థమైంది.

చివరికి ఈ 11వ వ్యాసంలో పరకాల అనే చిన్న పట్టణానికి అక్రమ కలప రవాణా పట్టుకోవడం కోసం బయలుదేరేమని చెప్తూ అక్కడున్న ఒక చిన్న పూట కూళ్ల ఇంటి లాంటి హోటల్లో అందరం భోజనానికి కూర్చున్నాంఅని మొదలుపెడతారు.

ఇంకేమీ!! అక్కడి వంటకాల గురించి చెప్తారని అమాయకంగా ఎదురు చూస్తుంటే ఆమె తను కూర్చున్న చోటికి ఎదురుగా ఒక గోడ మీద ఉన్న బొమ్మలను వాటిని నీడలను చూస్తూ ఉండిపోయానని ఇంతలో వడ్డన జరగడం భోజనం చేయటం అయిపోయాయని చెప్పేసి ఆ బొమ్మలు వాటి నీడల చరిత్రను మొదలుపెట్టి తెలంగాణ సాయుధ పోరాటాన్ని, రైతాంగ ఉద్యమాన్ని మూలాల్లోకి వెళ్లి చెప్పుకుంటూ వచ్చి, అడవుల వినాశనానికి కారణాలను ఒకటి ఒకటి గా వలుచుకుంటూ వచ్చారు.

అదంతా వివరంగా చదవాల్సిందే గాని కొన్ని ముఖ్యమైన విషయాలు చెప్పకుండా ఉండలేను.

ఇప్పటి వరంగల్ జిల్లాలో ఉన్న పరకాల చరిత్రను ఈ సందర్భంగా ఇలా చెప్పారు.

ఆమె కూర్చున్న ఆ ఇంటి హోటల్ ఎదురుగా పిట్ట గోడ మీద వరుసగా నడుస్తున్న మనుషులు తమ చేతుల్లో దొరికిన ఆయుధాన్ని పట్టుకొని వెళ్ళుతున్నట్టు కనిపిస్తున్నది. గబుక్కున చూస్తే వాళ్ళు నిజంగా వెళుతున్నట్టుగానే ఉంది, కానీ వాళ్లు కదలటం లేదు.

ఇలాంటి బొమ్మలతో ప్రహరీ. లోపల ఒక గుమ్మటం పైన చెదురుమదురుగా శవాల వలె ఉన్న బొమ్మలు. దాని గురించి అడిగితేఅక్కడి వారు అది పరకాల అమరవీరుల పార్క్ అని చెప్పారు. ఆమె త్వరగా భోజనం కానిచ్చి ఆ పార్కు వైపు వెళ్లి అక్కడ గేటు వేసి ఉన్నా సరే ఆ బొమ్మల్ని వాటి వెనుక ఉన్న పోరాటాన్ని వివరంగా తలుచుకుంటూ మనకు చెప్తారు. తెలంగాణలో పరకాల ఘటన అని ఒక సందర్భం. జాతీయ జెండా ఎగరవేసినందుకుగాను ఆనాటి నిజాం ప్రభుత్వం, నిజాం

ప్రైవేటు సైన్యం, రజాకార్లు, గ్రామస్తులను భయపెట్టడానికి జెండా ఎగరవేసిన యువకులను చెట్టుకు వేలాడదీసి కాల్చి చంపేశారు. అదొక దారుణ సందర్భం. పరకాల ఘటన కూడా అటువంటిదే. ఆ గాయపు గుర్తుకే ఇప్పుడు అమరధామం అని పేరు పెట్టారు. ఇది 1947 లో జరిగితే అమర్ ధామం 2003లో కట్టారు. ఇదంతా ఆమె భోజనం చేస్తున్నంత సేపు ఎదురుగా ఉన్న ఆ గుమ్మటాన్ని చూసి తర్వాత గుర్తు చేసుకున్న చరిత్ర.

ఇక్కడి నుంచి మొదలుపెట్టి తెలంగాణ సమాజం స్వతంత్రం కోసం మొదలుపెట్టిన సాయుధ పోరాటం ప్రపంచ రైతాంగ ఉద్యమాల్లోనే గొప్ప చారిత్రక సందర్భం అని చెబుతూ, ఆ నేపథ్యంలో అడవుల విధ్వంసంలోకి ఆమె కథ నడుపుతారు.

ఎందుకంటే సాహిత్య పోరాటంలో ప్రత్యక్షంగా జరిగినది అధికార బదలాయింపైతే, పరోక్షంగా సామాన్యుల భూములు యాజమాన్య హక్కులు పొందడం.

ఈ రెండింటి మధ్య ప్రభావితమైనవి అడవులు , వన్యప్రాణులు.

రాజకీయ కోణాలకు సంబంధం లేకుండా అడవులు, వన్యప్రాణులు కూడా ఈ పోరాటంలో పడ్డాయి. గాయపడ్డాయి. అమరులయ్యాయి.

ఇలా ఆమె కనిపించే పోరాటాల వెనుక కనపడని, లేదా, చరిత్ర నమోదు చేయని అరణ్య విధ్వంసం గురించి ఈ వ్యాసం అంతటా చాలా వివరంగా చారిత్రకమైన ఆధారాలతో చెప్పుకొస్తారు.

వలస పాలనకు ముందు అడవుల పరిస్థితి ఏమిటి? తర్వాత అడవుల విధ్వంసం విచక్షణా రహితంగా ఎలా జరిగింది ఇందులో స్పష్టంగా రాశారు.

పూర్వకాలంలో అడవుల మీద అధికారం అందరి దీను. వాటిని ఉపయోగించుకోవడం లో రాజ్యం తాలూకు జోక్యం పెద్దగా కనపడదు. అలాగని ప్రజలు కానీ రాజ్యం గానీ అడవులను ధ్వంసం చేసిన దాఖలాలు లేవు. వన్యప్రాణులకు వచ్చిన నష్టమూ లేదు. ఇలా చెప్తూ కౌటిల్యుడి అర్థశాస్త్రంలోనే అడవుల నిర్వహణ గురించి ఏం చెప్పాడో, రామాయణ కాలంలో సుందరకాండలో 13వ సర్గ 62వ శ్లోకంలో అడవిలో కలుపు తీయడం గురించి ఏం రాశారో ఈ వివరాలన్నీ చెప్పుకుంటూ వస్తారు.

ఇలా అడవుల చరిత్రను అధ్యయనం చేసినప్పుడు సామాజిక మార్పులు అధ్యయనం చేసినంత లోతుగా ప్రాకృతిక వనరులను, వాటి నిర్వహణను, మార్పును అధ్యయనం చేయకపోవడం ఒక అగాధంగా మిగిలిపోయిందనీ, నేను ఎప్పటికైనా పూరించటానికి కృషి చేయగలననిఆలోచిస్తూ ఉంటానని, అందుకు అన్వేషిస్తూ ఉంటానని, అందుకే ఇలా రాస్తూ ఉంటానని రాస్తారు.

మాట్లాడలేని వాటి చరిత్ర నాలాంటి వాళ్ళు చెప్పకపోతే నోరులేని వాటి వేదన ఎవరికైనా ఎలా తెలుస్తుంది అని అడుగుతారు. ఇదంతా ఆమె రాత్రి పది దాటిన తర్వాత అక్రమ కలప రవాణా పట్టుకోవడం కోసం అతి కొద్ది మంది సిబ్బందితో అడవిలో కాపలా కాస్తూ ఉన్న సందర్భంలో చేసిన ఆలోచనల సారం .

ఇక తనతో ఉన్న సిబ్బంది తనకంటే చాలా సంవత్సరాలు అటవీ శాఖలో అనుభవం ఉన్న వాళ్ళు. వాళ్ల ద్వారా తెలుసుకున్న విషయాలు చెప్తారు.

అవి ఆశ్చర్యాన్నే కాక ఎంతో బాధని కూడా కలిగిస్తాయి. ఒకప్పుడు విస్తారమైన అడవి. ఆ అడవులను నరికి ఎడ్లబళ్లలో రవాణా చేస్తూ ఉంటే అటవీ శాఖ వాటిని పట్టుకోడానికి పడిన పాట్లు. ఆ సందర్భంగా చివరకు సిబ్బందికి మరణాలు కూడా సంభవించడం, అయినా సరే విధి నిర్వహణ చేయడం, ఇదంతా మనకు చదువుతూ ఉంటే కనువిప్పుగా అనిపిస్తుంది.

ఈ అక్రమ రవాణాలు నానాటికి పెరగడమే కాక అటవీ శాఖకు పెద్ద సవాలుగా మారడం గురించి కూడా రాస్తారు. పైగా ఆ రోజుల్లో అటవీ శాఖ సిబ్బంది దగ్గర ఆయుధాలు కూడా లేకుండా పోవడం జరిగింది. అందువల్ల ఇప్పటివరకు 1400 మంది అటవీ సిబ్బంది అడవులను కాపాడడంలో అమరులయ్యారు అని చెప్తూ ఆ సందర్భంగా అమ్రిత దేవి నాయకత్వం లో 360 మంది బిష్ణోయ్ తెగ ప్రజల త్యాగాన్ని తలుచుకుంటారు.

మనకి సుందర్లాల్ బహుగుణ చిప్కో ఉద్యమం తెలుసు. కానీ దానికి స్ఫూర్తినిచ్చినది రాజస్థాన్ కు చెందిన ఈ బిస్నోయి తెగ వాళ్ళు. వారు జోధాపూర్ రాజా పేలస్ కోసం కలప నరుకుతుంటే దానికి వ్యతిరేకంగా జమ్మి చెట్లను ఒక్కొక్కరు

ఒక్కొక్క చెట్టును హత్తుకుని తమ ప్రాణాలు తీసేకే చెట్టు నరకాలని అడ్డుపడతారు. రాజు సైన్యం రాజాజ్ఞ పాటిస్తారు. 360 మందిని చంపేస్తారు. ఇది రాజుకు తెలిసి సిగ్గుపడి, ప్రజలను క్షమాపణ కోరి ప్రజల వనాలకు సంరక్షణ కల్పిస్తాడు.

ఈ కథను ఆమె 2007లో బిష్ణోయ్ తెగవారిని కలుసుకుని అమృతా దేవి సమాధి దర్శించి, వారి నోటనే విన్నారని చెప్పారు.

ఇంకా అసలు బ్రిటిష్ వాళ్లు రాకపూర్వం అడవులు ఎలా ఉండేవి, క్రమంగా జమీందారీ వ్యవస్థ ఏర్పాటు చేసి, భూముల మీద అధికారాలు పొందుతూ, అడవులను నరికి కలపను రవాణా మార్గాల కోసం వాడుకోవడం తో మొదలుపెట్టి, భారతదేశం అంతటా వేల ఎకరాల అడవులను ఎలా నరుక్కుంటూ వచ్చారో సంవత్సరాలు తారీకు తో సహా రాసుకుంటూ వస్తారు.

వేల ఎకరాల అడవులను వలస పరిపాలకుల కాలంలో ఏ ఏ కారణాల వల్ల ఏ ఏ కారణాల కోసం నరుక్కుంటూ వచ్చారు సవివరంగా చెబుతూ ఇలా అంటారు

స్వాతంత్రం వచ్చిన తర్వాత 1952 జాతీయ అటవీ విధానం భూగోళికంగా మైదాన ప్రాంతాల్లో 33% కొండ ప్రాంతాల్లో 66% అడవులు ఉండాలని నిర్ణయించింది. అయితే ఇప్పుడు దేశవ్యాప్తంగా ఇది 24 శాతం మాత్రమే ఉంది. అనేక రాష్ట్రాల్లో అటవీ భూముల ఆక్రమణ అతి క్లిష్టమైన సమస్య.

అని రాస్తూ చివరకు ఆమె ఈ విషయాలన్నీ ఆలోచించినప్పుడు ఎంతో బాధ కలుగుతుంది అంటారు. అన్నన్నిచెట్లను తొలగించినప్పుడు వాటి మీద ఆధారపడిన జీవరాశి ఎంతగా చెదిరిపోయిందో కదా? వేల వేల వృక్షాలు నేలకు ఒరుగుతూ తమ శరీర ఖండాల మీద ఇనుప చక్రాలు మోయడానికి నిస్సహాయంగా సిద్ధపడినప్పుడు ఈ నేల, ఆకాశపు వెన్నెల ఎర్రబడి ఉండవా? అని ప్రశ్నిస్తున్నారు.

ఇలా ఆలోచిస్తూ ఉండగా ఆ రాత్రి ఆమెకు వారు ఎదురుచూస్తున్న అక్రమ కలప వాహనం పట్టుబడుతుంది. దానిని పట్టుకుని వారు నర్సంపేట తీసుకెళ్లి అక్కడ భద్రపరచడం కోసం అక్కడికి బయలుదేరారు. అక్కడికి చేరే సరికి తెల్లవారుజాము కావచ్చు. అంటే రాత్రంతా ఆమె తెలంగాణ రైతాంగ పోరాటం నుంచి మొదలుపెట్టి ఒకప్పటి అడవులు, వలసవాదుల కాలంలో రకరకాల మార్పుల వల్ల వాటి తరుగుదల, క్రమంగా విధ్వంసంఅయిన క్రమం ఇలా అనేక విషయాల గురించి ఆలోచిస్తూ తెల్లవారేటప్పటికీ విధి నిర్వహణ పూర్తి చేస్తూ వ్యాసాన్ని ఇలా ముగిస్తారు.

"నర్సంపేట చేరేసరికి వెన్నెల మరింత తేజంగా కాస్తోంది. మా వెనుక వచ్చే వాహనంలో నిస్తేజంగా పడి ఉన్న నిన్నటి వృక్షం నేటి వెన్నెలను స్వీకరించలేదు. తరుఘోష వెన్నెలను తరుముతోంది. నిజానికి అది మరణించలేదు, హత్య చేయబడింది. నేను మృతవృక్షాన్ని తీసుకు వెళుతున్నాను. దానితోపాటు క్షతమైన మనసును మోసుకుపోతున్నాను"

ఇలా ఈ వ్యాసం చదవడం పూర్తయ్యేసరికి నాకు మనసుకు చెప్పలేని వికాసం కలిగిందనిపించింది. పలు విధాలైన విజ్ఞానాలు కలగలిసి వాటి ద్వారా ఒక సునిశితమైన అవగాహన ఏర్పడినప్పుడు, దాన్ని తన అనుభవానికి జత చేస్తేనే ఇటువంటి వ్యాసాలు వస్తాయి.

ఇలాంటి వ్యాసాలు చదివినప్పుడు మనకు మనమే విశాలమైన ప్రపంచంలోకి ప్రవేశించినట్లుగా అనుభవం పొందుతాం.ఆ అనుభవం చెప్పలేని ఆనందాన్నిస్తుంది. అందులోని విషయంలో విషాదం ఉండుగాక. కానీ సారభూతమైన ఆయా అంశాల తాలూకు సారవంతమైన జ్ఞానం మనకు ఆ విశాలత్వాన్ని ఇస్తుంది.

వీణావాణి గారు నేను రాస్తున్న ఈ సమీక్షలకు నాకు ధన్యవాదాలు చెప్పారు. కానీ ఇటువంటి వ్యాసాలు వ్రాసినందుకు ఆమెకు నాతో పాటు నిస్సందేహంగా ఈ జాతి మొత్తం రుణపడి ఉంటుంది.

(ధరణీరుహ పుస్తకాలు పల్లవి పబ్లికేషన్స్ విజయవాడ వారి వద్ద కొత్త స్టాక్ వచ్చాయట 13-05-2023)


శ్రీమతి దేవనపల్లి వీణావాణి గారు

కథ

# అజ్ఞాత సూర్యుళ్ళు



- కాంతి నల్లూరి

ఎండ, వేడిగాలులు తగ్గేయి, ఎండ వెన్నెలలా చల్లగా తెలియని ఏదో ఆనందాన్నిస్తుంది. నీలి ఆకాశంలో తెల్లటి మేఘాలు కొండలు, కొండలగా మెత్తగా కదిలిపోతున్నాయి. తోటమాలి పెట్టిన నీళ్ళతో తోటలోని మొక్కలు హాయిగా తలస్నానం చేసినట్లు నిండుగా నవ్వుతున్నట్లున్నాయి. ఆ చల్లగాలుల కోసం, కబుర్ల కాలక్షేపం కోసం ఒక్కోక్కరగా బయట కొచ్చి, కుర్చీలలో, అరుగుల మీద కూర్చోని కబుర్లు చెప్పుకుంటున్నారు. నవ్వుకుంటున్నారు. కొందరి ముఖాలలో ఆనందం కన్పిస్తున్నా, కన్పించని దిగులేదో అంతరాంతరాల్లో ఉన్నట్లు గోచరిస్తుంది. దూరంగా రోడ్డు మీద పొయ్యేవాళ్ళు మనం కూడా భవిష్యత్తో ఇక్కడకు రావాల్సిన వాళ్ళమే కదా! కాంక్రీటు జంగిల్లో కొద్దిగా విశాలంగా, చెట్లు మొక్కలున్న ఈ వృద్ధాశ్రమమే పర్వాలేదను కుంటు, అక్కడున్న పెద్దలను చూస్తు వెళ్ళుతున్నారు.

ఓ మూడు నెల్లక్రితం అక్కడకు వచ్చిన ఓ ఏనబై ఏళ్ళ దంపతులు అక్కడ పరిస్థితులకు ఇప్పుడిప్పుడే అపవాటు పడుతున్నారు. అన్నింటిని అర్థం చేసుకుని, సర్దుకుపోయే ఆ జంటకు అది పెద్ద కష్టంగా అన్పించటం లేదు. ఎక్కడో కన్పించని ఓ చిన్న బాధున్నా. ఆనందం, సంతోషం ఈ జగం ఇట్లా తెల్లారి పోతుందలే అన్న ఓ రిలాక్సేషన్ వారి ముఖాలలో కన్పిస్తుంది. వారి దగ్గరకు ముప్పై, నలభై సం॥రాల నుండి స్నేహితుడైన సూర్యం రావటంతో మెల్లగా కబుర్లు, చర్చలు మొదలవుతాయి. ఓ చిన్న బృందం అక్కడ తయారవుతుంది రోజు.

సూర్యం బాగా చదువుకున్నాడు. పూణేలోని డిపెన్స్ అకౌంట్సు డిపార్టుమెంట్లో ఉద్యోగంలో చేరాడు. రెండు సం॥రాల అనంతరం సికింద్రబాదికి బదిలి అయ్యాడు. ఉద్యోగంలో ఉన్నప్పుడే తన డిపార్టుమెంట్లో సమ్మెలు నిర్వహించారు. క్రమంగా నక్సల్బరి పోరాటం వైపు, విప్లవ రాజకీయాలవైపు, మార్క్సిజం వైపు తన ప్రయాణాన్ని కొనసాగించాడు. వివిధ ప్రజాసంఘాలకు, కార్మిక సంఘాలకు నాయకత్వం వహించాడు. పార్టీ పత్రికల నిర్వహించటంలో ప్రముఖ పాత్ర వహించాడు. 'క్రాంతి' పత్రికను బహిరంగంగా నడిపిన మొదటి సంపాదకుడు. పార్టీ రహస్య జీవితంలో ఉంటూ వివిధ పార్టీ పత్రికలు నిర్వహించాడు. పత్రికల నిర్వహిస్తూనే, అనేక అను వాదాలు చేశాడు.

అనేక సంఘాల నిర్మాణంలోను, సభల నిర్వాహణలోను ప్రముఖుడుగా ఉంటు, ప్రముఖపాత్ర నిర్వాహించాడు, అనేక రాజకీయ తరగతులలో పాలిటిక్స్ ఉపాధ్యాయుడుగా రాజకీయ పాటాలు చేప్పాడు. అరెస్టు అయ్యి ఒంటరి ఖైదిలో నాలుగు సం॥రాల శిక్షననుభవించాడు. ఆరోగ్యం బాగాపాడైంది. కంటిచూపు తగ్గింపు. శ్వాస కష్టంగా తీసుకునేవాడు. అతి తక్కువ ఆహారం తీసుకునేవాడు. విడుదల

తరువాత కొంతకాలం బంధువుల ఇంట్లో ఉండి, వారికి ఇబ్బంది కలిగించటం ఇష్టం లేక, మిత్రుల ద్వారా పౌండేషన్లో చేరి మూడు సంవత్సరాలైంది.

అమ్మా, నాన్న, సూర్యమన్న, రమ, సురేష్ దంపతులతో ప్రతి సాయంత్రం అక్కడ ఏదో ఒక రాజకీయ చర్చలు మొదలై, ఏదో ఒక కన్ క్లూజన్కు వస్తారు. లేదా అసంపూర్తిగా ముగుస్తాయి. కష్టాలను కలబోసుకొవటం వల్లనో, నలుగురున్నారన్న తృప్తి వల్లనో ప్రతి సాయంత్రం ఓ రిలాక్సేషన్తో ముగుస్తుంది.

ఆ సాయంత్రం మాత్రం అక్కడ చేరిన మూడు జంటలు, ఆరోగ్యం బాగాలేక హస్పిటల్కు వెళ్ళిన సూర్యం గారి గురించి మాట్లాడుకుంటూ, వారి వారి ఆరోగ్యాల గురించి, మందుల గురించి, తినే తిండి గురించి కబుర్లు చెప్పుకుంటున్నారు. హఠాత్తుగా, సూర్యంగారు ముప్పై ఏళ్ళు ఉద్యమంలో పని చేశారు గదా! అక్కడున్న వారిలో ఎవరో ఒకరిని పెళ్ళి

చేసుకోవచ్చు గదా! సూర్యంమన్న పెళ్ళెందుకు చేసుకోలేదు నాన్న! రమ సూర్యం గారి గురించి తెలుసుకుంటు బాధగా అడిగింది.

ఆ పెద్దాయనను నాన్న అని, ఆమెను అమ్మ అని వారికి పరిచయమున్న వారందరు పిలవటంతో రమ కూడా అమ్మ, నాన్న అనే పిలుస్తుంది. ఎప్పుడు సభలు, సమావేశాలలో కలుస్తూ ఉండటం వలన కూడా. రమ ప్రశ్నకు చిన్నగా నవ్వి, ముప్పై ఎళ్ళు కాదమ్మా, నాకు తెలిసి నలభై ఐదేళ్ళు పైనే నమ్మ, నాకు తెలిసి ఆయన ఉద్యమం పనే చేసాడు. ప్రజా సంఘాలలో పనిచేసేటప్పుడే ఓ అమ్మాయిని పెళ్ళి చేసుకున్నాడు.

ఎవరికండి పెళ్ళి? మనకు పప్పన్నాలున్నాయా? ఏటండి. చతుర్లాడుతూ మరో ఇద్దరు వచ్చి కుర్చీలలో కూర్చోన్నారు. వాటి గురించె. రండి, రండి. అని నాన్న వారిని సాదరంగా ఆహ్వానించాడు. చెప్పండి నాన్న అన్నట్లు రమ చూడటంతో, నవ్వూతూ రమవైపు చూసి, పక్కనున్న బాటిల్ లోని నీళ్ళు ఓ గుక్క తాగాడు. ఒడిలో ఉన్న కర్చీఫ్ తో ముఖం, మూతి తుడుచుకోని, ఓ నిట్టూర్చు విడిచి, నాన్న చెప్పటం మొదలెట్టాడు.

సూర్యంకు ఉద్యమాల పట్ల ఉన్న అవగాహన, అర్ధం చేసుకోవడం, సంసారంలో లేకపోయింది. సంసారం కూడా ఉద్యమంలాగే అనుకున్నాడు. ఇరవైనాలుగు క్యారెట్ల బంగారానికైనా నగీషీలుండాలి కదా. ఆ నగీషీలుంటేనే ఆ బంగారానికి అందమొస్తుంది. సంసారం కూడా అంతేనమ్మ. ఒకరి కోకరు అర్థమైనదాకాన్న ఒకరి భావాలు, ఒకరు పంచుకోవాలి. మాట్లాడుకోవాలి. కలిసి తిరగాలి. ప్రమాణాలు చేయ్యాలి. మౌనాన్ని వదలాలి. అప్పుడే ఒకరికొకరు అర్ధమవుతారమ్మ. సూర్యం తనను కామ్రేడ్ గానే భావించాడు గాని, సంసార లోతుపాతులు అర్ధం చేసుకోలేకపోయాడు. ఒక్క మాటలో చేప్పాలంటే ఉద్యమాన్ని అవగాహన చేసుకున్నంతగా సంసారాన్ని అర్ధం చేసుకోలేదనే చేప్పాలి.

ఎవరు ఏమి మాట్లాకుండా ఆసక్తిగా వినటంతో ఓ క్షణమాగి. ఆ అమ్మాయికి అవగాహన లేకపోవడంతో, భావాలను పంచుకోవడంలో, చర్చించు కోవడంలో, కలిసి ఉండడంలో వచ్చే సమస్యలను పరిష్కరించు కోవడంలో ఇద్దరు ఫెయిలయ్యారు. పెళ్ళైన సం॥లోపే ఆ అమ్మాయి వేరే అతన్ని ఇష్టపడి వెళ్ళింది.

మహిళల పట్ల ఉండే అవగాహనతో బాధను, దుఃఖాన్ని, తన మీదున్న ప్రేమను దిగమింగి అలానే ఉండిపోయాడు. ఒక్క మాటలో చెప్పాలంటే అతని ఉద్యమ జీవితమే బీజి అయ్యింది. నాన్న చేప్తున్నది వింటున్న వారి హృదయాలు తడితో బరువెక్కాయి. సూర్యం గురించి ఆలోచిస్తుండిపోయారు. ఆలోచనల నుండి బయట పడ్తూ, "నాన్న ! సూర్యమన్న అలా ఉండిపోవడం కరెక్టేనంటారా"? సందేహంగా అడిగింది రమ.

రమ సందేహన్ని గమనించి, నవ్వుతూ సూర్యం గారి పరిస్థితి ఎంటో మనకు పూర్తిగా తెలియదు. కాని వివాహం లేదా ఇంకోక పేరు ఏదన్నా కాని ఒకరిని ఒకరు అర్థం చేసుకుంటు ఒకరు మీద ఒకరు పెత్తనం లేకుండా ఓ స్త్రీ, ఓ పురుషుడు కలసి బ్రతకడం అవసరమేనని నే నను కుంటున్నాను. తను చేప్తున్నది అర్థం అవుతుందా? లేదా? అని పరిశీలిస్తూ...... నాన్న నెమ్మదిగా అన్నారు.

సూర్యంగారికీ అలాంటి ఆలోచన లేదా? లేక అలాంటి మహిళ ఎదురు కాలేదా? రెండు ప్రశ్నలు ఒకేసారి నెమ్మదిగా అడిగారు శారదమ్మగారు.

అప్పటి పని వత్తిడి, పని వేగం, పరిస్థితులు, ఉద్యమాలో ఉన్న మహిళల పరిస్థితి, వారి సంఖ్య అన్నింటిని మనం గమనించాలి కదమ్మా. అవి గమనించకుండా ఎదో ఒక నిర్ణయానికి రాకుడదు కదా! శారదమ్మ గారి వైపు పరిశీలనగా చూస్తు అన్నాడు నాన్న !

అక్కడి సంభాషణను శ్రద్ధగా వింటున్న రమ సహచరుడు సురేష్ అప్పటికి, ఇప్పటికి ఏమైనా మార్పులోచ్చాయండి"?? తను దేని గురించి అడుగుతున్నాడో పెద్దాయన గమనించ గలరన్న నమ్మకంతో అన్నాడు.

"వచ్చాయను కుంటున్నాను"

"అక్కడెమో కాని, ఇక్కడ సంగతులు మాట్లాడుకొండి. మనకు తెలియని, అక్కరలేని వాటి గురించి ఎందుకు? మన సంగతులు గురించి మాట్లాడుకుందాం" విషయం డైవర్టు అవుతుందన్న ఉద్దేశం, అక్కడకు మరో ఇద్దరు రావటంతో, ఆ సంగతులు ఎందుకులే అన్నట్లు అమ్మ చిన్న క్లూ ఇచ్చింది. అమ్మ తక్కువగా మాట్లాడిన సూటిగా మాట్లాడుతుందని, అమ్మ

అభిప్రాయం గ్రహించి నట్లుగా నవ్వాడు.

వాతావరణం గంభీరంగా మారటంతో, రాజకీయ అవగాహన ఉన్న నాన్న. అందరి ముఖాలు చూస్తూ " అప్పటి రోజులు అట్లాంటివమ్మా " అన్నాడు.

రమ బాధగా నిటూర్చటంతో ఆ మూడులో నుండి బయటకు రప్పించటం కోసం అన్నట్లుగా " అమ్మా ! మీకు ఇద్దరు పిల్లలు, మనవ సంతానం ఉంది కదా! మీరు ఇక్కడకు ఎందుకొచ్చారు". ప్రశ్నించాడు నాన్న.

అవును నాన్న అందురున్నారు. ఓ పెద్ద ఇల్లుకూడా ఉంది. కాని ఆ ఇంట్లో ఉండటానికి మనుషులు లేరు. దాన్నిండా మనుషులుండాలని, పిల్లలతో పాటు మొక్కలు, పక్షులు, చెట్లు, చేమా ఉండాలని ఊరి చివర ఓ పెద్ద స్థలం కొని, లోన్ తీసుకోని ఇల్లు కట్టుకున్నాము. ఖాళీ స్థలమంతా మొక్కలు, చెట్లు పెంచాం. పువ్వుల కోసం వచ్చే సీతాకోక చిలుకలు, తుమ్మెదలు, పండ్లకోసం వచ్చె చిలుకలు, గోరింకలు, ఉడతలు, గూళ్ళు కట్టుకున్న పిచ్చుకలు, కాకులు, వాటి పిల్లలతో, మా పిల్లలతో, వచ్చేపోయే జనాలతో ఇల్లంతా సందడిగా ఉండేది.

ఇల్లు, దాన్ని కట్టు కోవడానికి పడిన ఇబ్బందులు, సమస్యలు విమర్శలు, అప్పటి సంతోషాలు, దు:ఖాలు కళ్లముందు ఆనందమో, దిగులో అర్ధంకాని ముఖ:తో అలా చూస్తుండి పోయింది రమ.

మా పెద్దోడు చదివిన చదువుకు, చేస్తున్న ఉద్యోగాలకు, వచ్చే జీతాలకు పొంతన లేక పోవడంతోను, ఫ్రెండ్సు రమన్న ప్రోత్సహంతోను అమెరికా వెళ్ళాడు. చదువు, ఉద్యోగం, పెళ్ళి, పిల్లలు అన్ని అమెరికాలోనే. మాకు ఓపిక ఉన్నంతకాలం, వాళ్ళు చదువు మొదలు కానంతకాలం మనవళ్ళు, మనవరాళ్ళు మా దగ్గరే ఉన్నారు.... సురేష్ ఏ భావం లేకుండా నిర్లిప్తంగా అన్నాడు.

పెద్దోడు వెళ్ళితే, చిన్నోడు అదేదారిగా, పెద్దోడి పెళ్ళి అయితే చిన్నోడి పెళ్ళి ఎంతన్నట్లు నవ్వుతూ ప్రసాదరావుగారు.

ఆ ఇల్లు, మొక్కలు అన్ని వదిలి, చేసుకునే ఓపిక లేక, ఆ ఇంట్లో ఉండలేక, పిల్లల దగ్గరకు వెళ్ళలేక, మీలాంటి వారితో ఉండవచ్చు. కావాల్సినంత చదువుకోవచ్చు. రాసుకోవచ్చు అని ఇక్కడకు వచ్చేము" రమ బాధగా అంది.

రమను డైవర్టు చేయటం కోసం కొంత, అమ్మనాన్నలు అంత సంతోషంగా ఏలా ఉంటున్నారో తెలుసు కోవాలన్న ఆసక్తితో ఏ భావం కన్పించకుండా సురేష్ నెమ్మదిగా అన్నాడు. "మీకు ఇక్కడ ఉండటం ఏమి ఇబ్బందిగా లేదా"?

చెప్పు అన్నట్లుగా నాన్న, అమ్మవైపు చూసేడు. ఏమి చేప్తారు అని అందరు వాళ్ళవైపు మళ్ళారు. అమ్మ నవ్వు ము:ఖం పిల్లలు సంభాషణ రావటంతో మరింత ప్రసన్నంగా కన్పించింది. నెమ్మదిగా అందరిని చూస్తూ, మీ పిల్లలు అమెరికా వైపు అడుగులు వేస్తే, మా పిల్లలు అడవి వైపు అడుగులు వేశారు. వాళ్ళు కష్టమైన ప్రజల మర్గాన్ని ఎంచుకున్నారు అంది.

అమ్మకాని, మీరుకాని వారిని ఆపటానికి ప్రయత్నించలేదా? ఒకరినన్నా మీ కోసం ఉండిపోమ్మని ఆడగలేదా? ఆ దారి కష్టాలతో ఉంటుందని చెప్పలేదా?

తాసిల్దారుగా రిటైరు అయ్యి, కూతురు పిల్లలను చూడడం కోసం ఆరు నెలలు అమెరికాలో, ఆరు నెలలు ఇక్కడ ఉండే చంద్రశేఖర్ గారు, పిల్లలతో ఎన్ని ఇబ్బందులు పడుతుందోనని కూతురు గుర్తొచ్చి ప్రశ్నల వాన కురిపించాడు.

పజల మార్గాన్ని ఎంచుకున్నారు ఇద్దరు. అక్కడ ఉండగలరా? ప్రజలను అర్ధం చేసుకొగలరా? ఉద్యమం పట్ల అవగాహన ఉందా? వెళితె తిరిగి రాకుండా ప్రజల పక్షాన ఉండగలగాలి. ఉద్యమానికి ఎప్పుడు ద్రోహం చెయ్యకూడదు, చావో బ్రతుకో (Do Or Die.?) నార్ణయించుకోండి. మళ్ళి మళ్ళి ఆలోచించకొండి అనే చేప్పాము...... నాన్న.

మా పెద్దమ్మాయి అయితే నచ్చితే పని చేస్తాము. నచ్చనప్పుడు వస్తాము. నేనేం బాండు రాసి ఇస్తున్నానా అంది. పెద్దామెకు విద్యార్ధి ఉద్యమాల ప్రభావం ఎక్కువ. చిన్నామెకు మొదటి నుండి స్పందనలెక్కువ. కారంచేడు సంఘటన గుర్తొచ్చినప్పుడల్లా ఎడ్చేది. ఆమెను సముదాయించడానికి బోలెడన్ని విషయలు చెప్పాల్సి వచ్చేది. కబుర్లలోనే కూతుళ్ళను చూసుకునే అమ్మ సంతోషంగా.

ఇప్పుడు వాళ్ళు ఏ ఉద్యమంలో ఉన్నారు. నిశ్శబ్దంగా కబుర్లు వింటున్న మురళిగారు తన జర్నలిస్టు దొరణిలో సహజంగా ప్రశ్న వేశారు.

"ఏ ఉద్యమం ప్రజల పక్షాన ఉందో దానిలోనే, ఏది

ముందుందో దాని లోనే, వారి కిష్టమైన దాంట్లోనే ఉన్నారు" ఏ భావం వ్యక్తం లేకుండా గుంబనంగా, టక్కుమని జవాబు చెప్పటంతో. నాన్నకు రాజకీయ అవగాహన, పరిజ్ఞానం, పరిణితి, నిర్భయం బాగుందనుకున్నది, శ్రద్ధగా వింటున్న రమ.

అమ్మ! మీకేప్పుడన్నా బాధ వేస్తుందా పిల్లల గురించి. పిల్లల ఆలన, పాలనలో మనవ సంతానంతో

ఉండాల్సిన వయస్సు కదా మనది దిగులుగా శారదమ్మ.

మనవలు, మనవరాళ్ళు అనికాదు కాని, పిల్లలు గుర్తొచ్చినప్పుడు భాధగానే ఉంటుంది. మా చిన్నల్లుడును పట్టుకొని కాల్చిచంపి, ఎదురు కాల్పులని చెప్పినప్పుడు చాలా కాలం బాధపడ్డాము. మేమున్న చిన్న ఇంట్లో గట్టిగా ఏడ్వలేక, దుఃఖాన్ని ఆపుకోలేక నిశ్శబ్దంగా కన్నీరు కార్చేదాన్ని. అప్పుడు కూడా మా పిల్లలను చూడలేదు. ఇక్కడున్న సంఘాల పిల్లలు వచ్చి మాతో ఉన్నారు. మా పిల్లలను చూసి ఎంత కాలమైందోనని దిగులేస్తుంది. కాని మేమేప్పుడు మా కోసం వాళ్ళని రమ్మని అడగలేదు. రమ్మన్నా వాళ్ళురారు. అందరు మీ పిల్లలే. వాళ్ళల్లోనే మేమున్నాం అంటారు. బాధ, సంతోషం ధ్వనించింది అమ్మ గొంతులో.

మీరు నటులు కదా! ఏమన్నా సంపాదించారా? ఆర్థికంగా ఇబ్బందులు లేవు కదా! హోం ఖర్చులు గుర్తొచ్చిన రామ్మోహన్

ఎప్పటి కప్పుడు జీవనానికి సరిపడేటట్లు ఉన్నదానితోనే సర్దుకు పోవటం నేర్చుకున్నాము. ఈమె ఏలాంటి కోరిక కోరలేదు. ఈమె సహకారం లేకపోతే నావల్ల అయ్యేది కాదు. మా చిన్న తమ్ముడు కొంత చూస్తున్నాడు.

అనారోగ్యాల కాలం ముందు ముందు ఏ అవసరాలు వస్తే ఏలా అన్న భావం లేకుండా అమ్మ, మీరు హ్యాపిగా ఉండగలుగుతున్నారు. దీని రహస్యం ఏమిటి? పిల్లలిద్దరు అమెరికాలో ఉన్నారు. రోగం వచ్చినా, రోప్పువచ్చిన ఏలా అని మేమున్నాం. ఆసక్తిగా అడిగిన సురేష్ను చూసి అమ్మనాన్న చిన్నగా నవ్వేరు. చెప్పండి తెలుసు కొవాలి అన్నట్లు చూసేరు మిగతా వాళ్ళు.

అవును సురేష్. అనారోగ్యాల కాలమే ఇది. ఇప్పటి వరకు పెద్దగా ఇబ్బందులు పడనివ్వలేదు. ఇక్కడున్న పిల్లలు. ఎప్పుడు ఎవరో ఒకరు వచ్చి చుస్తారు. మీకు మేం పిల్లలమే అన్న భరోసాను యిస్తారు. పిల్లలపై గొప్ప ఆత్మ విశ్వాసంతో.... అమ్మ

ఓ ఐదేళ్ళ క్రితం నాకు బైపాస్ సర్జరి జరిగింది. మా చిన్నమ్మాయి ఫ్రెండ్, ఓ లాయర్ హస్పిటల్ నుండి ఇంటికి తీసుకోచ్చె వరకు ఉంది. డాక్టర్సు శ్రద్ధ తీసుకున్నారు. ఇంటికి వచ్చిన తరువాత ఓ టీచరు సెలవు పెట్టుకొని వచ్చింది. ఎవరు? ఎప్పుడు? అనేది వాళ్ళిద్దరు సమన్వయం చేసుకున్నారు. స్నానం దగ్గర నుండి, దస్టు ఉంటే ఎలర్జీ వస్తుందని రూంను రెండుసార్లు తుడుస్తూ, ఇల్లును శుభ్రంగా ఉంచడమే కాక, మంచి డైట్ కూడా ఇచ్చింది. నెల లోపలే కొలుకున్నాను. ఆ వయస్సులో అంతా తోందరగా కోలుకోవడంతో డాక్టర్సు కూడా మేచ్చుకున్నారు. రెండో తమ్ముడు, మూడో తమ్ముడు చుసారు. ఇబ్బంది పడలేదు.

అప్పుడు తనకు ఐదేళ్ళ పాప. ఎదురుగా ఉన్న షాపులో ఏదో ఒకటి కొనిపెట్టి, పాపను జాగ్రతగా చూడమని షాపులో వదిలి పెట్టెది పని అయ్యేంత వరకు. రెండేళ్ళ క్రితం ఇద్దరికి చికెన్ గున్యా వచ్చి ఇబ్బందిగా వున్నదన్నాము. మా హెల్ప్ కోసం ఇద్దరు, ముగ్గురుతో మాట్లాడింది. వీలుకాలేదు. తనే వచ్చింది పాపను తీసుకోని. మంచం మీద నుంచి లేవలేకపోయాను. ఈయన లేపలేకపోయారు. అమ్మాయే కావటేసుకోని లేపేది. బాతురూంకి వెళ్ళడం కూడా చేతకాలేదు. ఆర్థికంగా ఇబ్బందిగా కూడా ఉంది. తను వెళుతూ పదహారువేలు కట్టి ఒక హేల్ప్ను ను పెట్టి, ఏలా లేపాలి, ఏమి చేయాలి, అన్ని వివరంగా నేర్పి వెళ్ళింది. తనను మా మూడో అమ్మాయి అనుకుంటాము. తనుంటే నేను నిజంగానే అమ్మతనం అనుభవిస్తాను. తను వున్నని రోజులు నాకు పుల్ రెస్ట్ నిజంగా.... అమ్మ హాయిగా నవ్వింది. మన పిల్లలు మనకు చేస్తారో లేదో తెలియదు. కాని ఓ దశలో ఆర్థికంగా చాలా ఇబ్బందిగా ఉంది. అప్పుడె ఈమెకు గుండె పరీక్షలు చేయాలన్నారు. ఏమి చేయటానికి పాలుపోక ఫోన్ చేసి విషయం చేప్పాను. వెంటనే చూపించండి నాన్న అంటు బ్యాంకు ఖాతాలో పదివేలు వేసింది. తను వచ్చినా, మేము వెళ్ళినా మూడు, నాలుగు వేలు ఇచ్చేది. వాళ్ళిదరు ఏమంటు మొదలు పెట్టెరో కాని, ఇప్పటి వరకు ఎవరో ఒకరు మమ్మలను స్వంత తల్లిదండ్రులకన్నా ఎక్కువగానే చూస్తున్నారు.

అందరు మా పిల్లలనే మేం అనుకుంటాం. మా పిల్లలున్నా ఇలా జరిగిద్దా? లేదా? చెప్పలేం కదా! నాన్న రిలాక్సుడుగా.

ఇదేలా సాధ్యం. ఈ రోజుల్లో అలాచూసే పిల్లలున్నారా? స్వంత పిల్లలే ఆస్తులకు వారసులం అంటున్నారు కాని భావాలను, భాద్యతలకు కాదంటున్నారు. ఇది మీ మంచితనమా? ఆ పిల్లల మంచి తనమా? శారదమ్మ ఆశ్చర్యపోతు అడిగింది.

ఉన్నారనే మేము అనుకుంటున్నాము. మా విషయంలో నిజం కూడా అదే. నాన్న ఓలాంటి భరోసాగా.

మీరు మొదటి నుండి కమ్యూనిస్టు అవగాహనతో ఉన్నారు. కార్మికుల పక్షాన నిలబడినారు. ఇలా చూడడానికి మీ నేపధ్యమా? లేక మీ పిల్లలు ఉద్యమంలో ఉండటం వలన ఇది సాధ్యమైందా? అంటే, నా ఉద్దేశ్యం ఇప్పుడు చేయించుకునే వాళ్ళేగాని, చేసిన పనిని గుర్తుంచుకునే వాళ్ళు కూడ అంతగా లేరనుకుటాను – పెట్టింది మరిచిపోయిన వారిని తలుచుకుంటూ రమ.

"రెండు కావచ్చు" ఏ తడుములాట లేకుండా నాన్న ఖచ్చితంగా చేప్పాడు.

ఇలా అందరి విషయంలో జరుగుతుందా? పేపరులో చదివిన ఏదో విషయం గుర్తుకొచ్చి అనుమానంగా అడిగేరు సురేష్.

జరగకపోవచ్చు. అందరి విషయంలో మాకు లాగానే జరగాలని మేం బలంగా కోరుకుంటాము. అలా జరగాలంటే మనందరి సహకారం, బాధలు పంచుకోవడం, బాధ్యతలు తీసుకోవడం వైపుగా చైతన్యం పెరగాలి. ఉద్యమంలో ఓ కామ్రేడ్ పని చేయాలంటే, కుటుంబ సభ్యుల దిగులు వెంటడకూడదు. ఎవరో ఒకరు చూస్తారన్న నమ్మకం మనం వారికి ఇవ్వాలి.

ఏమండి! ఏటో ఏటో వెళ్ళి పోతున్నారండి. నవ్వుతూ నాన్నకు జాగ్రత్తలు గుర్తు చేసింది.

ఏటూ వెళ్ళలేదమ్మాయి. ఇక్కడే ఉన్నాను. ఏమి కాదన్న ఓ సందేశం అమ్మకు ఇచ్చారు. అబ్బ! ఇద్దరు ఎంత అన్యోన్నంగా, హ్యాపిగా వున్నారు. వాళ్ళలా మనం ఎందుకు ఉండలేక పోతున్నాము. ఒక వైపు ఆనందం మరోక వైపు దుంఖ:గా అనుకున్నారు.

సూర్యమన్న ఇంకా రాలేదు ఏంటాని దారి వైపుచూస్తు సూర్యమన్న లాంటి వారి పట్ల ఉద్యమం బాధ్యత తీసుకోదా? దిగులుగా అడిగింది రమ.

ఎందుకు తీసుకోదమ్మా. తీసుకుంటుంది. కాని ఎక్కడో వున్న వాళ్ళు వచ్చి ఇక్కడ బాధ్యతలు నిర్వహించడానికి వీలుందా? అన్నింటికి ఉద్యమం వైపు చూడకూడదు కదా! ఇక్కడున్న ప్రజలు, అభిమానులు, బంధువర్గం చూసే చైతన్యం రావాలని ఇందాకే అనుకున్నాము కదా! మరోసారి గుర్తు చేసాడు.

సూర్యం గారి ఖర్చులన్ని సేహితులు, అభిమానులే కదా చూస్తున్నారు. అందరు ఉద్యమంలోకి పోలేరు. కాని ఇక్కడున్న అనేక బాధ్యతలు, పనులు ఇక్కడున్న ప్రజలు నిర్వహించగలగాలి. రష్యా, చైనా, క్యూబా విప్లవాలలో ఇవన్నీ ప్రజలే చేశారని మనం చదివాము కదా.

మన దగ్గర పనులు చేయటం కన్నా మేథో చర్చ లెక్కువ. మతం మత్తు ఎక్కువ. ప్రభుత్వాలిచ్చే వాటికోసం ఎదురు చూడటం ఎక్కువ. రిజర్వేషన్ల దగ్గరే గుడి గుడి గుంజాలు తిరుగుతూ ఏ ఇబ్బంది లేని పోరాటాలు ఎక్కువ. మరి కొంత మందికి మాటల్లో మార్క్సిజం చేతల్లో రివిజనిజం. ఒక్క మాటలో చెప్పాలంటే ఒకవైపు వేదికల మీద కమ్యూనిస్టు (లెఫ్టిస్ట్) కీర్తిని, మరొకవైపు సంపద ప్రదర్శనల కీర్తిని పొందాలనుకుంటున్నారు, ఏదో గుర్తొచ్చినట్లు బాధగా చెప్తున్న నాన్నవైపు, ఏదన్న మిస్ అవుతామేమోనని ఆతృతగా చూస్తున్నారు.

వాళ్ళకు అంతరాయం కలిగిస్తునట్లు భోజనం రడీ అన్న బెల్ మోగటం, సూర్యం అక్కడకు రావటం తో,

అమ్మ నవ్వూతూ సూర్యం గంట కొట్టుకుంటూ వచ్చావా? ఏంది! ఏ పాటు తప్పినా, సాపాటు తప్పదు కదా! లేవండి. హస్టల్ పిల్లలు లాగా బెల్ మోగిందనటంతో అందరు హాయిగా గలగల నవ్వేరు.

సూర్యమన్న ఆరోగ్యం గురించి తలోక ప్రశ్నవేశారు. సూర్యమన్న అందరికి సమాధానం చేపుతూనే, అమ్మవాళ్ళ వైపు చూస్తు బస్తర్లో పెద్ద ఎన్ కౌంటర్ జరుగుతుందట, ముగ్గురు మహిళలు, కేంద్రకమిటి సభ్యులున్నారట. హస్పటల్లో విన్న టి.వి వార్తలను చెప్పడంలో అప్పటి దాకా ఉన్న వాతావరణం దిగులుగా, గంభీరంగా మారింది.

ఎన్ కౌంటర్ ఏలా జరిగింది? ఏమైనా, ఏవరైనా? సమాచారం ఇచ్చారా? – ఆత్రుతగా సురేష్. ఆ మహిళలు ఏవరు? దు:ఖపు గొంతులో రమ.

పాపం. ఎంత అన్యాయంగా చంపుతున్నారో? వాళ్ళ మానాన వాళ్ళు. ఆ అడవుల్లో తిని, తినక వాళ్ళ ఇబ్బందులు వాళ్ళు పడుతంటె, మిలటరీలను దింపి ఎన్ కౌంటర్లు చేయ్యాలా?... శారదమ్మగారు. బాగా చదువుకున్నవాళ్ళు, ఉద్యోగాలు చేస్తున్నవాళ్ళు, డాక్టర్లు, లాయర్లు ఎందరో, అన్నిటిని వదులుకొని త్యాగాలు చేస్తున్నారు. దూరపుబందువుల అబ్బాయి గుర్తొచ్చి.... ప్రసాదరావు.

ఏముంది? ఎప్పుడు చెప్పే కథలే. కూబింగ్ కు వెళ్ళాం, మా మీద కాల్పులు జరపారు. ఆత్మరక్షణ కోరకు మేం కాల్పుల జరిపేము. నక్సలైట్సు చనిపోయారంటారు. జర్నలిస్టు మురళి ఎప్పుడు వినే కథలే అన్నట్లుగా. వారి వారి అవగాహనల్లో నుండి, బాధల్లో నుండి ఏ జవాబులు లేని ప్రశ్నలుగా మాట్లాడుకుంటున్నారు. మళ్ళీ బెల్ మోగింది.

ఆ రాత్రికి ఆ స్యూరం, ఆ దంపతులు భోజనం చేస్తారో? లేదో? కనురెప్పలు మూతలు పడతామో? లేదో? వీరికే కాదు, ఆ వార్తలు విన్న, చూసిన ఎందరికో దుఃఖంతో కనురెప్పలు మూతపడతామో? లేదో? ముద్ద గొంతు దిగుతుందో? లేదో? ఆ బిడ్డల తల్లిదండ్రులు, అక్కచెల్లెళ్ళు, అన్నదమ్ములు, బంధువులు, స్నేహితులు, సానుభూతపరులు, ఉద్యమాకారులు ఎందరో అజ్ఞాత సూరీళ్ళకు ముద్ద గొంతు దిగుతుందో? లేదో? దు:ఖపు మేఘాలు కళ్ళను కమ్మేసి కనురెప్పలు మూతపడక పోవచ్చు.

ఎందరో అజ్ఞాతసూర్యుళ్ళు, సూర్యమ్మలు, స్పార్టకస్లు, నిర్మలమ్మలు, నిరంజనమ్మలు...... ఉద్యమం ముందుకే ముందుకే.

ఈ కథ (యధానిక అనుకుంటున్నాను) రాసి 29, జూలై 2021 న కాకరాల నాన్నకు వాట్సప్ పంపిచేను, ఏలా ఉందో చెప్పమని, సూర్యంది ఇంకా రాయాలి, మాదాని కన్నా, పోన్లో లో వద్దు. ఇక్కడకు వచ్చెయి. ఆయనతో మాట్లాడి రాద్దువు అన్నారు. అనేక కారణాల రీత్యా హైదరాబాద్ వెళ్ళలేకపోయాను.

తెలిసి తెలియని వయస్సులో (78–80 ప్రాతాలలో) గుంటూరు బ్రాడిపేటలో ట్యూషన్కు వెళ్ళితూ, వస్తూ 'క్రాంతి' పత్రిక ఆఫీస్కు నా కళ్ళు చూస్తూ, నా కాళ్ళను లాకు పోయేవి. కేవలం ఆయన కోసం అతను చెప్పె మాటలకోసం. తను తరువాత ఏమైంది నా చిన్న బుర్రకు తట్టలేదు. కొంచెం పెద్ద అయిన తరువాత, కొన్ని రాజకీయాలు తెలిసాక ఆయన గురించి తెలిసిన వాళ్ళను అడుగుతూనే ఉండేదాన్ని ఇష్టం కొద్ది. 95 ప్రాతంలో పత్రికల నిర్వాహణలో ఉన్నట్లు తెలిసింది. చూడాలనుకున్నాను. సాధ్యం కాదుగా నాలాంటి వారికి.

పత్రికల నిర్వాహణతో పాటు అనేక ట్రాన్స్ లేషన్స్ చేస్తున్నాడని విన్నాను మూర్తి నా జీవితంలోకి వచ్చిన తరువాత నేను చూడాలనుకున్న యల్.యస్.యన్. మూర్తి గురించి (ఐ.వి, సూర్యంమన్న, సుబ్బయన్న, గురవయ్య సార్ మొ॥గు) మాట్లాడుతున్నప్పుడు జననాట్య మండలి ఏర్పాటప్పుడు, రైతుకూలి సంఘం, రాడికల్, విద్యార్థి, యువజన సంఘం ఏర్పాట్లుప్పుడు, ఏనభైమూడులో జరిగిన రైతు కూలి సంఘం మహసభల నిర్వాహణలోను సూర్యంగారు (యల్.యన్.యస్. గారు) ప్రముఖ పాత్ర నిర్వహించారని, పొలిటికల్ కమీస్సారుగా పొలిటికల్ క్లాసులు చేప్పేవాడని, చాలా వాటినీ టాన్స్ లేషన్స్ చేసాడని చెప్పాడు.

అరెస్టు అయ్యి, జైలుశిక్ష అనంతరం విడుదలై వచ్చిన తరువాత కొంతకాలం బంధువుల ఇంట్లో ఉన్నాడని తెలిసింది. పౌండేషన్లో ఉన్నాడని తెలిసి, చూసివచ్చేను. కాకరాల ఫ్యామిలి పౌండేషన్లో ఉన్నప్పుడే మరోక సారి చూసి వచ్చేను. 2020 లో యాభై ఏళ్ళ విరసం మహసభల ముందు, రోడ్డు మీద అనామదేయుని "ఒంటరెక్క సీతాకోక చిలుక"ను మా కొరికపై యల్.యస్.యన్ గారు ఆవిష్కరించారు. మా ఇంటికి రమ్మన్నాను. చీరాల బంధువుల పెళ్ళికి వస్తున్నాను. వస్తాను అన్నాడు. ఆరోజు (తరువాత కూడా) రాలేక పోయాడు. ఆయన గురించి చాలా చాలా రాయాలనుకున్నాను. రాయలేక పోయినందుకు మన్నించమని ఆయన్ను కోరుతూ, ఈ యధానిక ఆయనకే అంకితం.

కవిత

# చీకటి కన్నీళ్లు



సరసిజ పెనుగొండ కవిత

అదేంటే?
మీ ఆయన నిన్న, నిన్నలా?
కవిత కళ్ళల్లోకి సూటిగా నా ప్రశ్నలబాణాలు
కవిత కళ్ళు మౌనమయ్యాయి
ఏమన్నాడు?
ఉన్నదేగా?
అంటే?

ఇది చూడు!
జనటిక్
నాన్న నుంచి స్కిన్ ప్రాబ్లం!
ఇక అమ్మ నుంచి థైరాయిడ్!
ఆఫ్టర్ డెలివరీ షేప్ అవుట్!

ఇవన్నీ నీ శరీరానికేనే!మరి నీ మనసు?
నిజం చెప్పు!
మనిషంటే శరీరమా?మనసా?
రెండు ఒకటేనా?
చిక్కుముడి విప్పలేక చిన్నబోయాను.

మూసిన కవిత కళ్ళల్లో కళ్ళు కలపలేకపోయాను.
కానీ అతనేం పెద్ద అందగాడని?
ఓ మోస్తారు గాడేగా?
మోస్తారయితేనేం?
మగాడే !
పైగా మొగుడు!

అయినా నువ్వే ముద్దుగుంటావు కదే !
ముద్దుగుంటే ముద్దు చేస్తారా?
తినే ఆ నాలుగు ముద్దలు నీ చేతివి కాదూ??
బియ్యపు గింజలు ఎవరివంటాడు?
ఏంటే కవి?
ఏది అడిగినా ఏదో ఒకటి చెప్తావు?
ఆ ఒక్కటి చెప్పకపోతే లక్ష ప్రశ్నలు ప్రశ్నిస్తాయి.

ఇంత నచ్చని వాడు మరి ఆ సమయంలో మాత్రం....??
చీకటి కార్యం కదూ!
మనసుతో పాటు దీపాలను కట్టేస్తాను.
కనిపిస్తే కాల్చుకుతినే లోపాలను
కారుచీకటిలో కాసేపైనా మరు...స్తాదని ....!
ఒక్కసారిగా మనసు చిట్లి
ఎందరో గాథల నిక్షేపాలు నిలదీసాయి.

కళ్ళు తెరిచిన కవి కన్నీటి అలలు
అరచేతుల్ని ఆలింగనం చేసుకున్నాయి.
అలవాటైన కన్నీటి నవ్వుతో
కవిత ఓ కవితనిచ్చి
నన్ను కవిని చేసి వెళ్ళిపోయింది

**సాహిత్య వ్యాసం**

# తెలంగాణ ఉద్యమ సాహిత్యంలో కవయిత్రులు / రచయిత్రుల పాత్ర:



**డా. వంగరి త్రివేణి**

**9951444803**

సాహిత్యంలో ప్రత్యేక ప్రాంతీయ వాదం అనేది సామాజిక, సాంస్కృతిక, రాజకీయ, ఆర్థిక, భాష, కళారంగాల్లో పురోభివృద్ధిని కాంక్షించింది. తద్వారా స్థానీయమైన అస్తిత్వాన్ని పెంపొందించుకోవడానికి అనేక ప్రక్రియలను అనుసరించింది. కథ, నవల, కవిత్వం, విమర్శ, పరిశోధన వంటి రచనా రూపాలలో తన వాదాన్ని బలంగా ప్రతిష్ఠించింది. ప్రత్యేక తెలంగాణ ఉద్యమ కాలంలో సాహిత్యం ప్రజలకు అత్యంత చేరువలోకి వచ్చింది. తెలంగాణ భాషాశైలిని ఉపయోగించి రాష్ట్రావశ్యకతను తెలియబరిచింది. తెలంగాణ జీవితం, సంస్కృతి నేపథ్యంలో వచ్చిన ఉద్యమ స్వరూపం కవిత్వం, కథా ప్రక్రియల్లో అతి సహజంగా ప్రతిబింబింపబడింది. స్వచ్ఛమైన ప్రాంతీయత మహిళల సాహిత్యంలోనే అభివ్యక్తీకరించబడింది.

**కవితా ఉద్యమం:**

తెలంగాణ స్త్రీల కవిత్వం అత్యంత మార్దవమైంది. స్త్రీల స్వరూప స్వభావాలకు తగినట్లుగానే; వారి కవితా రచన సుకుమారంగా, సుందరంగా ఉంటుందని ఇప్పటి వరకు మనకు తెలిసిన విషయం. కాని గాయాలే గేయాలై! లో అందుకు భిన్నంగా స్త్రీలకవిత్వం కన్పిస్తుంది. కొంగు నడుంకు కట్టుకొని, చీర చింగులు పైకి ఎగదోపి, వేలాడుతున్న శిగనొకసారి సవరించుకొని, చేతులకున్న గాజులు గట్టిగనుకొని నిలబడ్డ అక్కల్లాగున్నారు "గాయాలే... గేయాలై!" కవయిత్రులు. ఒకటేమిటి తెలంగాణ నిండా ఉన్న సమస్యలన్నింటిని ఎలుగెత్తి చాటారు, కలమెత్తి రాశారు. తెలంగాణ ఉద్యమం, పోరాటం మీద; తెలంగాణ విద్య, వైద్య, ఉద్యోగ అవకాశాల మీద; తెలంగాణ చెరువులు, భూములు, గనుల మీద; తెలంగాణ సమాజం, చరిత్ర, సంస్కృతి మీద; తెలంగాణ పల్లె, వ్యవసాయం, కులవృత్తుల మీద; తెలంగాణ హైదరాబాదు మీద, తెలంగాణ ప్రాణత్యాగాల మీద ఉత్తుంగ స్వరాన్ని పలికించారు. అన్యాయాన్ని ఎదిరించారు.

ఈ కవితా సంకలనానికి సంపాదకత్వం వహించిన వై. లక్ష్మీవాసన్ (రాజీవ), విజయకుమారి దెంచనాల (జ్వలిత), అమృతలత రాసిన ముందుమాటల్లో తెలంగాణ ఉద్యమ చైతన్యదీప్తి అధికంగా కనిపిస్తుంది. "తెలంగాణ అస్తిత్వవేదనలో స్త్రీల గొంతులు" అనే శీర్షికన కవితా సంకలనానికి డా॥ ముదిగంటి సుజాతారెడ్డి విమర్శనాత్మక విశ్లేషణ చేశారు. "ఇవి స్త్రీల గొంతులు. కవయిత్రుల ఆవేదన. అస్తిత్వ వేదన. ఇంతకుముందు "పొక్కిలి", "మత్తడి" వచ్చాయి. వాటిల్లో కవయిత్రులకు ఎక్కువ స్థానం దొరకలేదు. ఇప్పుడు ప్రత్యేకంగా స్త్రీల మనోభావాల అభివ్యక్తితో ఈ "గాయాలే గేయాలై!" కవితల సంకలనం వచ్చింది. దీనిలో అరవైమంది కవయిత్రుల కవితలున్నాయి. అన్నిటి వస్తువు ఒక్కటే. తెలంగాణ మీద అభిమానం "తెలంగాణ మాది మాకు కావాలనే తపన! ఆక్రోశం!" (పుట. 9) అంటూ సుజాతారెడ్డి తెలంగాణ ఉద్యమంలో స్త్రీల ఉత్తేజాన్ని, చైతన్యాన్ని తెలిపారు.

మొదటగా తెలంగాణ సర్వతోముఖాభివృద్ధికి చెందిన కవితలను పరిశీలిస్తే అందులో షహనాజ్ ఫాతిమా రాసిన కవిత 'అవసరం'

**ఆర్థిక పురోగతికి ఏకైక మార్గం తెలంగాణ**

చేతి నిండా పనికోసం కావాలి తెలంగాణ కనీసావసరాలు తీరడానికి కావాలి తెలంగాణ బుద్ధి వికాస విద్యకోసం అవసరం తెలంగాణ ఇహపర జ్ఞానాభివృద్ధికై సాధించాలి తెలంగాణ సామాజిక చలనానికై పొందాలి తెలంగాణ ప్రాణుల దప్పిక తీరడానికి తప్పనిసరి తెలంగాణ సమ్మిళిత సంస్కృతి

పునరుజ్జీవనం తెలంగాణ మరుగున పెట్టిన చరిత్ర జ్ఞాపకానికి తెలంగాణ (పుట –34)

ఈ కవితలో సామాజిక అంశాలన్నింటికి, వాటి పురోభివృద్ధికి తెలంగాణ ఎంత అవసరమో కవయిత్రి స్పష్టంగా తెలిపారు. తరతరాల భేదాలు పోయి ఏకత్వాన్ని సాధించాలన్నదే తన లక్ష్యంగా చెప్పుకొచ్చారు.

సంస్కృతి విషయానికొస్తే – ఇందులో తెలంగాణ స్త్రీల కట్టుబొట్టు గూర్చి వసంత సుబ్రహ్మణ్యం తన కవిత "ఆనాటి అందాలు"లో వర్ణించారు. భారతదేశంలో తెలంగాణ స్త్రీలకు ఉన్న ప్రాధాన్యత, గౌరవం కొనియాడారు. "తెలంగాణ మహిళల విశిష్టతకు సాటిలేని ప్రాంతం! / చేతిపనులకు మన మహిళలకే ప్రథమ కిరీటం". (పుట–38) అంటూ 'సుగాలి' చేతి కౌశల్యం గూర్చి వర్ణించారు. ఆ మహిళలు ధరించే లంగా–రవికె; వాటికి గల రంగుదారాల అద్దాలు, పూసలు, గవ్వలు; వేలాడే చున్నీ హొయలు వంటివి చక్కగా కవితలో తెలియజేశారు. ఇంకా చేతివృత్తులు, వాటి విలువ, ప్రయోజనం వివరిస్తూనే; చేతివృత్తుల స్థానంలో నేడు విరివిగా ప్లాస్టిక్, పాలథీన్ కవర్లు వాడుతున్న క్రమం వాటి నుంచి కలిగే దుష్పరిణామాలను వెల్లడించారు.

శక్తిస్వరూపిణి స్త్రీ. చారిత్రక స్త్రీల విషయం మనకు నిర్మల ఆంజనేయులు రచించిన "ఎవరమ్మా!?" కవితలో తెలుస్తుంది.

**"మేడారం సారలమ్మవా - సమ్మక్కవా**
**కాకతీయ కిరణం రుద్రమ రౌద్రానివా**
**డిచ్పల్లి దారికాచే దేవీ దుర్గమ్మవా**
**మేడ్చల్ అర్ధనారీశ్వరుని ఆదిశక్తివా**
**ఎవరమ్మా - నీవెవరమ్మా!?"** (పుట–47)

ఆంధ్ర – తెలంగాణల మధ్య ఎంత వ్యత్యాసం ఉందో టి. కవితా దివాకర్ కవితలో కనిపిస్తుంది. "ఒంటె – ఒనరు"లో మొన్న... ఇల్లు అద్దెకిస్తే; నిన్న... ఇల్లే మాదంటూ ఓనర్ని బయటికి పంపిన 'ఒంటె'లయ్యారు! (పుట–57) అంటూ ఆంధ్రవాళ్ళ స్వప్రయోజనాలను ఎండగట్టారు. ఏకు – మేకై వచ్చి నాటుకొనిపోయిన విధానాలన్ని చాలా స్పష్టంగా వివరించారు. తరతరాలుగా వారసత్వాన్ని సుస్థిరం చేసుకొని అధికారం చెలాయించిన విధానాన్నంతా వెల్లడించారు.

స్మృత్యర్థం గల కవితలలో మొదటగా చెప్పుకొనేది అనిశెట్టి రజిత కవిత "ఆత్మగల్ల తల్లి...". ఆమెనే ఆచార్య పాకాల యశోదారెడ్డి. యశోదారెడ్డి జీవితాన్ని, రచనలను ఈ కవితలో వర్ణించారు. ఆమె రచనలోగల తెలంగాణ ఆత్మగౌరవం, జాతిపౌరుషం ; తెలంగాణ భాషా సాంస్కృతిక సౌందర్యం వంటివి కవితాత్మకంగా అనిశెట్టి రజిత వర్ణించారు.

**తియ్యని జానపలుకుల అవ్వ**
**బుక్క బుక్క నోటికి అందిన కమ్మని బువ్వ**
**నా ఎడ్డితల్లి బొండుమల్లె ఎచ్చమ్మా**
**ఎడతెగని ముచ్చట్లు పందిరి కింద**
**పలుకుబడుల బడి చెప్పిన పంతులమ్మా...** (పుట–35)

అంటూ యశోదారెడ్డి తెలంగాణ రాష్ట్రం కోసం పడినపాట్లను తెలియజేశారు. సంస్కృతి పునరుజ్జీవనంలో తెలంగాణ ప్రత్యేకతకు ప్రాధాన్యం వహించిన యశోదారెడ్డి ఆలోచనలను, ఆశయాలను ఈ కవితలో గమనించవచ్చు.

"కనిపించని గొడ్డలి – మాయమైన చెట్టు" కవిత ఈ సంకలనంలో అత్యంత ప్రాచుర్యం పొందింది. ఇది సెజ్లకు సంబంధించిన కవితా వస్తువు. తెలంగాణ ప్రాంతాన్ని నిర్జీవం చేసే ఒక అధికార ప్రక్రియ సెజ్. దాని వల్ల నిర్వాసితులైన ప్రజల దీనస్థితి నిస్సారమైన భూసారం – పచ్చదనాన్ని కోల్పోయిన పల్లెపట్టు ఈ కవితలో కనిపిస్తుంది. మహబూబ్ నగర్ జిల్లాలోని పోలెపల్లి గ్రామవాసులు పల్లెల్లో సెజ్ లకు వ్యతిరేకంగా ఉద్యమం చేశారు. అందులో భాగంగా నిరవధిక ధర్నా చేస్తున్న రైతులకు ఆసరాగా ఉన్న చెట్టును కంపెనీ వాళ్ళు కొట్టివేసినప్పుడు, అది చూసి వలవలా ఏడ్చిన గంగమ్మకు అంకితంగా ఈ కవితను విరసం సిటీ కన్వీనర్ గీతాంజలి రచించారు. చెట్టు నీడనే వారి జీవనంగా చేసుకొని రాత్రింబవళ్ళు ఉద్యమం సాగించిన తీరును ఈ కవిత వెల్లడిస్తుంది. చెట్టు కొమ్మ, గూడు, చివురు, పూవు, వికసించని మొగ్గ, రాలిన పండుటాకు, వట్టిపోయిన పూవు, పుచ్చిపోయిన కసిగాయ ప్రతీకలుగా ఇందులో స్వీకరింపబడ్డాయి.

**చెట్టు గూటిలో రామచిలుకనై**
**ఇల్లు కట్టుకోవాలనిపిస్తోంది!**
**పోని - మరణం తర్వాతైనా**
**తన నీడన ఉన్న భూమి గుండెలో చోటిస్తే**

**ఈ చెట్టుకి పూవునై పూయాలని అనిపిస్తుంది**
**ఈ చెట్టంటే ఎందుకింత ప్రేమ నాకు!**
**ఈ చెట్టు ఎన్నెన్ని నినాదాలు ప్రతిధ్వనించిందనీ!**

(పుట–57)

అంటూ చెట్టు రైతు ఉద్యమానికి ఊపిరి అయిన తీరును కవయిత్రి వర్ణించారు. ఆకు ఆకులో అగ్నికణాలను మోస్తూ వచ్చిందని చెపుతూ చెట్టు, రైతు, భూమి ఒక్కటే అన్న నినాదాన్ని ధ్వనింపజేశారు.

ఓటు మీడియాకు చెందిన 'కీలెరిగి...' కవితను విజయ రచించారు. ఈ కవితలో ప్రభుత్వ శాఖలపైన ప్రతిఘటన తెలిపారు. ఉద్యమాలు, ధర్నాలు, బంద్ లు, రాస్తారోకోలు చేయడమే కాదు; ఓటు వేటుతో గద్దె దించుతామనే ధిక్కార స్వరాన్ని వినిపించారు. ఉద్యమంలోకి వచ్చిన విద్యార్థులు, వారి బంగారు బాటకు ఇది సోపానమని; ప్రింట్ మీడియా, ఎలక్ట్రానిక్ మీడియా నిజాలను మాత్రమే ప్రస్తావించాలని ఈ కవితలో ప్రస్తావించారు.

హైదరాబాద్ సిర్ఫ్ తెలంగాణయే! కదా. 1956 – 69 మధ్య జరిగిన పరిణామాలను ఒక చక్కని సన్నివేశానికి జోడించి విశ్లేషించారు. 'గబ్బిలాలు' అనే కవితలో వి. ప్రభాదేవి. శ్రీకృష్ణ కమీషన్ హైదరాబాద్ మీద చేసిన వ్యాఖ్యలకు వ్యతిరేకత కూడా ఈ కవితలో కనిపిస్తుంది. సీమాంధ్ర వాళ్ళు తెలంగాణకు వచ్చి; అంతా మాదేనని, అన్ని ఉద్యోగాలు పొంది, అన్ని అధికారాలు అనుభవించి; చివరకు పొమ్మంటే హైదరాబాద్ను ఒంటరి చేయడానికి చూసిన ఎత్తుగడను ఈ కవిత పటాపంచలు చేస్తుంది.

తెలంగాణ పండుగలకు సంబంధించి డా॥ వి. త్రివేణి కవిత రచించారు. తెలంగాణ అస్తిత్వానికి మారురూపమైన బతుకమ్మ, బోనాల పండుగలను గూర్చి వర్ణించారు. పల్లెల్లో కనిపించే ఆప్యాయత, బంధుమిత్రుల సందడి, కలిసిమెలిసి ఉండే కుటుంబాలు వంటివి ఈ కవితలో కనిపిస్తాయి. బతుకమ్మను తీరొక్క పువ్వు తెచ్చి పేర్చే విధానాన్ని; ఆ పువ్వుల యొక్క రంగు రంగుల కాంతులు, వర్ణాలు; ఆ పువ్వుల సుకుమారత్వం; ఆడపడుచుల ప్రతిరూపంగా వెలిగే పువ్వుల అందం వంటివి ఎంతో ఆహ్లాదంగా వివరించారు. బతుకమ్మ ఆట – పాటలు ; ఆటల్లోని చప్పట్లు – పాటల్లోని కథలు కలిగి ఈ కవిత మనలను మంత్రముగ్ధులను చేస్తుంది.

**గునుగు పువ్వు గూడంత కూడింది.**
**తంగేడు పువ్వు తడికంత తట్టింది.**
**ముద్దబంతి పువ్వు మురిపెంగ మొత్తింది**
**ముత్యాల పువ్వు ముచ్చటగ ముట్టింది.**
**బీరంకె పువ్వు బిరుసుగా పట్టింది**
**బంగారు బతుకమ్మ సింగారమయ్యింది!**
**బతుకమ్మ అందం సృష్టికే బంధమయ్యింది!!**

(పుట – 90)

ఈ కవితలో ఇంకొక పండుగ బోనాలు. బోనం శక్తిని, జ్యోతిని, అమృతత్వాన్ని కవయిత్రి స్పష్టంగా వెల్లడించారు. ప్రకృతికి ప్రతిరూపంగా బోనం కాంతులను ప్రతిబింబింపజేశారు. వివిధ గ్రామ దేవతలను, వారి వారి స్వగుణాలను, వారికి భక్తులు చెల్లించే మొక్కుబడులను ఈ కవితలో తెలుసుకోవచ్చు.

**బోనంలో పెట్టిన పచ్చన్నం**
**శక్తిమాతకు పరమాన్నం**
**బోనమొక అక్షయపాత్ర!**
**జ్యోతి ఒక ఆరని జ్వాల!!** (పుట–92)

విజయ దామోదర స్వామి 'మాతృమూర్తికి నివాళి' అనే కవితలో తెలంగాణ కుటుంబ జీవన విధానాన్ని తెలిపారు. ఇది వారి కుటుంబానిదే అయినా, దాదాపు తెలంగాణ పల్లెలో కనిపించే కుటుంబం లాగా, పరిచయం ఉన్న కుటుంబం లాగా అనిపిస్తుంది.

తెలంగాణ తల్లికి చెందిన కవిత తుర్లపాటి లక్ష్మి రచించింది "నేను నగెయాల్ల". తెలంగాణ తల్లి ఆత్మఘోష ఈ కవితలో కనిపిస్తుంది. ముల్కి ఉద్యమం, చదువులు, ఉద్యోగాలు, భూములు, నీళ్ళు వంటి వాటికి చెందిన విషయాల ప్రస్తావన ఇందులో ఉంది. "మా చదువులు మేం జదువుకుంటం, మా కొలువులు మేం జేసుకుంటం, మా తొవ్వ మేం జూసుకుంటం" అంటూ కవయిత్రి తన ధిక్కార కవితా స్వరాన్ని వినిపించారు.

తెలంగాణ ఉద్యమానికి, పోరాటానికి చెందిన కవితలు ఈ సంకలనంలో చాలా ఉన్నాయి. సుదీర్ఘ కాలం పాటు ఉద్యమ ప్రభావం కవయిత్రుల మీద చాలా ఎక్కువగానే చూపింది. ఇందులో అన్ని కవితలు తెలంగాణ ఉద్యమాన్నే చిత్రిస్తున్నాయి.

కొన్ని స్త్రీల మీద, తెలంగాణ సామాజిక, చారిత్రక, సాంస్కృతిక, విద్య, వైద్య, జానపద కళలు, పండుగల మీద ఉన్నా; బాహ్యాంతర్గత ప్రభావాన్ని తెలంగాణ ఉద్యమం కనబరుస్తుంది. ఈ నేపథ్యంలో రచించబడిన కవితలను కొన్నింటిని పరిశీలిద్దాం – 'కాలజ్ఞానం' అనే కవితలో గోగు శ్యామల తెలంగాణ ఉద్యమ రూపురేఖలను వివరించారు. అన్యాయమైన తెలంగాణ స్థితిగతులను, సెల్కలు ఎడారి అయిన విధానాన్ని తెలియజేశారు. "చాకలి ఐలమ్మ తెగింపు / యాదవ సంగెం లక్ష్మీబాయి నీతి / మాదిగ సదాలక్ష్మి నాయకత్వం / మాల ఈశ్వరీబాయి పౌరుషం వంటివి తెలంగాణ తరుణికి మెండుగా ఉన్నాయని కవయిత్రి ధీమా వ్యక్తం చేశారు.

'తెగించి కొట్లాడుడే' అన్న కవితలో తిరునగరి దేవకీదేవి "అచ్చమాంబనై ఆయుధం పట్టిన దాన్ని / పాలకుర్తి అయిలమ్మనై / నా పాలు గింజల్ని దక్కించుకున్నదాన్ని / పోరాటమే ఊపిరిగా వడిసెలతో / శత్రువును ఉక్కిరి బిక్కిరి చేసినదాన్ని" అంటూ తెలంగాణ ఉద్యమ పంథాను వివరించారు. తెలంగాణాలో జరుగుతున్న అక్రమాలను, నీళ్ళులేక – నిధులందక రైతులు పడుతున్న అగచాట్లను, ఆంధ్రుల దురాక్రమణలతో కొనసాగిస్తున్న వ్యాపారుల లబ్ధిని పేర్కొన్నారు.

డా॥ ఆడువాల సుజాత కూడా 'తెలంగాణ తల్లి ఎత' అంటూ తన కవితలో "అడ్డమొచ్చినోన్ని / అడ్డంగా నరుకుతం / తెలంగాణా పొద్దుపొడుపు / వచ్చే దాకా పోరాడుతాం" అంటూ తెలంగాణ ఉద్యమ గొంతుకను వినిపించారు. 'సమరాంగన' అంటూ తెలంగాణా తల్లిని తన కవితలో ప్రతిక్షేపించారు లలితాదేవి. తెలంగాణ మహిళలు ఓరుగల్లు భద్రకాళి, రుద్రాంబిక, ఝాన్సీరాణి శ్రీవారిని కీర్తిస్తూ; వారు "ఉద్యమాలకు బాసటగా నిలుస్తున్నారు / ఉద్యమించే వారికి ఊపిరి పోస్తున్నారు" అని నారీ శక్తిని ప్రేరేపించారు.

తెలంగాణ చారిత్రక ఘట్టాలను ఆధారంగా చేసుకొని వచ్చిన కవితలు ఈ సంకలనంలో ఉన్నాయి. మొదటగా " కాకతీయుల ప్రతాపం – సమ్మక్క సారక్క శౌర్యం" అనే కవితలో డా॥ కె. లావణ్య కాకతీయుల సామ్రాజ్యాన్ని, ఓరుగల్లు కోటను, సమ్మక్క అవతరణను, పడిగిద్దరాజు పరాక్రమతను, రాజపుత్రి సారలమ్మను అశేషంగా కీర్తించారు. కాకతీయులకు చెందిన గాథలను, సమ్మక్క సారలమ్మల వీరత్వాన్ని అత్యంత నైపుణ్యంగా కవితా గానం చేశారు.

**మూఢనమ్మకాల నుంచి**
**మేడ రాజ్యగూడాన్ని**
**కాపాడిన శక్తిమాత!**
**సమ్మక్క పడిగిద్దరాజు**
**పుణ్యదంపతుల ముద్దులపట్టి**
**సారలమ్మ రాజపుత్రి!!**
**సమ్మక్క యుక్తి**
**శక్తియుక్తుల దైవత్వం!**
**మేడారం సౌభాగ్యం.** (పుట – 62)

అంటూ సమ్మక్క, సారలమ్మల మహిమలను, భక్తులు సమర్పించే నల్లబంగారాన్ని అత్యంత అతిశయంగా కవయిత్రి ప్రస్తుతించారు. జాతర ఆద్యంతాలు ఈ కవితలో వర్ణించబడ్డాయి. కాకతీయుల సామ్రాజ్యాన్ని కీర్తించిన విదేశీ రాయబారులు కూడా ఇందులో కనిపిస్తారు.

చారిత్రక నేపథ్యాన్ని పురస్కరించుకొని "మన తెలంగాణ" కవితలో నెల్లుట్ల రమాదేవి "ఎన్ని పోరాటాల్ని చూసిందో / ఎన్ని ఆరాటాల్ని మోసిందో / ఎన్ని కష్టాలను కాసి / చరిత్రకెక్కిన ఈ నేల/ ఎన్ని అసువుల్ని బాసిందో" అంటూ కాకతీయుల రుద్రమదేవి, సమ్మక్క సారలమ్మ, ఐలమ్మ, జాయప సేనాని, సర్వాయి పాపన్న, కొమురం భీం, గోల్కొండ నవాబులు, రామదాసు, దాశరథి సోదరులు, సినారె, సుద్దాల అశోక తేజ, గోరటి వెంకన్న, అందెశ్రీ, చంద్రబోసు, చుక్క సత్తయ్య, సుద్దాల హనుమంతు, కాళోజీ, గద్దర్, భువనగిరి కోట, యాదగిరి గుట్ట, భద్రాచలం, వేయిస్తంభాలగుడి, నాగార్జున సాగర్, తెలంగాణ సంస్థానాలు వంటి కవి, గాయక, కట్టడాల చారిత్రక విశేషాలను వెల్లడించారు.

ప్రత్యేకమైన అంశంగా ఈ కవితా సంకలనంలో కనిపించేవి ప్రాణత్యాగాలు. తెలంగాణ బిడ్డలు వందలాది మంది అమరులైతే; ఆవేదన చెందిన కవయిత్రులు తమ కలంలో కన్నీళ్లను నింపుకున్నారు. కన్నీటి చుక్కతో తెలంగాణ దుఃఖాన్ని రూపుగట్టారు. అమాయకుల బలిదానాలకు చలించిపోయిన తెలంగాణ కవయిత్రులు ప్రభుత్వపు మొండి వైఖరిని ఎండగట్టారు.

కిరణ్ బాల రచించిన "ఆ రోజుల కోసం...!" కవితలో –

వాళ్లకి "ప్రాణం" ఎందుకు చేదయ్యింది?

వాళ్లకి "బ్రతుకు" అగ్గిపుల్లెందుకయ్యింది?

వాళ్లకి "బ్రతుకు" నిలువెల్లా కాలి బూడిద ఎందుకయ్యింది? (పుట -40)

అంటూ ఆత్మహత్యల వెనుక ఉన్న అనేక ప్రశ్నలను లేవనెత్తారు. రణానికైనా, మరణానికైనా తెలంగాణ వీరుడు భయపడడనే విషయాన్ని ఈ కవిత ద్వారా మరొకసారి గుర్తు చేశారు. కాని ఆత్మహత్యల వల్ల తెలంగాణ రాదని, చావు పేరెత్తకుండా 'ప్రమాణం' చేయమని యువకులను ప్రాధేయపడ్డారు.

ప్రాణత్యాగాల మీదనే "ఒక పోరాటం వేల వేల గాయాలు" అని శైలజామిత్ర; "మా జోలికొస్తే..." అని మేరీ కుమారి మాదిగ వంటి కవయిత్రులు కవితలు రచించారు. తెలంగాణ స్త్రీ, వారి తెగువ, శక్తియుక్తులు వంటి వాటిపై కవితలు ఈ సంకలనంలో చాలానే ఉన్నాయి. అదే విధంగా స్త్రీల మీద జరుగుతున్న అన్యాయాలను ఎదిరించడానికి కవయిత్రుల చేతులన్నీ ఏకమయ్యాయి.

సుజన "అణుకువ గల అమ్మాయి", డా॥ తెన్నేటి సుధ "ఉద్యమం ఉప్పెనగా లేస్తే", రజనీ "కలాలు - వారెవ్వా!", శిలాలోలిత "జీవనతత్త్వం", టి. లీలా "నిన్ను " నువ్వే మార్చుకో", సస్య "నేను మనిషినికానా?", అరుణశ్రీ "శోకించకు", చల్లపల్లి స్వరూపరాణి "క్షుద్రదేవత" వంటివి స్త్రీల మనోధైర్యాలను, సాహసాలను కీర్తిస్తూ రచించిన కవితలు.

**"గుండె నట్టనది మధ్యన**
**ఏళ్ళకేళ్ళుగా తవ్వుకుంటున్న**
**ఈ దిగుడు బావి**
**ఎన్ని జీవనది ప్రవాహాల్ని**
**తనలో ఒంపుకుంటుందో"** (పుట - 45)

ఇది "ఎదురుచూస్తూ..."లో స్వాతీ శ్రీపాద రచించిన పంక్తులు. విషాదమైన స్త్రీ జీవన పార్శ్వాలను తన కవితలో స్పృశించారు.

ఈ సంకలనంలో భాషాపరంగా ప్రత్యేకంగా కనిపించే కొన్ని కవితలున్నాయి. అవి తెలంగాణ ఉద్యమాన్ని, సంస్కృతిని, సమాజాన్ని, రాజకీయాన్ని చిత్రించేవే అయినా; భాషకు పెద్దపీట వేశాయి. అందులో ముఖ్యంగా జ్వలిత రాసిన "గచ్చపొదలచిచ్చు", జూపాక సుభద్ర రాసిన "డప్పుడప్పుల్లతో దండోరేసే నా రోజెన్నడో", జి. విజయలక్ష్మి రాసిన "నాక్కాత్తగిరే" శారదా హన్మాండ్లు రాసిన "సావకు బిడ్డా", సంగీతరాణి రాసిన "హిమ్మతితోని..." వంటివి చెప్పుకోదగినవి.

**సదువుకొన పట్నంలున్నడు బిడ్డ**
**ఎయిల బిడ్డలంత పోరాటం చేస్తుండ్రు**
**లారీలకు ఈపులిచ్చి కాలే కడుపులతో**
**అగ్గోలె రగిలి పోతుండ్రు** (పుట-143)

అంటూ తెలంగాణ భాషకు పూర్తి స్వేచ్ఛను ఇచ్చారు 'సావకుబిడ్డా' కవితలో శారదా హన్మాండ్లు. తెలంగాణ జీవద్భాష, వైవిధ్యభరితమైన తెలంగాణ భాష తెలుగు భాష నుంచి వేరు పడింది. భాషా ప్రత్యేకతను ఈ కవిత పొందుపరుచుకున్నది. భాష అస్తిత్వాన్ని సుస్థిరం చేసింది.

ఇంకా ఇందులో కొన్ని కవితలు ఫ్లోరైడ్ సమస్య, గల్ఫ్ సమస్య, ఖనిజసంపదల దుర్వినియోగం, దొర దౌర్జన్యం వంటి విషయాలకు చెందినవి ఉన్నాయి.

**నీళ్ళు అంతటా ఉంటాయి గాని**
**విషం కలిసిన ఫ్లోరోసిస్ జలధారలు**
**ఇక్కడ ప్రాణాలు తీస్తాయి** (పుట-72)

అంటూ "గత్యంతరం లేదు" కవితలో ఎన్. అరుణ వ్యక్తంచేశారు. గోదావరి - కృష్ణమ్మ జలధారలు స్వచ్ఛమైనవే అయినా, తెలంగాణ గడ్డకు శాపంగా తయారైన ఫ్లోరోసిస్ సమస్య అధికారుల అలసత్వం వల్లనే ప్రబలిందని గుర్తు చేశారు.

ఖనిజ సంపదను గూర్చి "శల్య రాజకీయాల్ని నమ్మే ఎర్రిబాగోల్లంకాదు" అనే కవితలో కందాల శోభారాణి, గల్ఫ్ సమస్యను గూర్చి "కాటిసుకం" కవితలో కొండెపూడి నిర్మల, దొరల దౌర్జన్యాన్ని ఎదిరిస్తూ "ఏది నా తెలంగాణ" కవితలో తమ్మెర రాధిక నినదించారు.

చివరగా ఈ కవితా సంకలనంలో ప్రత్యేక శైలిని ప్రకటించిన కవితలున్నాయి. ఉయ్యాల - కోల్ పదములతో కూడిన జానపద బాణీకి చెందిన, పాటలాగా సాగే గేయానికి చెందిన కవితలున్నాయి. డా॥ వి. శోభ రచించిన "నా తెలంగాణా" కవితలో పాటను తలపించే విధంగా గేయగతి కనిపిస్తుంది.

**తెలంగాణా పల్లెలన్నీ**
**పోలీసోళ్ళ షహరులాయె!**
**గోదావరి కృష్ణమ్మలు**
**వాకిట్ల పారుతుంటే-**
**అరె, తెలంగాణ భూములన్నీ**
**ఎందుకిట్ల ఎండిపోయె?** (పుట – 105)

అంటూ ఎనిమిది చరణాలతో ఈ గేయం నడుస్తుంది. పల్లవి–అను పల్లవులు కూడా ఇందులో ఉన్నాయి. గాన సరణి అత్యంత గంభీరంగా ఉంటుంది; తెలంగాణ సమస్యలన్నింటిని మనముందుంచుతుంది.

"బతుకమ్మా– బతుకుమ్మాకోల్!" అంటూ జి. శ్యామల, "ముగ్గురు పెండ్లాలం ఉయ్యాలో... మా మొగనికి మేము, ఉయ్యాలో!" అంటూ శిరీషారాణి కవితలల్లారు.

ఈ విధంగా ఒకే గొంతుకతో – ఒకే స్వరంతో తెలంగాణ ఉద్యమంలో మేము సైతం అంటూ అరవై మందికి పైగా కవయిత్రులు "గాయాలే.. గేయాలై!" ద్వారా బయటకొచ్చారు. మూకుమ్మడిగా గళమెత్తారు. ఇప్పటి వరకు స్త్రీలు అనేక ఉద్యమాలలో, పోరాటాలలో ప్రత్యక్షంగా పాల్గొన్నారు. చరిత్రను తిరుగరాశారు. కొందరైతే ఉద్యమ వీరులకు వెన్ను దన్నుగా ఉండి ఆత్మ స్థైరాన్ని ఇచ్చారు. చరిత్రలో స్త్రీలు లేని ఉద్యమం లేదు. అవే జీవ–సత్వాలను కూడగట్టుకొని నేటి కవయిత్రులు కవితాపరంగా తెలంగాణ ఉద్యమంలో భాగస్వామ్యమయ్యారు.

**:కథా ఉద్యమం:**

తెలంగాణ కథా సాహిత్యంలో రచయిత్రులకు ప్రత్యేక స్థానం ఉంది. బండారు అచ్చమాంబకు వారసులైన తెలంగాణ కథా రచయిత్రులు వస్తు, శిల్పాదులలో విభిన్నతను ప్రదర్శిస్తున్నారు. సమకాలీన సమాజాన్ని అత్యంత పారదర్శకంగా ప్రతిబింబిస్తున్నారు. తెలంగాణ ఉద్యమాన్ని పురస్కరించుకొని, ఉత్తేజాన్ని కలిగించే విధంగా అచ్చమైన తెలంగాణ భాషలో తెలంగాణ కథా రచయిత్రులు 'వెతలే... కథలై!' అనే సంకలనాన్ని వెలువరించారు. 'అమృతలత, అనిశెట్టి రజిత, తుర్లపాటి లక్ష్మి, కిరణ్ బాల' ల సంపాదకత్వంలో వెలువడిన ఈ కథా సంకలనం 17 జూలై 2011 రోజున నిజామాబాదు జిల్లాలో ఆవిష్కరించబడింది.

ఈ తెలంగాణ కథా రచనల్లో ప్రధానంగా మూడు అంశాలు. 1. సమకాలీనత, 2. సార్వత్రికత, 3. ఆర్ద్రత. సమకాలీనత అంటే ప్రాసంగికత. ప్రాసంగికానుగుణంగా ప్రస్తుత పరిస్థితులకు స్పందించడం, వాటిపై గల స్వచ్ఛమైౖ అభిప్రాయాలను తేటతెల్లం చేయడం. సార్వత్రికత అంటే విశ్వజనీనమైన భావన కలిగి ఉండటం. ఉదాహరణకు మహిళలు సమాజంలో అన్ని రంగాల్లో తన స్థానాన్ని సుస్థిరం చేసుకోవడం. అస్తిత్వ అస్మితాలను కాపాడుకోవడం. అన్ని సందర్భాల్లో మహిళ ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరిస్తూ, సార్వత్రికమైన ప్రయోజనాన్ని ఆశించడం. ఆర్ద్రత అంటే సున్నితమైన భావన. స్త్రీత్వాన్ని ప్రదర్శించే స్థితి. స్త్రీ సహజత్వం. పరిస్థితులను బట్టి అత్యంత ఆర్ద్రతతో దయ, కరుణ, జాలి, ప్రేమ, అనురాగం, ఆప్యాయత, వాత్సల్యం వంటివి ప్రదర్శించడం. ఈ లక్షణాలన్నీ తెలంగాణ 'వెతలే... కథలై!' లో కన్పిస్తాయి. చారిత్రక ప్రాశస్త్యాన్ని, ప్రాధాన్యతను సంతరించుకొంటున్న సమకాలీనత చిరస్థాయిగా నిలిచిపోతుంది. అందుకే తెలంగాణ ఉద్యమ నేపథ్యంలో రచించిన ఈ కథలన్నీ చరిత్రలో నిలిచిపోతాయి. కథా రచయిత్రులందరూ తెలంగాణ చరిత్రలో ఒక పుట అవుతారు.

తెలంగాణ కథా రచయిత్రులు బండారు అచ్చమాంబ వారసులమని గర్వంగా చెప్పుకుంటారు. అందుకు తార్కాణం ఈ 'వెతలే... కథలై'లో ఆమె కథ 'స్త్రీ విద్యను 'నివాళి'గా స్వీకరించడమే. అచ్చమాంబతో పాటు నందగిరి ఇందిరాదేవి, పాకాల యశోదారెడ్డి, మాదిరెడ్డి సులోచన, బొమ్మ హేమాదేవి కథలను ఇందులో చేర్చడం జరిగింది. (తెలుగు కథాలోకం పూర్తిగా విస్మరించిన బొమ్మ హేమాదేవిని మొదటగా నేను ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలో ప్రజాస్వామిక రచయిత్రుల వేదిక వారు నిర్వహించిన సదస్సులో "బిసి కథా రచయిత్రులు" అనే అంశంపై పత్ర సమర్పణ చేస్తూ పరిచయం చేశాను.) తొలి తరం కథా రచయిత్రుల స్థానంలోనే నిలవాల్సిన బొమ్మ హేమాదేవి 1956కు పూర్వమే కథా రచన చేసింది. అందుకే ఆమె కథ 'బాంచెను దొరసాని'ని సేకరించి, ఈ పుస్తకంలో మనకందించి, తెలంగాణ కథా రచయిత్రులందరిలో ఒక కొత్త స్ఫూర్తిని, ఉత్తేజాన్ని సంపాదకులు అందించారు.

'వెతలే...కథలై!' కథా సంకలనంలో సంపాదకవర్గం కథలు పరిశీలిస్తే మొదటగా అమృతలత 'నేను సైతం' కథలో ఒక చిన్నపిల్ల మనస్తత్వంలో దానగుణాన్ని ప్రేరేపించింది.

వలసవచ్చి తన ఇంటి ముందు గుడిసె వేసుకొని బతుకుతున్న నిరుపేద లంబాడీ కుటుంబంలోని బాలికకు బట్టలు ఇచ్చి 'మనకున్న దాంట్లో ఎంతో కొంత ఇతరులకి దానం చెయ్యాలి' అని ప్రబోధించే ఒక చిన్న పాప పాత్రను రచయిత్రి పరిచయం చేసింది. అనిశెట్టి రజిత 'సోపతి' కథలో తెలంగాణ ఉద్యమానికి సంబంధించిన మౌలికమైన అంశాలపై చర్చ వివిధ పాత్రల మధ్య జరిగింది. విగ్రహాల విధ్వంసం గూర్చిన ప్రస్తావనలో చందూ – 'వందలాది మంది యువకుల ప్రాణాలు పోతుంటే... దశాబ్దాల తరబడి వారి భాషా సంస్కృతుల విధ్వంసం జరుగుతుంటే... నోరు మెదపని నేను...ఎంత స్వార్థపరుడ్నో అర్థమైంది!' అని బాధపడినట్లు రచయిత్రి పేర్కొన్నది. తుర్లపాటి లక్ష్మి 'పునాదుల్లోంచి' కథలో తెలంగాణ ఉద్యమం ప్రజల్లోకి ఎంతగా చొచ్చుకొని పోయిందో చెప్పబడింది. 'పెండ'కు బదులుగా 'పేడ' అన్నందుకే పరాయితనం ఏర్పడిన భావనను ఒక సంఘటన ద్వారా రచయిత్రి తెలియజేసింది. కిరణ్ బాల 'నా తావులకెల్లి లెవ్వు!' కథలో చిన్నపిల్లల మనస్తత్వం నుంచైనా తెలంగాణ ప్రత్యేకీకరణను, దాని ఆవశ్యకతను తెలుసుకోవలసిన అవసరం ఎంతైనా ఉందని చూపబడింది. ఈ కథలో దివ్య ఏడవ తరగతి చదువుతుంది. ఒకనాడు దివ్యకు ఒక అన్యాయం జరిగింది. అదేమిటంటే క్లాస్ లో తాను కూర్చొనే స్థలంలో వేరొక అమ్మాయి వచ్చి కూర్చొంది. టీచర్లందరూ ఎంత నచ్చచెప్పినా గానీ ఒకే ఒక సూటి ప్రశ్నతో 'మన తెలంగాణ మనకు కావాలి గదా! నా తావు నాకివ్వండ్రి' అని సాధించుకుంది.

ఈ కథా సంకలనంలో షహనాజ్ ఫాతిమా 'ఇంకెప్పుడు?!' కథలో గల్ఫ్ కు వలస వెళ్ళిన కుటుంబాలలోని స్త్రీల వ్యథను చిత్రీకరించింది. ఊళ్లలో బతుకుదెరువు లేక పట్నం వలస వెళ్ళి అక్కడ ఉద్యోగాల్లో చేరి, ఆ అధికారులతో అనేక అవమానాలను ఎదుర్కొంటున్న స్త్రీల కష్టాలను కూడా చిత్రీకరించింది. ఈ వలసల వల్ల బాధలను అనుభవించేది స్త్రీలేనన్న విషయం స్పష్టం అవుతుంది. గోగు శ్యామల రచించిన 'ఎల్లమ్మ దస్కింది' కథలో తెలంగాణ యాస, భాష, సంవేదన చాలా వాస్తవికంగా ప్రతిబింబింపబడింది. 'ఎల్లమ్మ' అనే దళిత స్త్రీ జీవనగాథ ఈ కథలో తెలుస్తుంది. పన్నెండు మంది పిల్లలను కన్నా గానీ, ఏడుగురి బిడ్డల పెండ్లిండ్లు చేసినాగానీ, ఇంకా కొడుకుల కోసం ఇరవై ఎకరాల భూమిని సంపాదించింది ఎల్లమ్మ. కానీ ఆంధ్రవాళ్ళు ధరల ఆశచూపి ఎల్లమ్మ భూమిని కొనడానికి ప్రయత్నిస్తే; చాలా గట్టిగా నిలబడి ఎదిరించి భూమిని కాపాడుకుంది. ఇటువంటి ధైర్యాన్ని, వ్యక్తిత్వాన్ని తెలంగాణ ప్రజలందరూ కలిగి ఉండాలనేది గోగు శ్యామల కథలో తెలుస్తుంది. కొలిపాక శోభ పెళ్ళి రచించిన కథ 'ఎశోధ'. ఈ కథలో ఆదర్శవంతమైన ఒక సన్నివేశం చోటుచేసుకుంది. స్త్రీ స్వేచ్ఛ; కట్టుబాట్ల నుంచి, సంప్రదాయాల నుంచి పూర్తిగా విడిపడి రెండో పెండ్లి చేసుకొన్న 'ఎశోధ' దానిని స్వాగతించిన సమాజం; ఇదంతా ఒక ఆదర్శవంతమైన వాతావరణాన్ని ప్రోత్సహిస్తుంది.

డా॥వి. త్రివేణి రచించిన 'కూలిన నేత గూడు'లో 'విజయ' జీవన గాథకు సంబంధించిన సన్నివేశం ఉంది. చేతివృత్తులు నశించిన తర్వాత చేనేత కుటుంబాల జీవితాల్లో చోటుచేసుకొన్న పరిణామాలు ఈ కథలో తెలియజేయబడ్డాయి. అప్పుల ఊబిలో కూరుకుపోయిన తమ కుటుంబానికి ఆసరాగా నిలవడానికి పదవ తరగతి వరకు చదివిన 'విజయ' కూలీగా మారిపోయింది. కాని మనోధైర్యం, స్వశక్తిమీద పూర్తిగా విశ్వాసం కలిగిన 'విజయ' తన భవిష్యత్తును ఉన్నత స్థాయిలో నిలపాలని ఆలోచించింది. గోపి భాగ్యలక్ష్మి 'గంగపొంగు' కథలో 'గంగ' ఆత్మగౌరవాన్ని కాపాడిన సైనికుడి విజయం తెలుపబడింది. పోల్కంపల్లి శాంతాదేవి కథలో 'చామంతి' అనే చిన్న అమ్మాయి ఉదార స్వభావం, కూలీకోసం వలస వెళ్ళే వారి జీవితాలు, దిక్కుమొక్కు లేక అనాథలైన వృద్ధులు, పిల్లలు, వారి దీనస్థితి తెలియజేయబడింది.

తాయమ్మ కరుణ తన 'చుక్కాని' కథలో తన అనుభవంలోంచి వచ్చిన తెలంగాణ ఉద్యమ పూర్తి పాఠాన్ని చాలా వివరణాత్మకంగా నేటి తరానికి అందించింది. 'చెల్లని చెక్కు' కథలో నెల్లుట్ల రమాదేవి తెలంగాణ ఉద్యమాన్ని, విద్యార్థుల త్యాగాన్ని ప్రదర్శిస్తూ రాజకీయ నాయకుల దమన బుద్ధిని బయటపెట్టింది. ఈ కథాంశానికి ఒక సామాజిక వర్గానికి చెందిన వడ్రంగి వృత్తిలోని విద్యార్థిని ఉదాహరణగా తీసుకొని, అందులో ఒక యదార్థమైన సంఘటనను ప్రధానాంశంగా స్వీకరించింది. శిలాలోలిత 'తెలంగాణ బిడ్డను నేను!' కథలో ఉత్తమ పురుష కథనం కనిపిస్తుంది. ఆడపిల్లలను, మగపిల్లలను విభేదంగా చూస్తున్న కుటుంబ, సమాజ వాతావరణంలోంచి బయట పడ్డ ఒక పాత్రను పరిచయం చేస్తూ తెలంగాణకు జరుగుతున్న అన్యాయాన్ని, బలిదానాలను వ్యాఖ్యానించింది.

ముదిగంటి సుజాతారెడ్డి 'దీనికి అంతం లేదా!' కథలో ఊరిని వదిలి పట్నం వలస వెళ్లిన మల్లారెడ్డి జీవన గాథ కనిపిస్తుంది. అదే విధంగా ఈ కథలో ఆడపిల్లలు ఆత్మస్థైర్యం, సంస్కార భావన, స్వేచ్ఛ కలిగిఉండాలని చూపబడింది. భాష, యాసతో పాటుగా ఉపదేశాత్మక కథనం ఈ కథకు ప్రత్యేకతను సంతరించుకొంది. 'నా తెలంగాణ' కథలో ప్రొఫెసర్ వి. శోభ ఒక కళాకారుడి ఆత్మ త్యాగాన్ని కథాంశంగా స్వీకరించింది. ఇక అయాచితం అరుణకుమారి 'నా బంగారు తల్లి' కథలో ఆంధ్ర తెలంగాణల మధ్యగల ప్రాంతీయమైన సాంస్కృతిక, భాష వ్యవహారిక భేదాలను తెలియజేసింది. పండుగల్లో, ఆచారాల్లో, నమ్మకాల్లో గల అర్థాలను బట్టి చూస్తే తెలంగాణ పదాలే సరియైనవిగా కథలో తెలుస్తుంది.

గీతాంజలి రచించిన 'నేను పోలేపల్లి పీనుగని మాట్లాడుతున్న' కథలో ఆత్మహత్యల పర్యంతం అయిన 'సెజ్'ల విధానం తెలుస్తుంది. ఎందరి ఆత్మఘోషనో ఒక పీనుగు ద్వారా కథాంశాన్ని నడుపుతూ సర్కారు దౌర్జన్యాన్ని, పేదల జీవితాల్లో విషాదపు పరిస్థితులను వర్ణించింది. 'పల్లె ఇల్లు ఖాళీ చేసింది' కథలో శారదా హన్మండ్లు తెలంగాణ పల్లెల పరిస్థితిని వివరించింది. నిర్దేశిత ప్రాంతాన్ని స్వీకరించి ఒకప్పుడు చేనేత వృత్తులతో, పచ్చని పంటలతో, నిండిన వాగునీళ్ళతో, ఆప్యాయంగా పలకరించే పల్లె ప్రజలతో తులతూగే ఊళ్ళు ; ఈనాడు ఏడారులైన విధానాన్ని చాలా ఆక్రోశంగా వ్యక్తపరిచింది. 'గీసిన బొమ్మరిల్లులా ఉండే పల్లె, దోచుకోగా మిగిలిన చిందర వందర ఇల్లులెక్క ఉందిప్పుడు' అన్న రచయిత్రి మాటలో తెలంగాణ ఛిద్రమైన ఆవేదన కనిపిస్తుంది.

స్వాతి శ్రీపాద 'బతుకమ్మ' కథలో తల్లిదండ్రులు పిల్లల మీద కన్న కలలు, తమ పిల్లలు తెలంగాణ కోసం చేసిన బలిదానాలు, చివరికి వాళ్ళు కూడా ఆత్మహత్యలకు పాల్పడటం వంటివి గమనించవచ్చు. రాజీవ 'బిడ్డలెవరు?' కథలో భూకబ్జాలు, వ్యాపారాలు, సినిమాలు, పరిశ్రమలు, పైరవీ చేసే వారిని గూర్చి తెలంగాణ అణచివేతను గూర్చి తెలుపబడింది. తిరునగరి దేవకీదేవి తన కథ 'మన వేలుతోనే మన కన్ను పొడిశిండు'లో తెలంగాణ వాళ్ళ అమాయకత్వాన్ని ఆసరాగా చేసుకొని అంతర్గత తగాదాలను, శత్రుత్వ భావనలను పెంచే ఆంధ్రోళ్ళ ధోరణిని వివరించింది. ఆడువాల సుజాత కథ 'మారాలి'లో తెలంగాణ ప్రజల బతుకులు మారాలని, చెడు వ్యసనాలు దూరం కావాలని, కాపురాలు నిలబడాలని తెలుపబడింది. అందుకోసం తెలంగాణ సాధింపబడాలనే ఆశ కనిపిస్తుంది. డా॥ కె. లావణ్య 'వలస' కథలో ఊరిలో జీవనాధారం కోల్పోయి బతుకుదెరువు కోసం పట్నం వెళ్ళిన ఒక వలస కుటుంబం బాగుపడటం గూర్చి చూపబడింది. శంకర్రావు అనే ఊరి పెద్దమనిషి సలహా సహాయాలతో భర్త తన తాగుబోతు కుటుంబం నుంచి బయటపడటం, లక్ష్మి జీవితం ఈ కథలో ప్రధానాంశం. కాత్యాయనీ విద్మహే 'విభజన రేఖలు' కథలో విద్యావంతుల సంభాషణలో తలెత్తిన తెలంగాణ వాదాన్ని చర్చగా ముందుకు తీసుకొని పోయింది.

ఈ విధంగా తెలంగాణ ఆకాంక్షను బలంగా స్పృశిస్తూ, తెలంగాణ ప్రజల జీవితాలను సున్నితంగా స్పర్శిస్తూ ఈ 'వెతలే... కథలై!' కథా సంకలనం తెలంగాణ ఉద్యమ పంథాను సంతరించుకుంది.

తెలంగాణ ఆవశ్యకతను ప్రధానంగా చేసుకొని తెలంగాణ కవయిత్రులు / రచయిత్రులు 'గాయాలే... గేయాలై!', 'వెతలే... కథలై!' అనే కవితా, కథా సంకలనాలు వెలువరించారు. తెలంగాణ ఉద్యమ సాహిత్యంలో ప్రత్యేకతను నిలబెట్టుకున్నారు. వర్తమాన తెలంగాణలో మహిళల సాహిత్యం గణనీయమైన స్థానంలోనే ఉన్నదనడంలో అతిశయోక్తి లేదు.

**:ఆధార గ్రంథాలు:**


అమృతలత. (సం.) 2010, గాయాలే... గేయాలై!, రజనీ పబ్లికేషన్స్, నిజామాబాద్.

అమృతలత. (సం.) 2011, వెతలే కథలై!, రజనీ పబ్లికేషన్స్, నిజామాబాద్.

సేనాపతి దాస్యం. (సం.) 2010, వల్లుబండ, సింగిడి ప్రచురణలు, కరీంనగర్.

రజిత, ఎనిశెట్టి. (సం.) 2013, జిగర్, రుద్రమ ప్రచురణలు, వరంగల్లు.

శంకర్, ఎనిశెట్టి. (సం.) 2010, ఒకటేమాట తెలంగాణ, తెలంగాణ రచయితల వేదిక, నిజామాబాద్.

స్కైబాబా. (సం.) 2009, జాగో – జగావో, హమారా తెలంగాణ ప్రచురణలు, హైదరాబాద్.

కథ

# జీవన గంగ



వనజ తాతినేని

గబగబ నడుస్తూ పని చేసే యింటికి వెళుతుంది గంగ. చేతిలో వున్న ఫోన్ మోగింది. సరళ నుండి ఫోన్. యెత్తగానే అవతలి నుండి ప్రశ్న.

"ఎక్కడ వున్నావు"

" మీ యింటికి దగ్గరలో వున్నానండి అపార్ట్మెంట్ లో పని చేసుకుని వస్తాను"

"నేను యింట్లో లేను కానీ నువ్వు యింటికి వెళతావుగా , నేను చెప్పిన పని చేస్తావు కదా" అదో రకం వొత్తిడి పెడుతూ అడిగింది సరళ.

ఇబ్బంది పడుతూ నిమిషం పాటు ఆలోచించి "గంట తర్వాత వెళతాను, పర్వాలేదా అండీ"

"బయటకు వచ్చాక ఫోన్ చేయి, యెక్కడో వొక చోట కాలక్షేపం చేస్తాను. చెప్పిన మాట మర్చిపోకు. బుస్స్ మనే ఆ పాము కోరలు పీకి పడేసేలా వుండాలి. ఇంకెప్పుడూ బుస కొట్టకూడదు,కాటు అసలే వేయకూడదు"

"సరేనండీ".. నడుస్తూ ఆలోచిస్తుంది. ఇలాంటి వొక రోజే కదా..ఉన్నపళంగా తన యింటి రాతంతా మారిపోయింది అని బాధగా అనుకుంటూ రెండు నెలల కిందట జరిగిన చేదును గుర్తుచేసుకుంది గంగ.

★ ★ ★

మసక చీకట్లోనే తడుము కుంటూ మెల్లగా యింటి వెనక్కి నడిచింది నర్సమ్మ. ఈడుస్తున్న కాళ్ళతో రెండడుగుల యెత్తులో వున్న బాత్రూమ్ లోకి పోవడానికి చానాసేపు పట్టింది. పది నిమిషాల తర్వాత తలుపు తీసి చుట్టూరా చూసి నివ్వెరపోయింది. ఐదారు ఆకులతో వొత్తుగా నవనవలాడుతూ గోడ వారగా పెరుగుతున్న కొత్తిమీర మడి తోటకూర మడి మాయమైపోయాయి.

"అయ్యో అయ్యో, నా ఆక్కూర మడంతా మాయమై పొయ్యింది. నిన్న పొద్దుటేల కూడా చూసేను కదా. ఏ ముదనష్టపు చేతులు పడ్డాయో,పరక్కూడా లేకుండా పీక్కుపొయ్యాయి,ఆ చేతులిరగిపోనూ ఆళ్ళకు కుష్టు రోగం రానూ, ఆళ్ళ అమ్మ కడుపు కాల".. తిట్ల దండకం తో సన్నటి దుఃఖపు గొంతుతో మడి దగ్గరకు నడిచింది నర్సమ్మ.

"అత్తా, యెవరో యెందుకు చేస్తారు, నిన్న మజ్జేనం నీ కొడుకే పీక్కుపోయి అమ్మేసుకుని తాగేసాడు" అన్జెప్పి బాత్రూమ్ లోకి వెళ్ళి తలుపేసుకుంది గంగ.

"ఓరి దుర్మార్గుడా, నీకు పోయేకాలం వచ్చింది రా," అని తిట్టుకుంటూ రేకుల వసారాలోకి జేరి మంచంపై కూలబడింది. ఇంటిని వొకసారి కలియదిప్పి చూసుకుంది. ఒక పెద్ద గది దానిముందు రేకు వసారా.అందులో చిన్న వంట గది. వసారా లో తన మంచం. గవర్నమెంట్ కట్టించిన యిల్లు అది. ఈ యింటి మీద కూడా వీడికి యిక అప్పు పుట్టనట్టు వుంది. అందినకాడికి యేదిబడితే అది యెత్తుకుపోవడమే మిగిలింది. ఇల్లు వొల్లు గుల్ల చేసుకుని నూరేళ్ళు బతికింది యెవరూ.. అందులో సగం ఆయువుంటే మా గొప్ప అనుకుంది ఖాళీ గా వున్న తన నుదుటిని తడుముకుంటూ.

తన చేత్తో తన కన్ను ని తానే పొడుచుకుంటున్నట్లు తమ బతుకుల్లో నెలకొన్న పేదరికాన్ని యెన్నడూ జయించనివ్వని వ్యసనానికి బానిసైన కొడుకుని తలుచుకుని దిగులుపడింది. కళ్ళల్లో గుచ్చుకుంటున్న పొద్దుకి యెదురుగా కూర్చుని కోడలిచ్చిన టీ తాగి నెమ్మదిగా లేచి గోనెపట్టా చేతబట్టుకుని కర్రపోటు సాయంతో ఆ కాలనీ సెంటరుకు బయలుదేరింది.

మార్కెట్ లో గుత్తానికి ఆకు కూర కట్టలు కొని మార్కెట్ బయట గోనెపట్టా పరుచుకుని కూర్చునేదాకా రోజూ కోడలు వచ్చి సాయపడుతుంది. ఆ రోజు కోడలిని సాయమడగాలన్నంత బుద్ధి పుట్టక ఒంటరిగానే బయలెల్లింది.

నర్సమ్మ ఆకు కూరలు అమ్ముకుంటూనే కూసింత ఖాళీ దొరికితే చాలు కట్టల మట్టి దులిసేసి చీడ పట్టిన ఆకులేరేసి పచ్చబడిన ఆకులను తుంచేసి శుభ్రం చేసి క్యారీ బేగ్ లలో పెట్టి వుంచుతుంది.ఆ పనులన్నీ చేసుకునే తీరిక ఓపిక లేని కొందరు వాటిని వతనుగా ఆమె దగ్గరే కొంటూ వుంటారు. మరికొందరు ఆమెతో కూడా గీచి గీచి బేరమాడతారు. దయాశీలురు కొందరు ఆ వయస్సులో కూడా యేదో వొక పని చేసుకుని బతకాల్సిన

అవసరాన్ని గుర్తించి గ్రహించి యింకొంత డబ్బును వుదారంగా యిచ్చిపోతారు.

మధ్యలో నాలుగు ఇడ్లీలు తిని యింకోసారి టీ తాగి మధ్యాహ్నం దాకా పనిచేసుకుని యాభై వంద మధ్య డబ్బు చేసుకుని యింటికి చేరుకుంటుంది. కోడలు వుదయాన్నే వంట చేసి పెట్టి వెళ్ళి నాలుగిళ్లల్లో పనిచేసుకుని వచ్చేటప్పటికి .. నర్సమ్మ ఓ కునుకు తీసే వుంటుంది.

కానీ ఆ రోజు గంగ ఇంటికి రావడం ఆలస్యం అయింది.

నక్షత్రాలు కనబడనివ్వని కారు మేఘాలు నగరాన్ని కమ్మేసాయి. నగర శివారు రాత్రి దీపాలతో వెలుగుతుంది. మెయిన్ రోడ్ లో అడపాదడపా తిరిగే ఆటోలు తప్ప పెద్దగా సందడి లేని రోడ్డు. బస్టాప్ దగ్గర ఆగిన ఆటో లోనుండి దిగిన గంగ నడుస్తుంది.

వర్షాకాలపు గంభీరమైన నిశ్శబ్దాన్ని భంగపరుస్తూ వీధి కుక్కల కాట్లాట. చేతిలోని గొడుగుని వాటికి తర్జన గా చూపిస్తూ వడి వడిగా యింటికి చేరుకుంటూ.. మొగుడిని తలుచుకుని మహానుభావుడు ఖాళీ అయిన గ్యాస్ బండ యిచ్చేసి నిండు బండ తెచ్చాడో లేదో. అప్పు దొరికిందో లేదో అనే ఆలోచనలతో యిల్లు చేరింది.

వరండాలో మంచంపై కూర్చున్న అత్త.. "ఇంత ఆలస్యమైందేమే గంగా" అని అడిగింది.

"యాభై మందికి వంట చేయడం చిన్నమాటా.. అన్ని చేసి సర్ది వచ్చేటప్పటికి యీ టైమైంది. కాళ్ళు పడిపోయినయ్యి అనుకో"

"ఆడింకా రాలేదు. నువ్వు కూడా యేమి తేకుండా చేతులూపుకుంటా వచ్చావే! అంత మందికి వండిచ్చుకుని నీకేం పెట్టలేదా" అడిగింది ఆరాగా ఆకలిగా.

"వాళ్ళ పార్టీ అవ్వలేదు,రాత్రి పన్నెండింటికి అంట. అదవకుండా చుట్టాలు తినకుండా నాకెట్టా పెడతారు"అంటూ కాళ్ళు కడుక్కొని లోపలికి నడిచింది.

"పిల్లలూ నేనూ మద్దేనం యేదో వొకటి తిన్నాం. ఇప్పుడు యేం తినాలో యేంటో చూడు. సరిగ్గా కళ్ళు కనబడని నేను యేమి వండేది యెట్టా వండేది" అంది నర్సమ్మ.

కుక్కపిల్లను వొళ్ళో కూర్చోబెట్టుకుని ఆడుకుంటున్న కృష్ణుడు తల్లిని చూసి గబుక్కున లేచాడు.

మెటల్ గాజుకు గమ్ రాసి మునివేళ్ళతో చకచక దారాన్ని అల్లుతూన్న నవ్య తల్లిని చూసింది.చేతిలో గాజుని కిందేసి వొక్క వుదుటున లేచొచ్చి తల్లిని చుట్టేసి గగ్గోలు పెట్టి యేడ్చింది. .

బడికి వెళ్ళి ఆరవ తరగతి చదువుకుంటూనే తల్లికి ఉదయం యింటి పనిలో సాయం చేయడం సాయంకాలం గాజులకు రంగులు అద్దడం రాళ్ళు అతకడం దారం చుట్టటం ద్వారా రోజుకు పాతిక ముప్పై రూపాయల సంపాదించి తల్లి చేతికిస్తుంది. అట్టాంటి పిల్ల అంతలా బావురమనడంతో బిత్తరపోయింది గంగ. .

"ఎందుకు యేడుస్తున్నావే బంగారు తల్లీ,యేం జరిగిందో నువ్వైనా చెప్పవే అత్తా" అంది కంగారుగా.

"ఏం జరగలేదులే గంగా, నువ్వు బెంబేలుపడమాకు. ఆ యెదవ సచ్చినోడు యేదో చేయబోయాడట. బిడ్డ బాగా భయపడినట్టుంది" అంది.

"ఎవడాడు?

కూతురిని వొళ్ళోకి తీసుకొని వోదార్చి కాసిని మంచినీళ్ళు తాగిచ్చి యేం జరిగిందో చెప్పమని అడిగింది.

"ఆ రమణారావు డబ్బు యిస్తానన్నాడు. ఆ యింటికి వెళ్ళి డబ్బు తీసుకురా అన్నాడు నాన్న" అంటూ మొదలెట్టి జరిగిందేమిటో మననం చేసుకుని చెప్పసాగింది నవ్య. .

★ ★ ★

సన్నగా రివటలా వుండి పత్తికాయలంటి కళ్ళేసుకుని పెదాలు తడుపుకుంటూ ఆడాళ్ళని అదోరకంగా చూసే రమణారావు యింటికి వెళ్ళమంటే వెనక్కి తగ్గింది నవ్య.

"ఆ యింటికి నేనెళ్ళను నువ్వే వెళ్ళు" అంది తండ్రిని.

"ఎల్లమని చెబుతుంటే నీక్కాదు. నా నాలుగు నాకు పడితేకాని కదలవేమో" అని కసిరాడు.

అయిష్టంగానే కదిలింది.మూడొంతస్తుల ఇంటి గేటు ముందు నిలబడి బెల్ కొట్టింది నవ్య. రమణారావు కుక్క తో కూడా వచ్చి తలుపు తీసాడు.ఆ యిల్లు చిన్నతనం నుండి నవ్య కు పరిచయమే. తమ్ముడు పుట్టక ముందు తన తల్లి ఆ యింట్లో పనిచేస్తున్నప్పుడు తనను కూడా తీసుకొచ్చి పెరట్లో కూర్చోబెట్టి పని చేసుకునేది. రమణారావు భార్య సరళమ్మ. అప్పుడామె యింట్లో లేదు.

"ఎంత పెద్దదానివైపోయావే..నువ్వు అంటూ బుగ్గ గిల్లాడు... టీచరమ్మ యింట్లో లేదు. కూతురిని తీసుకుని షాపింగ్ కి వెళ్ళిందంట. కాసిని కాఫీ కలిపియ్యవే నవ్యా.. తల పగిలిపోతుంది అన్నాడు. "నాకు కాఫీ పెట్టడం రాదండీ. మీరు డబ్బులిస్తే వెళ్ళిపోతా".. అంది జంకుగా.

“అదేం బ్రహ్మ విద్యా? నేను యెలా చేయాలో చెబుతాను నువ్వు చేద్దువుగాని. లోపలకు రా” అంటూ చొరవగా చెయ్యి పట్టుకుని వంటింట్లోకి లాకెళ్ళాడు. పాల గిన్నె పొయ్యి మీద పెట్టించి “నేను పైకి వెళ్ళి డబ్బులు పట్టుకొస్తా, పాలు పొంగకుండా చూడు” అని పైకి వెళ్ళాడు. నవ్య పాల వంక చూస్తూనే వుంది. లోలోపల బితుకు బితుకు మంటూ యేదో భయం. కొద్దిసేపటికి పిల్లిలా చప్పుడు చేయకుండా వెనక నుంచి వచ్చి కొండచిలువలా వొళ్ళంతా చుట్టేసాడు.

భయంతో అరుస్తూ విదిలించుకుంటూ గుమ్మం వైపు చూస్తే. తలుపులు మూసేసి వున్నాయి. నవ్య వణికిపోతూ బిగ్గరగా అరిచినా బయటకు వినబడని పెద్ద శబ్దంతో టివి లో పాటలు.

యెరుపెక్కిన కళ్ళతో ముఖమంతా తడిచేసి గుండెలపై కర్కశహస్తాలతో తడిమి తడిమి తర్వాత అకస్మాత్తుగా నీరుకారిపోయి కుర్చీలో కూలబడిపోయాడు. షాక్ నుండి అయోమయం లోకి తర్వాత అసహ్యంలోకి మారిన ముఖంతో బయటకు రాబోతున్న నవ్య చేతిలో వెయ్యి రూపాయలు పెట్టాడు. “ఇక్కడ జరిగింది యెవరికీ చెప్పకు. అప్పుడప్పుడు వస్తూ వుండు. నీకు చాలా డబ్బులిస్తాను” అన్నాడు.

ఆ డబ్బులు అక్కడే విసిరేసి పరిగెత్తుకుని యింటికి వచ్చి పడింది. డబ్బు కోసం యెదురుచూస్తున్న తండ్రికి జరిగింది చెప్పింది. డబ్బులెందుకు పడేసి వచ్చావని తండ్రి వొక్కటిచ్చాడు. ఏడ్చుకుంటూ వెళ్ళి నాయనమ్మకు చెప్పింది. అది విన్నాక ఆవేశపడిన నర్సమ్మ యెదురుగా లేని కొడుకుని తిట్టిపోసింది, దినవారాలు చేసేసింది.

తల్లితో ఆ విషయమంతా చెప్పిన నవ్య మళ్ళీ వెక్కుతూ యేడ్చింది. వింటున్న గంగ కోపంతో వణికిపోయింది. పిల్ల ఏడుపు చూసి కడుపు తరుక్కుపోయింది.తల్లి ముఖంలో కోపం, ఏడుస్తున్న అక్కను చూసి బిక్కముఖం పెట్టుకున్నాడు కృష్ణుడు.

గంగ కాసేపటికి మనస్సు చిక్కబట్టుకుని కూతురి వైపు చూసింది. నవ్య కళ్ళలో యింకా వీడని భయం. చీటికిమాటికి తాగుబోతు తండ్రి తిట్టే తిట్లకు కన్నీళ్ళు తప్ప మరే యితర కలలు కనని ఇంద్రధనుస్సు లసలే పూయని అమాయకమైన సోగ కళ్ళు అవి. అమ్మ ను యెప్పుడూ విసిగించకూడదని వొట్టు పెట్టుకున్నట్టు వుండే ముఖం. నాన్నను యేవీ తెచ్చిమ్మని అడగని నోరు అది. జరిగినదాని గురించి ఆలోచిస్తూ కూర్చుంటే యెట్లా! ఆ సంగతి మర్నాడు చూద్దాం, పిల్లలు ఆకలి తీర్చాలి ముందు అని నెమ్మదిగా లేచింది.

స్టీల్ బేసిన్ లో పిండిని ముద్దగా కలుపుతున్న తల్లి చేతి కదలికను తదేకంగా చూస్తున్నాడు కృష్ణుడు. అమ్మెందుకో బాగా కోపంగా వుందని అర్థమై దిగులేసింది. కసిగా కదిలే ఆ వేళ్ళ కదలికల్లో కట్టుకున్న వాడిపై వున్న కోపావేశాలు కళ్ళలో బిడ్డలకు పట్టెడన్నం వొండి పొట్ట నింపలేని ఆక్రోశం వాడికేమీ తెలియకపోయినా నెమ్మదిగా తల్లి పక్కనజేరి చేరాడు.

గంగ యేడేళ్ళ కొడుకు వైపు చూసింది. మామూలుగా అయితే ఆమెతో పాటు పీటపై కర్రతో రొట్టెలు చేయడానికి సరదా పడేవాడు. కానీ వుదయం నుండి అర్థాకలితో వున్నాడయ్యే. ఆ పనిజోలికి వెళ్ళకుండా పక్కనే కూర్చున్నాడు. వాడి చిన్ని పొట్ట ఆకలిని కళ్ళలో వినబడని ప్రశ్నలను అర్థం చేసుకున్నది గంగ. పిండి కలిపిందే కానీ సిలిండర్ లేని పొయ్యి పై రొట్టె యెట్లా కాల్చాలో పాలుపోలేదు.మూడు రాళ్ళ పొయ్యి కింద మండటానికి కట్టెలు గతి లేని కిరోసిన్ లేని యిల్లే గాని ఆమె గుండెల్లో మొగుడు రగిలించిన నెగడు మండుతూనే వుంది. కలిపిన పిండి డిప్పను పక్కన పెట్టి వరండాలో మూలనున్న అట్టపెట్టె తెరిచి చూసింది. రొండే దోసిళ్ళు వున్న కర్ర బొగ్గుల సంచి కనబడింది. కుంపటిని తీసుకొచ్చి గుమ్మం ముందు కూర్చుని కుంపట్లో బొగ్గులేసి నిప్పు పుట్టించే పని మొదలెట్టింది.

అత్త నర్సమ్మ కోడలు గంగ ఆలోచనలు కనిపెట్టింది.

“పొద్దుననగా యెల్లాడు గేస్ బండ పట్టుకొత్తానని. ఇంతవరకు అయిపులేదు.ఏడ తాగి తందనాలు ఆడుతున్నాడో.” అంది. గంగ మాట్లాడలేదు. మళ్ళీ నర్సమ్మే అంది. “పిల్ల అంతా చెప్పేసి వుంటదని నీకు మొకం చూపిచ్చడానికి సిగ్గేసి యేడాడ తిరుగుతున్నాడో” అంది.

అత్త వైపు చురుగ్గా చూసి “నీ కొడుకు సిగ్గు పడటమా, అదో యెనిమిదో వింత అయ్యిద్ది. గేస్ బండ తెస్తాడని నీకు నమ్మకం వుందా యేంటి, చేసే యెదవ పనుల చిట్టా రోజు రోజుకి పెచ్చరిల్లిపోతుంది. ఎవడన్నా బిడ్డను చూసి యెదవ్వేషాలేస్తే దుడ్డు కర్ర తీసుకొని వాడి నడుం యిరగ్గొట్టాలి. తాగుడికి డబ్బులొస్తయి అని పెళ్ళాన్నో కడుపునబుట్టిన బిడ్డనో యెవడి పక్కలోనో పండబెట్టే తార్పుడుగాడి అవతారం యెత్తడు. సరళమ్మ యింట్లో పని మానేసింది యిందుక్కాదు,నేను తప్పించుకున్నాననుకుంటే బిడ్డను ఆడికి అప్పగించబోయాడు. తలుచుకుంటే భయమేస్తుంది,వొళ్ళంతా కంపరంతో వుడికిపోతుంది. నీ కొడుకుని మాత్రం వొదుల్తానా? రానీ ఆడి పని చెప్తా”. కుంపట్లో మంట గంగ ముఖంపై తారట్లాడింది కాసేపు.

ఆమె పిండి గిన్నె తీసుకొని వుండలు చుడుతుండగా..

“ఇదిగో గంగా! ఆడిని నేను తిట్టలేదనుకునేవు,ఆడికి ఫోన్

చేపిచ్చి తిట్టా. దైవసాచ్చిగా చెపుతున్నా! ఇంకెప్పుడైనా ఆయన దగ్గరకు డబ్బేట్టుకు రమ్మని పిల్లను పంపావా కాళ్ళిరగ్గొడతా సన్నాసెధవా! మరీ యింత సన్నాసి యెధవ్వి అవుతావనుకుంటే పురిట్లోనే వడ్ల గింజేసి చంపి వుందును" అని తిట్టిపోసా. ఆ రమణారావును మాత్రం నేను వొదిలాననుకున్నావా?, నడివీధిలో పెట్టకపోయినా యింటెనకమాలకు పిలిచి ఆడి పెళ్ళాం పిల్ల ముందర బుగ్గల్లో బుగ్గల్లో పొడిచి మొకాన ఊసి వచ్చా! నువ్వొచ్చాక నీకొక మాట చెప్పి పోలీసు స్టేషన్ కి పోదాం అని చూత్తన్నా, నువ్వేమంటావ్ మరి"

"ఇప్పుడేడ పోతాం, ఆలోచిచ్చుకోని నన్ను. ఏ సంగతి రేపు చూద్దాం."

ఈ మాటలేవిటికీ అర్ధం తెలియని కృష్ణుడు అమ్మ చేతిలో పిండి రొట్టెలయ్యీ పళ్ళెంలోకి పరుగెత్తి వచ్చే గోధుమ వర్ణపు చంద్రుడై నోట్లో వెన్నముద్దై కరిగి భగభగమని మండే జఠరాగ్నిని చల్లబరుస్తాయని ఆత్రంగా యెదురుచూస్తున్నాడు. నవ్య మంచంపై ముడుచుకుని ఆలోచిస్తుంది.

పిల్లలకు అత్తకు రొట్టెలు పెట్టి తను మజ్జిగ తాగి పడుకుంది గంగ. ప్రసాద్ పేరుకు ఆటో తోల్తాడు. అంగట్లో సరుకుల్లా ఆమ్మాయిలను బుక్ చేసి రమణారావుకు అప్పగించేవాడు. భార్య గంగ తన సొంత ఆస్థి అనుకుని ఆమెను రమణారావు వైపుకు నెట్టడానికి శక్తియుక్తులన్నీ ప్రయోగించాడు. గంగ మొగుడిని ఛీత్కరించుకుంది. పెట్టెబేడా సర్దుకుని పిల్లలను వెంటబెట్టుకుని పల్లెటూరుకు బయలెల్లింది. కాళ్ళబేరానికి వచ్చినట్టే వచ్చాడు కానీ యింటికి రావడమే మానేసాడు. గంగ కాకపోతే మంగ అన్నట్టు వేరొక స్త్రీతో రెండో యిల్లు యేర్పరుచుకున్నాడు. ఆ సంగతి తెలిసినా పట్టించుకోలేదు గంగ. పట్టించుకుని గనుక యేమి చేయగలను,ఎక్కడైనా రెక్కలు ముక్కలు చేసుకుని బతకాల్సిందే కదా బిడ్డల చదువు కోసమైనా పట్నాన్ని అంటిపెట్టుకుని వుండాలి తప్పదు అనుకుంది.

సన్నగా మొదలైన వాన కుంభవృష్టి గా మారింది. గంటల్లోనే లోతట్టు ప్రాంతంలో వుండే వారిళ్ళ మధ్య కలకలం. దాదాపు అందరి ఇళ్ళను వరద చుట్టేసింది. పిల్లలు గగ్గోలు పెట్టి ఏడుస్తున్నారు. ఆడాళ్లు కంగారుగా చేతికందిన చెంబూ తపేళ మూటాముల్లె నెత్తినెట్టుకుని పిల్లలను పట్టుకుని మోకాలు లోతు నీళ్ళలో కాళ్ళీడ్చుకుంటూ నడుస్తున్నారు. మగవాళ్లు ఇళ్ళ వరుసను బట్టి రోడ్డును అంచనా వేసుకుంటూ అందరినీ హెచ్చరిస్తూ ముందుగా నడిచారు.

నర్సమ్మ అందరికన్నా చివరన నడుస్తూ వెనక్కి వెనక్కి చూసుకుంటుంది. "నాయనా.. కిట్టయ్యా కుక్క పిల్లను చంకనేసుకున్నావా లేదా? పిచ్చిముండ మునిగి చచ్చిపోద్ది" అంది.

"నానమ్మా, నేను కుక్క పిల్లను భుజానేసుకుని నడుస్తున్నా. నువ్వు గబగబ రా.. నీళ్లు పైకొచ్చేస్తున్నాయి" అని అరిచాడు కృష్ణుడు. అందరూ భయం గుప్పిటబెట్టుకుని వానలో తడుస్తూనే ఎత్తైన ప్రదేశానికి చేరుకున్నారు. గంగ చేతిలో వున్నవి తలపై వున్న మూటను దించి అక్కడే పిల్లలను కూర్చోబెట్టి నర్సమ్మ కోసం వెనక్కి వచ్చింది. భుజం పట్టుకుని నడిపిస్తుంటే నర్సమ్మ వెనక్కి తిరిగి ఇంటి వైపు చూసుకుంటూ కళ్లు తుడుచుకుంటూ గొణుక్కుంటూ కోడలితో నడిచింది. ఎత్తుపై నుండి కూడా తదేకంగా కనీకనబడని తన ఇంటిని చూసుకుంటూ వుండిపోయింది. ఆ రాత్రి కాళరాత్రే అయింది వారికి. అధికారులు వచ్చి అందరినీ పునరావాస కేంద్రాలకు తరలించారు. రాజకీయ నాయకుల సహాయ కార్యక్రమాలు జరుగుతూనే వున్నాయి.

తెల్లారినాక కూడా వాన కురుస్తూనే వుంది. గంగ నర్సమ్మకు టీ టిఫిన్ తీసుకొచ్చి యిచ్చి "ఇంకా రెండు రోజులు వాన యిట్టాగే వుంటదంట. ఇక మనం ఇంటి ముఖం చూత్తామో లేదో, అంతా నానిపోయి కూలిపోద్దో యేమో, తలదాచుకోడానికి ఆ నీడ కూడా లేకుండా పోద్దేమో అత్తా! ఈ కష్టం పగోడికి కూడా వద్దు" అంది దిగులుగా.

"నాకు అదే దిగులుగా వుందే గంగా"

"నీ కొడుకెక్కడికి వెళ్లాడో. మిత్తవల్లే యింత వరదొచ్చి పడిందే,పిల్లలు తల్లి పెళ్లాం యెట్టా వుండారో యెక్కడ వుండారో అన్న ఆలోచన ఇంగితగానం వుండొద్దు. ఇట్టాంటి వాడు బతికి వుంటే యేంటి చస్తే యేంటి?" అంది కోపంగా.

"అంత మాట అనకే గంగా" అంటూ గట్టిగా ఏడ్చింది నర్సమ్మ. తెల్లారితే చాలు గుక్కెడు టీ కోసం పెర పెరలాడే ఆమె ఆ రోజు టీ ముట్టలేదు, టిఫిన్ తినలేదు.గోడకు ముఖం పెట్టుకుని ముడుచుకుని వుండిపోయింది.

అప్పుడప్పుడూ "గంగా, అట్టా బయటకుపోయి మన ఇళ్ల దగ్గరోళ్ళకు ప్రసాదు యేడన్నా కనబడ్డాడేమో అడిగి రా పో.." అనీ, పిల్లలను "మీ నాన్న వచ్చాడేమో చూసిరండి పోండి" అని తరుముతానే వుంది. నర్సమ్మ నసకు విసుగొచ్చిన పిల్లలు దగ్గరకు రావడం మానేసారు. గంగ కాలుగాలిన పిల్లిలా తిరుగుతూ మొగుడి కోసం ఆరా తీస్తానే వుంది.

మూడో రోజుకు వాన తెరిపిచ్చింది. నాలుగో రోజుకు మునిగిన కాలనీ ఇళ్లు బురద మేటేసుకుని దుర్గంధం కొడుతూ బయటపడ్డాయి. పశువుల కళేబరాలు కుక్కల కళేబరాలతో

పాటు కరెంట్ స్థంభానికి తట్టుకుని ఆగిపోయిన ప్లాస్టిక్ నవ్వారు మంచం.నవ్వారు పట్టెల్లో చిక్కుకున్న కాళ్ళతో ఉబ్బిపోయిన శరీరంతో వున్న శవం. మంచం, వొంటిపై అరకొర బట్టలు చూసి నర్సమ్మ కొడుకు ప్రసాద్ గా గుర్తించారు. నర్సమ్మ కుళ్ళి కుళ్లి ఏడ్చింది. గంగ నిబ్బరంగా పిల్లలిద్దరిని పట్టుకుని నిలబడింది.

నర్సమ్మ మనసులో కుళ్ళి కుళ్ళి యేడుస్తుంది. "అయ్యో కొడుకా! నా చేత యెంత పని చేయించావురా. నన్నెంత కటికదానిగా చేసావ్ రా అయ్యా! నీ బుద్ధి సక్రమంగా లేదని కోపంతో ఈ పని చేసాను. తాగొచ్చి వొళ్లు తెలియకుండా మంచం మీద పడిపోతే నిన్ను లెగవకుండా కట్టి పడేసా కదరా. ఆ తాడే నీకు ఉరితాడు అయ్యి నీళ్ళలో మునిగిపోతున్నా లెగవకుండా చేసింది కదరా అయ్యా. నన్ను బిడ్డను చంపిన పాపిని చేసావు కదరా అయ్యా" అని.

సరళ వచ్చి గంగ కు అండగా నిలబడింది. నర్సమ్మ వచ్చి రమణారావు పై కేసు పెడతానని అనేసరికి భయపడి ఫిట్స్ లాగా వచ్చి పడిపోయాడని హాస్పిటల్ కు వేసుకుని వెళితే పక్షవాతం వచ్చే సూచనలన్నారని చెబుతూ...

"గంగా..నీ మొగుడు చచ్చాడని నువ్వు యేడుస్తున్నావు నా మొగుడు యింకా యెందుకు చావలేదని నేను యేడుస్తున్నా" అంది సరళ.

"అయ్యో! అంతమాట యెందుకులేమ్మా, ఊరుకోండి అమ్మ గారూ" అంది. గంగ జాలి నిండిన గొంతుతో చెమ్మగిల్లిన మనసుతో.

కూలిపోయిన యింటిలో అప్పుల వాళ్ళ తాకిడితో చాలీ చాలని పరదా పట్టాల కింద తలదాచుకుంటుంది గంగ కుటుంబం. బతుకు భారంగా రోజులు వేగంగా గడుస్తున్నాయి. పశ్చాతాపంతో నర్సమ్మ గుండెలు మండిపోతున్నాయి. తప్పు చేసిన బిడ్డను మందలించవచ్చు దండించవచ్చు గానీ ప్రాణం తీసే హక్కు తనకు యేముందనీ అని లోలోపల కుమిలిపోయింది. ఎక్కువ కాలం రహస్యం కప్పిపెట్టలేక మనసు ఉగ్గబట్టుకోలేక చేసిన పాపం చెబితే పోతుంది అన్నట్టు గంగ కాళ్ళు పట్టుకుని తను చేసిన పని గురించి చెప్పింది క్షమించమని ప్రాధేయపడింది.

గంగ నిర్లిప్తతంగా చూసి "ఇట్టా జరుగుద్దని నువ్వు మాత్రం అనుకున్నావా యేంటి, ఊరుకో అత్తా" అంది. "ఈ మాట మరెక్కడా అనబోకు కడుపులో దాచుకో" అని కూడా చెప్పింది. నర్సమ్మ పాప భారాన్ని యెక్కువ కాలం ఓపలేకపోయింది.గంగ మోసే తన భారాన్ని కూడా తగ్గించేసి లోకం నుండి నిష్క్రమించింది. ఆ రోజు అండ పోయిందో బరువు తగ్గిందో యేమి బోధ పడలేదు గంగకు. అప్పు కోసం సరళ యింటి మెట్లెక్కింది మళ్ళీ.

★ ★ ★

జ్ఞాపకాల్లో నుండి బయటపడి.. అపార్ట్మెంట్ లో త్వరగా పని ముగించుకుని కృత నిశ్చయంతో సరళ యింటి మెట్లు యెక్కింది గంగ.

రెండు గంటల తర్వాత పార్క్ లో కూర్చున్న సరళ ఫోన్ మోగింది. "పని అయిపోయిందమ్మా యింటికి వెళ్ళండీ"

సరళ ఇంటికి చేరింది. బెడ్ రూమ్ లో భర్త విడిచిన షర్ట్ ని ముఖంపై కప్పుకుని మూడెంక వేసుకుని పడుకుని వున్నాడు.

ఆమె ముఖంలో క్రూరమైన నవ్వొకటి తొంగిచూసింది.

"ఏమిటలా ముఖం పై మసుగేసుకుని చేతకాని దద్దమ్మాలా పడుకున్నారు. రంధి, అదే నిద్ర రంధి తీరిందా" అని నర్మగర్భంగా అడిగింది.

ఉలికిపడి అనుమానంగా భార్య ముఖం వైపు చూసాడు.

"నీ స్త్రీ వ్యసనంతో నన్నెంత రంపపుకోతకు గురిచేసావు మదపత్రాష్టుడా! నా శరీరాన్ని రోగాల పుట్టగా మార్చావు. పసివాళ్ళని కూడా చూడకుండా చిన్న పిల్లలపై అఘాయిత్యాలకు పూనుకుంటున్నావ్ . నీ పురుషత్వం తలెత్తి చూడకుండా మానసికంగా నిన్ను బలహీనుడిని చేయడమే నీకు సరైన శిక్ష. నువ్వు ఈ గదిలో మగ్గి మగ్గి ఇలా కుమలాల్సిందే." కసిగా తిట్టింది.

అవమానంతో దిండు లో ముఖం దాచుకున్నాడు రమణారావు.

"నీ బతుక్కి సిగ్గు వొకటి వుండట్టు..ఆ ముఖం దాచుకోవడం వొకటే తక్కువ. కొడుకనే కనికరం లేకుండా తెగువగా ఆ నర్సమ్మ చేసిన పని నేను చేయలేకపోతున్నా" అంటూ కోపంగా జుట్టు పట్టుకుని తల గుంజింది.

భార్య వైపు భయంగా చూస్తూ "వద్దు వద్దు. నా తప్పు తెలుసుకున్నాను మారిపోయాను. నన్ను క్షమించు సరళా" అన్నాడు. ఏడుస్తూ.. ఛీ అనుకుంటూ అతనికి దూరంగా వెళ్ళింది ఆమె.

చీకటి పడుతున్న వేళ గంగ వచ్చి వంట ఇంటి గుమ్మం దగ్గర నిలిచింది. కూర్చోమని అన్నా కూర్చోకుండా..

"సరళమ్మా ! నిలువెల్లా కామంతో రగిలిపోయే

మనిషిని ఉసిగొల్పి మానసికంగా కుంగదీయాలి అని నాకో పని అప్పజెప్పావ్. డబ్బు అవసరం యెంతున్నా నేను అన్నీ ఇడిసేసిన మనిషిని మాత్రం కాదండీ. నీ అంత చదువుకున్నదాన్ని కాకపోయినా మనుషులను వస్తువులను వాడుకున్నట్టు వాడుకోకూడదనే ఇంగితగేనం వుంది. నువ్వు చెప్పినట్టు కాకుండానే నీ భర్తకు నాలుగు మంచి మాటల్జెప్పి ఇకనైనా మార్పు తెచ్చుకో. లేకపోతే నీ బిడ్డలకు మొహం కూడా చూపించలేక పోతావు అని మందలిచ్చాను యెత్తి పొడిచాను చీత్కరిచ్చాను. ఇని యిని ఆఖరికి దిండులో తలదాచుకుని ఎక్కిళ్లు పెట్టి యేడిసాడు. ఇక ఆయన నడుము యిరిగిన పాము అనుకో"

"చాలా చాలా థ్యాంక్స్ గంగా! నువ్వన్నట్టు యికనైనా ఆయన మారిపోతే చాలు" కృతజ్ఞత తో తేలికైన మనసుతో చిరునవ్వు ముఖంతో.

"అమ్మా! ఇంకో మాట విను. నా బిడ్డలకు పొట్టనిండా కూడు పెట్టుకోలేకపోతే పస్తు పడుకోబెడతాను కానీ జారతనం చూపెట్టను. ఆపదలో వున్నప్పుడు సాయం చేసావని నీ మాట కాదనలేకపోయాను కానీ అది నీలాంటివాళ్ళు చెప్పదగ్గ పని కాదు నేను చేయదగ్గ పని కాదు. ఇంటి పని వంట పని యివ్వాలనుకుంటే యివ్వండి. కష్టం చేసుకుని మీ బాకీ తీరుస్తాను కానీ యిట్టాంటి పని యింకెప్పుడూ చెప్పబాకమ్మా" బాధ నిండిన గొంతుతో కళ్లు తుడుచుకుంటూ వెళ్ళిపోయింది.

చెంప పై చెళ్ళున కొట్టినట్లైంది సరళ కు. గంగను నేనెంత తక్కువగా అంచనా వేసాను. నాకు నా భర్త కు తేడా ఏం వుంది? నేను పురమాయించిన పని కూడా అత్యాచారం కన్నా తక్కువేం కాదు.తనెంత దిగజారిపోయి భర్తను రెచ్చగొట్టి నీరు కారిపోయేటట్టు చేయమని అడిగింది? గంగ కాబట్టి నర నరం పదునుగా కోసినట్టు మెత్తగా స్పష్టంగా తనేంటో చెప్పింది. తల భూమిలో పెట్టుకున్నంత పనైంది సరళ కు. ఇంకా ఆలోచిస్తూ... దీనినే వ్యక్తిత్వం అని అంటారేమో! పరిస్థితులు యెలా వున్నా గంగ లాంటి వారు విలువలను పణంగా పెట్టలేరు, తమ ఆత్మాభిమానాన్ని పోగొట్టుకోలేరు. గంగ ముందు నేను నిత్యం సిగ్గుతో తలొంచుకోలేను పని కూడా ఇవ్వలేను అనుకుంది.

ఎదురుగా టివి లో .. గంగా పుష్కరాల ప్రత్యక్ష ప్రసారంలో వేటూరి పాట బ్యాక్ గ్రౌండ్ లో వినబడుతూ వుంది. "గండాలను పాపాలను కడిగివేయగా ముక్తినదిని మూడు మునకలే చాలుగా" తెర వైపు చూస్తూన్న సరళ మానసిక స్నానం చేస్తూ గంగలో మూడు మునకలు మునిగింది.

కవిత

# సంజె వేళ వాళ్ళు



- హిమజ

గాంధీబొమ్మ కూడలి వద్ద
వాళ్ళు ముగ్గురూ ప్రతిరోజూ...
సూర్యుడు అస్తమించడానికి ముందటి
నిర్వేదపు నీరెండ నీడలో
అక్కడ కలుసుకుంటారు
ఏమేం మాట్లాడుకుంటారో గాని
ఎవరే కాస్త ఆలస్యమైనా
ముక్కుమీదకు జారే కళ్ళద్దాలు
పైకెగదోసుకుంటూ
ఒకరి కోసమొకరు ఎదురు చూస్తుంటారు
కలిసే ఆ సాయంవేళ కోసం
పొద్దుటిపూట నుంచీ
ఎదురుచూపుల కిటికీలవుతారు

తరిమిన జీవితాన్నే తలపోస్తారో
ట్రిబుల్ వన్ జీఓ తో కనుమరుగయ్యే
పల్లెలనూహించి తల్లడిల్లుతారో
గూటిపక్షులు వలసెళ్ళిపోయాక
మిగిలిపోయిన ఒంటరితనాల
నిశ్శబ్ద రాగాలను తోడు రాగంలో
కూడి పాడుకుంటారో
చాయ్ తాగుతూ బీడీ కాలుస్తూ
జీవితానుభవాలను విత్తనాల్లా
కూడలి నలువైపులా వెదజల్లుతూ
మురిసిపోతుంటారో
ఎంత బతుకు బతికారో
బతుకు వాళ్ళనేం ఏమార్చిందో

ఇంకా ఇంకా బతకడానికి
చేయాల్సివస్తున్న
యుద్ధ వ్యూహాలే రచిస్తారో
మధించిన బతుకు సముద్రం
మాటల్లో మత్తడై దుంకుతుంటే
భారంగా మోసుకొచ్చిన
బరువులేవేవో దించేసుకొని
మిగిలున్న జీవితం పై
మరింత మమకారంతో
బెలూన్లలా తేలుతూ
ఆ రాత్రికి
ఇలు జేరతారు !!

వ్యాసం

# ఓల్గా గారి 'స్వేచ్ఛ' నవల స్త్రీల ఐడెంటిటీ స్ట్రగుల్ కు ప్రతిరూపం



- డాక్టర్ కొండపల్లి నీహారిణి

నిత్య జీవితంలో ఎవరినైనా గుర్తిస్తూ,గౌరవిస్తూ చూడాలి. అప్పుడే వాళ్ల కు అస్తిత్వం దక్కింది అంటాం. స్త్రీ ల ను గౌరవించని వాళ్లకు గౌరవించమని చెప్పడమే, గౌరవించేలా చూడడమే స్త్రీవాదం అనే మాటకు అర్థం.స్త్రీవాదం తలకెత్తుకుని పట్టుదలతో రచనలు చేస్తూ,పట్టుదలతో పోరాటాలు చేస్తూ స్త్రీల పక్షాన నిలబడిన సామాజికవేత్త ఓల్గా గారు. ఈ కోణంతో 1987లోనే ఓల్గా గారు రచించిన నవల'స్వేచ్ఛ'. ఈ నవల ఇప్పటికీ అందరూ తప్పనిసరి చదవవలసిన నవల. అందరూ అంటే స్త్రీలు పురుషులు అందరూ అన్నమాట. స్త్రీల గురించి చెప్పిన నవల కదా స్త్రీలు చదువుకోవాలి అని అనుకోవడం పెద్ద పొరపాటు. ఎందుకంటే స్త్రీలకు పురుషులు తండ్రిగానో, అన్నగానో, తమ్ముడుగానో, మేనమామ గానో, చిన్నాన్న గానో, మంచి స్నేహితుడిగానో, మంచి అధికారిగానో, ఒక సహ ఉద్యోగిగానో, గురువుగానో, తోటి విద్యార్థిగానో ఏదో ఒక రూపంలో ఉంటారు. వీళ్లంతా కాకుండా, ఎప్పుడు తోడుగా ఉంటాడు, ఉండాలి అనుకున్న పెళ్లయిన ఆడవాళ్ళకి భర్తగా మగవాళ్ళుంటారు. ప్రపంచం అంతటా ఇదే విధానం,ఇదే తీరు. అందుకే 'స్వేచ్ఛ' నవలను చదివితే ఇవన్నీ తెలుస్తాయి.

ఈ నవల లోని కథానాయికైన అరుణ లో పురుషులు స్త్రీల ను ఎన్నో రూపాల్లో, తల్లిగా భార్యగా చెల్లెలుగా అక్కగా అలా అన్ని వరుసలలోనూ ఆడవాళ్ళతో ఏదో ఒక సంబంధం కలిగిన వాళ్ళే కనిపిస్తారు.. మరి తమ ఆప్తురాలికి తమ మిత్రురాలికి తమ శిష్యురాలికి ఏ కష్టం కలిగినా, ఏ అవమానం కలిగినా కిమ్మనకుండా గమ్మున ఎలా కూర్చుంటారు? అసలు వీళ్ళకి కుటుంబాలలో ఏ విధమైన అవమానాలు జరుగుతున్నాయో, ఎలా జరుగుతున్నాయో ఈ'స్వేచ్ఛ 'నవల చదివితే తెలిసిపోతుంది. తమ బిడ్డలకు, అక్కలకు, చెల్లెళ్లకు, వదినకు, మరదలుకు, అమ్మకు, అత్తకు కూడా ఇలాంటి ఇబ్బందులు కలుగుతున్నాయా ? అవునా! అయ్యో! అని అనుకోకుండా ఉండరు. స్వేచ్ఛ నవలకు ముందుమాట రాస్తూ "సమానత్వం సాధిస్తే స్వేచ్ఛ దొరుకుతుందనుకునేవారు ఉంటారు. సమానత్వం లేకుండా స్వేచ్ఛ ఉంటుంది గానీ, స్వేచ్ఛ లేకుండా సమానత్వానికి అర్థం ఉండదు "ఈ నవలా రచయిత్రిగా అంటారు ఓల్గా గారు. ఈ విషయాన్నీ నవలలో కథాంతర్గతంగా ఏ విధంగా ప్రతిపాదించారో చూద్దాం.

ఈ నవల లోని కథలో కథానాయక అరుణ ఒక విద్యావంతురాలు. లెక్చరర్ ఉద్యోగం చేస్తుంటుంది. ప్రేమించి పెళ్లి చేసుకుంటుంది, ఒక పాపను కూడా కంటుంది. భర్త, అత్తగారు, కన్న కూతురు అరుణ చక్కని కుటుంబమే!ఈ ప్రయాణంలో తన మనసులో చిన్ననాటి నుంచి నిబిడీకృతమైన స్వేచ్ఛ సమానత్వాలనే భావన ఆమెతో పాటే పెరుగుతాయి. కలిసి నడుస్తాయి. అరుణ పెళ్లి కి ముందు కుటుంబంలో తల్లి తండ్రి మేనత్త అన్న వంటివాళ్ళు ఆమెను అదుపు ఆజ్ఞలో పెట్టేవాళ్ళు. ఈ అణచివేత ఆమెకు అస్సలు నచ్చేది కాదు. ఆ ఇంట్లో వాళ్ళు, వాళ్ళ డామినేషన్ ను అరుణ సహించలేకపోయేది. ఒక పంజరంగా భావిస్తూ తనకి ఇక్కడ స్వేచ్ఛ లేదని తనకు స్వేచ్ఛ కావాలి అంటే తను కోరుకున్న వ్యక్తితో పెళ్లి చేసుకొని వెళ్ళిపోవడమేనని నిర్ణయం తీసుకుంటుంది. అలా ప్రకాశం ని ప్రేమించి పెళ్లి చేసుకుంటుంది. ఒంటరిగా సంసారం పెడతారు. ఉద్యోగానికి వెళ్లి వస్తూ ఇంట్లో పని చేసుకుంటూ ఇటు సాధారణమైన గృహిణిగా అటు విద్యా బోధనలో ఒక లెక్చరర్ గా సమర్థవంతంగా నిర్వహించుకుంటూ వస్తుంది అరుణ.

కథ ఇలాగే ఉంటే ఇంకా కథేముంది? ఇక్కడి నుంచి అసలు ట్విస్ట్ మొదలు అవుతుంది. కథ లో జీవితం కదా

ఉంటుంది!

అరుణ ప్రేమించి పెళ్లి చేసుకుంది. తనకు స్వేచ్ఛ లభించిందనుకుంది. పుట్టినప్పటినుంచి ఇంట్లో అన్నీ ఆంక్షలు. తండ్రి మేనత్త ఏదో రకమైన పెత్తనాలు చలాయించడం, ఈమెలో ఉన్న నైపుణ్యాలను సృజనాత్మకతను తెలివిని ఎవరూ గుర్తించకపోవడం వంటివి ఎప్పుడూ తనలో ఒక రకమైన బాధ రగులుస్తూ ఉంటుండేది. తన సోదరునికి తనకి మధ్యన ఇంత వివక్షను ఎందుకు చూపిస్తారు అనే ఒక ఉద్వేగం కలుగుతూ ఉండేది. వీటన్నింటి నుంచి తనను తన అభిప్రాయాలను గౌరవించే వాడి దగ్గరికి వెళుతున్నాను అనుకుంటే. పెళ్ళయ్యాక ఆమె అభిప్రాయాలను అతడు గౌరవించడు. అతడు కూడా అందరి మగవాళ్ళలాగే అరుణని ఎక్కడెక్కడ ఖండించాలో అక్కడ ఖండిస్తూ ఉంటాడు. ఎక్కడెక్కడ ఆమెను అదిమి ఉంచాలో అక్కడ ఆమెను అణగదొక్కే ప్రయత్నం చేస్తూ ఉంటాడు. తన సొంత అభిప్రాయాలకు ఏమాత్రం విలువ ఇవ్వడం లేదు అని అనుకున్న అరుణ లోపల ఉక్రోశం, విసుగు కలగడం ఎక్కువవుతుంది.

పెళ్లికి ముందు తన స్నేహితురాలు అయినా ఉమ చెప్పిన మాటలు గుర్తుకు వచ్చాయి. "పెళ్లంటే గానుగెద్దు జీవితం ఇల్లు పిల్లలు తప్ప మరో లోకం లేకుండా బతుకంతా గడపటం అంటే భయంగానే ఉంది కానీ ప్రకాశం లేకుండా జీవితాంతం ఆ ఇంట్లో ఆ నరకంలో ఉండగలదా "( పేజీ 29) అని అనుకుని పెళ్ళికి ఒప్పుకొని బయటికి వస్తుంది. అరుణ పెళ్లయ్యాక రోజులు గడుస్తున్న కొద్దీ ఉమ చెప్పిందే నిజమేమో అనిపించే పరిస్థితులు ఎదురవుతుంటాయి.

అరుణ చేసేది లెక్చరర్ ఉద్యోగం అవడంతో అక్కడ సామాజిక కోణంలో తను పరిశీలించడం మొదలవుతుంది. అసోసియేషన్ పనులలో అరుణ పాల్గొనడం అరుణ భర్త ప్రకాశంకు నచ్చదు. దీని వలన అసోసియేషన్ మీటింగ్ కు వెళ్ళేటప్పుడు, మెహిందీ స్త్రీల దగ్గరికి వెళ్ళి ఇంటర్వ్యూ తీసుకోవాల్సి వచ్చినప్పుడు అబద్ధం చెప్పాల్సిరావడం ఆమెకు బాధ కలుగుతుంది.ఇదేం పరిస్థితి? అనే భావన వెంటాడే ప్రశ్న. అంతేకాదు ఆ పత్రిక నడిపే వాళ్ళ ప్రవర్తన ఇంట్లో ఒకతీరు బయటొక తీరు ఉండటం ఏమిటి అని అరుణ చాలా ఆశ్చర్య పోతుంది. కాని వీళ్ళ వల్ల తనదైన ఆశయం ఏమైపోతుంది? అనే ఆలోచనతో అటు తన భర్తను, ఇటు అసోసియేషన్ పనులనూ వదులుకొని ఢిల్లీ లో ఉన్న తన ఫ్రెండ్ ఉమ దగ్గరకు వెళ్తుంది.

"పత్రిక పని అనే కాదు నాకిష్టమైన పని ఏదైనా నేను చేస్తాను. దానిని ప్రకాశం కంట్రోల్ చేయటం అతనికి ఇష్టమైన పనులు చేస్తేనే మా మధ్య సంబంధం నిలుస్తుంది అన్నట్లు మాట్లాడడం ఇవన్నీ భరించలేను. నా జీవితం తనకు మాత్రమే పరిమితమై ఉండాలంటాడు ప్రకాశం. నాకట్ల బతకడం ఇష్టం లేదు .నాకు ప్రపంచంతో సజీవ సంబంధం కావాలి. నా ఉనికి వల్ల సమాజానికి ఏదో ఒక చలనం ఉండాలి అది ప్రకాశం భరించలేడు" (పేజీ 150) అంటూ తన నిర్ణయాన్ని ఉమ కు చెప్తుంది అరుణ.

ఇది విని, "సమాజాన్ని బాగు చేయడానికి నువ్వు ఒక్కదానివి ఏం చేయగలవు" అని ఉమ ప్రశ్నిస్తే," మొత్తం సమాజాన్ని మార్చడం నాకు చేతకాదని నాకు చేతనైంది కూడా నేను చేయొద్దా ? అలా చేయకుండా నేను బతకలేనని నాకు తెలిసిపోయింది ఆ పనిలో నన్ను నేను నిరూపించుకుంటున్నాను దానివల్ల నాకెంతో తృప్తి" అంటూ ఒక విలువైన అభిప్రాయాన్ని జవాబుగా వ్యక్తం చేస్తుంది . ఈ ముగింపు లక్షకోట్ల ఆలోచనలు రేకెత్తించేలా ఉన్నది.

ఓల్గా గారు స్త్రీల జీవితాలు ఎంతటి వివక్షకు గురవుతున్నవో చాలా దగ్గర నుంచి చూడటం ఇందులో స్పష్టంగా కనిపిస్తుంది. Liberty, Equality, Fraternity అనే ఫ్రెంచ్ విప్లవ నినాదం ఈ నవలకు అంతఃసూత్రంగా ఉన్నట్టు చెప్పవచ్చు.

ఆడపిల్లలకు రక్షణ కరువైపోతున్న ఈ కాలంలో జీవిత పాఠాలు చాలా నేర్చుకోవాల్సిందే.పుట్టుకనే ఒక ప్రశ్న అయి, పెరగడం ఓ సమస్య అయి బతుకే భారమైపోతున్న సంధికాలంలో ఉన్నాం. ఇటువంటి కథలను నవలలనూ చదవాలి. స్త్రీ వాదం అంటేనే భయం కలిగించారు. స్త్రీవాదం స్త్రీలదే కాదు సమాజానిది.

ఓల్గా గారు 'స్వేచ్ఛ' నవల వంటి మంచి నవలను అందించినందుకు వారికి మరోసారి అభినందనలు తెలియజేస్తున్నాను.

కథ

# జర్నీ

- సరోజన బోయిని..



ఒక్కోసారి మనం చేసేది కొద్ది దూరం ప్రయాణమే అయిన మన చుట్టు ఉన్న తోటి ప్రయానికుల్లో ప్రపంచాన్నీ చూస్తున్నామా ! అన్నంత ఫీలింగ్ వస్తుంది..

ఎందుకంటే ఒక్కొక్కరు ఒక్కోలా వుంటారు కాబట్టి!

భాష నుండి మొదలు వస్త్రధారణ వరకు..

ఒక్కొక్కరిదీ ఒక్కో స్టైల్ కానీ ఇప్పటి ప్రయాణాలు ఎనకటి లెక్క కావు..

ఒంటరి ప్రయాణం చేసే వాళ్ళు ఎక్కువ మంది పక్కన ఎమ్ జరిగుతున్న పట్టింపు లేనట్టు ఫోన్ చూడడంలో మునిగి పోతారు..

కొంచెం కాలేజ్ పిల్లలు అయితే చాటింగ్ తో బిజీ.

ఇలాంటివి చాలానే మన కళ్ళకు కనబడుతాయ్.

నేను ఎక్కువ సార్లు చేసేది ట్రైన్ జర్నీ నే..

అందులో వెళ్ళేటప్పుడు జరిగే అనుభవాలు మనసు డైరీ లో అప్పుడప్పుడు రాసి పెట్టుకుంటూ ఉంటా.

నాకు ఏదైనా భాద కలిగించే విషయాలు ఏవైనా ఉంటే మాత్రం వాటి గురించి నా ప్రయాణం ముగిసినా కూడ జ్ఞాపకాలుగా భద్రపరుచుకుంటా..

మొన్న ఈ మధ్యే స్కూల్ కి ఓ నాలుగు రోజులు సెలవులు వస్తే మా అమ్మ వాళ్ళ ఇంటికి వెళ్ళాలి అని మా పాప నేను రైల్వే స్టేషన్ వెళ్ళాం.

ఇంతకు ముందు అయితే.. ట్రైన్ ఏ టైమ్ కి వస్తుందే అని ట్రైన్ టైమ్ కంటే ముందే వెళ్లి గంటలు,గంటలు కూర్చునే వాళ్ళం.

కానీ ఇప్పుడు అంతా ఆన్లైన్ పుణ్యమా అని ట్రైన్ ఎక్కడి దాకా వచ్చిందో చూసుకొని రైల్వే స్టేషన్ కి వెళ్తున్నాం..

ఫోన్ వల్ల నష్టాలే కాదు ఇలాంటి లాభాలు కూడ ఉంటాయి..

పది నిమిషాల్లో ట్రైన్ వస్తుంది అనగా మా పాప నేను స్టేషన్ కి వెళ్ళాం ఇంతలో ట్రైన్ వస్తుంది అని మైకులో మూడు భాషల్లో అనౌన్స్ మెంట్..

నేను త్వరగా వెళ్లి టికెట్ తీసుకున్న..ఇంతలో ట్రైన్ రానే వచ్చింది.

ఆ రోజు చాల జనం కూర్చో వడానికి సీటు కాళీ లేదు..

ఎంత సేపు నిలబడి వెళ్ళాలి అని మా దృష్టి అంతా సీటు కోసమే..కొంచెం అలిసిపోయి కూడ ఉన్నాం..

కొంచెం నాకు ఒంట్లో కూడ బాగలేక నిలబడే ఓపిక లేదు.కానీ ఎవరూ ఇస్తారు సీట్..

ఇంతలో ఒక ముస్లిమ్ అబ్బాయి మమ్మల్ని చూసి తను లేచి నా బిడ్డకు,నాకు సీట్ ఇచ్చారు..

హమ్మయ్య! అనుకొని కూర్చున్నాం..

ఆ అబ్బాయి వాళ్ళ అమ్మమ్మ అంట "మా పిల్లవాడిని లేపి మీరు మాత్రం కూర్చున్నారు..తను ఇప్పుడు నిలబడి రావాలా.."అంటూ ఒకటే నసుగుడు.కొద్దిసేపు ఓపికగా విన్నా కానీ కోపం వచ్చింది

"అమ్మా..! మీ అబ్బాయి చేసింది మంచి పనేగా ఎందుకు గులుగుతున్నారు..

లేడీస్ కి రెస్పెక్ట్ ఇవ్వాలి.అందరూ...

మీ అబ్బాయిలా....

ఏదోరోజు మళ్ళీ ఏదైనా మీ ప్రయాణం లో మీకు ఇలాంటి ఇబ్బంది ఎదురు కావచ్చుగా... అప్పుడు మీ పరిస్తితి " అనేసా. ..ఇక ఆమె నోట మాట రాలె..

కొంత దూరం ఎవరి పనుల్లో వాళ్ళు మునిగిపోయారు నాలో మాత్రం కొంత నిశ్శబ్దం అలాగే ఏదో ఆలోచనలో ఉండిపోయా...

ఒక్కోసారి మన ఆలోచనలు మనం ఎంత మందిలో

ఉన్న ఒంటరిగా కూర్చోబెడతాయి..

ఇంతలో ఎదురుగా కూర్చున్న అదే ఒక ముస్లిమ్ సోదరి పసిబిడ్డ అప్పడి దాక కిల,కిల నవ్వుకుంటూ

అటు,ఇటు దొర్లుతూ అప్పుడప్పుడు మొబైల్ లో కార్టూన్ చూస్తూ వాడికి ఎమ్ అర్థం కాకున్నా ఫోన్ ఏదో ఆపరేట్ చేస్తూ వున్నాడు..

కొద్ది సేపు తరువాత ఆ బిడ్డ నవ్వు ఆపేసి గుక్క పట్టి ఒక్కటే ఏడుపు తల్లి ఎంత తల్లడిల్లి ఊకుంచిన కూడ ఒకటే ఏడుపు..

ఎండకు అది మిట్ట మధ్యాన్నం.

ఎంత పైన ఫ్యాన్లు ఉన్న చెమటకు అంత పెద్దవాళ్లకే చికాకు.

అలాంటిది నోరు లేని పసి బిడ్డ ఎమ్ చెప్పగలడు.

ఇంతలో నేనే అన్నా.. "అమ్మా !ముందు ఆ డైపర్ తీసేయండి రాషెస్ తో బాబు ఇబ్బంది పడుతున్నడేమో.."

ఎనకటి రోజులు కాదు పసి పిల్లలు మీద మూత్రం చేస్తే ఎంత మంచిది అనేవారు కానీ ఇప్పుడు వాడికి నిద్రలేసింది మొదలు ప్లాస్టిక్ డైపర్లతో వాడికి కొంచెం కూడ గాలి అడకుండా చేస్తున్నారు..

ఎనకటి పొత్తి పేగులు ఇప్పుడు లేవు..ఓ సంచి తొడిగినట్టు ఓ డైపర్ తొడుగితే ఐపాయ్..పిల్లలకు ఎప్పటికప్పుడు బట్టలు మార్చడం వల్ల ఉబడే శుభ్రత,ఆరోగ్యం వాటిలో ఉండదు.

అయిన వాడుతారు..బద్దకపు జనాలు..

ఏందో అంతా అని నా మనసులో నేను అనుకున్నా..

ఇంతలో ఆ బిడ్డ తల్లి ఎందుకైన మంచిది అని డైపర్ తీసేసింది..

కొద్ది సేపు భుజం పై ఎత్తుకుంది..

ఆబాబు ఏడుపు ఆపేశాడు.. ఆ తల్లి రొమ్ము పట్టింది వాడు ఇక ఈ లోకాన్ని మర్చిపోయి అమ్మ ఒడిలో పడుకొని కడుపు నిండా పాలు తాగి నిద్ర పోయాడు..

అప్పుడు ఆమె నా వైపు చూసి నవ్వింది,నేను కూడా నవ్వా..

ఇంతలో "ఏ పల్లి బఠాని , చిప్స్ అంటూ.ఒక అతను నెత్తిమీద మూట మోసుకుంటూ అరస్తున్నాడు.."

కూటి కోసం కోటి విద్యలు అన్నట్టు పొట్టకూటికోసం ఎన్ని పాట్లు..

మా పాప "బోర్ గా ఉంది మమ్మి టైం పాస్ కోసం చిప్స్ తీసుకుంటా అన్నది.."

ఒక ప్యాకెట్ 10 రూపాయలు..అందరికి అందుబాటులో ఉండే ధర.కానీ బయటి ఫుడ్ ఆరోగ్యానికి హానికరం అని నేనే ఏది బయటవి తిననివ్వ..

కానీ మా పాప "ఎంత సేపు ఊరికే ఇలా కూర్చోను అని ఒక ప్యాకెట్ తీసుకుంది.."

ముందు కూర్చున్న పిల్లలతో షేర్ చెసూకుంటూ ఆ పిల్లతో కాలక్షేపం చేస్తూ ఉంది

ఇంతలో విండో సింగిల్ సీట్ లో మా పక్కనే ఒక మహిళ..మాసిన నైటీ వేసుకొని..పైన ఒక పాతది పూర్తిగా మాసిపోయిన స్కార్ఫ్ తో తన కాళ్ళకు కనీసం చెప్పులు కూడ లేవు..

తల కూడ గాలికి అనుకుంటా చిందర వందరగా ఉంది..

ఇంతలో"ఆమె కూడ తన స్కార్ఫ్ లో కట్టి పెట్టున్న 20 రూపాయల నోటు తీసుకొని ఒక ప్యాకెట్ ఎంత అన్నట్టు అడిగింది.."

"అతను మాములుగా 10 రూపాయలు "అని చెప్తే తనకు అర్థం కాలే..

"దస్ రూపియే అని హిందీలో చెప్పాడు" అప్పుడు ఆమెకు అర్థం అయ్యింది అనుకుంటా.

10 రూపాయలతో ఒక ప్యాకేటతీసుకొని మిగితా 10 రూపాయలు మళ్ళీ స్కార్ఫ్ లో కట్టుకుంది..

అప్పడి దాక ఆమె తోనే ప్రయాణం చేస్తున్న మేము ఆమెని పట్టించుకోలే.

కానీ ఆమె దగ్గర కేవలం 20 రూపాయలు మాత్రమే ఉన్నాయి అని అర్థం అయ్యింది.

కనీసం తాగడానికి తన దగ్గర వాటర్ బాటిల్ కూడా లేదు..

తన దగ్గర ఎలాంటి లగేజ్ లేదు.చిన్న పర్స్ కూడ లేదు..

మరీ మాసిన పాత నైటీ మీద తను ఎటు వెళ్తుంది..

మనసులో ఏదో ఆలోచన.

తన కాళ్లు చూసా చెప్పులు లేవు కానీ కాలికి మట్టెలు ఉన్నాయి.

ఆమె వివాహిత అని అర్థం అయ్యింది. వయస్సు ఓ 40 ఉంటుంది కావచ్చు..

ఎందుకో ఆమె ఏదో ప్రాబ్లమ్ లో ఉంది అనిపించింది.

మనసు ఆగలే తనని ఒకసారి పలకరించాలి అనుకున్న.

"అమ్మా..! మీరు ఎక్కడి నుండి వస్తున్నారు ఎక్కడికి వెళ్తున్నారు అని అడిగా.." తను సమాధానం చెప్తే ఆమె ఏదన్నా ప్రాబ్లమ్ లో ఉందో తెలుసుకుందాం అని..

కానీ ఆమెకు నా భాష అర్థం కాలే..తను ఏదో చెప్పబోతుంది అది నాకు అర్థం కాలే..

కొద్ది సేపు ట్రయ్ చేసా..ఏమి తనకు అర్థం కాలే నాకు కూడ..

కొద్ది సేపు ఆమెను అలానే చూస్తూ ఉండి పోయా..

ఇంతలో ఆమె తన దగ్గర ఉన్న స్నాక్స్ కొన్ని ఎదురుగా ఉన్న పిల్లవాడికి ప్రేమగా ఇవ్వ బోయింది..కానీ ఆ పిల్లవాడి తల్లి ఆ స్నాక్స్ పిల్లవాడిని తీసుకొనివ్వ లేదు..

మరి కొద్ది సేపు ఆగి అదే బాబును మా పాప ముద్దు చేస్తూ ఆ బాబుకి స్నాక్స్ ఇస్తే లెలో ఛేటా అని తినిపించింది..

మా పాప ఇస్తే తినిపించిన తను ఆమె ఇస్తే ఎందుకు తీసుకొనివ్వ లేదు..

బహుశా తను మాసిన బట్టలతో ఒక పిచ్చి దానిలా ఉంది అని కావచ్చు..

కానీ ఆమె వస్త్రధారణ,మనిషిని మాత్రమే చూసింది అందులో ఆమె ప్రేమను ఎందుకు చూడలేక పోయింది..

ఏంటో వింత లోకం నాకు ఒక్కటే మనసులో ఆమె గురించి ఎలా అయిన తెలుసుకోవాలి అని...

ఒకవేళ తనకు హిందీ వచ్చేమో అని ముందు ఉన్న ముస్లిమ్ సోదరిని అడిగి తెలుసుకోమన్నా..

ఆమె హిందీలో తనని అడిగింది కానీ అది కూడ ఆమెకు అర్థం కాలే..

ఎన్ని రకాలుగా ప్రయత్నం చేశామో..

ఇంతలో "అమ్మా ! మన స్టేషన్ వచ్చిందే. అన్నది నా బిడ్డా..!

మనసంతా ఏదోలా అసలు ఎమ్ జరుగుతుంది అర్థం కాని స్థితిలో స్టేషన్ లో దిగి పోయాం..

ఇంతలో ఆటో వాళ్ళు "ఎక్కడికి వెళ్ళాలి అమ్మా! అంటూ "ఎదురుగా రానే వచ్చారు..

"జెండా దగ్గరికి "అని చెప్పి ఆటో ఎక్కాం ..

మా అమ్మ వాళ్ళ ఇంటి ముందే ఆగింది ఆటో...

ఆటో అతనికి డబ్బులు ఇచ్చి దిగాం..

కానీ హాండ్ బ్యాగులో డబ్బులు చూడగానే మళ్ళీ ఆమెనే గుర్తు వచ్చింది..

ఇంతలో మా వదిన ఎదురుగా వచ్చి " అక్కా! కాళ్ళు కడుక్కో అంది..

కానీ నేను అదే మూడ్ లో ఉన్న." ఒక పది నిమిషాలు ఆగు వదిన" అని ఇంకో మాట మాట్లాడకుండా డైరెక్ట్ గా వెళ్లి బెడ్ రూమ్ లో తలవాల్చా..

మళ్ళీ ఆలోచన..

పాపం తనూ.. ఎంత సేపు తను ప్రాబ్లమ్ లో ఉంది కావచ్చు అని తెలుసుకునే ప్రయత్నం చేస్తూ తన మీద అబద్దపు జాలి నటించానా...

లేక పోతే తనకు మన భాష రాదు కానీ తన దగ్గర డబ్బులు లేవు అనే విషయం అయితే స్పష్టంగా తెలుసు..తను ఏదో ప్రాబ్లమ్ లో ఉండచ్చు అనే ఆలోచన ఉంది..

నాకే కాదు అక్కడ ఉన్న వారందరికీ..తెలుసు..

కానీ ఆమె మిగిలిన 10 రూపాలయాతో ఎక్కడి దాకా పోగలదు ఆకలి వేస్తే ఎమ్ తినగలదు..అని ఆలోచించలే..

పెద్దగా నేను డబ్బులు ఉన్న దాన్ని కాకపోవచ్చు కానీ నాకు ఉన్న దాంట్లో ఎంతో కొంత తనకు ఇవ్వడానికి ప్రయత్నం చేయలేదు.. నేనే కాదు నాతోటి ప్రయాణికులు కూడ చూస్తూ వున్నారే తప్ప తనకు సాయం చేసే ప్రయత్నం చెయ్యాలే...

ఒకవేళ చేసిన తను తీసుకునేదా!

తన ఆత్మాభిమానం దానికి అడ్డు పడేదా..?

ఏమో..!

కానీ ఆ క్షణం ఒక్కసారి నా మీద నాకే రోత పుట్టింది..

ఆ స్థితిలో ఉన్న తను.. తను తినేదాంట్లో కొంచెం ఇవ్వబోయింది.. కానీ నాకు ఎందుకు ఆ ఆలోచన రాలే..నాకు ఉన్నదాంట్లో కొంచెం ఆమెకు ఎందుకు ఇవ్వలేక పోయా...

ఆ క్షణం నాకు నేను ఆమె కన్నా భీకారిలా కనపడ్డా..

ఇంతలో ఫోన్ మోగింది మా వారు..

ఫోన్ తీసా.. "చెప్పండి అన్నా..""

క్షేమంగా చేరుకున్నారా..?."

."హా ! చేరుకున్నాం"

"మరి చేరుకున్నాక ఫోన్ చెయ్యలేదే"

అని కోపంగా అడిగారు "

హా! అని ఎమ్ చెప్పలేక పోయా"

కానీ తన కోపంలో మాపై ఉన్న ప్రేమ నే చూసా..

తను ఫోన్ కట్ చేసాడు..ఫోన్ పక్కకు పెట్టి కొద్ది సేపు కళ్ళు మూసుకొని మళ్ళీ ఆలోచనలో పడిపోయా..

కవిత

# మహికే వెలుగు మహిళ

-డా.శ్రీభాష్యం అనూరాధ
తెలుగు అధ్యాపకులు



అబలల పండగ అంబరాన్నంటింది శోభాయ మానంగా
శుభాకాంక్షలు
సాటి మహిళలకు సాంకేతికంగా
సతీమణులకు సత్కారాలు
పరిఢవిల్లిన పణతులకు
పురస్కారాలు సాధించిన ఘనతను
సమీకరించి గుర్తింపునిచ్చిన గౌరవాలు
మనోల్లాసాలతో మహిళలకు
మహికే వెలుగు అంటూ మారుమ్రోగిన గొంతులు
అంతర్జాలమంతా నిండే అవని నిండా
శుభాకాంక్షలు శుభాభినందనలతో
అంతా ఒక్క రోజుకే నా?
ఈరోజు కోసమేనా?...
పుట్టుక నుండి చావు వరకు
క్షణక్షణం క్షామంగా ఎండి
నీరు కారుస్తున్న తన్వి తనువును, రాలుతున్న రుధిరాక్షువులను
వేదనతో నిండిన హృదికి తెలుసు
కొవ్వొత్తిలా కరిగే శరీరాకృతికి ఎరుక
ఎదమీటే మాటల అస్త్రాలకు, విలువనీయని శ్రమకు,
విశ్రాంతి లేని పనికి పరిచయం...
అందుకే...
ఆడది అనే చిన్నచూపు చూసే చక్షవులు
సామర్థ్యం కప్పేసిన చేతులుఉన్నంతకాలం
మహిలో వెలగదు మహిళ...
సాధికారత సార్థకం వ్రాతలకే పరిమితమైన,
సతి ఆక్రందనలు ఆమె సహజీవనమైన,
ప్రతి ఇంట,బయట చులకన చూపులు తోడైన
ఆమె అన్న పదానికి సారూప్యత లేకున్న,
ఎలా వెలుగును మహిళ?..
ఈ సృష్టికే మూలం సృజన
అమ్మలా ఆప్యాయత అందించి,
సోదరిలా ప్రేమానురాగాలు పంచి,
భార్యలా బాధ్యతలను పంచుకొని,
కూతురిలా కలిమిలేములలో తోడుండి,
కోడలిలా కలిసి జీవించి,
అమ్మమ్మ, నానమ్మలా ఆలనా పాలనా చూసుకొని,
స్నేహితురాలిగా ఆపదలో నీ వెంట ఉండి,
సహోద్యోగిగా సహాయసహకారం అందిస్తూ..
అన్నింటా తానై, అన్నింట్లో తానే అంటూ..
రాణిస్తున్న రవళులను నిత్యం గౌరవిద్దాం..
బ్రతుకు నిచ్చే భామినిని బ్రతకనిద్దాం..
అపుడే మహిలో మహిళలంతా వెలుగుదురు
రవిచంద్రులున్నంత వరకు..

వ్యాసం

# వంటంటే చిన్న చూపేందుకు?



-డా॥ కందేపి రాణీప్రసాద్

మహిళలను వంటింటి మహారాణులని కొందరు గొప్పగా చెబితే, వంటింట్లో పడి ఉండే వాళ్లకు బయటి విషయాలేం తెలుస్తాయని మరి కొందరు ఈసడింపుగా అన్నారు. పూర్వకాలం ఎవరెలా అన్నా ప్రస్తుతం అమ్మాయిలు వంటిల్లును ఒక నిషిద్ధ ప్రదేశంగా భావిస్తున్నారు. బహుశ పూర్వపు తల్లుల వేదన, రోదన దీనికి కారణమై ఉండవచ్చు ఆ నాటి తల్లులకు రోజంతా వంటింట్లోనే గడపవలసి వచ్చేది. కుటుంబం లోని శ్రమ విభజనలో మహిళలకు వంటపని, ఇంటిపని పురుషులకు బయటి నుంచి డబ్బు సంపాదించుకు రావడం వచ్చింది. శ్రమ విభజన జరిగినప్పుడు బాగానే ఉన్నా రాన్రానూ పురుషుల ఆధిపత్యంతో మహిళలు వంటిళ్ళను బందిఖానాగా భావించాల్సి వచ్చింది. ఇప్పుడయితే వంటిళ్ళు లేకుండా ఇళ్ళను నిర్మించుకోవాలనే ఆలోచనలో ఉన్నారు. ఇంట్లో ఆహారం తయారు చేసే అవసరమే లేకుండా చెయ్యాలనే కొత్త కాన్సెప్ట్ పురుడు పోసుకున్న నేపథ్యంలో వంటింటి గురించి మాట్లాడుకుందాం !

నాకు వంటిల్లు ఒక పదార్థ ప్రయోగశాలగా కనిపిస్తుంది. అందులో వంటలు ఆద్భుతమైన రుచితో అందించే మగువలు ఆహార శాస్త్రవేత్తలు. ఏ కూరను ఎంతసేపు ఉడికించాలి ? ఏ పిండిని ఎంతసేపు నానబెట్టాలి ? ఉప్పు, కారం, చింతపండులు ఏ ఏ పాళ్ళలో కలపాలి ? ఏ వంటకు మంట ఎంత పెట్టాలి ? అన్న విషయాన్నీ ఏ సిద్ధాంత గ్రంధంలోనూ రాయలేదు గానీ మగువల మేదళ్లలోనే నిక్షిప్తమై ఉన్నాయి. వంటిల్లును సమర్థించటమంటే చిన్న విషయమనుకునే మగవాళ్ళతో పాటు ఆడవాళ్ళు కూడా జత కలుస్తున్నారు. " ఆమేమి చేస్తుంది ; ఇంట్లో గిన్నెలు తోముకునే రకం " అని మగవాళ్ళు చిన్నచూపు చూస్తూ ఈసడింపుగా మాట్లాడమే కాదు ; " నేనా ! హౌస్ వైఫ్ నేనండి తినడం, పండుకోవడం తప్ప చేసేదేమీ లేదు " అని మహిళలూ తమ గురించి తామే తక్కువగా చెప్పుకుంటున్నారు. మహిళలైనప్పటికీ ఉద్యోగస్తులైన మహిళలు కూడా ' అమెనా ! హౌస్ వైఫ్ ' అంటూ చులకనగానే చూస్తున్నారు. మహిళలకు మహిళలు కూడా మద్ధతు పలకకపోవడం వల్లనే పురుషజాతి నుంచి సైతం విమర్శలు ఎదుర్కోవలసి వస్తుంది.

ఈనాడు ఆసుపత్రులలో పెద్ద పెద్ద జబ్బులతో పాటుగా ఫుడ్ పాయిజనింగ్ కూడా ఎక్కువగా కనిపిస్తున్నది. పిల్లలు చదువుల కోసం ఇళ్లకు దూరంగా హాస్టళ్ళలో ఉండటం మూలంగా దొరికిన చోటల్లా తిని రాగాల పాలబడుతున్నారు. పెద్ద పెద్ద కాలేజీలున్నా పరిసర ప్రాంతాల లోని ఆసుపత్రులలో ఫుడ్ పాయిజనింగ్ కేసులు ఎక్కువగా రిజిస్టరు అవుతున్నాయి. తీవ్రమైన కడుపునొప్పి, వాంతులు, విరేచనాలతో పిల్లలు ఆసుపత్రుల పాలవుతున్నారు. హాస్టళ్ళలో ఆహారం వండి పెడతారు కానీ రుచికరంగా వండటానికి అమ్మ కాదు కదా ! పనయిపోయిందా లేదా అని చూస్తారు కానీ తింటున్నారా, పారేస్తున్నారా అని చూసేవాళ్ళు కరువు. సముద్రంలో ప్రయాణించే వాడికి మంచి నీళ్ళ కరువు లాగా చుట్టూ వందల హోటళ్ళు ఉన్నా నోటికి రుచించే తిండి మాత్రం కరువు. వ్యాపారం కోసం వండే వంటలు తప్ప పరిశుభ్రంగా, రుచికరంగా వండే వంటలు లేవు. చదువుల కోసం రాత్రింబగళ్ళు శ్రమించే విద్యార్థులు నోటికి రుచించని చప్పిడి తిండి తింటూ నరకం చూస్తున్నారు. ఈ హోటల్లో బాగుంటుందేమో, ఆ హోటల్లో బాగుంటుందేమో అని తిరిగి తిరిగి వేసారి డబ్బు వృధా చేసుకుంటున్నారు.

‘ కోటి విద్యలు కూటి కొరకే ’ అని సామెత ఎవరు ఎంత సంపాదించినా పొట్టకు కావాల్సిన తిండి కొరకే కదా ! తిండి లేకపోతే బతికే సమస్య లేదు కదా ! మనిషి జీవించడానికి అత్యంత అవశ్యకమైన ఆహారాన్నీ దాన్ని తయారు చేసే వారినీ ఎందుకు తక్కువగా చూస్తున్నారు ? బాగా చదువుకుంటే పెద్ద ఉద్యోగం వస్తుంది. పెద్ద ఉద్యోగమైతే జీతం ఎక్కువుంటుంది. జీతం ఎక్కువ ఉంటే కావాల్సినవన్నీ సమకూరి నచ్చిన తిండి తినవచ్చు. జీవితంలో అత్యంత ప్రధానమైన వంటనూ, వంట ఇంటినీ ఎందుకు తేలికగా తిసుకుంటున్నారు. అమ్మాయిల మనసులో వంటంటే చిన్న చూపెందుకు ? ఇంటి పనులు నేర్చుకోమ్మా అని ఏ తల్లయినా కూతురికి చెబితే ‘ నేను వంట మనిషిని పెట్టుకొని చేయించుకుంటా ‘ అని సమాధానం వస్తోంది. అందుకే పని వాళ్ళకు ఆడింది ఆట పాడింది పటగా చెలామణి అవుతున్నారు. వాళ్ళు చెప్పిన కండిషన్లు అన్నింటికీ తల ఉపాల్సిన పరిస్థితి వచ్చింది. మన ఇంటి పనుల్లో చిన్నా పెద్దా తేడా లేదు వంట చేస్తే, అంట్లు తోమితే తప్పు కాదు. మన ఆరోగ్యం కోసమే ఈ శుభ్రమంతా. మనం బతికి ఉండటం కోసమే ఈ తాపత్రయమంతా. హౌస్ వైఫ్ అని చులకన చేయడం మూలంగానే అమ్మాయిలు ఈ పనులకు దూరంగా ఉండాలని ప్రయత్నిస్తున్నారు.

రూపాయల్లో లక్షల్లో సంపాదించిన డబ్బును తిండి పదార్థాలుగా మార్చుకుంటేనే కదా జీవించగలిగే అవకాశమున్నది. డబ్బులు, బంగారం అలాగే మింగెయ్యలేం కదా ! ఆరోగ్యం కోసం అని చెపితే ఏ చిన్న పనయినా ఆచరించే జనం వంటను మాత్రం ఆరోగ్య సూత్రంగా తీసుకోవడం లేదు. నెయ్యి ఫ్యాట్, అన్నంలో క్యాబ్స్ ఉంటాయి మానేయండి. అని ఎవరో చెబితే వెంటనే పాటిస్తారు. ‘ శుచిగా, శుభ్రంగా వంట వండుకొని తినండి ‘ అంటే మాత్రం నచ్చడం లేదు ఎందుకంటే వంటను, వంట ఇంటినీ పనికి రాని పనిగా చిత్రీకరిస్తున్న వాళ్ళ పుణ్యం వల్లనే . ఇదంతా జరుగుతుంది. మేము ఫలానా హోటల్లో తిని వచ్చామని పక్కింటోళ్ళు అనగానే మరునాడే అక్కడికి పయనమయ్యే జంటలున్నారు. వేలకు వేలు తగలేసి అనారోగ్యాన్ని ప్యాక్ చేసుకుని ఇంటిదాకా తెచ్చుకుంటున్నారు. పేరు లేని ప్రమాదకర రోగాలు తెచ్చుకొని చావును ఏరి కోరి కొని తెచ్చుకుంటున్నారు. చైనా వారి ఆహార పదార్థాల వలననే ప్రపంచమంతా కరోనా గుప్పిట్లోకి వెళ్ళవలసి వచ్చిందనేది నిపుణులు చెప్పిన మాటను కోతిపారేయ్యలేం గదా ! ‘ ఎక్కడైనా కొట్టు కానీ కడుపు మీద కొట్టద్దు ’ అని పాత కాలపుమాట అలాంటి పొట్టకు ఎన్ని తిప్పలు తెచ్చి పెడుతున్నరీనాడు. కాస్త అన్నం పెడితే బజ్జుందే బొజ్జకు ఏవేవో పెట్టి క్యాన్సర్లు లాంటి భయంకర జబ్బులు తెచ్చి పెడుతున్నారు.

యోగాలు, జిమ్ లు , వాకింగులూ, జాగింగులూ, అన్నీ చేయటానికి టైముంటుంది గానీ వంటకు మాత్రం ఉండదు. ‘ వంటంటే నాకెక్కడ కుదురుతుందీ ‘ అంటున్నారు ఉద్యోగినులు చింతపండు, ఎండుమిరపకాయలు, మినుములు, పెసలు వంటివన్నీ శుభ్రం చేసి ఎండబెట్టి ఏడాదంతా నిలవ ఉంచే తరం పోయింది. సాంబారు ఏ పప్పుతో వండుతారు అనే తరం వచ్చింది. కూరల్లో వేసుకునే పొడులన్నీ శుభ్రంగా ఇంట్లోనే తయారు చేసుకునేవారు పాత తరం. రకరకాల పొడులు, మసాలాలు చల్లటం వాల్ల బాగున్నదేదో బూజు పట్టినదేదో తెలియటం లేదు. అందంగా ప్యాక్ చేసిన ప్యాకెట్లలో తిరిగే పురుగులెన్నో. అమెరికా నుంచి తెచ్చిన స్వీట్ బాక్సుని తెరిస్తే లోపల ఇష్టరాజ్యంగా ఆడుకుంటున్న పురుగులు. చిరు తిళ్ళు కూడా చాలా ప్రమాదకరంగా మారాయి. ఒకనాడు మగవాళ్ళు వంటనూ, ఆడవాళ్లనూ చులకన చెసిన ఫలితమే ఈనాటి ఈ పరిస్థితికి కారణం. కలుషితమైన ఆహారంతో ఎన్నో సమస్యలు వస్తున్నాయి. ప్రాణాలు పోతున్నాయి. మనిషిని బతికించే వంటనూ, వంటింటినీ, ఎగతాళి చేయకండి అనారోగ్యాన్ని దరి చేరనీయకండి. శుభ్రమైన వంటింట్లో పరిశుభ్రంగా వంట చేసుకుని తిని ఇంటిల్లి పాదీ సుఖ సంతోషాలతో ఉండండని పెళ్లిల్లో నవ దంపతుల్ని ఆశీర్వదించాల్సిన రోజులు వచ్చాయనిపిస్తోంది.

కవిత

# మనుషుల గతీ అంతే



తిరునగరి దేవకీదేవి
9949636515

టపటపమంటూ పడ్డ వాన చినుకులు
కూసింత గాలి పీల్చుకోమంటూ  సలహా పడేసినై

పొద్దంతా మంచానికతుక్కు
పోయిన వెన్నెముకా  వంతపాడింది

అడుగులో అడుగు వేసుకుంటూ వచ్చి అరుగుమీద
చతికిలపడ్డ

ఫ్చ్! లాభం లేదు
చెట్టుకొమ్మల్లో కదలికే లేదు సరికదా భూతల్లి
వేడి నిశ్వాసలతో మరింత ఉక్కపోత

ఇంతలో
రేలింగ్ లేని మెట్ల కింద
ఏదో రణగొణ ధ్వని

చెవులతో పాటు కళ్ళనూ సార్థకం చేసుకోమన్నా

కించిత్ ఏమరుపాటు కూడదంటూ హెచ్చరించాను కూడా

తీరా చూద్దునుకదా మెట్లకింద ఔడ్డేటెడ్ గా చెల్లుబాటవుతున్న
సామాన్ల సమావేశమది

అందులో పుచ్చిపోయిన(వుడెన్) ఆరామ్ చేర్ , పాడైన  ఏర్
కూలర్ డబ్బా, తుప్పు పట్టిన గాద్రేజ్ చేర్, విరిగిన ప్లాస్టిక్
బిందె , రంధ్రాలు పడ్డ ఇనుప బొక్కెన, చీకిన చేటలు, ఈత
చాపలు , మొక్కి చీపుర్లు వాడి పడేసిన జమానా
కాలం బత్తీల స్టౌ
ఒకటా రెండా
మొత్తంగా శతాధికం కాబోలు  వస్తువులు

అధ్యక్ష స్థానంలో ఉన్న
కూలర్ డబ్బా  అన్ని వస్తువుల అభిప్రాయ సారాంశంగా ఇలా
అంది

మీరన్నది నిజమే ఈ మనుషులంతా ఏరు దాటాక తెప్ప
తగలేసే  రకాలు.
మనం కండీషన్ లో ఉన్నప్పుడు తెగ ఎంజాయ్ చేసారా?
ఇప్పుడేమొ నిర్దాక్షిణ్యంగా ఇలా!!

ఐనా మన ఈ దుర్గతికి
వాళ్ళ అశ్రద్ధ కారణం కాదా?
అధ్యక్షునికి అడ్డొస్తూ గాద్రేజ్ చేర్ ప్రశ్నించింది

అదీ నిజమే. ఐనా
కొత్త హంగుల ముందు
మన బిషాదెంత? అంది  ఈతచాప విచారంగా

మీకు తెలుసా? ఈ ఇంటిని కూల్చి పెద్ద భవంతి
కడుతున్నారట" కొత్త సమాచారాన్నిచ్చింది
ప్లాస్టిక్ బిందె

అంటే ఇల్లూ ఔట్ డేటెడ్ అన్నమాట "
కుతూహలంతో అన్నది వుడెన్ చేర్‌వి

గ్గాక్కీ..
మరి మన గతి???? అడిగింది బత్తీల స్టౌ
ఆందోళనతో

పిచ్చి మొహమా! అదీ తెలియదా?
ఇల్లెంత విశాలమైనా వాళ్ళ మనసులంత ఇరుకు
మనమేకంగా  పాత సామానుల వాడి పంచనే.
స్క్రాపింగ్ సిస్టమ్ లో రూపాంతరమే
చీకిన చేట  వివరణ

దాంతో
నోట మాట రాక నిస్సహాయులై
దిగులుగా దీనావస్థలో
వస్తువులన్నీ

అంతా విన్న నాకు
భలే నవ్వొచ్చింది
సోకాల్డ్ ఉచ్ఛస్థాయి ఎదుగుదలే ధ్యేయంగల
ఈ ప్రపంచంలో వస్తువులే కాదు మనుషుల గతీ అంతేనని
ఆ విషయం వాటికి బోధపడలేదని

★ ★ ★

కథ

# విక్టరీ ఇస్ యువర్స్



సిస్టర్ అనసూయ
నల్గొండ

పొద్దంతా అగ్గి కురిసినట్టు ఎండలు, రాత్రంతా ఉడకపోత వీటిని తట్టుకోలేక సునీత అత్తమామలు బయట మంచం వేసుకొని పడుకున్నరు. సునీత ఇద్దరి కొడుకుల తో ఇంట్లోనే పడుకుంది. కొద్దిసేపటి తర్వాత చెమటలతో ఒళ్లంతా తడిసిపోయి ఉంది. ఆమె చెమటలు తుడుచుకుంటూ పెద్దకొడుకును అత్తమామల ప్రక్కన పడుకోబెట్టి, వారి మంచం పక్కన కింద చాపలో చిన్న కొడుకును పక్కలో వేసుకొని పడుకుంది. ఊరంతా గాఢ నిద్రలోకి వెళ్ళిపోయింది. రాజయ్య ఒక్కడే సంకలో సంచి పట్టుకొని పట్నం నుంచి ఇంటికి వచ్చాడు. నిద్రిస్తున్న భార్యను కొడుకులను చూసి కాళ్లు చేతులు కడుక్కొని తుడుచుకునే సమయంలో భార్య సునీత లేసింది. “ఎప్పుడు వచ్చినావ్ బావ” అంటూ వంట గదిలోకి వెళ్లి అన్నం పెట్టుకొచ్చి ఇచ్చింది. “నాకొద్దు తినే వచ్చిన” అంటున్న భర్తను “కొంచెం తిను బావ అక్కడ ఎప్పుడు తిన్నావో ఏమో” అంటున్న సునీతను “నాకొద్దు” అని విసుకున్నడు రాజయ్య.

సరేలే నీ ఇష్టం అని మనసులో అనుకుంటూ కొడుకు పక్కన కూర్చుంది.

రాజయ్య బయట పడుకోకుండా ఇంట్లో పడుకున్నడు. బయటికి రాకపోయేసరికి పోకపోతే ఏమంటాడో అని,చిన్న కొడుకుని ఎత్తుకొని ఇంట్లోకి వెళ్లి రాజయ్య పక్కన చిన్న కొడుకును పడుకోబెట్టి కోడుగుపక్కనంగా పడుకుంది సునీత. రాజయ్య మాత్రం నిద్రపోవడం లేదు. కళ్ళు మూసుకొని ఏదో ఆలోచిస్తున్నాడు తొలికోడి కూసిన చప్పుడు విని నిద్రలేచింది సునీత. కంచంత వాకిలి ఊడ్చి సాంపిసల్లి ముగ్గు వేసింది. తరువాత అలుకుకుండలో కొంచెం ఎర్రమట్టి కొద్దిగా పేడ వేసికలిపి పొయ్యి అలికి ముగ్గు వేసింది. అందరూ లేచేసరికి అన్నం కూర తయారు చేసింది. లేడీ లేచిందే పరుగు అన్నట్లు రాజయ్య లేచి ఎవరితో మాట్లాడకుండా ఊర్లోకి వెళ్లి గుడుంబా తాగి తూలుకుంటూ ఇంటికి వచ్చిండు. అతనిని చూసి గడగడ వణుకుతుంది సునీత. మునుపు వచ్చినప్పుడే తాగిన మత్తులో నన్ను బ్లేడ్లతో ఒళ్లంతా గాయాలు చేశాడు. ఇప్పుడు ఏం చేస్తాడో అని భయపడుతూ మనసులో అనుకుంది. అంతలోనే రాజయ్య తల్లి లింగమ్మ వచ్చి “ఎందుకురా రాజయ్య ఇంత పొద్దుగాల తాగినవ్? నువ్వు ఇంటికి వచ్చినప్పుడల్లా మా ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని ఉంటున్నము. మీకు సూర్యచంద్రులు లాంటి ఇద్దరు కొడుకులు. సీతా దేవి లాంటి నీ భార్య ఉంది. ఇంత మంచి కుటుంబాన్ని ఆగం చేసుకోకు కొడుక. బుద్ధి కలిగి మంచిగా బతుకు. నిన్ను కన్న దాంట్లో మేము బతికి ఉన్నదాంట్లోను ఏమి సుఖం లేదురా. మేము బతికుండగానే నరకం చూపిస్తున్నవు. కన్నోళ్ళకి సుఖం లేదు. కట్టుకున్న దానికి సుఖం లేదాయే నీవల్ల. ఎందుకురా రాజి ఇట్లా చేస్తున్నావ్, ఇది చాలదని పట్నంలో కూడా కాపురం పెట్టిన వంట” అని అంటుండగానే రాజయ్యకు వల్లు మండి ఉగ్రుడై ఆహా ఇవన్నీ నీతో చెప్పిందా! ఏమి ఎరుగని నంగనాచి లాగా చూస్తుంది చూడు” అంటూ తన వెంట తెచ్చుకున్న సంచిలో నుండి కత్తి తీసి సునీతపై విసరగా ఆ కత్తి ఆమె భుజం కింది భాగంలో తాకి రక్తము కారుతుంది. పక్కనే ఉన్న రాజయ్య తల్లి ఏం పుట్టిందిరా నీకు అన్యాయంగా దాన్ని చంపుతుంటివి. కన్న కష్టం చేసి ఇద్దరు పిల్లలను సాదుకుంటుంది అంటూ లింగమ్మ ఇంట్లోకి వెళ్లి పసుపు తెచ్చి చెయ్యికి కట్టు కడుతుంటే వెనుక నుండి వచ్చి కూర్చున్న సునీత వీపు మీద తన్నిండు. ఆమె ముందుకు వంగి బొక్క బోర్లా పడిపోయింది. మూలుగుతున్న నక్క మీద

తాటికాయ పడినట్లు అయింది. నొప్పికి తట్టుకోలేక గట్టిగా ఏడుస్తుంది సునీత. పిల్లలు శివ, సాయి ఇద్దరు దూరంగా ఉండి ఏడ్చుకుంటూ చూస్తున్నరు. పిల్లల ఏడుపు విని పక్కింటి సైదులు వచ్చి వద్దురా తమ్మి ఆడపిల్లల కొడితే ఏమి లాభం. నువ్వు ఎన్ని దెబ్బలు కొట్టినా కూడా నిన్ను ఏం అనట్లేదు వాళ్లేమన్నా మరల మనలా కొడతారా, కొట్టరు కదా! అది వారికున్న గొప్ప జ్ఞానం అంటూ ఎన్నో విషయాలు చెప్పుకుంటూ రాజయ్యను అక్కడ నుండి దూరంగా తీసుకుని పోయిండు సైదులు. అనేకులు వచ్చి సునీతను చూస్తున్నరు. అంతలో తన దూర బంధువు వెంకటమ్మ సునీతను చూసి ఎంతో బాధపడుతూ "నెత్తిలో నాలుగిత్తులు పడ్డప్పటినుండి బిడ్డకు ఇవే కష్టాలయే. సుఖం ఎప్పుడూ లేదు అంటూ దీనికి కూడా బుద్ధి లేదు ఇక్కడ ఉంటే నిన్ను ఎప్పుడో చంపుతాడు చెల్లె నీ తల్లిగారింటికి వెళ్లిపోమంటే మాట వినదు. నేను సచ్చిన ఇక్కడే ఉంటా బతికిన ఇక్కడే ఉంట అని మూర్ఖంగా మాట్లాడుతుందని వెంకటమ్మ బాధతో అన్నది.

ఒకరోజు తన పిల్లల విషయమై ఆలోచిస్తూ, నా పిల్లలు ఇక్కడే ఉంటే ఈ గొడవలన్నీ చూసి తండ్రి మీద పగ పెంచుకుంటారేమో! వారి చదువులను ఆగం చేసుకుంటారేమోనని అనుకొని తన ఇద్దరి కొడుకులను శివను, సాయిని హాస్టల్లో వేసింది. తను మాత్రమే అత్తమామల దగ్గర ఉంటుంది. తన భర్త రాజయ్య నెలకొకసారి వచ్చి పోతుంటడు. ఒకరోజు రాజయ్య కొత్త నెంబర్తో తన భార్య సునీతకు ఫోన్ చేసిండు. ఇది ఏదో కొత్త నెంబర్ అని ఎత్తలేదు సునీత. మాటిమాటికి ఫోను వస్తుంటే పాపం ఎవరో అని ఫోను ఎత్తింది. భర్త గొంతు గుర్తుపట్టి కొద్దిసేపు మాట్లాడిన తర్వాత "ఈ నెంబర్ ఎవరిది బావ అని అడిగింది. వెంటనే ఇదిగో ఈమెతో మాట్లాడు అని తనతో కాపురం ఉంటున్న స్త్రీకి ఇచ్చి మాట్లాడమన్నడు. సునీత మారు మాట్లాడకుండా ఫోన్ కట్ చేసి... మనసులో కుమిలి కుమిలి ఏడుస్తూ ఎందుకు ఈయన నన్ను మాటిమాటికీ శారీరకంగా మానసికంగా గాయపరుస్తున్నాడని బాధపడింది. ఒకరోజు సునీత అత్తమామలు ఆమెతో "నీవు ఇంట్లో ఉంటే నిన్ను ఎప్పుడు చంపుతాడో తెలవదు. వాడు రాక చాలా రోజులైంది. ఈ రెండు మూడు రోజులల్ల రావచ్చు. వాడు రాకముందే నీవు వెంకటనరసమ్మ పటేలమ్మ ఇంటిలో ఉండు. అక్కడికైతే వాడు రాడు" అని చెప్పి కోడల్ని పటేలమ్మ ఇంటిలో ఉంచింది లింగమ్మ.

కూలి నాలి పనులు చేస్తూ పిల్లలను సాదుకుంటుంది సునీత.

కొన్ని రోజుల తర్వాత మరల తల్లి అనుకున్నట్టుగానే ఇంటికి వచ్చిండు రాజయ్య. ఇంట్లో పిల్లలు లేరు భార్యలేదు తల్లిదండ్రులు మాత్రమే ఉన్నారు. వీడు మల్ల ఎందుకు వచ్చిండ్రా బాబు అని మనసులో అనుకొని చాలా రోజులకు ఇల్లు గుర్తుకొచ్చింది నాయనా అంటూ పలకరించింది తల్లి. మీ కోడ లేదమ్మా అని అడిగిండు రాజయ్య. వాళ్ల గురించి నీకెందుకు కొడకా వారికి ఏమన్నా పైసలు ఫలాలు తెచ్చి ఇచ్చేటోడివా పుచ్చటోడివా వాళ్లు ఎటు పోతే నీకెందుకు కొడకా అని ఇంట్లోకి వెళ్లిపోయింది లింగమ్మ. ఇంట్లో తల్లిదండ్రులను నానా మాటలు తిట్టి రచ్చబండ కాడికి రచ్చబండ కాడికి పోయిండు. అక్కడ చాలామంది కూర్చొని ఓ పంచాయతీ తస్సివచేస్తున్నరు. వారిలో ఒకతను "ఎప్పుడొచ్చినవురా రాజయ్య" అని పలకరించిండు. ఇప్పుడే వచ్చిన కాక అంటూ "మీ కోడలు కనపడిందా కాక" అని అంటుండగానే ఓ పిల్లగాడు "నాకు తెలుసు పటేలమ్మ ఇంట్లో ఉంటుందని చెప్పాడు. అక్కడున్న వారంతా ఆ పిల్లవాని వైపు ఎందుకు చెప్పితివి రా బాబు అన్నట్లుగా చూస్తున్నరు. చిన్న పిల్లలు కపటం లేని వారు అంటారుకదా. అందుకే అతడు అతిగతి లేకుండా చెప్పాడు. ఇప్పుడు ఆ పిల్లను ఏమంటాడో అని అందరూ ఆలోచనలో మునిగిపోయారు. వీడు అసలే మంచోడు గాడు. చాలా కంత్రి నా కొడుకు. ఈసారి ఆ పిల్లను ఏమన్నా అంటే వీడికి తగిన శాస్తి చేయాలి అని అనుకున్నరు అక్కడున్న పెద్దలంతా. రాజయ్య వైన్ షాప్ కి వెళ్లి ఫుల్ బాటిల్ మందు కొట్టి పటేలమ్మ ఇంటికెళ్లి బండ బూతులు తిడుతూ "ఒసేయ్ పటేలమ్మ నా పెళ్ళాన్ని నీ కొడుకు ఇచ్చి పెళ్లి చేసినావే నీ ఇంట్లో ఉంచుకున్నావ్ అంటూ అనరాని మాటలు తిట్టిండు. వెంటనే పటేలమ్మ మస్కూర్ను పిలిపించి పోలీస్ స్టేషన్కు తీసుకపొమ్మని చెప్తూ వీడు చిన్న పెద్ద లేకుండా మాట్లాడుతుండు ఒకసారి పోలీసు దెబ్బ చూపిస్తేనే వింటడు" అని చెప్పింది.

అందుకు సునీత "వద్దు పటేలమ్మ అంత పని చేయకమ్మా. నా వల్లనే నీవు ఇన్ని మాటలు పడ్డావు. తప్పంతా నాదేనమ్మ. ఈ ఒక్కసారి మన్నించండి నేనే వెళ్ళిపోతాను నా భర్త మీద కేసు పెట్టకండి" అని బ్రతిమలాడుకుంది. రాజయ్య మాత్రం నా భార్యకు ఎవరు పనివ్వద్దు ఎవరింటిలో ఉండనివ్వదు అని కరాకండిగా చెప్పిండు. అతని తిట్లకు భయపడి సునీతకు ఎవ్వరూ పని ఇవ్వట్లేదు. మాట్లాడటం లేదు. ముందు బోతే నుయ్యి వెనక బోతే గొయ్యి అన్న రీతిగా ఉంది సునీత జీవితం. ఇప్పుడు ఎక్కడికి పోవాలి? యాడ ఉండాలి అని ఆలోచిస్తున్న సమయంలో సెల్ ఫోను మోగింది. ఫోన్ ఎత్తి హలో అనగానే "బాగున్నావా వదినా, అన్నయ్య బాగుండా ఇంకా తాగుతూనే ఉండ, పిల్లలు ఎలా ఉన్నారు" అంటూ ప్రశ్నల వర్షం కురిపించింది రమణమ్మ. ఓ మా ఆడబిడ్డ రమణమ్మనా అని మనసులో అనుకొని "బాగున్నాం రమణ ఎన్నాళ్ళకు గుర్తొచ్చినం తల్లి. మా ఊరే మర్చిపోయినవ్ గ!!"

"ఎందుకు మర్చిపోతాను వదిన వద్దామని అనుకునేసరికి అమ్మే నా దగ్గరికి వస్తుండే. అందుకని రాలేకపోతున్న వదిన ఏమనుకోవద్దు" అనగానే "అవును రమణ అత్తమ్మ నీ దగ్గరకు వస్తున్నది గాని చాలా రోజులకు ఫోన్ చేసినవ్ ఏంటి విశేషాలు" అని అడిగింది సునీత.

"విశేషాలు ఏమి లేవు వదిన. ఉన్న విశేషము నీకు తెలిసిందే కదా అంటూ డాక్టరమ్మ బెడ్ రెస్ట్ తీసుకోమంది నేనేమో హాస్టల్లో పిల్లలకు వంట చేసి పెడతాను ఇప్పుడు నేను రెస్ట్ తీసుకుంటే పిల్లలకు వంట చేయుటకు వేరే వాళ్లను పెట్టుకుంటది ఆ మేడం. అందుకని నీవు వంట బాగా చేస్తావు కదా వదినా నాకోసం కొన్ని రోజులు పిల్లలకు వంట చేసి పెట్టు తర్వాత నేనే చేస్తాను.నీవు మాతో పాటు అయినా ఉండొచ్చు. అక్కడ హాస్టల్లో కూడా ఉండొచ్చు. హాస్టల్లో మీకు రూము ఇస్తరు అని చెప్పింది రమణ".

వెతుకుపోయే తీగ కాళ్లకు తగిలినట్టు అయింది సునీతకు. కొద్దిసేపు ఆలోచించి "సరే రా రమణ రెండు రోజుల తర్వాత వస్తాను" అంటుండగానే

"వదిన అమ్మతోపాటు రా ఒక్కదానివి రాలేవు నీకు రూము దొరకదు" అని చెప్పింది.

"సరేరా మంచిది. వస్తలేరా" అనగానే రమణ ఎంతో సంతోషముతో "థాంక్స్ వదినా" అని చెప్పి ఫోన్ కట్ చేసింది.

రెండు రోజుల తర్వాత అత్తా కోడలు ఇద్దరు కలిసి రమణ ఇంటికి వెళ్లారు వారిని చూసి ఎంతో ఆనందపడింది రమణ ఆ రాత్రంతా ఎన్నో విషయాలు కడుపునిండా మాట్లాడుకున్నారు మరుసటి రోజు సునీతను హాస్టల్కు తీసుకొని పోయింది రమణ. "ఈ పిల్లలకు నీవే అన్నము వండి పెట్టాలి. ఈరోజు నుండి అంతా నీదే బాధ్యత. ఈ హాస్టల్ నడిపించే మేడం ఇక్కడ ఉండదు. ఆమె ఈ పిల్లలకు కావలసినవన్నీ పంపిస్తది. ఆ మేడము నన్ను నమ్మి ఈ బాధ్యత నాకు అప్పగించింది. నేను నిన్ను నమ్మి ఈ బాధ్యత నీకు అప్పగిస్తున్నాను వదిన" అని అంటుండగానే

"సరే రమణ నేను వీరికి వంట చేసి పెట్టాలి అంతేగ అన్నది సునీత".

"వంట మాత్రమే కాదు వదినా వంటతో పాటు తల్లి తన పిల్లలను ఎలా చూస్తుందో అలా చూడాలి వారిని పొద్దుగాల లేపాలి చదివించాలి కొట్టుకోకుండా చూడాలి నీవు వారికి వంట మనిషివి కావు తల్లివి" అనగానే సునీతకు కళ్ళల్లో నీళ్లు తిరిగినవి నాకున్న ఇద్దరు కొడుకులను హాస్టల్లో వేసినప్పుడు ఒక్కదానినని ఎంతో ఏడ్చాను కానీ దేవుడు ఇప్పుడు వందల మంది పిల్లల మధ్య నన్ను ఉంచాడు అని సంతోషించింది.

సునీతతో పాటు రూతు అనే స్త్రీ కూడా అక్కడే పని చేస్తుంది. ఒకరోజు సెల్లు ఓపెన్ చేసి దానిలో మునిగిపోయి ఎవరు వచ్చినా చూసుకోకుండా సెల్లులో నిమగ్నం అయింది. అదే సమయంలో సునీత వచ్చి "ఏం చేస్తున్నావ్ రూతు ఎప్పుడు చూసినా చెల్లె పట్టుకుని ఉంటావు. కొంచెం సమయం దొరికితే చాలు సెల్లులో మునిగిపోతావ్" అన్నది చిరాకుగా అందుకు రూతు "నేను ఇంగ్లీషు రాయడం మాట్లాడడం నేర్చుకుంటున్న" అని చెప్పింది.

ఆ మాటకు సునీత ఎంతో ఆశ్చర్యపోయి బడికి పోకుండా సెల్లులో చదువుచెప్పుతున్నరా!! ఏది నాకు చూపించవా" అని అమాయకంగా అడిగింది.

"నిజం సునీత ఇదిగో చూడు" అని చూపించింది రూతు. అది ఇంగ్లీషు మాట్లాడుతుంటే సునీతకు ఏమీ అర్థం కాలేదు.

అందుకని "నాకు ఇంగ్లీషులో ఏమీ అర్థం కావట్లేదు. తెలుగును కూడా నేర్పిస్తదారా!"

" అవును తెలుగు కూడా నేర్పుతారు ఇదిగో చూడు అని చూపించింది" రూతు.

"ఓ.. అమ్మ ఎంత మంచిగా చెప్తుంది టీచర్ అంటూ ఆశ్చర్యపోయింది" సునీత. "ఆ తెలుగు చెప్పే టీచర్ను నా సెల్లులో పెట్టవా" అని అమాయకంగా అడిగింది సునీత.

వెంటనే రూతు ఆమె సెల్ లో యాప్ డౌన్లోడ్ చేసింది.

పొద్దంతా పనులు చేసి రాత్రంతా కష్టపడి చదవడం రాయడం నేర్చుకుంది. అదేవిధంగా రూతు సహాయముతో ఓపెన్ టెన్త్ ఫీజు కట్టి పరీక్ష రాసి పాస్ అయింది సునీత. ఆమె సంతోషానికి అవధులు లేవు. పట్టజాలని సంతోషం ఎన్నడు పొందలేని ఆనందం ఆ ఆనందంలో రూతును ఒకేసారి ఎత్తుకొని నాకు చదువు రావడానికి నీవే కారణం నీవే నా చదువుల తల్లివి" అంటూ పొగుడుతుంటే...

"నేను కాదు సునీత నీవే కష్టపడి రాత్రనక పగలనక చదువుకున్నావ్. ఇంతటితో ఆగక ఇక నుండి కూడా ఇలానే చదివితే మంచి ఉద్యోగం పొందుతావు" అంటూ దీవించింది రూతు.

సునీత అంతటితో ఆగిపోలే సంకల్పం ఉంటే ఎంత పెద్ద కొండనైనా దాటొచ్చు అని రుజువు చేసింది. ఆమె ఎన్నో కష్టాలను ఎదుర్కొంటూ బతుకును కొనసాగిస్తున్న సమయంలో సునీత భర్త తన చెల్లె రమణమ్మ ద్వారా తెలుసుకొని అక్కడికి వచ్చి ఎంతో గందరగోళం చేయడం జరిగింది. అందువలన అక్కడ ఉన్నవారు ఆమెను బయటికి పంపించారు. సునీత చేసేది ఏమీ లేక రూతు సహాయముతో ఒక మంచి కంపెనీలో జాబు చేయుటకు కుదిరింది. రోజుల తర్వాత సునీత పనిని బట్టి అక్కడ మంచి జీతం ఇస్తున్నరు. తన ఇద్దరి పిల్లలను తన వద్దే ఉంచుకొని చదివించుకుంటుంది. వారు కూడా మంచిగా చదువుకొని ఉద్యోగాలు పొందుకున్నారు. ఆమెకు చెప్పలేని సంతోషం కలిగింది. నా కష్టాలన్నీ తీరిపోయినవి అనుకొని, ఒక నిమిషం పాటు గతాన్ని గుర్తుచేసుకొని దేవునికి థాంక్స్ చెప్పింది. కొడుకులిద్దరూ తల్లి కాళ్ళకు పాదాభివందనం చేశారు. ఇద్దరిని లేపి గుండెల కత్తుకొని నుదుటిపై ముద్దు పెట్టి "మీరిద్దరూ నా రెండు కండ్లు ఉద్యోగంలో నమ్మకంగా ఉండాలి. జీవితంలో మీ నాన్న లాగా తాగకూడదు అంటూ ఆయురారోగ్యాలతో సుఖశాంతులతో నిండా నూరేళ్లు సల్లాంగ ఉండాలని" దీవించింది సునీత. కొన్ని రోజుల తర్వాత "నీవు ఇకనుండి ఏ పని చేయనవసరం లేదమ్మ ఇంటి దగ్గర ఉండు. ఇన్ని రోజులు మమ్ములను ఎంతో కష్టపడి పెంచి పెద్ద చేసి చదువులు చెప్పించావు. ఇకనుండి మేము సాదుకుంటాం" అని కొడుకులు అనగానే "ఇప్పటినుండి ఖాళీగా కూర్చొని ఉండడము నా వల్ల కాదురా మీరన్నట్లే పనికి వెళ్ళను కానీ మన వీధిలో ఉన్న అనాధ పిల్లలకు చిన్నపాటి ఆశ్రమం లాగా నడిపిస్తాను దానికి మీరు అంగీకరిస్తే చాలు అన్నది సునీత. అందుకు వారు అది చాలా రిస్క్ తో కూడిన పని అమ్మ అన్నారు. కానీ తర్వాత తల్లి ఇష్టం కాదనలేక ఒప్పుకొని వెంటనే వారు సునీత అనాధ ఆశ్రమం అని పేరు ఫ్లెక్సీ మీద రాయించుకొని తల్లికి చూపించారు. ఆనాటి నుండి సునీత ఎంతోమంది అనాధ పిల్లలకు తల్లి అయింది. పని కోసం వచ్చిన ఆమె ఫౌండర్ గా మారింది అనేకమంది జీవితాలలో వెలుగులు నింపింది. కొంతకాలం తర్వాత పిల్లలిద్దరి పెళ్లిళ్లు చేసింది. తరువాత అత్తమామలు,తన భర్త అందరు కలిసి ఒకే చోట ఆనందంగా జీవిస్తున్నా సమయంలో ఒకరోజు రాజయ్య సునీతతో నీవే గెలిచావు సునీత నేనే ఓడిపోయాను అనగానే "ఎవరు ఓడిపోలే మనిద్దరం గెలిచాము మన పిల్లలిద్దరికీ ఉద్యోగాలు వచ్చాయి. పెళ్లిళ్లు చేశాము అంతా మన మంచికే జరిగిందని చెప్తూ

బాధలు కష్టాలు మధ్యలో వస్తాయి మధ్యలోనే పోతాయి. అవి అందరికీ ఉంటవి. వాటన్నిటిని అధిగమించి తన జీవితాన్ని మెరుగుపరుచుకొని ముందుకు సాగాలి అప్పుడే మనము ప్రగతిని సాధించగలం అని చెప్పింది సునీత.

నిజమే కదా సునీత జీవితం అనేకులకు మార్గదర్శం.

వ్యాసం

# ఎంతమంది ఉసురు పోసుకుంటారు ?



**ఎస్. పుణ్యవతి**



'మాకు ప్రాణ హాని ఉంది. మేము నిత్యం వేధింపులకు గురవుతున్నాం'. ఈ ప్రకటన చేసింది వినేష్ ఫోగట్. దేశానికి పతకాల మీద పతకాలు సంపాదించి పెట్టిన, దేశం పరువు నిలబెట్టిన క్రీడాకారిణి. 'భారత కుస్తీ సమాఖ్య అధ్యక్షుడి మీద ఫిర్యాదు ఇచ్చిన వారితో సహా మా అందరి జీవితాలు ప్రమాదంలో ఉన్నాయి. మా కుటుంబాలకు బెదిరింపులు వస్తున్నాయి'. ఈ మాటలు వినేష్ జనవరి 18వ తేదీన మొట్టమొదట జంతర్‌మంతర్ దగ్గర ధర్నా చేసిన రోజే చెప్పింది.

'నేను ప్రధానమంత్రిని కలిసినప్పుడు కూడా ఇంత వివరంగా కాకపోయినా...మేం వేధింపులను ఎదుర్కొం టున్నాం. మాకు సహాయం చేయండి...అని విన్నవించు కున్నాన'ని కూడా చెప్పింది. తిరిగి ఏప్రిల్ 25వ తేదీన, మే 18వ తేదీన పత్రికలు, ఎలక్ట్రానిక్ మీడియాకు చెప్పింది. అయితే ఇవన్నీ ప్రభుత్వానికి ఎందుకు అర్థం కావడం లేదు. ఇప్పటికి ఐదు నెలలుగా వాళ్ళు ఆందోళన చేస్తున్నారు. ఈ మహిళా క్రీడాకారులు నిజంగానే జీవితం ప్రమాదంలో పడేంత తీవ్రమైన ఇబ్బందులు అనుభవిస్తున్నారా. అంటే గతంలో జరిగిన ఘటనలు నూటికి నూరు శాతం నిజమనే చెప్తున్నాయి. ఒకసారి గతంలో ఏం జరిగిందో చూద్దాం.

రుచిక గిర్హోత్రా. గూగుల్ తల్లిని అడిగితే ఈమె గురించి అన్ని వివరాలు చెబుతుంది. అభం శుభం తెలియని 14 ఏళ్ల బాలిక. టెన్నిస్ నేర్చుకునేది. అప్పటి పోలీస్ అధికారి అయిన టెన్నిస్ అసోసియేషన్ నాయకుడి వేధింపులకు బలైంది. న్యాయం దొరకక, తన కారణంగా తమ్ముడు, మొత్తం కుటుంబం వేధింపులకు గురైన కారణంగా మనస్తాపం చెంది ఆత్మహత్య చేసుకుంది. అయితే సదరు పోలీస్ అధికారి మాత్రం డిజిపిగా పదోన్నతి పొందాడు. ఇదీ మన ఆడపిల్లలకు న్యాయం జరిగే తీరు.

వివరాల్లోకి వెళ్తే...రుచిక టెన్నిస్ క్రీడాకారిణి. చండీగఢ్ లోని సేక్రెడ్ హార్ట్ గర్ల్స్ హైస్కూల్లో 10వ తరగతి చదివేది. తండ్రి యూకో బ్యాంక్ మేనేజర్. తల్లి చిన్నప్పుడే చనిపోయింది. సోదరుడు అషు. స్నేహితురాలు ఆరాధనతో కలిసి హర్యానా లాన్ టెన్నిస్ అసోసియేషన్‌లో టెన్నిస్ నేర్చుకునేది. ఇది ఎక్కడ ఉన్నదంటే, అప్పటి ఇన్‌స్పెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్‌గా పనిచేస్తున్న ఎస్‌పిఎస్ రాథోడ్ నివాస గృహం పక్కనే ఉండేది. అప్పట్లో ఇతగాడు హర్యానా లాన్ టెన్నిస్ అసోసియేషన్ ప్రెసిడెంట్‌గా పని చేసేవాడు. ఆ హోదాలోనే రుచిక ఇంటికి వెళ్లి ఆ అమ్మాయి తండ్రితో మాట్లాడాడు.

ఇది జరిగింది 1990 ఆగస్టు 11వ తేదీన. 'అమ్మాయి బాగా పైకి వస్తుంది. నా ఇంటికి పంపించండి. కోచింగ్ ఇస్తాను' అని చెప్పి వచ్చాడు. 12వ తేదీన స్నేహితురాలు ఆరాధనతో కలిసి రుచిక రాథోడ్ ఆఫీస్‌కి వెళ్లి కలిసింది. ఆ ఇద్దరు అమ్మాయిల్ని చూసిన ఈ పెద్ద మనిషి టెన్నిస్ కోచ్‌ని తీసుకురమ్మని చెప్పి ఆరాధనను బయటకు పంపించాడు. ఆ అమ్మాయి బయటకు వెళ్లిందో లేదో ఒంటరిగా ఉన్న రుచికను గట్టిగా పట్టుకొని దగ్గరకు తీసుకొని చెప్పరాని విధంగా

ప్రవర్తించసాగాడు రాథోడ్. ఏదో విధంగా అమ్మాయి అతన్ని బయటకు నెట్టేసి ఇవతలకు వచ్చింది.

అయినా అతని ధోరణి మారలేదు. బయటికి వెళ్లిన ఆరాధన లోపలికి వచ్చి జరిగిందంతా చూసింది.

జరిగిన విషయం ఆడపిల్లలు ఇంట్లో వాళ్లకి చెప్పలేదు. అందరు ఆడవాళ్లు, ఆడపిల్లల్లాగే భయపడ్డారేమో. ఆ తర్వాత రోజున మళ్లీ టెన్నిస్ నేర్చుకోవడానికి వెళ్లారు. ఆ పిల్లలిద్దరినీ తన ఆఫీసుకు పిలిపించాడు రాథోడ్. ఇక దీంతో వారిద్దరు ఇంట్లో వాళ్లకి చెప్పారు. విషయం తెలుసుకున్న తల్లిదండ్రులు ఏదో ఒకటి చేయాలని నిర్ధారణకు వచ్చారు. పైఅధికారుల దృష్టికి తీసుకురావాలనుకున్నారు.

ఆగస్టు 17 తేదీన హోం సెక్రటరీకి ఫిర్యాదు ఇచ్చారు. అధికారులు చర్యలు తీసుకుంటారని భ్రమపడతాం కదా. వారూ అలాగే అనుకున్నారు. అయితే కథ అక్కడితో ఆగలేదు. ముఖ్యమంత్రులు, హోంమంత్రులతో కలిసి నేరస్తుడ్ని రక్షించడానికి నాటకాలు మొదలెట్టారు.ఆ తర్వాత జరిగినదంతా తెలుసుకుంటే ఒళ్ళు జలదరిస్తుంది. క్రైమ్ స్టోరీని తలపిస్తుంది. న్యాయం జరగకపోగా రుచిక కుటుంబాన్ని, మద్దతునిచ్చిన స్నేహితురాలు ఆరాధన కుటుంబాన్ని సర్వనాశనం చేశారు. ఇదంతా అధికారంలో ఉన్న పెద్దల అండతోనే సాగింది.

సెప్టెంబర్ 17వ తేదీన హోం సెక్రటరీకి ఫిర్యాదు ఇచ్చాక...హోం సెక్రటరీ ఆర్.ఆర్. సింగ్ నివేదిక ఇచ్చారు. దాంట్లో స్పష్టంగా నేరం జరిగినట్లు చెబుతూ ఎఫ్ఐఆర్ తక్షణమే నమోదు చేయాలని సిఫార్సు చేశారు. ఆ కొద్ది కాలానికి ఆర్. ఆర్.సింగ్ స్థానంలో దుగ్గల్ హోం సెక్రటరీగా వచ్చాడు. సింగ్ ఇచ్చిన రిపోర్టు ఎక్కడ చెదలు పట్టిపోయిందో తెలియదు. నేరం చేసిన రాథోడ్ కి స్థానిక ఎమ్మెల్యేతో సహా అప్పటి ముఖ్యమంత్రి హుకుమ్ సింగ్, ఆ తరువాత వచ్చిన ఓం ప్రకాష్ చౌతాలా ప్రభుత్వాల అండదండలు దండిగానే ఉన్నాయట.

బాలిక కుటుంబానికి మాత్రం వేధింపులు తారాస్థాయికి చేరాయి. మొదట స్కూల్ ఫీజు ఎగ్గొట్టిందని ఆరోపించి ఆ పిల్లని స్కూలు నుంచి బహిష్కరించారు. ఫీజులు కట్టని 135 మంది మీద మాత్రం ఒంటి మీద ఈగ వాల లేదు. ఈ బహిష్కరణను అడ్డం పెట్టుకొని ఆ పిల్ల మీద నిందా ప్రచారం తారాస్థాయిలో చేశారు. ఆ తల్లి లేని పిల్ల ఒకవైపు మానసిక వేదనతో గది నాలుగు గోడల మధ్య మగ్గిపోయింది. రాథోడ్ చెప్పుచేతల్లో ఉన్న పోలీస్ డిపార్ట్మెంట్ వాళ్ళు తెల్ల చొక్కాల ముసుగులో ఆ కుటుంబం మీద ఒక కన్ను వేశారు.

తండ్రి మీద, పది సంవత్సరాల తమ్ముడి మీద మర్డర్ కేసు, దొంగతనం కేసుతో సహా పెట్టని కేసులు అంటూ లేవు. కేసులు పెట్టి వేధించారు. పోలీస్ స్టేషన్లో పెట్టి చిత్రహింసలకు గురిచేశారు. సినిమాల్లో తప్ప మరెక్కడ చూడం ఇట్లాంటి చిత్రహింసలు. ఆ పిల్లాడు ఎట్లా బతికి బయటపడ్డాడో తెలియదు.

మరో బాలిక ఆరాధన మీద పదికి పైగా కేసులు పెట్టారట. ఆమెను తండ్రి హర్యానా ప్రభుత్వంలో చీఫ్ ఇంజినీరుగా పనిచేసేవాడు. మచ్చలేని మనిషి. అటువంటి ఆయన మీద కేసులు మీద కేసులు పెట్టి చివరికి ఉద్యోగంలో నుంచి సస్పెండ్ చేయించారు.

ఇవన్నీ చూసిన బాధితురాలు రుచిక మూడేళ్ల తర్వాత అంటే 1993 డిసెంబర్ 28న విషం తిని చనిపోయింది. అక్కడికి ఆ దుర్మార్గుడు కక్ష తీరలేదు. తండ్రి చేత బలవంతంగా తెల్ల కాగితాల మీద సంతకాలు పెట్టించుకుని గాని ఆ అమ్మాయి మృతదేహాన్ని తండ్రికి అప్పగించలేదు.

ప్రభుత్వం ఈ కేసు ఫైలు మూసివేసింది. వేధింపులు తట్టుకోలేక కుటుంబం చండీగఢ్ నుంచి సిమ్లా దగ్గరకు పోయి మట్టి పని చేసుకుని బతికిందట. రాథోడ్ మాత్రం సంవత్సరం తర్వాత 1994లో అడిషనల్ డిజిపిగా పదోన్నతి పొందాడు.

ఆ తర్వాత 1999లో ఓం ప్రకాష్ చౌతాలా ప్రభుత్వంలో డిజిపిగా పదోన్నతి పొందాడు. ఈ మొత్తం ఘటన మీద అప్పటి రాష్ట్ర స్థాయి బిజెపి నాయకుడు స్పందించాడట. అయితే కేంద్రంలో ఉన్నది వాజ్‌పేయి ప్రభుత్వమే కదా. వాజ్‌పేయి ప్రభుత్వానికి ఓం ప్రకాష్ చౌతాలా ప్రభుత్వం మద్దతు ఉంది

కాబట్టి అన్ని రకాల మద్దతులు కలిపి ఒక ఆడపిల్లకి, ఒక భావి భారత క్రీడాకారిణికి అన్యాయం చేశారు. ఇదంతా పార్లమెంట్ వేదికగా కూడా చర్చ జరిగింది. అప్పుడు పార్లమెంటు సభ్యురాలుగా ఉన్న బృందాకరత్ కూడా రుచికకు న్యాయం జరగాలని పార్లమెంటును వేదికగా చేసుకుని పోరాడారు.

ఇవన్నీ ఆనాటి ఇంగ్లీషు, హిందీ అన్ని పత్రికల్లోనూ ప్రముఖంగా ప్రచురించబడ్డాయి. చివరికి కేసు సిబిఐ చేతుల్లోకి వెళ్ళింది. సుప్రీంకోర్టు దాకా వచ్చింది. నేరం జరిగిన 20 సంవత్సరాల తర్వాత 2010లో రాథోడ్ నేరం చేశాడని అంగీకరిస్తూ కోర్టు తీర్పు చెప్పింది. ఏమైనప్పటికీ నేరస్తుడికి పదోన్నతి, బాధితురాలికి మరణం సంప్రాప్తించాయాఇదంతా చూశాక...బాధితులైన క్రీడాకారులు, వాళ్ళ కుటుంబాలు భయభ్రాంతులకు గురవుతున్నాయని అనడంలో ఏమైనా ఆశ్చర్యం ఉన్నదా.

పుండు మీద కారం చల్లినట్లు 'వాళ్లు రోడ్డెక్కింది న్యాయం కోసం కాదు. రాజకీయాల కోసం' అన్న దుష్ప్రచారాలను సోషల్ మీడియా వేదికగా చూసిన వాళ్లకి బుర్ర వేడెక్కిపోవాల్సిందే. ప్రస్తుతం కుస్తీ క్రీడాకారిణులు పోరాడుతున్నది ఒక అధికార మదగజంతో అన్నది దేశ ప్రజలందరికీ అర్థం కావాలి. దేశానికి పతకాలు సాధించి పెట్టి, దేశం పరువు నిలబెట్టిన ఆడపిల్లల్ని రక్షించుకోవడానికి ఈ దేశ ప్రజ ఏం చేస్తున్నది? ఇది మనందరి ముందు ఉన్న ప్రశ్న!

(ప్రజాశక్తి సౌజన్యం తో)

వచన కవిత

# దుప్పటి





**డాక్టర్ దాసోజు పద్మావతి**
**చరవాణి -9441286794**


దుప్పటి నులి వెచ్చని కుంపటి
అమ్మకు వాళ్ళ అమ్మ ఇచ్చింది
అమ్మ లాలిని నాన్న లాలనను కలిపి అందించే అనురాగాల విపంచి–
ఈ దుప్పటికి కలలు– కన్నీళ్లు కమ్మటి జ్ఞాప కాలన్నీ తెలుసు
ముదిమి తనపు ముడతల్లో మూడు తరాల జ్ఞాపకాలు దాచుకున్న అను రాగమయి–
కుటుంబం అంతా దుప్పట్లో మడుచు కుంటే ఎంతో భద్రతా భావం–
అమ్మ కథలు చెప్పిన నిద్ర పుచ్చిన బాల్యం– నాన్న గుండెల్లో తలదాచుకున్న ఆ పసితనం–
దాగుడు మూతల్లో అదే కదా మనకు రక్షణ కవచం.
ఎన్నెన్నో అను భవాలను– అను బంధాలను నాకు మిగిల్చిన స్నేహ మయఈ దుప్పటి–
ఈ దుప్పటి పై
కాసేపు తల వాల్చితే అమ్మ ఒడిలో సేదతీరిన అనుభూతి ఈనాటికీ
ఈ దుప్పటి దులిపితే ఎన్నెన్నో మరపు రాని మధుర స్మృతులు నన్ను ఉక్కిరి బిక్కిరి చేస్తాయన్న భయం అందుకే దాన్ని
ఆత్మీయంగా గుండెలకు హత్తు కుంటాను తప్ప ధైర్యం చేసి ఏనాడు కప్పుకోను

కథ

# అనుమానం



చల్లా. సరోజినీ దేవి
సెల్-9849826634

అప్పట్లో నేను డ్యూటీ కి వెళ్ళి తిరిగి వచ్చేప్పుడు, మార్కెట్ లో ఏ రోజు కు సరిపోయే కూరగాయలు ఆ రోజే ఫ్రెష్ గా తెచ్చే దానిని. ఇప్పుడు రిటైర్ అయ్యాక , పిల్లలు వారానికి ఒక సారి తెచ్చే కూరగాయలు ఫ్రిజ్ లో పెట్టీ,అవే వారానికి సర్దుకోవాల్సి వస్తోంది. ఒక్కోసారి ఆకు కూరలు పాడై పోతే పడేయాల్సి వచ్చినప్పుడు ఉసూరు మనిపిస్తుంది. ఒకసారి వీధిలోకి తోపుడు బండిలో కూరగాయలు పెట్టుకొని అమ్మడానికి ఒక పాతికేళ్ల కుర్రవాడు వచ్చాడు. కూరగాయలు అన్నీ తాజాగా బాగున్నాయి. ఇరుగు పొరుగు వాళ్ళు అందరూ గుమి గూడి బేరం ఆడుతుంటే, మా ఇంటి బాల్కనీ లో నిలబడి చూసాను. కాసేపటికే బండిలోని కూరగాయలు సగం దాకా అయిపోయినవి. ఆకు కూరలు పచ్చగా , నవనవ లాడుతూ నా

దృష్టిని ఆకర్షించాయి. నేను కూడా క్రిందికి వెళ్ళాను. ఆ అబ్బాయి ఒక చెవికి తెల్లరాయి దిద్దు తో , ఒక రకమైన యాస గల హిందీలో మాట్లాడుతున్నాడు. అడిగిన వాళ్ళు అందరికీ నవ్వుతూ, కూరగాయలు ఇస్తున్నాడు. ఆ భాష చూస్తే లంబాడీ లాగా aనిపించింది. ప్రక్కింటి విమల " రోజూ వస్తావా?" అని అడిగింది. " జీ, రోజూ ఆవుంగా" అన్నాడు. అతని మాటలు వినగానే నవ్వు వచ్చింది నాకు. సగం తెలుగూ, సగం హిందీ కలిపి మాట్లాడుతూ, చూస్తుండగానే చాలా కూరగాయలు అమ్మేసి "మై ఫిర్ కల్ ఆతా హు" అని వెళ్ళిపోయాడు. అది మొదలు రోజూ ఆ అబ్బాయి దగ్గిర తాజా కూరగాయలు కొనడం మా వీధి వారితో పాటు , నాకు కూడా అలవాటు అయింది. గీసి గీసిబేరం చేస్తూ కొందరు ఆడవాళ్ళు విసిగించినా ఎప్పుడూ విసుక్కోవడం గానీ, చిరాకు పడటం గానీ చేసే వాడు కాదు. విదేశాల్లో పై చదువుల కోసం వెళ్ళిన నా మనుమడు ను తలపించే ఆ అబ్బాయిని చూడటానికి నా మనసు రోజూ ఎదురు చూసేది. "లంబాడీ అబ్బాయే కాబోలు?" అనుకొని " మీ కులం ఏమిటీ?" అని అడుగాలనుకొని కూడా , " ఛ, ఈ రోజుల్లో కూడా కులం గురించి ఎవరైనా అడుగుతారా? అయినా ఏ కులం అయితే ఏమిటి? అందరం మనుషులమే గదా? ఆ అబ్బాయి నా మనుమడు లాగే వున్నాడు. రోజూ తాజా కూరగాయలు తెచ్చి, కొన్న దానికన్నా కొంచెం అదనంగానే ఇస్తాడు. ఎప్పుడూ చిరునవ్వుతో వుంటాడు, ఆ అబ్బాయి రోజూ ఇలాగే వస్తె చాలు" అనుకొన్నాను. అప్పుడప్పుడు ఆ అబ్బాయి వీధి లోని పెద్ద తురాయి చెట్టు క్రింద బండి ఆపి, రెస్ట్ తీసుకొనే వాడు. నెల గడిచింది. ఇప్పుడు ఫ్రిజ్ లోనుంచి తీసివాడిన కూరలు వండుకునే బాధ తప్పింది అందరికీ. అన్ని రోజులు గడిచినా, ఆ కూరగాయల అబ్బాయి పేరు ఎవ్వరం అడుగనే లేదు." అబ్బాయ్ అనీ, బాబూ అనీ పిలిచే వాళ్ళం.

ఒక రోజు ఏదో పని వుండి బయటికి వెళ్ళి తిరిగి వస్తున్నాను. చెట్టు క్రింద ఒక అరుగు పైన కూర్చుని విమల కొడుకు పదేళ్ళ బంటీ

తో ఏదో చెపుతున్నాడు ఆ అబ్బాయి. నన్ను గమనించ లేదు ఆ ఇద్దరూ." మా తాత వేటాడి తెచ్చిన పులి తోలు మా ఇంట్లో ఇంకా వుంది తెలుసా?" అన్నాడు ఆ అబ్బాయి." అన్నీ కోతలు" అనుకొన్నాను నేను .బంటి ఎంతో శ్రద్ధగా వింటున్నాడు. అంటే చాలా సేపటి నుండి వాళ్ళు కబుర్లు చెప్పుకొంటూ వున్నరాన్నట్లు." ఏరా బంటి, ఈ వేళ స్కూల్ కు వెళ్ళలేదా?" అని అడిగే సరికి ఇద్దరూ ఉలిక్కి పడి నా వైపు చూసారు." టుడే ఇస్ సండే గ్రాండ్ మా"అని నవ్వుతూ అన్నాడు బంటి. నా మతి

మరుపు కు నేనే నవ్వుకొని" ఓ సారీ, నేను మరిచి పోయానురా" అన్నాను."ఏంటీ, ఈ వేళ మీరు కూరగాయలు ఏమీ తీసుకొనే లేదు మేడం?" అన్నాడు కూరగాయల అబ్బాయి. " ప్రొద్దున్నే మా అబ్బాయి మార్కెట్ నుండి ఏవో నాన్వేజ్ తెచ్చాడు బాబూ. అందుకే ఏమీ కొనలేదు. రేపు తీసుకుంటాను లే" అన్నాను. " ఏంటీ, ఆప్ నాన్వెజ్ ఖాతే క్యా?" ఆశ్చర్యంగా అడిగాడు ఆ అబ్బాయి." ఏం, అంత ఆశ్చర్యంగా అడుగుతున్నావు?" అన్నాను.

"కుచ్ నహీ మేడం, ఆప్ కో మై బొమ్మన్ సంజా" అన్నాడు ఆ కుర్రాడు."ఎందుకలా?" నవ్వుతూ అడిగాను." ఆప్ వైసే హీ దిఖ్తే" అన్నాడు కూరగాయల అబ్బాయి. " సరే లే, ఇంతకీ ఇన్ని రోజులు అయినా నీ పేరు మాకు తెలియనే తెలియదు. నీ పేరు ఏమిటి? ఏ ఊరు? ఏమన్నా చదువుకున్నవా?" అని అడిగాను. ఇప్పుడు ఆ అబ్బాయి తెలుగు చక్కగా మాట్లాడుతున్నాడు. నాతో మాత్రం హిందీ లోనే మాట్లాడుతాడు. నేనూ ఎక్కువగా అలాగే మాట్లాడడం కారణం కావచ్చు." గ్రాండ్మా, హిస్ నేమ్ ఈస్ తుకారాం నాయక్" ప్రక్కనే వున్న బంటి చెప్పాడు. నా ఊహ నిజమే అయింది.

"మేడం ,నేను ఓపెన్ యూనివర్సిటీ లో డిగ్రీ సెకెండ్ ఇయర్ చేస్తున్నాను. మాది ఆదిలాబాద్ దగ్గిర వున్న చిన్న తండా. మా భూమి లో సరైన పంటలు లేవు. బ్రతుక దాని కని మా నాయన ఇంతదూరం వచ్చాడు. మీ ఇళ్ళ వెనుకే వుండే మూసీ కాలువ పక్కన గుడిసెలు మావే. మా ఊరి నుండి చాలా కుటుంబాలే ఇటు వచ్చాయి." అన్నాడు తుకారాం. నాకు నోట మాట రాలేదు. డిగ్రీ చదివే పిల్లాడు భేషజం లేకుండా ఇల్లిల్లూ తిరిగి కూరగాయలు అమ్ముతున్నాడు. ఈ రోజుల్లో ఇంటర్ చదివే పిల్లలకే ఎంతో టెక్కు. ఏదైనా చిన్న పని చెప్పినా, మాట అన్నా వినిపించుకోండా వుంటారు. అలాంటి వారిని ఎందరినో చూసాను. ఇరుగపొరుగు ఇళ్ళల్లో చూస్తూనే వున్నాను." అలాగా? చాలా సంతోషం బాబూ. మరి మీ నాన్న ఏం చేస్తున్నాడు? ఇంకా ఇంట్లో ఎవరెవరు వుంటారు?" అడిగాను ఆసక్తిగా." మా నాన్న సుతారి పనికి పోతున్నాడు మేడం. మా చెల్లి పదో తరగతి చదువుతున్నది. అమ్మ ఇంట్లోనే వుంటుంది." వివరంగా చెప్పాడు తుకారామ్. నాకు మరింత ఆశ్చర్యం అనిపించింది." ఆ చిన్న గుడిసెలో అంత మంది వుంటారా? ఏదైనా చిన్న ఇల్లు అద్దెకు తీసుకోవచ్చు కదా?" అన్నాను. " ఇంకా అంత పరిస్థితి లేదు మేడం. నా డిగ్రీ అయిపోతే ఏదన్నా జాబ్ చూసుకొని ,అప్పుడు ఇల్లు అద్దెకు తీసుకుని వుంటాం" అని నవ్వాడు తుకారాం. నాది అర్థం లేని ప్రశ్న అని నాకే అర్థం అయింది. " సారీ బాబూ. త్వరగా నీ డిగ్రీ పూర్తి అయితే మా వాడికి చెప్పి, ఏదైనా జాబ్ లో పెట్టిస్తా. మా వాచ్ మన్ వాళ్ళు త్వరలో వేరే వూరికి వెళ్తారట. మీ నాన్న తో మాట్లాడి ఆ పని మానేసి, ఇక్కడ డ్యూటీ చేస్తాడేమో అడుగు. ఇల్లు తో పాటు జీతం కూడా వుంటుంది కదా?" అన్నాను. తుకారాం ముఖం సంతోషం తో వెలిగి పోయింది." చాలా థాంక్స్ మేడం. తప్పకుండా అడుగుతాను." అన్నాడు.

"గ్రాండ్ మా, వీళ్ళ తాత పులిని హంట్ చేసాడట. దాని స్కిన్ ఇంకా వుందిట" అన్నాడు బంటి." ఈస్ ఇట్ ట్రూ?" రవ్వంత ఎగతాళి ధ్వనించింది నా గొంతులో. " ఎస్ మేడం, మా తాత మంచి వేటగాడు. గ్రేట్ బ్రేవ్ మన్. ఆయన చనిపోయే వరకూ మా ఊరిలో ఎవ్వరూ ఆయన ముందు గట్టిగా మాట్లాడే వాళ్ళు కూడా కాదు. మా నాన్న కూడా మంచి బలవంతుడు. ఇప్పటికీ ఈజీ గా బస్తా వడ్లు ఒక్కడే ఎత్తగలడు." ఉత్సాహంగా చెప్పాడు తుకారాం. " వెరీ గుడ్. అయితే ఈ రోజు మీ నాన్న తో మాట్లాడి చెప్పు" అని మా ఇంటి వైపు సాగి పోయాను నేను......

నేను చెప్పిన ప్రతిపాదన విని మా వాడు " అమ్మా, అందరినీ నువ్వు త్వరగా నమ్మేస్తావు. అసలే లంబాడీలు అంటే ఎక్కువ గా దోపిడీ దొంగలు అనే పేరు వుంది. ఆ పిల్లాడిని చూస్తే , నలుగురిని అయినా ఒకే సారి పడేసే లాగ వున్నాడు. లేనిపోని తలనొప్పులు తేకు, నేనే ఇంకెవరైనా దొరుకుతారేమో చూస్తాను లే" అన్నాడు. నాకు కోపం వచ్చింది." ఒరేయ్, గాడిదను– గుర్రాన్ని ఒకే రాటకు కట్టేయ వద్దు రా. లంబాడీలు అనగానే " దోపిడీ దొంగలు" అనే ముద్ర వేయడం కరెక్ట్ కాదు. ఎవరో కొందరు చేసిన ఆ తప్పుడు పనికి అందరినీ

అలాగే అనుకోవద్దు. వాళ్ళ లో చాలా మంది కూలీ పనులు చేసుకుంటూ, ఉల్లిపాయలు, పళ్ళు, కూరగాయలు లాంటివి అమ్ముకుంటూ నిజాయితీగా బ్రతుకుతున్నారు. వాళ్ళు కూడా చక్కగా చదువుకుంటున్నారు. మన ఊరిలో డాక్టర్ సుశీల లంబాడీ ఆవిడే అని నీకూ తెలుసు కదా? తుకారాం చదువుకుంటూ, కుటుంబానికి అండగా వుంటున్నాడు. అలాంటి వారికి సహాయం చేస్తే పుణ్యం పురుషార్ధముంటుంది. ఈ విషయం లో నా మాటే ఫైనల్." అన్నాను. మా వాడికి కూడా కొంచెం కోపం వచ్చే వుంటుంది. " నువ్వు ఎప్పుడు మా మాట విన్నావనీ? అయినా ఇంకా టైం వుందిగా? చూద్దాం లే" అన్నాడు. నేను నవ్వి" ఒరేయ్ నాన్నా, నీ చిన్నకొడుకు ఇంటర్ కూడా పూర్తి చేయలేదు. కాస్త బజారుకు వెళ్ళి ఏదైనా తేరా బాబూ అంటే వింటున్నాడా? బండి లేకుండా బయటికి వెళ్ళడం నామోషీ వాడికి. " ఇలాగ నన్ను చిన్న చిన్న వాటికి బజారుకు పంపించవద్దు" అని ముఖం మీదే అంటాడు. మీ ఆవిడా, నువ్వూ కూడా వాడికి చెప్పరు. నేను ఏదైనా అంటే కోపం. తుకారాం డిగ్రీ చేస్తున్నాడు. అయినా ఎంత వినయం,విధేయత వున్నాయో? అలాంటి వారిని కేవలం కులం కారణంగా దూరం పెట్టకూడదు నాన్నా" అని నచ్చ చెప్పాను. మా వాడు చిన్నగా నవ్వి" చూద్దాం అని చెప్పాను కదమ్మా?" అన్నాడు. నేనూ తృప్తిగా నవ్వుకొన్నాను.

★ ★ ★

ఉదయమే వీధిలో ఏదో గొడవ పెద్దగా వినిపించింది. " ఏమిటా?" అని బాల్కనీ లోకెళ్ళి చూసాను. రోజూ లాగే తుకారాం బండి చుట్టూ జనం మూగి వున్నారు. అయితే కూరగాయలు కొంటూ కాదు. గట్టిగట్టిగా అరుస్తూ వున్నారు. విమల భర్త కూడా వున్నాడు అక్కడ. ఎవరు ఏం మాట్లాడుతున్నారో సరిగ్గా అర్థం కాలేదు. విమల భర్త తుకారాం చొక్కా కాలర్ పట్టుకొని" నువ్వు గాకపోతే ఎవ్వడు కాజేస్తాడు రా రాస్కెల్?" అంటూ చెంప చెళ్ళుమనిపించడం చూసి , నేను కంగారుగా క్రిందికి పరిగెత్తాను. నేను వయసులోనూ, అనుభవం లోనూ పెద్ద దానిని కావడం వల్లా, అక్కడ ఎన్నో ఏళ్ల నుండీ వుంటున్నందు వల్లా నేమో అందరూ నా మాటకు విలువ ఇస్తారు.

"ఆగం డి., అసలు ఏమైంది? ఎందుకు ఆ అబ్బాయి పైన చేయి చేసుకొంటున్నారు?"

అడిగాను. " ఆంటీ, వీడు నా ఉంగరం కాజేసాడు." అని పిర్యాదు చేసింది విమల.

నేను తెల్ల బోయాను." ఎలా? మీ ఇంట్లోకి ఎప్పుడు వచ్చాడు?" అన్నాను." నిన్న ఉదయం కూరగాయలు తీసుకోవడానికి వచ్చినప్పుడు నా చేతికి ఉంగరం వుంది. తరువాత లేదు. వీడి బండిలోనే పడి వుంటుంది. ఇక్కడే అన్నీ అమ్ముడు పోయాయి. ఖచ్చితంగా ఆ ఉంగరం వీడి కె దొరికి వుంటుంది. అది చాలా ఖరీదైనది ఆంటీ. మొన్నీ మధ్యే నా పుట్టిన రోజు నాడు మా ఆయన గిఫ్ట్ గా ఇచ్చారు" అన్నది విమల ఏడుపు గొంతు తో. " మీ ఇంట్లో చూసుకున్నావా?" అడిగాను నేను." ఆ, మొత్తం వెతికాం ఆంటీ, మేము బయటికి ఎక్కడికీ వెళ్ళలేదు. ఈ వెధవ నే తీసాడు. అనుమానం లేదు." అన్నాడు విమల భర్త.

"అని ఎలా చెప్పగలరు బాబూ? ఇల్లంతా మరోసారి వెతకండి. నిరాధార ఆరోపణలు చేయవద్దు. " అని తుకారాం వైపు చూసాను. పాలిపోయిన ముఖం తో దీనంగా చూస్తున్నాడు. " నేను దొంగను కాను సార్. నాకు ఏం తెలియదు. ఆ రింగ్ అస్సలు నేను చూడనే లేదు" అన్నాడు .

"అన్నీ దొంగ మాటలు. నువ్వు గాకపోతె ఇంకెవరికి అవకాశం ఉంది? తను ఎక్కడికీ వెళ్ళలేదు. ఇట్లోనుండి నాలుగడుగులు వేసి, నీ బండి దగ్గిర కే వచ్చింది. ఇంటి ముందూ, ఇంట్లో అంతా వెతికినా దొరుకలేదంటే, ఎక్కడ పోయినట్లు?" గుంపు లో ఎవరో లా పాయింట్ ఎత్తారు.

"అవును కదా? ఖచ్చితంగా నీకే దొరికి వుంటుంది. కావాలంటే ఒక వెయ్యి రూపాయలు ఇస్తాం లే. మా ఉంగరం మాకు ఇవ్వరా బాబూ" కొంచెం బతిమాలుతూ అన్నది విమల." ఏంటీ, ఈ దొంగ వెధవకి వెయ్యి రూపాయలు ఇవ్వాలా? నాలుగు తగిలించి , పోలీసులకు ఒప్పగించాలి" అంటూ మళ్ళీ

చేయి ఎత్తాడు విమల భర్త. నేను వెంటనే కలుగ చేసుకొని " ఆగు బాబూ, ఇది పద్ధతి కాదు. కావాలంటే కంప్లైంట్ చేసుకోండి. దానికీ రుజువులు, సాక్ష్యాలు కావాలి. అనవసరంగా కొట్టడం తప్పు" అన్నాను.

" మేడం, మీరు కూడా నన్ను దొంగ అనుకుంటున్నారా?" దాదాపు ఏడుస్తూనే అడిగాడు తుకారాం. నా మనసు చివుక్కుమంది." లేదు బాబూ, కానీ వారి వాదన లో కూడా కొంత నిజం వుంది కదా? అనీ" ఇంకేం మాట్లాడాలో తెలియక మధ్య లోనే ఆపేసాను." లేదు మేడం, నిజంగా ఆ ఉంగరం నాకు దొరుకలేదు. దొరికితే నేను దాచుకొంటానా? ఎన్ని సార్లు మీలో ఎవరో ఒకరు పొరపాటున డబ్బులు ఎక్కువ ఇస్తే తిరిగి ఇచ్చాను? నేను దొంగను కాను మేడం" కన్నీళ్ళు నింపుకొం టూ అన్నాడు తుకారాం." చాలు చాల్లే, నీ దొంగ ఏడుపులు, మళ్ళీ మా వీధిలో కనిపిస్తే కాళ్ళు విరగ్గొడుతాను. పో ఇక్కడినుండి." అంటూ బండిని ఒక్క తోపు తోశాడు విమల భర్త. అందరూ ఆశ్చర్యంగా చూసారు. ఇంత తొందరగా అతడు తుకారాం ను వదిలేయడం అందరికీ వింతగా వుంది. నేను చెప్పిన మాట అతడికి అర్థం అయింది అని గ్రహించాను. రుజువులు సాక్ష్యాలు ఎక్కడినుండి తే వాలి ? అనుకున్నాడేమో తుకారాం ను వదిలేసాడు. " అదేంటీ? వాడిని పోలీసులకు పట్టివ్వరా? "అన్నది విమల.

"అవును కదా? " చుట్టూ వున్న వాళ్ళు వంత పాడారు. " ఎవడి పాపాన వాడే పోతాడు లే. చేసిన నిర్వాకం చాలు గానీ ఇక లోపలికి పద" అంటూ భార్యను లోపలికి తీసుకొని వెళ్ళాడు అతడు. తుకారాం నా వైపే జాలిగా చూస్తూ ముందుకు సాగాడు. మూగదానిలా చూస్తూ నిలబడి పోయాను. అంతా తలా ఒక మాట అనుకొంటూ ఎవరి దారిన వాళ్ళు వెళ్ళి పోయారు. వీళ్ళే అంతకు ముందు " భలే చవకగా, తాజా కూరగాయలు దొరుకుతున్నాయి. ఈ అబ్బాయి రావడం మన అదృష్టం " అన్నారు. ఎదుటి వాడి బాధ ను చూసి సంతోషించే శాడిజం కొందరికి అలవాటు.

"వాడిని పోలీసులకు అప్పగిస్తే బాగుండేది." అనే మాట విని నిట్టూర్చాను.

"ఆ ఆపద రాకుండా అయితే అడ్డుకోగలిగాను. కానీ నిజం ఎలా తెలియాలి? నాకు తెలిసి తుకారాం అలా చేసి వుండడు."అనుకొంటూ ఇంటికి వెళ్ళాను. కోడలి ద్వారా విషయం విన్న మా వాడు" నేను చెప్పానా, లేదా? ఇంకనన్నా జాగ్రత్తగా ఉండండి. ఇలాగ కూరగాయలని, ఉల్లిపాయలు అనీ తిరుగుతూ రెక్కీ నిర్వహిస్తారు ముందు. ఆ తరువాత సమయం చూసి దోపిడీకి దిగుతారు. అమ్మా, నువ్వు బయటికి వెళ్ళేప్పుడు అన్ని నగలు వేసుకో వద్దు. అలాగే మెడచుట్టూ చీర కప్పుకుని వెళ్ళాలి. నువ్వు ఎవరి మాట వినవు కదా?" అంటూ వ్యాఖ్యానించాడు. నేను ఏమీ జవాబు చెప్పలేదు. నిశబ్దంగా చూస్తూ కూర్చున్నాను. నా మనో నేత్రానికి పదేపదే తుకారాం దీనమైన ముఖం, " నేను దొంగను కాను"అనే అతడి ఆక్రోశం కనిపిస్తోంది. రోజంతా అన్యమనస్కంగా నే వున్నాను. అన్నం కూడా సహించ లేదు.

వారం రోజులు గడిచాయి. మళ్ళీ ఫ్రిజ్ లో కూరగాయలు తప్పడం లేదు. తుకారాం కనబడడం లేదు." కూరగాయలు అమ్మా. సబ్జీ లేలో అమ్మా సబ్జి" అనే మాటే చుట్టు పక్కల అస్సలు వినబడడం లేదు. అందరూ " నిజంగానే విమల ఉంగరం పోయిందా?" అనే సందేహం లో పడినట్లు నా కోడలు చెప్పింది." తాజా కూరలు ఇంటిముందుకే తెచ్చేవాడు. అనవసరంగా ఆ పిల్లాడిని కొట్టి, తరిమేశారు. ఒక్కరు చేసిన తప్పుకు అందరం నష్ట పోవాల్సి వచ్చింది కదా" అని కూడా బాహాటంగానే అనుకుంటున్నారట. ఇవన్నీ విన్నాక నాకు ఎలాగైనా ఆ అబ్బాయిని కలిసి మాట్లాడాలి అనిపించింది. వెంటనే చెప్పులు వేసుకొని బయల్దేరాను. కాలినడకనే కొంచెం దూరంగా వున్న నది ఒడ్డున గుడిసెల వైపు వెళ్ళాను. తుకారాం గురించి వాకబు చేయగా , ఆ కుటుంబం అంతా వేరే వూరికి వెళ్ళారనీ, వాళ్ళ ఇంటికి తాళం వేసి ఉంది అనీ తెలిసింది. ఆ గుడిసె ను బయటి నుండే చూసాను. రెండు గదులుగా విభజించినట్లు వుంది. శుభ్రంగా కూడా వుంది. చుట్టూ కొన్ని పూల మొక్కలు,

కూరగాయల పాదులు వున్నాయి. తలుపుసందుగుండా చూస్తే సామాను పొందిగ్గా సర్ది వుంచు కొన్న తీరు నచ్చింది. " అంటే మొత్తానికి వెళ్ళ లేదు. మళ్ళీ వస్తారు." అనుకొని మెల్లగా వెనుదిరిగాను. రోజులు గడుస్తున్నాయి ....

నేనే స్వయంగా మళ్ళీ తుకారాం ఇంటివైపు వెళ్ళాను. అయితే ఆ ఇల్లు యథాప్రకారం మూసి వుంది. అయితే చుట్టూ వున్న మొక్కలూ, పాదులు పచ్చగా ,ఏపుగా కళకళాడుతూ వున్నాయి. ఇదెలా సాధ్యం?

అనుకొని పక్క ఇంటి వారిని అడిగాను. "వాళ్ళు అందరూ ఎవరి పనికి వాళ్ళు పొద్దునే ఎల్లి పోయి, సందకాడకు తిరిగి వస్తారు"అని చెప్పారు. " తుకారాం వాళ్ళ అమ్మ ఇంట్లోనే వుంటుంది అని విన్నానే?" అడిగాను. " ఇంతకు ముందు ఇంట్లనే వుండేది. ఈ నడుమ మొగుడితో పాటు తను కూడా ఏళ్తాంది." అని సమాచారం అందించారు వాళ్ళు. " ఇంక తుకారాం ను ఎలా పట్టుకోవడం?" అని బాధగా అనుకొన్నాను. నిస్పృహ గా వెనుదిరిగాను.

మరో రెండు రోజులు గడిచాయి. నేను మార్కెట్ ఏరియా కు వెళ్ళాను పని వుండి. అక్కడ అనుకోకుండా తుకారాం కూరగాయలు బేరం చేస్తూ కనిపించాడు. నేను ఆనందం పట్ట లేక పోయాను. టోకు న కూరగాయలు కొని బండి మీద చేరుస్తున్నాడు." తుకారాం" అని సంతోషంగా పిలిచాను. ఉలిక్కి పడి తలెత్తి చూసాడు తుకారాం. " మేడం మీరా?" అని అడిగాడు సంభ్రమంగా." అవును బాబూ, రెండు సార్లు మీ ఇంటి వైపు వచ్చాను. నువ్వు కనపడలేదు. మీ వాళ్ళూ కనిపించలేదు" అన్నాను నిష్టూరంగా.

" మా పక్కింటి వాళ్ళు" మీ కోసం ఎవరో ఒక పెద్దావిడ వచ్చింది, " అని చెప్పారు మేడం.

కానీ మీరు అని ఊహించలేదు." అన్నాడు తుకారాం. " మా కాలనీ వైపు రావడమే మానేసావు కదా? నా పైన ఇంకా కోపం గానే వుందా?" అన్నాను కించిత్ బాధగా.

"అయ్యో మేడం , అలా అనకండి. ఆ రోజు మీ వల్లే నన్ను వదిలేసారు. లేకపోతే ఇప్పటికీ జైలు లోనే వుండేవాడిని. ఎలా రమ్మంటారు మేడం, నన్ను దొంగ అని నింద వేసి కొట్టి తరిమేశారు కదా?" అన్నాడు తుకారాం." ఇప్పుడు నువ్వు దొంగ కాదని అందరికీ తెలిసి పోయింది బాబూ. మా ఔట్ హౌస్ రెండు మూడు రోజుల్లో ఖాళీ అవుతుంది. నీ కుటుంబం అంతా వచ్చేసేయండి. నీకు ఇల్లిల్లూ తిరుగుతూ కూరగాయలు అమ్మే కష్టం లేకుండా ఇంటి ముందే చిన్న కొట్టు పెట్టుకోవచ్చు. మీ నాన్న వాచ్ మన్ గా ఇల్లు చూసుకొంటే చాలు. నెలకు పది వేల రూపాయలు జీతం కూడా వుంటుంది. మీ అమ్మ హాయిగా ఇంట్లోనే వుండవచ్చు."

ఏకబిగిన చెప్పాను." ఇదంతా నిజమేనా మేడం? ఆ రోజు మా నాన్నకు చెప్పితే సంతోషంగా సరే అన్నాడు. అది మీకు చెప్దామని చూస్తే, అంత గొడవ జరిగింది. ఇంతకీ ఉంగరం ఎక్కడ దొరికింది?" అనందాశ్చర్యాలతో అడిగాడు తుకారాం.

"అది వాళ్ళింట్లో నే బీరువాలో దొరికింది. తప్పు చేశామన్న బాధ వాళ్ళకే కాదు, మొత్తం కాలనీ వాళ్ళు అందరికీ వుంది. నువ్వు ఎప్పటి లాగే అక్కడ నీ వ్యాపారం చేసుకోవచ్చు తుకారాం. జరిగింది మరచిపో" అనునయంగా అన్నాను.

"మేడం, అడక్కుండానే ఇన్ని వరాలు ఇస్తానంటే ఎలా కాదు అంటాను? మీరు మాకు దేవత తో సమానం" అన్నాడు తుకారాం. " అస్సలు భాషే రాదు అనుకొంటే కవిత్వం కూడా చెప్తున్నవే? రెండు రోజుల్లో అన్నీ సర్దుకొని వచ్చేయండి. అందరం ఎదురు చూస్తూ వుంటాం" అన్నాను నేను. " అలాగే మేడం," వినయంగా అన్నాడు తుకారాం.

నాకు ఎవరెస్ట్ ఎక్కినంత ఆనందం కలిగింది. సంతోషంగా ఆటో ఎక్కాను.

# స్వార్థమే సౌఖ్యం



- డా. బండారి సుజాత
చరవాణి: 9959771228

"నమస్తే అండి" అన్నది లహరి.

కూర్చోమన్నాడతను.

'అమ్మ' ఆశ్రమానికి వెళ్లిన లహరి "నిన్న ఆశ్రమంలోని వాళ్ళను యూట్యూబ్ లో చూపించారు అందులో ఒకరు మా అమ్మ లాగే వుంది. ఆమె మా అమ్మేనేమో అనుకుంటున్నాను ఒకసారి చూపించగలరా! ఇదిగో ఇది మా అమ్మ ఫోటో, ఇప్పుడు గుర్తు పట్టలేకుండా ఉన్నది. మా అమ్మ పేరు శ్రీలక్ష్మి" అన్నది లహరి.

ఆఫీస్ రూము ముందు కూర్చొని రికార్డు రాస్తున్న అతన్నడగగానే,

"ఆమె మీకేమవుతుందన్నాడు" అతను.

"ఆమెను నిన్న యూట్యూబ్లో చూశాను ఆమె మా అమ్మలా ఉంది. మా అమ్మే అనుకుంటున్నాను "అన్నది లహరి.

"అవును ఆమెను ఎవరు చేర్పించారన్నాడతడు."

"తెలియదు" అన్నది లహరి.

"ఆమె కనపడకుండా పోయి చాలా సంవత్సరాలైంది అన్నది లహరి.

"ఇక్కడ ఉన్నదని మీకెలా తెలిసింది" అన్నాడు అతను.

"అదే చెబతున్నానుకదా ! మీ ఆశ్రమాన్ని ఇక్కడున్న వాళ్ళను యూట్యూబ్ లోచూపెడుతుంటే చూశాను. ఆమె మా అమ్మే నని అనుకొని చూడ్డానికి వచ్చాను "అన్నది లహరి.

"మీ పేరు రాసి ఇక్కడ సంతకం పెట్టండి "అన్నాడు అతను.

"సంతకం చేసిన ఆమెను హోమ్ లో ఆయాను పిలిచి అమ్మ దగ్గరకు తీసుకువెళ్లమన్నాడు" అతడు.

వివరాలడిగి ఆ పోలికలతోవున్న ఆమెను పిలిపించింది ఆయమ్మతో మేనేజర్ వాసంతి.

ఎముకల గూడులా, లోతుకుపోయిన కళ్ళతో తైల సంస్కారం లేకుండా వున్న ఆమెను చూడగానే లహరికి దుఃఖం ముంచుకొచ్చింది. ఆమె కుడి చెంపమీది పుట్టుమచ్చ ఆమెతన అమ్మే అని గుర్తుపట్టి అమ్మా! అంటూ చుట్టూ చుట్టేసుకొని బావురుమని ఏడ్చింది లహరి.

"నిర్వికారంగా చూస్తున్నదికానిఎందుకు ఏడుస్తున్నావని అడిగలేదామె. తన తల్లితనను గుర్తు పట్టలేదు అని అర్థమైంది లహరికి. అమ్మ ఎలా ఉండేది ఎలా అయిపోయింది అనుకుని బాధపడింది లహరి.

"అవునమ్మా !మీ అమ్మే నా గుర్తుపట్టావా ! అన్నది ఆయమ్మ.

"మా అమ్మేనమ్మా ! మా చిన్నప్పుడు అమ్మకు ఆక్సిడెంట్ లో తలకు గాయమైయింది. ఇంట్లో నుండి వెళ్లిపోయింది. మా నాన్న పోలీస్ రిపోర్ట్ ఇచ్చాడు. ఎక్కడెక్కడో వెతికించాడు కానీ మా అమ్మ ఎక్కడ కనపడలేదు. ఏమైందో తెలియదు ఇప్పుడు ఇలా చూస్తాననుకోలేదు" అన్నది లహరి.

వాళ్ళు మాట్లాడుకుంటుంటే తనకు అవసరం లేదన్నట్టు కూర్చున్నది శ్రీలక్ష్మి. మీకు ఎవరు చెప్పారు.

అదే, నిన్న మీ ఆశ్రమాన్ని యూట్యూబ్లో చూపెడుతుంటే చూశాను. మా అమ్మ లాగా ఉన్నది అనుకోన్నాను.మా అమ్మ వెళ్ళిపోయినప్పుడు నేను ఏడవ తరగతిలో ఉన్నాను. మా అన్నయ్య పదవ తరగతిలో ఉన్నాడన్నది" లహరి.

మరి మీ అమ్మను తీసుకెళ్తావా ? అన్నదాయమ్మ. లహరి మా అమ్మ నన్ను గుర్తు పట్టలేదు. డాక్టర్ ను అడిగి తెలుసుకున్న తర్వాత ఆలోచిస్తాను "అన్నది లహరి.

సరే !అమ్మను నువ్వు లోపలికి తీసుకు వెళ్ళమని, తను తెచ్చిన పండ్లు తినుబండాలరాలూ ఆఫీసులో ఇచ్చింది లహరి.

లహరి డాక్టర్ను కలిసింది. ఆవిడ మీ అమ్మని ఎట్లా అనుకుంటున్నావన్నది డాక్టరు. ఆమెతెచ్చిన ఫోటో చూపెట్టింది.

మా అమ్మ బాగుంటుందండి. ఇప్పుడు ఇలా ఉంది మా అమ్మకు కుడి బుగ్గపై పై పుట్టుమచ్చ కూడా ఉంటుంది.

"చాలామంది కాటుక పెట్టుకున్నావులే శ్రీ లక్ష్మీ అని నవ్వే వాళ్ళు" అన్నది లహరి.

"చూడమ్మా ! ఆమెను తీసుకెళ్దాం అనుకుంటున్నావా?" అన్నది డాక్టర్ సుహాసిని.

"లేదండి నిన్న యూట్యూబ్లో చూడగానే మా అమ్మేనా, కాదా అని తెలుసుకుందామని వచ్చాను. ఆమె మా అమ్మే కానీ నన్ను గుర్తుపట్టే స్థితిలో లేదు నాకు అన్నయ్య కూడా ఉన్నాడు. వాడికి చెప్పి మళ్ళీ వస్తానన్నది" లహరి.

"ఆమెకు బ్రెయిన్ లోపల బ్లడ్ క్లాటయింది. ఇప్పుడు ఇప్పుడే బాగుపడుతుందనుకోను ట్రీట్మెంట్ ఇస్తున్నాము .పిచ్చిగా చూస్తూ ఏవేవో మాట్లాడేది తన గురించి తాను పట్టించుకోకపోయేది కొంచెం తన పని తాను చేసుకుంటున్నది ఇప్పుడు ఎవరైనా అరుస్తే దూరంగా వెళుతున్నది అంటే కొంచెం అవగాహన అవుతున్నది అన్నది" డాక్టర్ సుహాసిని.

"ఆమె ఎప్పుడు బాగుపడుతుందో నేను మాత్రం చెప్పలేనన్నది డాక్టర్. ఆమెకు తన వాళ్ళు ఉన్నారన్న స్పృహ కూడా లేదు. ఆమెను ఇక్కడకు తీసుకువచ్చి దాదాపు పది సంవత్సరాలైంది" అన్నది డాక్టర్.

"మేడం ఇప్పుడు మా నాన్న కూడా చనిపోయాడు నాకు పెళ్లయింది ఒక బాబు. మా అన్నయ్యకు పెళ్లయింది. వాడికి ఒక కూతురు. ఈ విషయం మా అన్నయ్యకు తెలుసో లేదో నేను వెళ్లి చెప్పి ఇద్దరం కలిసి వస్తాం అన్నది లహరి చూడగానే అమ్మను గుర్తుపట్టి ఆగలేక ఇంట్లోకి ఎవరికి చెప్పకుండా వచ్చింది కానీ అమ్మను తీసుకువస్తానంటే ఊరుకుంటారా! అనుకున్నది. ఎప్పుడో పెళ్లి చేసి అవతలపడ్డాడు మీ నాన్న ఓ అచ్చట ముచ్చట లేదు అని ఇప్పటికీ ఏదో ఒక మాటలంటూ మెటికలు విరుస్తూనే ఉంటది అత్తగారు. అన్నయ్య అసలు పట్టించుకోడు వాడు బతుకు వాడు బతుకుతున్నాడు. ఏం చేయాలా అని ఆలోచిస్తూ అన్నయ్యను కలిసిన తర్వాత ఏదో ఒకటి ఆలోచించుదాం అనుకుంటుంటే అమ్మ జ్ఞాపకాలు చుట్టూ ముట్టాయి.

అమ్మ, నాన్న నేను అన్నయ్య అందరం కలిసుంటే అంతబాగుండేదో ,అప్పుడప్పుడే ఊహ తెలుస్తున్నప్పుడే అమ్మ దూరమైంది.

అన్యమనస్కంగా ఉన్న లహరిని ఏమైంది అంటూ అడిగిన భర్త కిరణ్ తో జరిగిన విషయం చెప్పింది.

"లహరి మీ అమ్మ చనిపోయిందన్నారుకదా!" అన్నాడు కిరణ్. "అవును అప్పటికి చాలా సంవత్సరాల నుంచి దొరకలేదు, కనుక ఇంకా చనిపోయిందనుకున్నాడు మా నాన్న. అందరికీ అలాగే చెప్పాడు అమ్మ ఎక్కడుందో, ఎమైందో తెలియదు అందరిలో అనుమానాలు పెంచడం ఇష్టంలేక అలా చెప్పాడన్నది" లహరి.

మా నాన్న నరేష్, అమ్మ శ్రీలక్ష్మి. వారిదిప్రేమ వివాహం. అటు ఇటు పెద్ద లెవరూ ఆశీర్వదించలేదు. అమ్మ ప్రైవేట్ స్కూల్లో టీచర్ పనిచేసేది. నాన్న ఏదో షాపులో పనిచేసేవాడు కలిమి లేదు కానీ ఇద్దరు అన్యోన్యంగా ఉండేవాళ్ళు.

అన్నయ్య పుట్టే వరకు నాన్న చిన్న చిన్న వ్యాపారం మొదలుపెట్టాడు అది అభివృద్ధి కాగానే మంచి బతుకులూ మొదలయ్యాయి. తర్వాత నేను పుట్టిన తర్వాత వ్యాపారం అభివృద్ధి చెందిందట. అంతా లహరి అదృష్టం అనేవాళ్లు.

అమ్మ నాన్న ఇది పుట్టింది అన్ని కలిసొచ్చాయనేవారు. అలా మంచి ఇల్లు అన్ని హంగులు సమకూర్చాడు నాన్న. అమ్మ అదే స్కూల్లో హెడ్మాస్టరైంది. స్కూల్లో అందరికీ అమ్మంటే ఇష్టం తను ఎవరిని నొప్పించకుండాపనులు చేయించేది.

మేము అదే స్కూల్లో చదివే వాళ్ళం కనుక మేమంటే అందరికీ ఇష్టం. స్కూల్లో అందరూ బాగా చూసేవారు. ఒక రోజు మేము స్కూల్లో ఉండగా ఏదో పని ఉందని నాన్న వచ్చి అమ్మని తీసుకెళ్లాడు. ఇద్దరు బండి మీద వెళుతుంటే ఆక్సిడెంట్ అయింది. నాన్నకు హెల్మెట్ ఉండటంతో దెబ్బలతో తప్పించుకున్నాడు. అమ్మ వెనక్కి పడిపోవటంతో తలకు దెబ్బ తగిలింది. హాస్పిటల్ లో చేర్పించాడు. ట్రీట్మెంట్ ఇప్పించాం. ఇంటికి తీసుకొచ్చుకున్న అమ్మను నాన్న చాలా జగ్రత్తగా చూసుకునేవాడు వారం వారం హాస్పిటల్ కి తీసుకు వెళ్లేవాడు. పరిక్షలు దగ్గరకు వస్తున్నాయి.

నాకు, అన్నయ్యకూ అన్ని "నాన్నే" అయ్యాడు. ఒకరోజు సాయంకాలం మేమిద్దరం గదిలో చదువుకుంటున్నాం అమ్మ ఇష్టంగా పెంచుకున్న మొక్కలలో అమ్మను కూర్చోబెట్టి ఇంట్లోకి వచ్చాడునాన్న. కాఫీ కలుపుకొని తీసుకొస్తానని లోపలికి వచ్చాడు. నాన్న కాఫీ కలిపి పట్టుకుని వెళ్లే వరకుఅమ్మలేదు. నాన్న లక్ష్మీ, లక్ష్మీ అని అరుస్తుంటే మేము బయటకు పరిగెత్తుకొచ్చాం. మమ్మల్ని చరో వైపు వెతుకుమని పంపాడు. నాన్న కూడా వెతికాడు. అమ్మ ఎక్కడ కనపడలేదు. పోలీస్ స్టేషన్లో కంప్లైంట్ ఇచ్చాం. వెతకని చోటంటు లేదు. ఇదే ఇప్పుడు చూడటం. ఏమైందో ఏమో ! ఇప్పుడిలా కనపడిందని

ఏడుస్తుంటే ఓదార్చాడు కిరణ్.

రేపు మా అన్నయ్య దగ్గరికి వెళ్దామండి అన్నది లహరి. అన్నయ్యకు కూడా ఈ విషయం చెప్పి మంచి డాక్టర్కు చూపిస్తే బాగుపడుతుందేమో అన్నది లహరి. సరే అలాగే వెళ్దాం కానీ, మీ అమ్మ చనిపోయిందని చెప్పి ఇప్పుడు ఉందంటే ఎవరైనా నమ్ముతారా? దాదాపు పదిహేను సంవత్సరాల తర్వాత ఆశ్రమంలో ఉందంటే ఎవరు చేర్పించారు. ఇన్నాళ్లు ఎక్కడుంది? ఏమైంది? అనే దానికి ఎవరు సమాధానం చెప్తారు అన్నాడు కిరణ్.

"అంతే కాదు ఆమెను తీసుకొచ్చుకోవడానికి మా అమ్మా, నాన్న ఒప్పుకుంటారో లేదో. విషయం పెద్దది చేయడం నాకు ఇష్టం లేదని ఆమె మీ అమ్మే అనిపిస్తే మీ అన్నయ్యతో మాట్లాడుకుని నిర్ణయం తీసుకుందామన్నాడు" కిరణ్.

మర్నాడు వెళ్లిన లహరిని చూసి నువ్వు వస్తావని అనుకుంటున్నాను అన్నాడు ప్రకాష్. అదెలా అనిఅడిగింది లహరి .నేను కూడా యూట్యూబ్లో చూశాను మన అమ్మేనా అనిపించింది. కానీ అమ్మ అవునో కాదో అనుకున్నానన్నాడు ప్రకాష్. అవునన్నయ్యా! చూడగానే నేను వెళ్లాను అన్నది లహరి.

ఆమె మనఅమ్మే! అసలు ఆరోగ్యం బాగాలేదు.

బ్రెయిన్ లో బ్లడ్ క్లాటయిందని డాక్టరు చెప్పారు. ట్రీట్ మెంటు ఇస్తున్నారట అన్నది లహరి.

ఆడబిడ్డకు మర్యాదలుచేసింది సుమ. ప్రేక్షకుడిలా కూర్చున్నాడు లహరి భర్త కిరణ్.

"నువ్వేమనుకుంటున్నావు లహరి అని అడిగింది సుమ. నేను అమ్మని తీసుకువచ్చి మంచి ట్రీట్మెంట్ ఇప్పిస్తే త్వరగా కోలుకుంటుంది అనుకుంటున్నాను" అన్నది లహరి.

"ఇవే మాటలు మీ అన్నయ్య నిన్నటి నుండి అంటున్నాడు. అసలు మీ అమ్మను ఎవరైనా తీసుకపోకపోతే అంత తొందరగా ఎలా మాయమైపోతుంది? అసలు మతిస్థిమితం లేని మనిషి ఎక్కడికి పోతుంది? చనిపోయింది అనుకున్నామెను నువ్వు తీసుకొచ్చి నెత్తి మీద పెట్టుకోవడం నాకైతే ఇష్టం లేదు" అన్నదిసుమ.

"నేను అదే చెప్తున్నానమ్మా! సజావుగా సాగిపోయే బతుకుల్లో లేనిది ఒకటి తెచ్చిపెట్టుకొని అందరూ అనే మాటలు పడాల్సి వస్తుంది" అన్నాడు కిరణ్.

"అన్నయ్య నువ్వేమంటావు" అన్నది లహరి. "నేను అనేది ఏమీ లేదు. ఒకవేళ అమ్మే అయినా ఇంటికి తీసుకువచ్చి ఆమెను చూసుకునే ఓపిక, స్థితులు" నాకు లేవు.

"ట్రీట్మెంట్ ఇస్తున్నారు కదా ! ఒకవేళ బాగుపడి మనందరం గుర్తుకొస్తే అప్పుడు చూద్దాం" అన్నాడు ప్రకాష్ .

"అన్నయ్యా! అంటూ నాన్న ఎలాగూ లేరు లేదనుకున్న అమ్మ కనపడిన వద్దంటున్నావు" అని ఏడ్చింది లహరి.

"నువ్వు ఇంటికి తీసుకువచ్చిన మీ వాళ్ళు ఒప్పుకోరు. నేను తీసుకొచ్చిన నేను చూసుకోలేను ,మీ వదిన అసలు చూడనే చూడను అంటున్నది. అందుకే అక్కడే ఉంచి వేరే డాక్టర్ కు ఏమన్నా చూపించవచ్చంటే చూపించుదాం. అప్పుడప్పుడు వెళ్లి వద్దాం" అన్నాడు ప్రకాష్.

గుండెలవిసేలా ఏడుస్తున్న లహరి నీ దగ్గరికి తీసుకొని ఇంతకంటే మనం చేసేదేమిలేదురా! మతిస్థిమితం లేని మనిషిని కంటికి రెప్పలా కాపాడుకోవాలి. ఇప్పుడు మనమున్న పరిస్థితుల్లో అవి చేయలేం. వారానికి ఒక రోజు వెళ్లి అమ్మను చూసొద్దాం.

"ఆమెకు కావాల్సినవన్నీ తీసుకెల్దాం. అలా కలుస్తుంటే ఒకవేళ ఆమె బాగుపడిన తర్వాత ఆలోచిద్దాం" అన్నాడు కిరణ్.

"ఎక్కడ తీసుకొస్తా నని అంటుందేమోనని మనసులో భయపడుతున్న సుమకు ప్రాణం లేచి వచ్చినట్లైయింది.

"ఆమెను తీసుకొస్తే అమ్మా ,నాన్నలకు ఏం చెప్పాలి? ఎలాచెప్పాలి? చెబితే గొడవవుతుందనుకున్న కిరణ్ హాయిగా ఊపిరి" పీల్చుకున్నాడు.

'అమ్మను సుమ చూసుకోకపోతే తీసుకొచ్చి కష్ట పెట్టాల్సి వస్తుంది. అక్కడైనా వేలకి ఇంత తిండి దొరుకుద్ది ఇక్కడ ఆ పని చేయలేక బాధపడాలి. కష్టపెట్టాల్సి వస్తుంది. అందుకని అమ్మ అక్కడ ఉంటేనే మంచిదను కొని నిట్టూర్చాడు 'ప్రకాష్.

'ఇంతమంది వద్దంటున్నా తను తీసుకొస్తే జరగరానిది ఏదైనా జరిగితే బాధ్యత తనదే అవుతుంది. అత్తా, మామ ఒప్పుకోరు. కిరణ్ కు అమ్మను తీసుకురావడం అసలు ఇష్టం లేదనేదిఅర్థమైంది లహరికి.

'ప్రతిరోజు వెళ్ళి అమ్మను చూసుకుంటాను. ఆమెకు అందరం జ్ఞాపకం వచ్చే వరకు ఎదురు చూస్తాను. అమ్మను తీసుకువచ్చి అందరితో మాటలు పడలేననుకున్నది లహరి.

వ్యాసం

# దృశ్యచిత్రాల కూర్పే ఈ అక్షర నేత్రాలు..!!



నాంపల్లి సుజాత

9848059893

కవిత్వం అంటే.. కదిలించీ, కనిపించిన అంశాలనీ, అనుభూతులనీ మనలోకి ఒంపుకుని తిరిగి దానికి మనదైన తనాన్ని చేర్చి కూర్చి ఆవిష్కరించేదే..! అది ఓ నీటి చెలిమెలా, ఊటబావిలా పొంగుకువస్తే తప్పా మంచి కవిత్వం ఉదయించడం సాధ్యపడదు.

అనుకుంటాం కానీ, కవిత్వం ఎవరికీ బళ్ళున ఒక్కసారే పుట్టదు.. పుడుతూనే మన వెలుపట్టుకొని వెంట రాదు..అప్పుడో ఇప్పుడో చిన్నప్పుడో మనోఫలకంపై నాటుకున్న కవితాక్షర బీజాలు అననుకూల పరిస్థితుల్లో వెలికిరాక , తిరిగి ఏ ప్రేరణాశక్తి వల్లో,మరే అనుకూల పరిస్థితుల స్ఫూర్తి వల్లో చైతన్యమై తోడినకొద్దీ ఊరే మంచిల్ల చెలిమెలా నిరంతరాయంగా ఉబికి వస్తూనే ఉంటాయి కొందరికి..!

అలాంటి వర్ధమాన కవయిత్రి యన్. లహరి గారి కలం నుంచి జాలువారిన కవిత్వం “అక్షర నేత్రాలు” యాభై నాలుగు కవితలతో కూడిన ఈ కవితా సంపుటిని ఇటీవలే ఆవిష్కరించారు..!

ఈమె కవిత్వానికి కొత్త కాదు గానీ, పుస్తకాన్ని ఆవిష్కరించేందుకు మాత్రం తొలి అడుగులే..!

తను మొదటి పుస్తకంలోనే లోతైన భావాలతో మానవీయత పొంగిపొరలే మృదువైన శైలిలో కవితలని తీర్చిదిద్దారు, తన అనుభూతిలోకి వచ్చిన ఏ విషయాన్నీ వదలకుండా వాటిని ముడి సరుకుగా వాడుకొని ఆకట్టుకునేలా కవిత్వీకరించారు..

తన స్ఫూర్తిదాయకమైన కవితా వాక్యాల్లోంచి ఇలా చెబుతారు..

“శూన్యంగా ఉండడం కాదు,

అనంతంగా ఉండడం ఆకాశ లక్షణం,

చివరి మెట్టు చూసి భయపడితే,

పాదాల చెంతనే మిగిలిపోతాం

సాహసించి అడుగు వేస్తేనే శిఖరాగ్రం చేరుతామంటారు“

వ్యక్తిత్వ వికాసానికి తోడ్పడే భావ పరిమళం ఈ పుస్తకంలోని ప్రతి పేజీలో నుంచీ తోడుకోవచ్చు..!

పుస్తకాలను చదవడం ఓ జిజ్ఞాస, కొత్త విషయాన్ని నేర్చుకోవడం, తద్వారా మనల మనం తీర్చిదిద్దుకోవడమే ఇందలి అంతర్గత ప్రయోజన పరమావధి.

ఎవరి రచనా సాహిత్యాన్నయినా సరే చదువుతున్నప్పుడు అ కవి లేదా ఆ రచయత స్వీయ భావనలు దాంట్లో అంతర్లీనంగా పరోక్షంగానో ప్రత్యక్షంగానో కనబడుతూనే ఉంటాయి , వారి అంతర్గత భావాలను ఎక్కడో ఓ చోట వ్యాఖ్యానిస్తూ ప్రతిబింబిస్తారు..!

ఆత్మజ్ఞానం అనే కవితలో కవయిత్రి ఇలా అంటారు.

“మన గురించి మనం తెలుసుకోకుండా/ ప్రపంచాన్ని వడబోసి వ్యాఖ్యానిస్తారు, ముందు నిన్ను నువ్వు /చదివాకే అడుగు కదపాలి, అందుకే /జీవితం నేర్పే విలువైన పాఠాలని నేర్చుకుంటూ /నన్ను నేను తీర్చిదిద్దుకుంటూ సాగిపోయే బాటసారిని/ “ అంటూ..

అవును ముందు మన గురించి మనం తెలుసుకోకుండా ప్రపంచాన్ని, ఇతరులను ఎలా వ్యాఖ్యానించగలుగుతాం..!? ఇంట గెలిచాకే రచ్చ గెలవాలి..

ఈ యువ కవయిత్రి కూడా లింగ వివక్షతను, పురుషాధిక్య భావజాలాన్ని, స్త్రీల పట్ల చిన్నచూపు, అసమాన సమాజాన్ని నిరసించి, తన కలంతో సూటిగా ప్రశ్నిస్తారు..

"మగమహారాజు నంటూ /అహంకార అంధకారంలో విర్రవిగే వెర్రివాడా / మెదడుకు పట్టిన బూజును దులిపెయ్" అంటారు, పైగా ఓ మంచి ముగింపు తో కవితని పూరిస్తారు..

"స్త్రీ లేనిదే జీవం లేదు, స్త్రీ లేనిదే సృష్టి లేదు" అంటూ బల్లగుద్ది తేల్చేస్తారు..

అయినా ఎవరెన్ని రకాలుగా తలబాదుకొని మొత్తుకున్నా,దున్నపోతు మీద వాన పడ్డట్టే..ఎవరూ పట్టించుకోరు, ఇసుమంతన్న ఈ సమాజంలో మార్పు రాదు

కళ్ళు తెరిచిన్నుంచి,పోయేదాకా స్త్రీలు లింగ వివక్షను ఎదుర్కొంటూనే ఉన్నారు..!

కుల మతాల్లో మునిగిన నేటి సమాజంలో మనిషి అవస్థలను, ఒకరినొకరు దూషించుకుంటున్న విధానాలను ధనుమాడి ఎలా ఉండాలో తెలియజేస్తున్నారు..

"వృత్తులపరంగా కులమంటూ/ కత్తులు దూస్తూ మతం అంటూ /మనుషులు విడిపోతున్నారు/ కుల మతాలని కూకటి వేళ్ళతో /కూలదోలా లంటారు..! ఆ పని మన భారత రాజ్యాంగ నిర్మాత డా.అంబేద్కర్ చేసినప్పటికీ, ఇంకా ఇంకా మిగిలే ఉంది.. కుల మతాలు అనేవి అంతరించిపోవు గాని,వాటిని చూసే విధానంలో మార్పు రావాలి.. సర్వ మానవులు సమానమే నన్న విషయాన్ని గుర్తెరుగాలి..!

మనకు ప్రత్యర్థంటూ, శత్రువులంటూ ఎవరూ ఉండరు.. మన మాట, మన ముచ్చట, మన నడవడిక తోనే వాటిని ఆహ్వానించుకుంటాం..

"నీలో ఉన్న నువ్వే నీకు ప్రత్యర్థి, ప్రధాన శత్రువు / బరిలో నిలిచేది, ఓడేది,గెలిచేది నువ్వే / నిన్ను నువ్ మచ్చిక చేసుకో / అందరినీ కలుపుకొని సాగిపోయేదే జీవితం" అంటారు.. అనుభవాల లోతుల్లోంచి రాలిపడ్డ జ్ఞాన క్షేత్రాలే ఈ అక్షర నేత్రాలు.

ఇంకా ఈ పుస్తకంలో బుద్ధం శరణం గచ్చామి, యుద్ధం మిగిల్చిన శోకం,

దార్శనికుడు, ప్రాణదాతలు, మార్గదర్శి లాంటి గొప్ప కవితలు ఎన్నెన్నో ఉన్నాయి..!


ఈ గ్రంథం శ్రీమతి సుశీల నారాయణరెడ్డి ట్రస్ట్ వారి సౌజన్యంతో ప్రచురించబడింది..!

ఈ అక్షర నేత్రాలకు..ప్రఖ్యాత కవి, కేంద్ర సాహిత్య అవార్డు గ్రహీత డా.యన్.గోపి గారి 'లోచూపు' పేర ముందుమాట వ్రాసి పాఠక లోకానికి చిరంజీవి లహరిని పరిచయం చేసారు..కూరెళ్ల గారి పుస్తకముఖ చిత్రం సందర్భోచితంగా ఉంది..!

ఇలాంటి మరిన్ని రచనలతో నిరంతరం నిత్య నూతనంగా కవితా సాగు చేయాలని కవయిత్రి లహరిని అభినందిస్తూ..!!

పుస్తకం వెల.100/-

ప్రతులకు.. సంప్రదించాల్సిన నం. 9885535506



కథ

# మరో అమ్మ




వై. సుజాత ప్రసాద్

చరవాణి : 9963169653


"నాస్తి మాతృసమం దైవం

నాస్తి మాతృసమః పోజ్యో,

నాస్తి మాతృసమో బంధు

నాస్తి మాతృ సమో గురుః " –

అని దగ్గరలోని కస్తూరిభా వృద్ధాశ్రమం నుండి లీలగా ఈ శ్లోకం చెవులకు సోకుతుండగా,, (అమ్మతో సమానమైన పూజ్యులు గానీ, దైవంగానీ లేరు తల్లిని మించిన బంధువులుగానీ, గురువులు కానీ లేరు) (తల్లీ కన్పించే దేవత). ఘణ... ఘణ... మని ల్యాండ్ఫోన్ అదే పనిగా మ్రోగుతున్నా విన్పించనంత తన్మయత్వంతో వింటున్న నాకు పరుగున వెళ్ళి ఫోన్ అందుకున్న నాకు బాబు నుండి ఫోన్.

"అమ్మా! నాన్నగారి సంవత్సరీకం కూడా అయిపోయిందిగా... ఇప్పుడైనా మాతోపాటు వస్తావా అమ్మా...?"

"ఏంటమ్మా! ఏం మాట్లాడవు... ఇంకా దేని గురించి నీ ఆలోచన..?"

ఏం చెబుతుందోనని ఆత్రంగా తల్లి మొహంలోకి చూశాడు దామోదర్.

"ఇప్పటికిప్పుడంటే ఎలారా నాన్నా... పొలం కౌలు గురించి మాట్లాడాలి. ఉన్నపళంగా ఇల్లు వదిలివస్తే ఎలా... అనవసరమైనవి వదిలించి అవసరమైన సామానంతా ఓ గదిలో సర్ది మిగిలిన ఇల్లు ఎవరికైనా అద్దెకిస్తే... ఎవరో ఒకరు ఇల్లు కనిపెట్టుకుని ఉంటున్నారన్న ధైర్యం ఉంటుంది. ఇంత మొక్కలకు నీళ్ళు పోస్తూ.. ఇంట్లో దీపం వెలిగించే వారెవరైనా దొరుకుతారేమో చూస్తాను" మౌనంగా ఉన్న కోడలు వైపు చూస్తూ అంది.

సరే "ఆ పనులన్ని త్వరగా పూర్తయ్యేలా చూడమ్మా!... నాకు ఎక్కువ రోజులు లీవ్ పెట్టడానికి కూడా కుదరదు. మళ్ళీ వచ్చి నిన్ను తీసుకెళ్తాను" అన్నాడు.

"సర్లేరా, నువ్వంతగా చెప్పాలా. నీ దగ్గరికి కాక, నేనెక్కడికి పోతానురా చెప్పు" అంటూ మురిపెంగా కొడుకువైపు చూసింది ఆండాలమ్మ.

వెంకటయ్య, అండాళమ్మ దంపతులకు ఒక కొడుకు, కూతురు. ఉన్న కొద్దిపాటి పొలంతోపాటు మరికొంత కౌలుకు తీసుకొని ఎంతో కష్టనష్టాలకోర్చి కొడుకుని ఎం.టెక్, కూతుర్ని డిగ్రీవరకు చదివించారు. డిగ్రీ కాగానే కూతురి అందాన్ని చూసి దామోదర్ ఫ్రెండ్ సుధాకర్ ఇష్టపడి మరీ పెద్దలనొప్పించి పెళ్ళి చేసుకున్నాడు. దామోదరానికి మంచి జీతంతో ఇన్ఫోసిస్ కంపెనీలో ఉ ద్యోగం రాగానే ఓ ధనవంతుల సంబంధం వెతుక్కుంటూ వచ్చింది. అల్లుడికి, కొడుక్కి ఐదంకెల్లో జీతం రావటం, వాళ్ళు జీవితంలో బాగా సెటిలై పిల్లా పాపలతో సంతోషంగా గడపటం చూసి విధికి కన్ను కుట్టిందేమో! రోడ్డు ప్రమాదంలో తలకి బలంగా దెబ్బ తగలటంతో వెంకటయ్యను హాస్పిటల్ కి తీసుకెళ్ళేలోపు మరణించాడు. తనని ఒంటరిదాన్ని చేసి భర్త అంత హఠాత్తుగా దూరమవటాన్ని తట్టుకోలేకపోయింది ఆండాళమ్మ. కోలుకోవటానికి చాలాకాలం పట్టింది.

తల్లిని ఆ స్థితిలో చూసి తట్టుకోలేకపోయాడు దామోదర్, "ఒక్కదానివే ఇక్కడ ఎందుకమ్మా... మాతోపాటు వచ్చేయ్" అని ఎన్నోసార్లు బతిమిలాడాడు దామోదర్.

"ఇప్పుడు నాకెక్కడికి రావాలని లేదురా. నాన్న జ్ఞాపకాలతో నన్నిక్కడే ఉండనియ్యి. అంతగా అయితే కొద్దిరోజులాగాక చూద్దాంలే" అంది. ఆ తర్వాత "సంవత్సరీకం కానీయ్" అంది. అందుకనే సంవత్సరీకం కాగానే తల్లిని తనతో తీసుకెళ్ళాలని అడిగాడు.

ఇంతలో దాక్షాయణి కలుగజేసుకుని.. అమ్మా

అన్నయ్యతో చెన్నై వెళ్ళావంటే మళ్ళీ ఎప్పుడొస్తావో ఏమో.... నాన్న ఉన్నపుడు ఇద్దరు కలిసిరావడమే, నువ్వు మా యింటికి వచ్చి కూడా చాన్నాళ్ళు అవుతుందమ్మా.. పిల్లలు నిన్ను మరీ మరీ గుర్తుచేస్తున్నారు. ఓసారి రామ్మా! మా యింటికి" అంటూ ఫోన్ చేసింది కూతురు దాక్షాయణి. దాక్షాయణి ఫోన్ చేసి పదేపదే అడగటంతో ఓ మంచిరోజు చూసుకొని తెలిసినవాళ్ళు హైదరాబాద్ వెళ్తుంటే వాళ్ళతోపాటు బయలుదేరింది ఆండాళమ్మా. అల్లుడు స్టేషన్ కి వచ్చి ఇంటికి తీసుకెళ్ళాడు.

"బాగున్నారా వదినగారూ...?" అంటూ పలకరించిన వియ్యపురాలు యశోదమ్మని చూసి విస్తుపోయింది ఆండాళమ్మ.

"నిండుగా పుష్టిగా ఉండే యశోదమ్మగారేనా ఇంతలా చిక్కిపోయారు. ఎలా ఉండే ఆమె ఇలా అయ్యారేంటి" అనుకుంటూ "బాగున్నాను వదినగారూ... మీరు బాగున్నారా" అన్నయ్య పోయిన దిగులుతో మీరు చాలా చిక్కిపోయినట్లున్నారు అంటూ పలకరించింది. "అమ్మమ్మా..." అంటూ పరుగున వచ్చిన మనవడిని, మనవరాలినీ చూసి ఉండడర్రా,,, మా బంగారాలు రాత్రంతా ప్రయాణం చేసి వచ్చానుకదా! స్నానం చేసి వస్తాను" అంటూ బ్యాగ్ తీసుకొని లోపలికి వెళ్ళింది.

స్నానం చేసి పిల్లలతో కబుర్లు చెబుతూ టిఫిన్ తిని, కాఫీ తాగుతూ యశోదమ్మనే గమనించసాగింది. ఇల్లు ఊడ్చి తుడవటం, వాషింగ్ మిషన్ లో బట్టలు వెయ్యటం, కూరలు తరిగి వంటచేయటం, అంట్లన్నీ తోమి తుడిచి సర్దిపెట్టటం దగ్గర్నుండే అన్ని పనులూ చేస్తున్న యశోదమ్మని చూసి "అదేమిటి వదినగారూ... ఈ పనులన్నీ మీరు చేస్తున్నారు. పనిమనిషి దొరకటం లేదా?" ఆశ్చర్యంగా అడిగింది ఆండాళమ్మ.

"లేదమ్మా.. మానేసింది" అంది దాక్షాయణి.

కూతురి సమాధానం విని "ఎందుకు మానేసింది? ఎన్నో ఏళ్ళుగా సొంతమనిషిలా నమ్మకంగా పనిచేస్తుంది కదా!" అంది. "ఒంట్లో బాగుండటం లేదని రెండేళ్ళనుండి రావటం లేదు".

"మరి ఇంకెవరినైనా పనికి పెట్టుకోలేకపోయావా అమ్మా... ఏదో ఒకరోజో రెండ్రోజులో అయితే ఎలాగో చేసుకోవచ్చుగానీ, రోజూ ఇంట్లో పనంతా చెయ్యాలంటే మాటలా... అందులోనూ మీ ఇ చాల పెద్దది. పైగా ఇంటిచుట్టూ మొక్కలు కూడా పెంచుతుంటారు. పిల్లలతో ఇంత పని చెయ్యాలంటే కష్టం కదా!"

"చాలామందిని అడిగి చూశాను., ఎవ్వరూ దొరకటం లేదమ్మా. పనివాళ్ళున్నా లేకపోయినా మన పని మనకి తప్పదు కదమ్మా!" అని నవ్వింది దాక్షాయణి.

తనేదైనా పని అందుకోబోతే కూతురుతోపాటు యశోదమ్మ కూడా అడ్డుపడి చెయ్యనివ్వటం లేదు. ఒకరోజు సాయంత్రం యశోదమ్మ పెరట్లో మొక్కలకి నీళ్ళు పోయటం చూసి తల్లి పక్కన చేరింది దాక్షాయణి.

"అమ్మా! మీ అల్లుడు గారు ఈవిడ గారిని ఇక్కడకు శాశ్వతంగా తీసుకుని వచ్చేశాడు. ఈమధ్య ఆరోగ్యం కూడా అంత బాగుండటం లేదు. కదా! ఒక్కదానివే అక్కడెందుకు? అని తీసుకొచ్చి దిగబెట్టాడు. తప్పనిసరి తద్దినంలా ఈవిడగారిని భరించాల్సింది నేనేగా... ఇక్కడ నేనేదో ఒపిగ్గా ఉండి అందరికీ చాకిరీ చేసేదానిలా కనిపిస్తున్నానేమో. అందుకే నాకు ఒళ్ళు మండి కావాలనే పనిమనిషిని మానిపించాను. మా అత్తగారికి తను స్వయంగా చేసుకుంటే తప్ప, మరొకరు చేసే ఏ పని నచ్చదు... నువ్వు చేసినా మళ్ళీ తను చేసుకుంటుంది. కొన్నాళ్ళపాటు రావద్దు. అంతగా అవసరమైతేనేనే కబురు చేస్తాన్లే అని చెప్పాన్లే పనిమనిషికి. ఇకనుండి ఈవిడగారికి ఇన్ని జరిపి మళ్ళీ పనిమనిషికి అంతంత జీతాలివ్వటం ఎందుకు... వాళ్ళ ఊళ్ళో ఉన్నప్పుడు పనిమనిషి లేకుండా ఇంట్లో పనంతా తనొక్కతే చేసుకోలేదా ఏంటీ... అక్కడ చేసినట్లే ఇక్కడా చేస్తుంది. అంతే కదమ్మా!" అంది.

కూతురి మాటలకి కళ్ళు పెద్దవి చేసుకుని విస్తుపోయి చూసింది. ఆండాళమ్మ.

"అమ్మా అక్కడున్న పొలం అమ్మేసి పిల్లలిద్దరి పేరున ఇక్కడ రెండు ప్లాట్లు తీసుకున్నాడాయన. ఇల్లు కూడా బేరం పెట్టాం. దాన్ని కూడా అమ్మేసి, ఆ వచ్చిన డబ్బును పిల్లలిద్దరి పేరు మీద ఫిక్స్ డ్ డిపాజిట్ చెయ్యాలను కుంటున్నాం. అన్నట్టు మరిచాను. అన్నయ్య కూడా నిన్ను చెన్నై తీసుకెళ్ళాక మన ఊళ్ళో ఉన్న యిల్లు, పొలం అమ్మాలని అంటున్నాడు. ఒకవేళ అవి కానీ అమ్మటం జరిగితే నాకు కూడా వాట ఇవ్వాలి ముందే చెబుతున్నాను. ఇవ్వకపోతే ఊరుకోను. వాడికెలా నచ్చచెప్పుకుంటావో నీ ఇష్టం" అంది.

ఆ మాటలు విన్నాక ఇక కూతురు చెప్పేవేమి బుర్రలోకి

ఎక్కటం లేదు. ఏదో ఆలోచిస్తూ అలాగే కూర్చుండిపోయింది. మర్నాడు సాయంత్రం దాక్షాయణి ఫ్రెండ్స్ కాబోలు ఇద్దరు ఆడవాళ్ళు వస్తే హాల్లో కూర్చొని కబుర్లు చెప్పుకుంటున్నారు. వాళ్ళొచ్చిన విషయం తెలియక ఉతికిన బట్టలు మడత పెట్టి ఎవరి గదుల్లో వాళ్ళవి సర్దటానికని హాల్లో నుండి బెడ్రూంలోకి వెళ్ళింది యశోధమ్మ. ఆ తర్వాత పెరట్లోకివెళ్ళిపోయింది. ఆ వచ్చినవాళ్ళలో ఒకామె వెళ్తూవెళ్తూ మొక్కలకి పాదులు చేసి నీళ్ళు పెడుతున్న యశోదమ్మని చూసి "మీ పనిమనిషి అన్ని పనులు ఎంతో చక్కగా బాధ్యతగా చేస్తుందే... మాక్కూడా ఎవరైనా దొరుకుతారేమో కాస్త కనుక్కో" అంది.

దాక్షాయణి ఆ మాటలు విననట్లే వెంటనే టాపిక్ మార్చి గేట్ వరకు సాగనంపింది. "ఇంటికి ఎవరైనా వచ్చినప్పుడు వాళ్ళకు ఎదురుపడవద్దని చిలక్కి చెప్పినట్లు ఎన్నిసార్లు చెప్పినా ఈవిడింతే... చూసినవాళ్ళంతా 'పనిమనిషా' అని అడుగుతుంటే ఏం చెప్పాలో అర్థం కాక చస్తున్నాను. ఇంకా ఎన్నాళ్ళు భరించాలో ఈవిడగారిని" అంటూ యశోధమ్మ స్నానానికి వెళ్ళటం చూసి తల్లి ముందు విసుక్కుంది దాక్షాయణి.

ఇంట్లో ఇంతకుముందు ఉన్న పరిస్థితికీ ఇప్పటి పరిస్థితికీ చాలా తేడా కన్పించింది అండాళమ్మకి. ఓ వారం పదిరోజులు మనవడూ మనవరాలితో సరదాగా గడపాలని వచ్చిందల్లా ఐదో రోజే తిరుగు ప్రయాణ మైంది. పదిరోజుల తర్వాత కూతురికి ఓ ఉత్తరం రాసింది ఆండాళమ్మ.

అమ్మా! దాక్షాయణి...!

అన్నయ్యతో చెన్నైకి రాను.. ఇక్కడే ఉంటానని చెప్పావట కదమ్మా!... ఎందుకని అని నువ్వు నన్ను ఎన్నిసార్లు అడిగినా ఎలా చెప్పాలో అర్థం కాక ఇప్పుడిలా నీకీ ఉత్తరం వ్రాస్తున్నాను. నిన్ను చూస్తుంటే చాలా మారిపోయావు అనిపిస్తుంది. నీలో ఉండే జాలి, ప్రేమా, కరుణా నేను నేర్పిన నడవడిక ఏమైపోయాయో అర్థం కావడం లేదు. ఇంత సగటు మనస్తత్వంతో నీవు ఎలా మారావని ఆశ్చర్యపోతున్నాను.

చిన్నతనంలోనే భర్త చనిపోతే ఎన్నో కష్టాలు పడి ఆశలు కోరికలూ చంపుకుని తినీ తినకా ఉన్నగానొక్క కొడుకుని ఇంతవాడిని చేసింది మీ అత్తగారు. వయసుడిగి, శక్తి నశించి, ఆరోగ్యం బాగాలేదని పరిస్థితిలో కొడుకు ఆదరణ కోసం వస్తే చివరిరోజుల్లో ఆమెని నువ్వెంత బాధపెడుతున్నావో నీకేమైనా అర్థమవుతుందా...?

తిండి తిప్పలు, బట్టలు, మందులు అన్నీ మేమే చూసుకోవాలిగా. అన్నావే... ఆమె కూడా ఇంచుమించు నా వయసుదే కదా... ఈ వయసులో మాలాంటి వాళ్ళు ఎంత తింటాం చెప్పు... ఆమె తినే ఆ నాలుగు మెతుకులు నీకు భారం అనిపించిందా. మీరంతా తినగా మిగిలిపోయినంత లేదు ఆమె తినే తిండి. రేపేదైనా నా పరిస్థితి బాగాలేక నీ దగ్గర ఉండాల్సివస్తే నాగురించి కూడా ఇలాగే అనుకుంటావామ్మ అమ్మా...!

ఆమె ఆరోగ్యం బాగున్నప్పుడు మీకు మీ పిల్లలకు ఎన్ని చేసి పెట్టలేదు. నీకు సీమంతాలకు, పురుళ్ళకు ఎంత సేవ చేయలేదు. మర్చిపోయావా అమ్మా! ఆడబిడ్డలు లేని తను నిన్నే బిడ్డనుకుని ఎన్ని సేవలు త్యాగాలు చేయలేదమ్మా! మర్చిపోయావమ్మా...?

తను 500/- వాయిల్ చీర కొనుక్కొని నీకు 5000/- పట్టుచీర కొన్నదన్న విషయం మర్చిపోయావమ్మా! మీవారు ఎందుకమ్మా ఇంత ఖర్చుపెట్టి కొన్నావు అని అంటే పంట బాగా వచ్చింది సంతోషంగా కొన్నానురా మన ఇంటి లక్ష్మియే కదరా కోడలు అనేది మా అత్తమ్మ అనేదానివి కదమ్మా!

తనకు బిడ్డలు లేని కారణంగా తీర్చుకోలేని కోర్కెలన్ని నీకు తెచ్చిపెట్టి అందరికి నా కోడలు బాగుండాలని కోరుకునేది కదమ్మా చివరికి తన కోసం కొనుక్కున్న చీరనైనా దాక్షాయణి నీవు కాస్త పాతబడేవరకు కట్టుకుని మరీ నాకివ్వమ్మా అప్పుడు నేను కట్టుకుంటాను. అనే పెద్దమనసుగల మాతృమూర్తి అని మర్చిపోయావా అమ్మా! ఇంకా నాదన్నదంతా నీదే కదమ్మా! ఈ నగలు పెట్టుకో అని ఇచ్చి నీవు పెట్టుకుంటే చూసి మురిసిపోయేది అన్న సంగతి మర్చిపోయావమ్మా.

ఎక్కడినుండి వచ్చిందమ్మా నీకు ఇంత కఠినత్వం- ఎవరు బోధపోశారమ్మా నీకు ఈ పైశాచికత్వం. ఇక ఈ వయసులో ఒళ్ళు దాచుకోవటానికి ఏవో నాలుగు సాదా కాటన్ చీరలు తప్ప మాలాంటివాళ్ళకు పట్టుపీతాంబరాలు అవసరం లేదు కదమ్మా... ఆమెకి కొనే చీరలు అన్నీ కలిపినా నువ్వు కొనుక్కునే ఒక్క సాదా చీర మామూలుగా ఇంట్లో కట్టుకునే చీర ఖరీదు కూడా ఉండదు. నెల మొత్తం మీ అత్తగారికి అయ్యే ఖర్చంతా చూసినా మీరు మీ పిల్లలు ఒకరోజు సినిమా చూసి, రెస్టారెంట్లో భోజనం చేసినంత కూడా అవదు. అవునంటావా... కాదంటావా? కడుపునిండా తిండి కూడా తినకుండా కరిగే కొవ్వొత్తిలా మీ భవిష్యత్తు కోసం తాను కరిగిపోతూ మీకు వెలుగు

పంచిన మహోన్నతమూర్తి మీ అత్తగారు. ప్రతిక్షణం నీ భర్త కోసం త్యాగాలు చేస్తూ కంటికి రెప్పలా కాపాడుకుంటూ, ఇటు భర్త లేక దాయాదుల కుట్రలకు లోకులనే కాకుల మాటలకు బలి అవుతూ పోరాడుతూ శారీరకంగా, మానసికంగా ఎన్నో బాధలుపడ్తూన్నా ఎంతో ప్రేమగా పెంచుకోబట్టే కదా! నీ భర్త ఈ రోజు లక్షలు సంపాదిస్తూ నిన్ను నీ పిల్లల్ని ఏసి గదుల్లో ఉంచి ఏసీ కార్లల్లో తిప్పగలుగుతున్నాడు.

వృద్ధాప్యంలో ఆరోగ్యం క్షీణించి అనారోగ్యంతో తన పనే తాను చేసుకోలేక కన్నబిడ్డ దగ్గరికి వస్తే మీ ఇంటిల్లిపాది అందరి పనులు చేయిస్తూ జీతం లేని పనిమనిషిని చేస్తున్నావు కదమ్మా! నీకు ఇది న్యాయమా చెప్పు. అటు పనిమనిషిని మాన్పించి మరీ... ఎంత దారుణం. తను రాకముందు నీకు ఇంటిపనికి ఒకరు, వంటపనికి ఒకరు ఉండేవాళ్ళు కదా! వయసులో ఉన్న నువ్వే నీ ఇంట్లో పని చేసుకోలేక ఇద్దరు పనివాళ్ళను పెట్టుకుంటే, వయసు మళ్ళిన మీ అత్తమ్మ ఇంటెడు చాకిరీ ఎలా చెయ్యగలదనుకున్నావమ్మా! అత్తగారంటే తల్లి తర్వాత తల్లి లాంటిదని ఎందుకనుకోవు. ఆమె అత్త కాదు. "మరో అమ్మ" అని తెలుసుకో. ఆమె స్థితిలో నేనే ఉంటే.. ఒక్కసారి ఊహించుకో... నీకెంత బాధ కలుగుతుందో. ఇలా అంటున్నానని కోపం తెచ్చుకోక, అత్తమ్మకో న్యాయం, అమ్మకో న్యాయమా... ఇది భావ్యం కాదు. నేను నిన్ను 21 సంవత్సరాలే పెంచి పెళ్ళి చేశాను బాధ్యత తీర్చుకున్నాను కాని మీ అత్తమ్మ తను తనువు చాలించేవరకు బాధ్యత వహించి మీ కుటుంబ క్షేమం కోసం పాటుపడుతుంది. అలాంటప్పుడు అత్తమ్మను అమ్మలా చూడాలి కాని పనిమనిషిగా కాదు. ఇది తెలుసుకోమ్మా....!

అయినా మాలాంటి వాళ్ళం. ఇంకా ఎన్నాళ్ళుంటాం. ఎన్నేళ్ళు బ్రతుకుతాం. మీరు మమ్మల్ని మంచిగా చూస్తే ఇంకా అయిదు సంవత్సరాలు ఆరోగ్యంగా బ్రతుకుతామేమో. ఈ వయసులో మాకు ఉండేది ఒకే ఒక కోరికమ్మా... ఉన్న నాలుగు రోజులు కన్నబిడ్డల అభ్యున్నతి కళ్ళారా చూస్తూ మనశ్శాంతిగా బతికి, ప్రశాంతంగా తనువు చాలించాలనే. కానీ మీరు పెట్టే భోజనానికో భోగభాగ్యాలకో ఆశపడి బ్రతుకడం లేదు. కానీ ఈ కాలం ఆడపిల్లలకి భర్తలు కావాలి. వాళ్ళు సంపాదించే లక్షల జీతం కావాలి. వాళ్ళ వెనుకున్న ఆస్తులు కావాలి. కాని వాళ్ళ తల్లిదండ్రులు మాత్రం వద్దు. నోరారా వాళ్ళని అత్తమ్మా! మావయ్యా! అని పిలవటానికి కూడా ఇష్టపడటం లేదు.

వాళ్ళని తన యింట్లో పాత వస్తువుల్ని స్టోర్ రూముల్లో పడవేసినట్లు వాళ్ళను స్టోర్ రూమ్ లో ఉంచుతున్నారు. కారణం. వాళ్ళు పరాయి వాళ్ళు, పనికిరానివాళు ఎ), అంటరానివాళ్ళు. ఇంకా చెప్పాలంటే వాళ్ళు ఒకటి రెండు పోతారని నీరు, భోజనం పెట్టని ప్రబుద్ధులు కోడళ్ళు కూడా ఉన్న సమాజం మన మధ్యలోనే కన్పిస్తుంది. మొన్న ఒక కొడుకు తన తల్లిని బ్రతికి ఉండగానే స్మశానంలో మూట కట్టి పడేసిన విషయం తెలిసి ఈ సంస్కృతి ఎటు పోతుందో అని శ్రవణకుమారుడు పుట్టిన దేశం ఇదేనా అనిపిస్తుంది. నువ్వే నీ అత్తగారిని ఓ పనిమనిషిని చేస్తే నీ ఇంటికొచ్చిన వాళ్ళు మాత్రం అలా అనుకోవటంలో తప్పేముందమ్మా. పనిమనిషి కాదు ఆమె మా అత్తగారు... అని చెప్పే సంస్కారం నీకు లేకపోయె... నా కడుపులో పుట్టి, నా పెంపకంలో పెరిగిన నువ్వే ఇలా ఉంటే, ఇక నీ వదిన మాత్రం నన్ను బాగా చూస్తుందన్న గ్యారంటీ ఏంటీ... తనూ నీలాంటి ఆడపిల్లే కదా! నేనూ తనకు అత్తగారినే... మీ భాషలో చెప్పాలంటే 'తప్పనిసరి తద్దినాన్నే' కదమ్మా! నా పెంపకంలో న్యాయం, ధర్మం, పాపం – పుణ్యం అని ఎన్నో ధర్మసూక్తులు నేర్చుకున్న నీవే ఇలా ప్రవర్తిస్తే ఏది తెలియనివాళ్ళు ఇలా ప్రవర్తించడం అతిశయోక్తి కాదేమో. ఇది నా పెంపకం లోపమేమో అని నేను సిగ్గుపడుతున్నానమ్మా!

ఉన్న ఆస్తులు వదులుకొని మీ ఇళ్ళకి వచ్చి మీ ఇళ్ళల్లో సేవలు చేస్తూ. పనిమనుషులుగా మారి, మీరనే సూటిపోటి మాటలు భరిస్తూ, జీతంలేని పనిమనుషులుగా బ్రతుకు వెళ్ళదీస్తూ 'ఆ దేవుడు ఎప్పుడు తీసుకెళ్తాడా' అని ఎదురుచూస్తూ జీవచ్ఛవంలా బతకాల్సిన ఖర్మ నాకు వద్దమ్మా!... నీ ఇంటి వాతావరణం చూశాకే నాకు జ్ఞానోదయమైంది. నువ్వే కాదు... ఈ రోజు చాలామంది కోడళ్ళు నీలానే ప్రవర్తిస్తున్నారు. అందుకే నా కంఠంలో ప్రాణం ఉన్నంతవరకూ నా యింట్లోనే ఉండాలనీ నేను ఉన్నంతవరకు నా ఆస్తులు కూడా అమ్మకూడదని నిర్ణయించుకొన్నాను. చివరిగా ఓ మాట... నీలో జాలి, దయ, మానవత్వమనేవేవీ ఏ మాత్రమైనా ఉంటే ఈ చివరి రోజుల్లోనైనా మీ అత్తగారికి కాస్తంత విశ్రాంతిని, సంతోషాన్ని, మనశ్శాంతిని కలిగించి ఆమెలో ఈ అమ్మని చూసుకుంటావని ఆశిస్తూ... కాదు కాదు అభ్యర్థిస్తూ.....

మీ అమ్మ. ఆండాళమ్మ.

వ్యాసం

# రాజ్యాంగ నిర్మాత



**జి. విజయలక్ష్మి, ఎంఏ, ఎంఫిల్.,**
**రచయిత్రి, జర్నలిస్టు**

ప్రతి సంవత్సరం అంబేద్కర్ జయంతి నాడు అన్ని వర్గాలవారు అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేయడం సర్వసాధారణమే. కానీ ఈ సంవత్సరం అది ఎంత పెద్ద ఎత్తున జరిగిందంటే బహుశా భవిష్యత్తులో అంబేద్కర్ని కూడా దేవుడిగా మార్చబోతున్నారా అన్నంత స్థాయిలో జరిగింది. బుద్ధుణ్ణి విష్ణువు 9వ అవతారంగా మార్చి బుద్ధిజాన్ని సమాధిచేసిన హిందూ మతం లాగా అంబేద్కర్ని దేవుడిగా చేసి అంబేద్కర్ సిద్ధాంతాలను పూడ్చిపెడతారా అని అనుమానం కూడా కలిగింది. విగ్రహారాధనని వ్యతిరేకించిన బుద్ధుడి విగ్రహాలు ప్రపంచమంతా ఎలా వెలిశాయో అదేవిధంగా అంబేద్కర్ ఆశయాలను పక్కనపెట్టి అంబేద్కర్ విగ్రహాలను మాత్రం ప్రపంచమంతా ప్రతిష్టిస్తారా అనే ఆవేదన కలిగింది. హైదరాబాదులో ప్రపంచంలోనే అతి పెద్ద 125 అడుగుల అంబేద్కర్ విగ్రహాన్ని ప్రతిష్టించారు కాబట్టి కొంత ఎక్కువ ప్రచారం జరిగి ఉండవచ్చు. అంతవరకు అయితే ఫరవాలేదు.

"దేవీ దేవతలను పూజించం" అనేది అంబేద్కర్ ఏర్పరచిన 22 ప్రతిజ్ఞలలో ఒకటి. 1950 అక్టోబర్ 14న విజయదశమి రోజున ఐదున్నర లక్షలమంది బౌద్ధ ధమ్మాన్ని స్వీకరించిన సందర్భంగా ఈ 22 ప్రతిజ్ఞలను అంబేద్కర్ తయారుచేశారు. ఈ ప్రతిజ్ఞ విగ్రహారాధనకు వ్యతిరేకం. ప్రస్తుతం ప్రపంచమంతా అనేక దేశాలలో కొన్ని లక్షల అంబేద్కర్ విగ్రహాలు దర్శనమిస్తాయి. విగ్రహాలను స్థాపించి చేతులు దులిపి వేసుకుంటే ఉపయోగం ఏముంది? అంబేద్కర్ ఆశయాలను నెరవేర్చే క్రమంలో అవసరమైన కార్యక్రమాలను చేపట్టడం, ఆయన కోరుకున్న సమాజాన్ని ఏర్పరచడమే ఆయనకు నిజమైన నివాళి. దానిని వదిలివేసి ఎన్ని వేల విగ్రహాలు స్థాపించినా ఉపయోగం లేదు. ఒక దళిత మహిళ రాష్ట్రపతి పీఠాన్ని అధిరోహించిన మాత్రాన దేశంలోని దళితులందరూ అభివృద్ధి చెందినట్లు కాదు కదా!

రాజ్యాంగ రచనలో కీలకభూమి పోషించిన అంబేద్కర్ రాజ్యాంగ సభలో ఒకసారి మాట్లాడుతూ "అది ఎంత మంచి రాజ్యాంగం అయినప్పటికీ, అమలు చేసేవాళ్ళకి చిత్తశుద్ధి లేకపోతే అది నిరర్ధకమవుతుంది. ఒకవేళ రాజ్యాంగం చెడ్డదైనప్పటికీ దాన్ని అమలు చేసేవాళ్ళు సరైనవాళ్ళయితే ఆ రాజ్యాంగమే తన స్వరూపాన్ని మార్చుకుంటుంది" అని ప్రభుత్వాల స్వభావాన్ని గురించి, రాజ్యాంగం అమలు యొక్క ప్రాధాన్యం గురించి వివరించారు. దీనికి సంబంధించిన ఒక సంఘటన తమిళనాడులో జరిగింది. తమిళనాడులోని కడలూరు జిల్లాలోని ప్రసిద్ధ చిదంబరం నటరాజస్వామి దేవాలయంలో ఒక దళిత మహిళకు జరిగిన అవమానంపై ప్రభుత్వం స్పందించి, ఇరవైమంది అర్చకులపై కేసు నమోదు చేసింది. చిదంబరం నటరాజ స్వామి దేవాలయంలో కనకసభ ప్రాంగణంలోకి వెళ్ళి దేవుడిని దర్శించుకోవడానికి ప్రయత్నించిన లక్ష్మి అనే మహిళను పూజారులు అడ్డుకొని, కులం పేరుతో దూషించారు. ఈ సంఘటనపై ఆమె పోలీసు స్టేషన్లో ఫిర్యాదు చేయగా, ప్రభుత్వ యంత్రాంగం స్పందించి పూజారులపై కేసు నమోదుచేసి, దర్యాప్తు చేస్తోంది.

తమిళనాడులోని డిఎంకె ప్రభుత్వంలో కరుణానిధి ముఖ్యమంత్రిగా ఉన్నపుడు దేవాలయాల మీద గుత్తాధిపత్యాన్ని చెలాయిస్తున్న అర్చకవర్గంపైన చర్యలు తీసుకోవాలని నిర్ణయించింది. దేవాలయాలను దళితులకు దూరంగా ఉంచుతున్న పరిస్థితులను మార్చడానికి హిందువులుగా విశ్వాసం కలిగి, హిందూ దేవాలయాల్లో పూజలు చేసుకోవాలనుకున్న అన్ని కులాలకు పూజారులుగా ఉండే అవకాశం ఉన్నదని భావించి, అర్హతలను బట్టి వారిని ఎంపికచేసి శిక్షణనిచ్చే కార్యక్రమాన్ని 2007లో చేపట్టింది. ఎంతో పట్టుదలతో ఈ

కార్యక్రమాన్ని ప్రారంభించిన కరుణానిధి ప్రభుత్వంపై కొందరు కోర్టుకు వెళ్ళారు. అప్పటి సుప్రీంకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ గొగోయ్, జస్టిస్ రమణలు ఈ కేసును విచారించి దేవాలయాల్లో పనిచేయడానికి అవసరమైన సిబ్బందిని, అర్చక వర్గాన్ని ఒక కులానికి మాత్రమే పరిమితం చేయకూడదని, హిందువులైన అందరూ హిందూ దేవాలయాల్లో అర్చకులుగా అర్హులేనని 2015 డిసెంబర్ 16న తీర్పునిచ్చారు. అప్పుడు తమిళనాడులో అధికారంలో ఉన్న ఏఐఏడిఎంకె ప్రభుత్వం ఆ తీర్పును పట్టించుకోలేదు. 2021 తమిళనాడు ఎన్నికల్లో డిఎంకే హిందూ దేవాలయాల్లో వివక్షకు తావులేకుండా అర్హులైన అందరినీ అర్చకులుగా నియమిస్తామని తన ప్రణాళికలో ప్రకటించింది. అందుకు అనుగుణంగా ఎన్నికల్లో గెలిచిన అనంతరం గతంలో శిక్షణ పొందిన బ్రాహ్మణేతరులైన అర్చకులను ఉద్యోగాల్లో నియమిస్తూ 2021 ఆగస్టు 14న ఉత్తర్వులు జారీ చేసింది. దీనికన్నా ముందే మరొక దక్షిణాది రాష్ట్రమైన కేరళ ప్రభుత్వం 2017లో బ్రాహ్మణేతరులను దేవాలయ పూజారులుగా నియమిస్తూ ఉత్తర్వులు జారీచేసింది. అంబేద్కర్ ఆశయాలను నిజమైన అర్థంలో నెరవేర్చడం అంటే ఇదే. కేవలం విగ్రహాలు స్థాపిస్తూ, విగ్రహాలకు దండలు వేస్తూ చేతులు దులుపుకుంటే ఉపయోగం లేదు. రాజ్యాంగం అమల్లోకి వచ్చి డెబ్బై ఏళ్ళు దాటినా రాజ్యాంగంలోని "అందరూ సమానమే" అనే సమానత్వ స్ఫూర్తికి – ఆచరణకు మధ్య ఆకాశానికి – భూమికి ఉన్నంత తేడా ఉంది ఇప్పటికీ. కొంత మార్పు వచ్చిన మాట నిజమే అయినా రావాల్సిన మార్పు ఇంకా ఎంతో ఉంది.

ఒకే రకమైన నేరం చేసినప్పటికీ కులాన్ని బట్టి, వర్ణాన్ని బట్టి వేరువేరు శిక్షలు ఉంటాయని శాస్త్రాలు, పురాణాలు తరతరాలుగా ప్రజల మెదళ్ళలో చొప్పించిన ఫలితంగా చాతుర్వర్ణాల్లో బ్రాహ్మణులు దైవంతో సమానం కాబట్టి వారిని శిక్షించే అధికారం ఎవరికీ లేదని, క్షత్రియులు ఏది చేసినా రాజ్య రక్షణార్థమే చేస్తారు కనుక వారిని శిక్షించే అధికారమూ ఎవరికీ లేదని, వైశ్యులను కేవలం మందలించాలని, శూద్రులను శిక్షించాలని ప్రజల మనస్సు పొరల్లో నిండుకు పోయిన భావజాలానికి అడ్డుకట్ట పడింది 1950 జనవరి 26న అమల్లోకి వచ్చిన భారత రాజ్యాంగం ద్వారానే. నిజానికి స్వచ్ఛంగా, సంపూర్తిగా అమలు చేయబడి ఉంటే భారత రాజ్యాంగమే ఒక విప్లవం అయ్యుండేది. రెండువేల సంవత్సరాలకు పైగా కరడుగట్టిన భావజాలానికి రాజ్యాంగం అమల్లోకి వచ్చిన తర్వాత కాలం చెల్లిపోవడం అనేది సమాజానికి జరిగిన ఒక గొప్ప మేలు. రాజ్యాంగం అమల్లోకి రావడం ఒక మహత్తరమైన సందర్భమే అయినా దాని అమలు ఆశించిన ఫలితాల్ని సాధించలేకపోవడం విషాదం. కానీ రాజ్యాంగంపై ఆధారపడి రూపొందించబడిన చట్టాలు మాత్రం అణగారిన ప్రజలకు గొప్ప భరోసానిచ్చాయి.


రిజర్వేషన్ల ద్వారా పదవులు చేపట్టిన ప్రజాప్రతినిధుల పనితీరు చూసి బాధపడ్డ అంబేద్కర్ 1956 మార్చి 18న ఆగ్రాలో జరిగిన ఒక సభలో ప్రసంగిస్తూ "మీకు రాజకీయ అధికారాలను అందించడానికి ఎంతో ప్రయాసపడ్డాను. పార్లమెంటులోనూ, శాసనసభల్లోనూ మీకు సీట్లు రిజర్వు చేయించడానికి ముప్పై సంవత్సరాలు రాత్రీ, పగలూ శ్రమించాను. ఎవరైనా మిమ్మల్ని తమ రాజభవనంలోకి ఆహ్వానిస్తే సంతోషంగా వెళ్ళండి కానీ మీరు నివసించే చిన్న ఇల్లును తగులబెట్టుకుని మాత్రం వెళ్ళకండి. కొన్ని రోజుల తర్వాత ఏదో ఒక రోజు మీమీద మీకే కోపం కలిగితే, మిమ్మల్ని గెంటివేస్తే ఎక్కడికి వెళతారు. మీరు అమ్ముడుపోవాలనుకుంటే అమ్ముడుపొండి, కానీ మీ స్వంత బలాన్ని ధ్వంసం చేసుకుని మాత్రం కాదు" అన్నారు. మరోసారి "మా ప్రజాప్రతినిధులు ఆవులింత వస్తే తప్ప నోరు తెరవరు" అంటూ తన బాధను వ్యక్తం చేశారు. ఆయన అప్పుడు చేసిన విమర్శ ఇప్పటికీ వర్తిస్తుంది. ఎక్కడినుంచి వచ్చారో మరిచిపోయి, అమ్ముడుపోయి, బానిసలుగా ఉంటున్న ప్రజాప్రతినిధులే ఇప్పుడు ఎక్కువమంది ఉన్నారు. ఎక్కడినుంచి వచ్చామో చెప్పుకోవడానికి సిగ్గుపడే వారు కూడా చాలామందే ఉన్నారు. అంబేద్కర్ విగ్రహాల్ని చూసుకుని మురుసుకుంటూ, ఆయన విగ్రహం ముందు ఫోటోలకి పోజులిస్తూ సంతృప్తి పడి నిద్రపోవడం ఆయన ఆశయాలకు ద్రోహం చేయడమే అవుతుంది. ఈ పరిస్థితి మారాలని, అంబేద్కర్ కోరుకున్న సమసమాజం రావాలని కోరుకుందాం. దానికోసం నీతి నిజాయితీ నిబద్ధతతో పనిచేయడమే ఆయనకిచ్చే నిజమైన నివాళి. జైభీమ్!

సమీక్ష

# అత్యాచారాలపై గొంతెత్తిన మహిళార్ఘురి - యుద్ధనారి



శైలజామిత్ర




పేరుకి మనది స్త్రీని పూజించే దేశం. స్త్రీని గౌరవించే దేశం. కానీ దేశంలో స్త్రీ వివక్షకు గురి కాని క్షణం లేదు. దోపిడీకి గురికాని రోజు లేదు. శ్రమదోపిడి, శారీరక దోపిడీ ఏదయినా కావచ్చు. హక్కుల విషయంలో, సంప్రదాయాల విషయంలో, చట్టాల విషయంలో, ఉద్యోగాల విషయంలో, వేతనాల విషయంలో, పిల్లల్ని కని పెంచే విషయంలో, విడాకుల విషయంలో, కోర్టు కేసుల విషయంలో, ఆస్తి హక్కుల విషయంలో పురుషుల పెత్తనం తారాస్థాయిలో ఉంటూనే ఉంది.

జాతీయ మహిళా కమీషన్ గత సంవత్సరం అంటే 2022లో హింసకు సంబంధించి 31 వేల కేసులు స్వీకరించింది. 2014 సంవత్సరం నుండి తీసుకుంటే కిందటి సంవత్సరంలో ఉన్నంత హింస ఎప్పుడూ లేదు. అంటే గత సంత్సరాల కాలంలో మన దేశంలో హింస రేటు 26.35 శాతం పెరిగింది. ఢిల్లీలో అయితే 2022 మొదటి ఆరునెలల్లోనే 17 శాతం పెరిగినట్లు సమాచారం. శరీరంపైన యాసిడ్ పోయడం, శరీరాన్ని ముక్కలు కోసి ఫ్రిడ్జ్ ఉంచడం,స్నానం చేస్తుంటే వీడియోలు తీసి బ్లాక్మెయిల్ చేయడం, బలవంతంగా పడుపువృత్తిలోకి దించడం, ప్రేమించలేదని, తనని కాకుండా మరొకర్ని వివాహం చేసుకుందని చంపేయడం వంటి వార్తలు అనేకం మనం కిందటి సంవత్సరంలో విన్నాము. ఆవేదన పడ్డాము. ఒక్కోసారి కన్నీళ్ళు కూడా పెట్టుకున్నాము. రోజు రోజుకీ మహిళల హింసలకు సంబంధించి, హక్కులకు సంబంధించి దాదాపు 36 లక్షల కేసులు ఉన్నాయని న్యాయమంత్రి కిరణ్జీజు ఇటీవలే ప్రకటించారు. డిసెంబర్ 16, 2012లో జరిగిన నిర్భయ దారుణ హత్య తర్వాత మన భారత శిక్షాస్మృతి సవరించుకున్న పదేళ్ళ తర్వాత కూడా అంటే 2022 వరకు ఏమాత్రం ఈ అఘాయిత్యాలు తగ్గుముఖం పట్టలేదని తెలిపారు.

భారతదేశానికి స్వాతంత్ర్యం లభించి 75 ఏళ్ళు అయిన

సందర్భంగా కేంద్ర ప్రభుత్వం "ఆజాదీ కా అమృత్ మహోత్సవ్" వంటివి ఎన్ని ఏర్పాటు చేసినా మాతృస్వామ్యవ్యవస్థ శిధిలాలపై నిర్మించబడిన పితృస్వామ్యం నిరంతరం దోపిడీ, దౌర్జన్యాలతో మహిళ శారీరకంగా, మానసికంగా హింసలకు గురిచేస్తుంది. మన దేశంలో మహిళల రక్షణ కోసం అనేక చట్టాలు, జాతీయ మహిళా కమీషన్, స్థానిక సంస్థల్లో మహిళలను రిజర్వేషన్లు, బాలికల అభివృద్ధి కోసం జాతీయ ప్రణాళిక, మహిళా సాధికారిత కోసం జాతీయ ప్రణాళిక, మహిళా సాధికారిత మిషన్ ఏర్పాటు, సమస్యల సాధికారిత కోసం జాతీయ ప్రణాళిక, దిశా చట్టం, దిశా యాప్, మహిళా కమీషన్ ఉభయ తెలుగు రాష్ట్రాల్లో షీటీమ్ లు, మహిళా పోలీసు స్టేషన్లు ఇన్ని ఉన్నా వాటిని అమలు పరిచేవాళ్ళు పురుషులే కావడంతో జాప్యం, అలసత్వం కనిపిస్తోందని తెలుస్తోంది. ఉదాహరణకు అరవై మంది హాస్టలు విద్యార్థినులు వంటింట్లోకి బహిష్టయి వచ్చారా? అని వార్డను అమ్మాయిలను బట్టలు ఊడదీసి చూస్తే సభ్య సమాజం ప్రశ్నించలేదు. నోరు మెదపలేదు.

2005లో నిర్భయ చట్టం వచ్చింది. అది కేవలం పేరు వరకే ఉంది. ఇదసలు చట్టమే కాదు భారత శిక్షాస్మృతి సెక్షన్ 376 కి ఒక సవరణ మాత్రమేననిపిస్తుంది. గృహహింస జరిగిన ఇంట్లోకే ఆ స్త్రీని సర్దుకోవాలని, కుటుంబం అన్నాక అనేకం ఉంటాయని చెబుతున్న వారు, మొగుడు మగాడు కాదని పిల్ల మొత్తుకుంటున్నా ఇంకా ఇంకా పరువు కోసం అక్కడే ఉండాలని శాసించేవారు, విడాకులు విషయంలో విషయాన్ని సరిగా వినేవారు లేకపోవడం, విడాకులు పొందాక కోర్టు ఆదేశానుసారం భార్యకు భరణం పేరున ఒప్పుకుని రెండు నెలల తర్వాత తమ దారి తాము చూసుకోవడం, ఈ విషయాన్ని కోర్టు సీరియస్ గా తీసుకోకపోవడం వంటి

విషయాలు దేశంలో 760 మహిళా కలహాల న్యాయస్థానాలున్నా కుటుంబ కేసులు ఒక పట్టాన తెగటం లేదు. పైగా పెరుగుతుండటం గమనార్హం. స్త్రీలకు పనికిరాకుండా పోతున్న హక్కులు, ఆస్తిహక్కు, ఎన్టీరామారావు గారు 1983 సంవత్సరంలో తెచ్చిన చట్టం ఇది. తర్వాత నరేంద్రమోదీ ఈ హక్కును దేశం మొత్తానికి వర్తింపజేసారు. 2015 లో సుప్రీంకోర్టు స్త్రీల ఆస్తిహక్కు గురించి మాట్లాడుతూ మహిళలకు కూడా తమ అన్నదమ్ములతో పాటు ఆస్తిహక్కు ఉంటుందనే స్పష్టం చేసింది. అయినా ఆ సంబంధిత అన్నదమ్ములు తమ తోబుట్టువుల ఆస్తిని ఇవ్వకుండా కాజేయడం, దానిపై మళ్ళీ కోర్టులను ఆశ్రయించడం వంటివి అనేకం పెరిగిపోతున్నాయి.

ఇవి కాక స్త్రీలకు సమాన హక్కులుండాలని రాజ్యాంగం చెబుతున్నా, పార్లమెంట్లో మహిళా బిల్లు ఇంకా మూలకే ఉంది. అని రాష్ట్రాలలో మహిళలకు ఉద్యోగాలలో మూడోవంతు రిజర్వేషన్లు కల్పిస్తున్నా, కేంద్ర ప్రభుత్వంలో మాత్రం మార్పు రావడం లేదు. కేంద్ర ప్రభుత్వ ఉద్యోగాలలో దాదాపు 93 శాతం పురుషులే ఉంటుండటం పెన్షనర్ల లెక్కలే చెబుతున్నాయి. ఇవిగాక తండ్రులూ, తాతలు, భర్తలు, మామలు, తోబుట్టువులు, మరుదులూ, కొడుకులు, అల్లుళ్ళు, యజమానులు, తోటి ఉద్యోగులు, పక్కింటివారూ, టీచర్లు, డాక్టర్లు, లాయర్లు, ఇలా ఒక్కరేమిటి నిత్యం ఎవరిద్వారానో ఒకరి వల్ల స్త్రీలు బలవుతూనే ఉన్నారు. ఎన్ని చట్టాలున్నా, ఆ చట్టాలను ఎలా ఉపయోగించుకోవాలో తెలియక కొందరు, ఆ చట్టాలద్వారా ఏమాత్రం న్యాయం లభించని వారు కొందరూ దిక్కుతోచక పడివుంటున్నారు. టీచర్లు తప్పును ఎత్తి చూపితే మార్కులు రావని, డాక్టర్ల తప్పును చూపితే తన ఆరోగ్యానికి భంగం వాటిల్లుతుందని, యజమానులకు ఎదురుతిరిగితే ఉద్యోగాలు పోతాయని అనేక వికృత చేష్టలను భరిస్తూనే ఉంది మహిళ. ఎన్ని దినోత్సవాలు జరిగినా మార్పురాని ఈ జీవితాలకు ఎవరు సమాధానం చెబుతారు? స్త్రీలపై వారి మానసిక బలహీనలపై, సున్నితత్వాలపై, కరుణశీలత గల మనోగతాలపై పురాణాలు, ఉపనిషత్తులు, వేదాలు, మీదపడిపోతూ ఆక్రమించుకుంటున్న ఈ దాష్టీలతో పాతివ్రత్యం, పవిత్రత, శీలం వంటి పనికిరాని మాటలు పలికేలా ఒక దయనీయ స్వేచ్ఛారాహిత్యపు కాఠిన్యతలోకి కాఠిన్యతలోకి నెట్టబడ్డారు.

ఈ పోరాటం ఇప్పటిది కాదు.. 11వ శతాబ్ధంలోనే స్త్రీలు తమకంటూ ప్రత్యేక స్థానం కోసం ప్రయత్నాలు మొదలుపెట్టే

క్రమంలో మొల్ల, రంగాజమ్మ, రంగనాయకమ్మ, తాళ్ళపాక తిమ్మక్క కరిమళ్ళ వెంగమాంబ ప్రయత్నించినా స్వీయ గొంతుక వినిపించి గెలిచినట్లు కనిపించదు....

"ఆడపిల్లలను పుట్టకముందే చంపటం వరకు విస్తరించిందన్న జయప్రభ

"చావడానికి మా దగ్గరకు రాకండి/ బతకడానికి నానా చావు చస్తున్నవాళ్ళం"– ఓల్గా

"పాలింకి పోవడానికి మాత్రలు ఉన్నట్లు/ మనసింకిపోవడానికి మాత్రలు ఉంటే బావుండు" – పాటిబండ్ల రజని "వంటింటి సామ్రాజ్యానికి మా అమ్మ రాణి/ కానీ వంటపాత్రలమీద మాత్రం నాన్నపేరే" – విమల పెళ్ళంటే పెద్ద శిక్ష, ఏం పాలిచ్చి పెంచన జనంలో సగమే మమ్మల్ని విభజించి పాలిస్తుంది"–సావిత్రి "బాల్యంలో చిన్నపిల్లవి నీకేం తెలుసు కూర్చో" యవ్వనంలో మంచి చెడు తెలియదు కూర్చో – రజియాబేగం వీరంతా స్త్రీల జీవితాలను, స్త్రీ తన జీవితంలో ఎదుర్కొంటున్న సమస్యలపై కలాన్ని ఎక్కుపెట్టినవారే. ఇంతటి గొప్పవారు అనే మాటలతో పాటు మరికొందరు కవయిత్రుల స్వరాన్ని అందుకోవాలనే ప్రయత్నంలో మహిళలపై జరుగుతున్న అత్యాచారాలకు వ్యతిరేకంగా కవయిత్రుల నిరసన స్వరాలను వినిపించాలనే ఆశయంతో నీలం సర్వేశ్వరరావు గారు చేసిన ఈ ప్రయత్నం ఎంతో హర్షించదగినది.

ఈ గ్రంథంలో 49 మంది కవితలున్నాయి. అన్నీ కాకపోయినా దాదాపుగా ఎక్కువ మొత్తం కవితల్లో కనిపిస్తున్న కవితాత్మకమైన, విషయాత్మకం, శిల్పాత్మకం కలగలిసిన కొన్ని వాక్యాలు మీ ముందుకు .. "నెలకోమారు ఉప్పతిల్లీ / చెడు రక్తపు కరాళాలతో /యుద్ధం సలుపుతూ

ప్రసవ వేదనతో/ బహుశా తనువు చాలిస్తానని తెలిసీ/ వెన్ను వంచని అమ్మ!'– నీలం సర్వేశ్వరరావు "తప్పి దారి మరచిపోయి/ మనిషిగా జన్మనిచ్చాను/ మగాడిగా పుట్టినందుకు/ బాధపడుతున్నాను" జవేరియా

"ఆమె ఎపుడూ వారికి ఓ అంగడి సరుకే/ కోర్కెలు తీర్చే బొమ్మే/ అది అమ్మయినా/ అపుడే పుట్టిన పసికందైనా/ వారికి కావాల్సింది దేహం మాత్రమే" – సలీమ

"ఆరేడు మృగాలు/ ఏడు రోజులు/ ఎనిమిదేళ్ళ పసిప్రాయం/ అత్యాచారం ఎంత నరకం అనుభవించి వుంటుందో ఆ చిట్టితల్లి"??? – జ్యోతిరాజ్

"ముతక పరికిణీ కచ్చపోసి కట్టి/ దాన్ని బుష్కోటు పైన తొడిగి/ పైగా గళ్ల తువ్వాలు భుజానేసి/ పగుళు ళ్ళే పట్టిన కాళ్ళతో/ సిమెంట్ దూరిన గోళ్ళతో/ వాడిపోయిన మల్లెల దండతో/ ఎండకి మాసిపోయిన మొహంతో/ చెమటకు తడిసి రంగుమారిన వదులైన బట్టలతో తిరిగే నేను, ఆ కామపు దున్నపోతుని/ ఎట్ల రెచ్చకొట్టాయో తెలియదు" – సాయి పద్మ

నేనొక విత్తనాన్ని/ రేపటి మానవ జాతికి మాతృకను/ హంతకులుగా మిగులుతారు. కానీ అమ్మే లేని ప్రపంచానికి/ కలల రచన చేస్తున్నదెవరు? / నీ అపురూపమైన జీవితాన్ని / విషబీజాలుగా నాటిందెవరు/ ఓ మనిషి / నువ్వు కూర్చున్న కొమ్మను/ నీవే నరుక్కుంటున్నావెందుకు?" — జ్వలిత

స్త్రీని వ్యాపార వస్తువుగా / అంగడి బొమ్మగా ఆటబొమ్మను చేసారు. నానాటికీ దిగజారుతున్న/ మాధ్యమాలను అరికట్టే వ్యవస్థ కావాలి/ మాధ్యమాలను అరికట్టే వ్యవస్థ కావాలి?? – లలిత కుమారి

"నవ మాసాలు మోసి అల్లారు ముద్దుగా పెంచి, విషయ పరిజ్ఞానంతో/ విలువలు నేర్పిన మంచిని/ మానవత్వాన్ని మరచి/ మృగపుటాలోచనలతో/ ఆడపిల్లల బతుకులతో ఆడుకుంటున్న మగవాడా!/ నిన్ను కనడమే మానేసి కసి తీర్చుకుంటానురా! బండారి సుజాత

"ప్రతి రోజూ అదే ఆలోచన / నిప్పంటిన అడవి మాదిరి / ఎప్పటికీ అంతు తేలని మదపుటేనుగుల/ మనసులేని ఆకలి బీభత్సం" – శైలజామిత్ర

"ఒకవైపు స్త్రీల మాన ప్రాణాలకు రక్షణ లేదంటూ / రక్షణ కల్పించాలని పోరాటాలు/ ధర్నాలు, చేసేది మేమే/ మరోవైపు విలువల్ని, వలువల్ని వదిలేసి/ అంగాంగాల్ని యథేచ్ఛగా

మాధ్యమాల్లో వదిలి/ ఇలా చూపే స్వాతంత్ర్యం మాకులేదా? / మా జన్మలకు బంధాలు ఇంకెన్నాళ్ళని గగ్గోలు పెట్టేది మేమే?" – రిమాషాను 44 "వద్దు బిడ్డా!/ ఇంకాసేపు పడుకో/ ఈ లోకం ఒక / అంతులేని అగాధం" – భండారు విజయ "అతడెవరో.. మరెవరితోనో, బాహాటంగానే సకిలిస్తున్నాడు/ తీరు మారకుంటే గాజులు, చీర పంపుతానని/ అహంకారరపూరిత సవాల్ విసురుతున్నాడు// రాజయినా/ రారాజయినా/ ఆకాశంపైకి ఉమ్మేస్తే / ఏమవుతుందో తెలవనట్లుంది పాపం!/ ఎందుకూ ఎప్పుడూ ఎక్కడా/ పూర్వాపరాలు కాదిప్పుడు" – నాంపల్లి సుజాత

"ఆడపిల్లా! నీ జననం/ నిత్యం ఒక సవాల్!/ నీ ఎదుగుదల అనుక్షణం/ ఆందోళన/ ప్రశ్నార్థకం/ అంతా విచ్ఛిన్నం ఒక దృశ్యం!/ ఆడపిల్ల నీ అస్థిత్వం!" – అనిశెట్టి రజిత

"ఏమిటిది? ఆడుతూ పాడుతూ తిరిగే వయసు/ అమ్మ జాగ్రత్తలు చెప్పినా నాన్న ఆంక్షలు పెట్టినా/ అర్థం కాలేదు ఎప్పుడు/ గంపకింద కోడి పిల్లలా ఉండాలా?/ గూడులోని గువ్వ పిట్టలా బతకాలా? /ఇప్పుడు అర్థమయింది/ అది ఆంక్షకాదు/ కట్టుబాటు కాదు అమ్మకి నాన్నకి మామీద ఉండే భయం" ఖబడ్దార్ నీ ఒళ్ళు దగ్గర పెట్టుకుని లేకపోతే/ ప్రతి స్త్రీ ఒక ఆయుధంగా మారి/ నీ అంతానికి కారణం అవుతుంది. జాగ్రత్త!" అంటూ హెచ్చరింపు – సావిత్రి ప్రసాద్

"ఆయుధం ఏదైనా కానీ/ అన్యాయాన్ని నీవే.. అంతమొందించాలి' – సత్తుపల్లి ఉషారాణి

"మహిళలు బొమ్మలు కాదు.. అమ్మలని గ్రహించే తరుణాల కోసం/ వేదన గానం ఆలపిస్తూ సాగుతుంది" – తిరుమల వాణిశ్రీ

చంద్రమండలం చుట్టినా/ హిమాలయాల ఎత్తుల్ని తాకినా ఇప్పటికీ రోగగ్రస్త సమాజంలో/ బాలారిష్టాలను దాటలేకపోతోంది/ స్త్రీ గౌరవం నిలబెడితేనే/ సమాజానికి పరువు దక్కేది" రాళ్ళబండి శశిశ్రీ

పట్టపగలే గుడ్లగూబ ఒకటి అరుస్తుంది. ఒక చెట్టునుండి మరో చెట్టుకు గబ్బిలాలు ఎగురుతుంటాయి/ టీవీలు కంఠశోష/దిక్కులన్నీ రోదనలు/ కాలం స్థంబించిపోతుంది/ మరోసంఘటన/ ఆ తర్వాత షరామామూలు/ సమాజం వాకిటిలో/ మార్పు బీజం నాటనంతవరకూ అంతే/ ఖచ్చితంగా అంతే" – నస్రీనాఖాన్.

ఈ వాక్యాలన్నీ స్త్రీ ఆవేదనల తాలూకు భావాలు. అందుకు సందేహం లేదు. సమకాలీన కాలానికి సరితూగే అక్షరాలు. స్త్రీ ఎన్ని విధాలుగా అరిచినా, ఉద్యమం చేసినా, ఎదురీది పోరాడినా సదరు రాజ్యాంగం మారదు. ఎందుకంటే రాజ్యాంగం రచించిన వారు పురుషులే. అందుకే మన జీవితాల్ని మనమే రాసుకుందాం.. అయితే ఇక్కడ మనం గమనించాల్సిన విషయం ఒకటి ఉంది. ఈ యుద్ధనారి'ని తట్టి లేపింది, పలకరించింది ఒక పురుషుడే. ఒక నిఖార్సయిన కవి. అతనే నీలం సర్వేశ్వరావు. ఎంతో వ్యయ ప్రయాసలకు ఓర్చి స్త్రీలపై ఉన్న అత్యంత గౌరవంతో తీర్చిదిద్దిన సంకలనం ఇది. ఒకప్పటి చలం గారి ఆశయాలతో నడిపిస్తూ ఒక స్త్రీ పక్షపాతి ఆర్తితో సేకరించిన భావాలివి. ఆధునిక మహిళల స్వచ్ఛమైన గళాలివి.

కాకుంటే ఈ సృష్టిలో అతిగా ఏది వున్నా అది అనర్థమే. అదే స్త్రీ విషయంలో తీసుకుంటే స్వాతంత్ర్యం వరకు పర్వాలేదు. స్వేచ్ఛ అంటే అది ఎవరికైనా పురుషునికైనా ప్రమాదమే. అదీ కాక స్త్రీ మానసికంగా ఎదగాలి. తోటి మహిళను మనం ఆదరించినప్పుడే మహిళ విజయాన్ని సాధించగలుగుతుంది అనే విషయం సంపూర్ణంగా ఆకళింపు చేసుకోగలగాలి. అత్త అమ్మలాగా మారినప్పుడు, ఆడబడుచు చెల్లెలి పాత్రను పోషించినప్పుడు, వియ్యపురాలు స్నేహితురాలిలాగా మారినప్పుడు మాత్రమే ఇవి సాధ్యమవుతాయి. అని అనిపిస్తుంది. రెండు కొప్పులు ఒకచోట చేరవు అనే వాక్యాన్ని తిరగరాద్దాం.. వందకొప్పులైనా కలిసి వుంటాం అనే నినాదాన్ని మనం మోద్దాం! ఒక్క రోజు కాదు ప్రతి రోజూ మహిళాదినోత్సవాలు జరుపుకుందాం! యుద్ధనారి కవితా సంకలనం మరో స్త్రీవాద కవితా సంకలనంగా పేరు రావాలని కోరుకుందాం!

కథానిక

# వాళ్ళ ఇంట్లోనో...?



ఎం. వి. ఉమాదేవి
నెల్లూరు

చరితకి వొళ్ళు మనసూ దహించుకు పోతున్నాయి. ఒకటా రెండా ఎన్ని నెలలూ సంవత్సరాలూ ఇలా? స్త్రీ గా పుట్టినపాపానికి ఇంత హింసా? ఇతను చదువుకున్నాడు, లోకం చూసాడు. అయినా యథాలాపంగా ధారాళంగా ఇటువంటి మాటలు ఎలా అంటున్నాడు? తల్లీ, అక్క చెల్లెలు ఉన్న వాడే కదా. నేరుగా ఆకాశం నుండి ఊడిపడలేదుగా!? అదేం ఖర్మో చిన్నతనం నుండీ తనకు నెలసరిలో ఆరోగ్యం బొత్తిగా బాగుండదు. రెండ్రోజులు ముందే బలహీనత, నడుం నొప్పిగా ఉంటుంది. పుట్టింటికి వెళ్తే డాక్టర్ కి చూపారు. హార్మోన్స్ ప్రాబ్లమ్స్ అని మందులు ఇచ్చారు. వాడాక కాస్త నెమ్మదిగా ఉంది గానీ పూర్తిగా తగ్గింది లేదు. ఆహారము కూడా తీసుకోలేని కడుపునొప్పి. ఇంట్లో చూస్తే అత్త గారు నిత్య పూజలోనే రోజు అంతా గడుపుతున్నది. పూజలు తప్పుగాదు. ఆ వయసులో ఆధ్యాత్మిక రూట్ మంచిదే అంటాడు అతను గొప్పగా!మంచి...? ఏం మంచి? ఇంట్లో కూతురు కంటే చిన్నదైన తాను ఇంటెడు పని చేస్తూ వుంటే సాయం చేయదు. అస్తమాను యేవో యాత్రలూ భజనలూ ఆన్లైన్ లో వస్తువుల కొనుగోలుతో పూజలు. అంతా ఒకేలాంటి చీరలతో చేయకుంటే దైవం కరుణించదా? ఆ డబ్బు పేవ్ మెంట్ మీద పేదలపిల్లలకి ఇస్తే ఎంత పుణ్యం! ఆ మాటే ఆడపడుచు సుధ కూడా అనేసింది తల్లితో.

"చాల్లేవే ఇవాళ ట్రెండ్ ఇలా నడుస్తుంది. నలుగురుతో నారాయణ అన్నారు పెద్దలు. మీ నాన్న పెన్షన్ డబ్బులు ఇలా నాకు నచ్చిన విధంగా ఖర్చు చేసుకొని సంతోషపడుతా! మధ్యలో మీకేం బాధ? ఏం ఆవిడ గానీ ఎక్కించిందా?"అని అత్తగారు రుసరుసలు.

" ఆపు అమ్మా!ఎదురుగా కనిపిస్తుంది కదా.. మళ్ళీ వదిన చెప్పాలా ఏంటి? అయినా చరిత అలాంటి పిల్ల కాదు. కల్లో కూడా అనుకోకు!ఆ పూజల పుణ్యం కూడా పోతుంది!" చిరాకుగా అని లేచి లోపలకి పోయింది సుధామయి.

అప్పటినుండీ కాస్త నోరు తగ్గించింది గానీ అత్త గారు తన మీద నిఘా తోనే ఉంది. తనకేం భయం లేదు. నిజాయితీగా ఉండే వాళ్ళు భయపడరు అనుకుంది చరిత!

ఇతను మాత్రం తగ్గేదేలే అన్నట్టు పిల్లల ముందే ఇష్టమొచ్చినట్టు మాట విసరడం తట్టుకోలేక పోతుంది చరిత. తండ్రి అలా వుంటే ఇక పిల్లలకి తల్లి అంటే భయం ఉంటుందా? అతను తినడం డ్యూటీ వెళ్లడం తప్ప వాళ్ళగురించి, చదువు గురించి పట్టించుకోడు. పాత కాలం భావాలు, పురుషాహంకారం జాస్తి. దాంతో తరచుగా ఘర్షణ తప్పడం లేదు. మామూలుగా తను ఎవరిజోలికి పోదు. గృహిణిగా తన కర్తవ్యం తనకి తెలుసు. రోజు వారీ పనుల్లో ఎటువంటి లోపం చేయదు. పైగా పనులు తేలికగా అయిపోయే చిట్కాలతో, కాసింత టైం తనకంటూ మిగుల్చుకొని, ఏ పుస్తకమో చదువుకోవడం, పూల మొక్కలు వేసుకోవడంతో రిలాక్స్ అయ్యే ప్రయత్నం చేస్తుంది. అదీ వప్పదు అతనికి. కుక్క మీదా పిల్లి మీదా పెట్టి ఏదో కామెంట్స్. విననట్టే ఊరుకుంటుంది ఒకోసారి మాత్రం ఖచ్చితంగా జవాబు చెప్తుంది అతని పద్ధతిలోనే.

ఇదుగో రెండ్రోజుల క్రితం అదే జరిగింది. పొద్దున్నే అతని మిత్రుడు వచ్చి బైటనే ఉండి పిలిచాడు. ఇతను లేచి షర్ట్ బనీను కూడా లేకుండా అర్ధనగ్నంగా గేట్ బయటకెళ్ళినపుడు చరిత అనుకోకుండా బయటికి చూసింది. బైక్ మీద రామారావు, వెనక సీట్లో అతని భార్య!గేట్ కి బైక్ కి మధ్యలో అడుగు దూరంకూడా లేదు. అతని అవతారం చూసి వాళ్ళు ఇబ్బందిగా ఫీల్ కావడం స్పష్టంగా కనిపిస్తుంది. చేతిలో కాగితాలు అతనికిచ్చి ఒకటి రెండు మాటలు తో రామారావ్ వెళ్లిపోయాడు.అవి ఇతనికి అవసరం అయిన పేపర్స్. వాళ్ళు ఆ దారిన టౌన్ కెళ్తూ మర్యాదగా ఇంటికి వచ్చి ఇచ్చివెళ్తున్నపుడు కాస్త గౌరవంగా లోపలకి పిలవొచ్చుగా. ప్రతి వాళ్ళనీ అంతే. తనకేం ఘోషా లేదు కదా. వాళ్ళు దొంగలు కాదు. తోటి ఉద్యోగులు. ఇలాంటి

ప్రవర్తన తోనే ఎవరూ లోపలకి రావడం ఇష్టపడరు. వాళ్ళ సాయం కోరుకుంటూ కూడా గొంగళి పురుగులా ఇదేంటి పద్ధతి? ఉండబట్టలేక గేటు వేసి వస్తున్న అతనితో "లోపలకి పిలిచి ఉండాల్సింది అండీ!"అంది నెమ్మదిగానే. పేపర్స్ చూస్తున్న వాడల్లా చివ్వున తలెత్తిచూసి " ఇల్లు నీదా నాదా? " అనేశాడు. యుద్ధానికి రెడీ అవుతున్నట్టు.

"ఇల్లు ఎవరిది అన్నది ముఖ్యం కాదు. మర్యాద గురించి చెప్పా అంతే!"అని బాత్ రూములో బట్టలు ఉతుక్కోను వెళ్లిపోయింది. అతను వదులుతాడా? నేరుగా వచ్చి బాత్ రూమ్ తలుపు దగ్గర నిలబడే గొడవ మొదలెట్టాడు. ఉదయం వేళా ఇదేం తగువు పనిపాట లేకుండా అని, పక్కన వాళ్ళు వింటారేమో పిల్లలు ట్యూషన్ నుండీ ఆకలి తో వస్తారనీ, ఏదో సర్ది చెప్పుకొని వదిలించుకుని తన పనిలో మునిగింది చరిత.

అదే మనసులో పెట్టుకోని ఉన్నాడేమో ఇవాళ ఇంకో గొడవ!

డిసెంబర్ నెల కావడం, ఇంటి ఆవరణలో పెద్ద చెట్లు రెండు ఉండటం తో ఆరేసిన బట్టలు సరిగా ఎండ తగలడంలేదు. ప్రహరీ మీద లంగాలు వేసి గాలికి పడిపోకుండా రాళ్లు పెట్టింది చరిత. అంతలో దూరపు బంధువులు పెళ్లి కార్డు ఇచ్చేదానికి వచ్చారు. కార్డు ఇచ్చి మంచినీళ్లు అడిగితాగి వెళ్లారు. వాళ్ళు వెళ్ళాక కార్డు చూస్తున్న చరితతో " గోడ మీద లంగాలు అరేసేది ఏమిటీ అసహ్యంగా? నీకసలు బుద్ధి లేదు. "అంటూ గొడవకి దిగాడు అతను. ఓ నిమిషం ఏమి అర్థం కాలేదామెకి. "

"ఇప్పుడేమయింది?"

అన్నది అయోమయంగా...

"ఇంకా ఏం కావాలి? నా పరువు పోయింది. వాళ్ళు చూస్తూ వెళ్లారు!"ధుమ ధుమలాడుతూ అంటున్నాడు.

"చూడనీయండి! ఏం వాళ్ళ ఇంట్లో ఆడవాళ్లు ఉండరా? లంగాలు, బ్రాలూ వేసుకోరా? ఉతికి అరేయడం వాళ్ళు చూడరా? చిన్న విషయాలు ఎందుకు సీరియస్గా తీసుకొని సాధిస్తారు. శాంతం గా ఉండండి. " అంటున్నా వినిపించుకోలేదు.

" తప్పు కప్పి పుచ్చుకోకు! బాగా ఎదిరిస్తూ ఉన్నావు. కాస్త హద్దులు చూసి మాట్లాడు!"అంటూ క్యారియర్ తీసుకోకుండానే డ్యూటీకి బస్ కోసం రోడ్డు మీదికెళ్లాడు. రెడీ చేసి ఉన్న క్యారియర్ తీసుకొని గబాలునా వాకిట్లో కెళ్ళి రోడ్డున ఉన్న అతనికి బ్యాగ్ ఇవ్వడం, అది విసురుగా తీసుకోవడం తోనే బస్ రావడంతో, ఎక్కి వెళ్లిపోయాడు.

నిట్టూర్పు విడుస్తూ ఇంట్లో కొచ్చింది చరిత. పుట్టింటికి వెళ్లినపుడు తన గోడు వెళ్ళబోసుకుంటే, వాళ్ళు కాస్త వేపకాయంత వెర్రి ఉంటుంది కొందరికి. సర్దుకుపోతూ ఉండాలి అని, వ్యసనాలేమి లేవుగా అనీ నీతులు చెప్పుకొచ్చారు. పడే వాళ్ళకి కదా నొప్పి తెలిసేది అనుకుంది చరిత!

పిల్లలు పెద్దవాళ్ళు అవుతున్నా బుద్ధి మారడం లేదు. అతనికోసం ఎవరైనా వస్తే మాట్లాడాలి కదా. అదీ తప్పే. పొడి పొడి జవాబులతో ఒకరు వేరే వాళ్ళతో "చరితకి గర్వం. సరిగా మాట్లాడటం లేదు!"అని ఇద్దరికీ తెలిసిన ఫ్యామిలీ తో అన్నారట. విపరీతంగా బాధ పడింది ఆ రోజు. మళ్ళీ ఇతను ఫ్రెండ్స్ ఇళ్ళకి పోయి భోజనం కూడా చేసి వస్తూ ఉంటాడు. తనేం అనుకోదు కదా! పెళ్లి రోజు అని సరదా పడి రేపు మీ ఫ్రెండ్స్ నీ పిలవండి. లంచ్ ఇద్దాం అని అడిగింది.

అదోలా చూసి "ఏమి అక్కర్లేదు లే!"అని లేచి వెళ్లిపోయాడు. ఏమేమి చేయాలో ఆలోచనలో ఉన్న ఆమెకి ఉసూరుమనిపించింది. తన అక్కయ్యవాళ్ళు ఎంత సందడిగా ఫ్యామిలీ ఫ్రెండ్స్ ని పిలుస్తారు. వాళ్ళఇళ్లకి పోతారు. ఈ మనిషి తత్వం ఏమిటో అర్థం కాదు.ఇలాంటి చిన్న విషయాలకే విదేశాల్లో విడాకులు కూడా అని చదివింది ఓ పుస్తకంలో. వాళ్ళ పద్దతి వేరే.. కౌమా రంనుండే వాళ్ళు స్వతంత్ర భావనతో సొంత కాళ్లమీద నిలబడి జీవితం సాగిస్తారు. అందుకే కుటుంబం మీద పెద్దగా అనుబంధం ఉండదేమో. తమ సంస్కృతిలో తమ పిల్లలకి పెళ్లిళ్లు అయినాకూడా ముసలివాళ్ళు అయిన తమపేరెంట్స్ మాట ప్రకారం కొన్ని చేయాల్సివస్తుంది.

మధ్యాహ్నం అంతా అలోచించి, తను కూడా చిన్న పని చూసుకోవాలని నిర్ణయం తీసుకుంది చరిత. ఆడపడుచుకి చెప్తే చాలా ప్రోత్సాహం ఇచ్చింది. దానివల్ల మనకి వచ్చే నష్టం ఏమి లేదు. పైగా బైట గౌరవంగా మాట్లాడుతారు. మొదట్లో వ్యతిరేకంగా ఉన్నా అతనే సర్దుకుపోవాల్సినట్టు ఉండాలి తన ప్రవర్తన అని గట్టిగా నిర్ణయం తీసుకోవడం, పదిరోజుల్లో కాలనీలో ఉన్న కొత్త స్కూల్లో ప్లే క్లాస్ వాళ్ళకి టీచర్ గా చేరడం జరిగింది. సామాన్యంగా ఇంట్లో పెద్ద పిల్లలు స్కూల్ కెళ్లేపుడు, మూడు నాలుగేళ్ల పిల్లలు ఇంట్లో ఒంటరిగా ఫీలయ్యి అల్లరి

ఎక్కువ చేస్తారు. కొందరు గడుగ్గాయలయితే అక్కతో నన్ను ఎందుకు పంపరు? అని రోజూ గొడవే అని కొందరు పేరెంట్స్ అంటూ ఉంటారు. ఎన్ని ఆధునిక వసతులున్నా నేటి ఇల్లాలుకి ఒత్తిడి అధికమే. రాత్రి 12కి పడుకొని ఉదయం 5కే లేవాల్సిన పరిస్థితి. బాల్యం కోల్పోయిన పిల్లలు అంటారు గానీ..., ఒంటరిగా తల్లితో ఇంట్లో ఉండే కంటే, చురుగ్గా తోటి పిల్లలతో బొమ్మలు, టీచర్ చెప్పింది చేయడం తో నాలుగేళ్ల పిల్లలు చలాకిగా తయారుకావడం జరుగుతుంది.

అతను డ్యూటీ వెళ్లి పోయాక ఇల్లు తాళం పెట్టి ఓ నోట్ బుక్, పెన్ తీసుకొని తమ ఏరియా లో ఒక్కో ఇల్లు తిరుగుతూ, అలాంటి పిల్లలని గుర్తించి చేర్చింది చరిత. ఈ ప్రాసెస్ అంతా అయేసరికి మరో నెల పట్టింది. దాంతో ప్రిన్సిపాల్ కూడా సంతోషపడి రెండేళ్లు పోయాక మంచి శాలరి ఇస్తాం అమ్మాయి ప్రస్తుతం పది వేలు తీసుకో అన్నారు. ఆమె రిటైర్డ్ ప్రొఫెసర్. కాలక్షేపం కోసమే స్కూల్ పెట్టుకున్నా అంకితభావనతో నడుపుతూ ఉన్నారు.

ఇప్పుడు చరితకి ఇంట్లో నస గురించి ఆలోచనచేసే సమయం కూడా లేదు.పిల్లల్ని పంపుతున్న వాళ్ళు చరిత నేర్పే మంచి మాటలు, పద్ధతులు పిల్లలు ఇంట్లో చిలకల్లా వల్లెవేయడంతో సంతోషంగా ఉన్నారు.

" అమ్మాయి చరిత!ఇవాళ నేను పాలకూరపప్పు చేశాను. సాయంత్రం మా మనవడు నాలుగేళ్లవాడు ఇంటికి వచ్చి" నానీ!పప్పు బాగుంది, ధన్యవాద్!"అన్నాడమ్మా " అంది నవ్వుతూ ఎదురింటి ఆమె.

అతనికి కూడా మార్పులు అర్థం అయ్యి కోపం తగ్గింది. అత్తగారు కూడా తన హోదా పెరిగినట్టు ఫీలయ్యి చేతిలో పని తీసుకొని సాయం చేస్తున్నారు.ఇలాంటి చరితలు ఎందరో...!??

గేయం

# మాతృదేవోభవ

ఆళ్ల నాగేశ్వరరావు
చరవాణి : 7416638823

పల్లవి :
పూలతో నిన్నభిషేకించా లని
పూలలో పెట్టి నిన్ను చూసుకోవాలని
విదేశం నుంచి స్వదేశానికి
వేగిరమే తరలి వస్తున్నానమ్మా...!

చరణం : 1.
రెక్కలు వచ్చేంత వరకు పొదిగిన నిన్ను విడిచి...
దూరపుకొండలు నునుపని తెలియక
ఎండమావుల వంటి డాలర్ల మోజులో పడి
కని... పెంచిన నిన్ను కష్టాలపాల్చేసి వెళ్లిన నేను....

చరణం : 2
అడ్డాల నాడు బిడ్డలే గాని
గడ్డాల నాడు బిడ్డలు కాదనే నానుడిని నిజం చేస్తూ
మాతృమూర్తి మమకారానికి తిలోదకాలిచ్చి
ధనార్జనే ధ్యేయంగా విదేశాలకు వలస వెళ్లిన నేను....!

చరణం : 3
నీవు కన్న కలలను సాకారం చేసేందుకు
జన్మభూమిలో వైద్యునిగా సేవలు అందించేందుకు
నీ ఆశీస్సులను అనుదినము అందుకునేందుకు
పరాయి పంచను వీడి తిరిగి వస్తున్నాను నేను....!

చరణం :4
నిను వీడి వెళ్తేగాని తెలియరాలేదు నీ విలువేమిటో...
నీ విలువను తెల్సుకుని
నీ ఒడిలో సేద తీరేందుకు
మాతృభూమి ఋణం తీర్చుకునేందుకు
స్వదేశానికి మరలి వస్తున్నానమ్మ నేను....!

వ్యాసం

# ప్రకృతితో ప్రయాణం



E. శ్రావణి

అమ్మో... రైలు ప్రయాణమా? అన్న భయం మదిలో మెదులుతుంది.ఎప్పుడైనా రైలు ప్రయాణం చేయాలంటే చాలా చికాకు అనిపిస్తుంది. దానికి తోడు ఒంటరిగా ఉండడం. అలాగే మనసును నొక్కిపెట్టి, రైలు వచ్చే సమయం కొరకు వేచి చూస్తున్నాను. అంతలోనే రైలు వచ్చింది. అందరూ హడావుడిగా తమ వస్తువులను లాక్కొని పరుగులతో వెళ్ళసాగారు. అమ్మో! నేను వెళ్లాలిగా.. అని వెంటనే రైలు ఎక్కి కూర్చున్నాను.

నా అదృష్టం ఏంటబ్బా... ఎంత బాగా సహకరిస్తుంది. ఎందుకంటే నేను కిటికీ పక్కన కూర్చున్నాను. నాకు అలవాటు. ప్రకృతిని ఆస్వాదించడం, ప్రకృతిలో ఎలాంటి మార్పు మొదలైన, నా తనువు తాకినట్టుగా ఆనందం. ప్రతి పువ్వును, చెట్టును అలాగా గమనిస్తే ఏదో తెలియని సంతోషంగా ఉంటుంది. ప్రకృతిని నా ప్రాణ మిత్రుడిగా తలుస్తాను. ఆ ఆనందం చూపరానిది రాయలేనిది. అలాంటి ఆనందాన్ని ఆస్వాదించకుండా, అటు మనుషులతో, పక్కవారితో మాట్లాడి వారి పరిచయాలను, ఆనందాలను పంచుకోవడం మానేసి, ఎవరి ప్రపంచం వారిదే అంటూ పక్కన ఉన్నవారు... అని అనుకున్నాను. ఎలా ఉన్నారు, వారి పరిస్థితి ఏమిటి? తిన్నారా? అనే ఆలోచన లేకుండా ప్రతి ఒక్కరూ తమ కళ్ళకు పని చెప్పి, అవి విసిగిపోయేలా ఒకటే పనిగా చరవాణి చూస్తూ ఉన్నారు. వాటితోనే మాట్లాడుతారు. వారికి ఏదీ తోచదు ఒక ఆ చరవాణి తప్ప. అప్పుడప్పుడు అనిపిస్తుంది ఈ సమాజంలో మార్పు రావాలంటే వాటిని వాడకం తగ్గించాలని. సాంకేతికాభివృద్ధి మనం వాడే విధానం పైనే ఆధారపడి ఉంటుంది. సమాజంలో సంబంధాలు సన్నగిల్లడానికి కారణం అదేనేమో. బహుశా సమాజం పెరుగుదల అంటే అందరికీ మధ్య దూరం తగ్గాలే కానీ, రోజురోజుకు పెరిగిపోతుంది.చరవాణి ఉపయోగాలతో ఉపయోగాలతోపాటు వచ్చే రోగాలను తలచుకుంటుంటే ఒళ్లంతా ఏదో భయం.

దాని నుండి బయటపడేటందుకు మళ్లీ నా మదిని ప్రకృతి వైపుకు మలచి, నా మదిలోని మాటలని పంచుకుంటున్నాను. ఇక నా ప్రయాణం నా ప్రకృతితో మాటలతోనే సరిపోయింది. అలా ముచ్చట్లతో కొనసాగింది. ఆఖరి వరకు అది నన్ను ఎంతో స్వచ్ఛమైన గాలి ఒడిలో నిద్రపుచ్చింది. తెల్లవారగానే, అమ్మలాగా చిరుశబ్దాలతో నిద్ర లేపింది. అన్నిటిని మరచి, అందరి ఆనందాన్ని కోరుకుంటూ ఉంటుంది.

దిగాల్సిన స్టేజి రాగానే ఆ రైలుకు నా తరపు నుండి విరామం తెలిపి నా ప్రయాణానికి వేరే తోడును వెతుకుతూ అక్కడి నుండి బయలుదేరాను.

వ్యాసం

# ఇంట గెలిచి రచ్చ గెలవడం...



డా. ప్రతిభా లక్ష్మి

ఇంట గెలిచి రచ్చ గెలవాలి అనే మాట చాలా ప్రమాదకరమైనది అనిపిస్తుంది. ఈ మాట వల్ల, ముందు ఇంట్లో వాళ్ళను impress చేయాలి, ఇంట్లో వాళ్ళను convince చేయాలి, ఇంట్లో వాళ్ల support పొందాలి అనే ఉద్దేశంతో సగానికి పైన ప్రజలు, ముఖ్యంగా మహిళలు ఇంటి నుండి బయటకు రాలేక అక్కడే మిగిలిపోతున్నారు.

నీ ఆలోచనలతో ఇంట్లో వారు ఏకీభవించక పోయినా, నీ ఆలోచన తప్పు కాదు అని నీకు నమ్మకం ఉంటే, వారిని ఒప్పించే ప్రయత్నం చేస్తూ, గెలవలేక, ఓటమిని ఒప్పుకోలేక అక్కడే నిరాశ, నిస్పృహతో ఆగిపోకు.; లేక జీవితాంతం వారితో గొడవలతో మనశ్శాంతి లేకుండా మిగిలిపోకు. ధైర్యం చేసి ముందుకు వెళ్ళు. నువ్వు రచ్చ గెలిచినాక, అంటే, అనుకున్నది సాధించినాక, నువ్వు చేసింది మంచిదే, నీ నిర్ణయం సరైనదే, నీ ఆలోచన సబబే అని వారే ఒప్పుకుంటారు. నిన్ను చూసి గర్వ పడతారు.

నాకు దగ్గరగా ఉన్న వారిలో నా ఆలోచనలతో ఏకీభవించే వారు, నాలా ఆలోచించే వారు దాదాపుగా ఎవరూ లేరు అనే చెప్పాలి. అయినా నేను వారితో వాదించను. అలా అని వారి ఆలోచనలతో ఏకీభవించను. వాళ్ళను ఒప్పించాలని, మెప్పించాలని ప్రయత్నించను. నా ఆలోచనలతో నేను ముందుకు వెళ్తూ ఉంటాను. మెల్లి మెల్లిగా నేను చేసే పనులతో వాళ్ళు నాతో ఏకీభవించడం, నా లాగా ఆలోచించడం మొదలు పెడతారు అని అనుకుంటాను.

గెలుస్తాను అని చెబితే నమ్మని వాళ్ళు, గెలిచి చూపిస్తే నీకు జే జే లు పలుకుతారు.

కవిత

# ప్రియ నేస్తం



వకుళ వాసు

బాల్యం నుండి బడికి పోతూనే వున్న
ఇప్పటికీ ఎప్పటికీ
చిన్నప్పటినుండి ఎన్ని పాఠాలను నేర్పిందో నాబతుకు పుస్తకం
ఒక్కోసారి మనసు ఆహ్లాదంగా వున్నప్పుడు కృష్ణశాస్త్రి వీధిఅరుగుల మీద కూర్చుని
ఆకాశంలోని చుక్కలతో జాబిలితో ముచ్చట్లాడుతూ వుంటుంది...
ఒక్కోసారి మనసు ఇంకా తెలియని విషయాలను తెలుసుకోవాలని ఉవ్విళ్ళూరినప్పుడు
వేమన సుమతి శతకాల పద్యాలు చిన్న చిన్న పదాలతో బతుకుకు సరిపడా జ్ఞానబోధ చేస్తాయి
ఎదో సమస్యవచ్చి కొట్టుమిట్టాడుతున్న తరుణాన ఆదర్శమూర్తులు వారి జీవిత చరిత్రలను
అక్షరాల మూటలుగా మోసుకొచ్చి నామీద ఒలకబోస్తారు ఇంత కష్టానికే అంత బెంగా చూడు నన్ను చదువు అంటూ గుండెకు నిబ్బరాన్నిస్తూ మాయమౌతారు
అందుకే నాకనిపిస్తుంది నాప్రియమైన నెచ్చెలి పుస్తకమే అని ఎందుకంటె ఎవ్వరు నన్ను వీడినా
తను నన్ను వీడకుండా నా జీవితకాలమంతా తోడుంటూనే వుంటుంది నా హస్తభూషణమై అలలారుతూనే వుంటుంది

వ్యాసం

# తోడు చెవులే నాకు తోడూనీడ

-దేవరకొండ సుప్రియ



రోజు నన్ను కామన్ గా చూసే స్నేహితులు, ఓ రోజు నుంచి వింతగా చూడటం మొదలు పెట్టారు. మొదటిసారి మా క్లాస్ రూమ్ కూడా నాకు వింతగా తోచింది. పదేళ్ల వయసులో మొదలైన ఈ వింత చూపులు నేటికీ కొనసాగుతూనే ఉన్నాయి. అదే సమయంలో పరిహాసాలూ మొదలయ్యాయి. ఎంత వద్దనుకున్నా.. అన్నింటినీ పట్టించుకున్నాను. అవేదన చెందాను. ఏళ్లకేళ్లు భరించాను అంటారు దేవరకొండ సుప్రియ.

ఇంతకీ ఆకస్మికంగా ఆమె జీవితంలో వచ్చిన మార్పేంటి..? అన్నేళ్లు ఆమెను బాధించిన విషయం ఏంటి..?

మా అమ్మానాన్నలకు చాలా ఓపిక. నాకప్పుడు ఏడేళ్లు ఉంటాయనకుంటా. నా గురించి వాళ్లు టెన్షన్ పడుతున్నట్టు అర్థమయ్యేది. వేసవి సెలవుల్లో అమ్మ నన్ను రోజూ ఉదయం పిల్లల లైబ్రరీకి తీసుకెళ్లి వదిలేసేది. సాయంత్రం వచ్చి ఇంటికి తీసుకెళ్లేది. ఓ రోజు మా అమ్మ వచ్చే సరికి నాకన్నా కాస్త పెద్ద పిల్లాడు. నన్నేవో ప్రశ్నలడగటం... నేను వాటికి తప్పులుగా సమాధానం చెప్పడం గమనించింది. ఇంటికి తీసుకెళ్తూ ఆ పిల్లవాడు అడిగిన ప్రశ్నలేమిటో? హియరింగ్ ఎయిడ్ పెట్టుకోకపోవడం వల్ల నేను ఏలా వినలేకపోయానో చెప్పింది. హియరింగ్ ఎయిడ్ అవసరం నాకెంతుందో అప్పుడే అర్థమైంది.

**వంద రోజులైతే చాలా...**

నేను మొదటిసారి హియరింగ్ ఎయిడ్ పెట్టుకున్నప్పుడు నా వయసు పదేళ్లు. దానికి తలకు పెట్టుకునే బ్యాండ్లు రెండుండేవి. దానికి జతగా రిసీవర్, మరొక మెషిన్ జేబులో పెట్టుకోవాలి. అదంతా భయంగా అనిపించేది. దాన్ని పెట్టుకోవాలంటే ఎంతో సంకోచించాను పెట్టుకునే ముందు దీన్ని నేను ఎన్ని రోజులు పెట్టుకోవాలని ప్రశ్నించాను కూడా, వంద రోజులా.. అప్పటికి నాకు తెలిసిన పెద్ద అంకె అదే ఈ ప్రశ్న విని మా అమ్మానాన్నలు కన్నీళ్లు పెట్టుకున్నారు. అప్రయత్నంగా నా కళ్లలోనూ నీళ్లు తిరిగాయి.

**ఆటవిడుపుగా మారింది..**

ఆ హియరింగ్ ఎయిడ్ వచ్చిన రోజున నన్ను క్లాస్కు అలస్యంగా పంపించడానికి అమ్మానాన్న అనుమతి తీసుకున్నారు. నేనా కొత్త వస్తువును పెట్టుకుని క్లాస్లోకి ప్రవేశించగానే అందరూ వింతగా చూసారు. చీమ చిటుక్కుమన్నా స్పష్టంగా వినిపిస్తున్న ఆ సమయంలో, వారి చూపుల్లో ఎన్నో ప్రశ్నలు వినిపించాయి. అప్పటికే నా థిక్ ఫ్రెండ్ మరొకరి పక్కన కూర్చుని ఉంది. నేను మొండిగా తన పక్కనే కూర్చుంటానని వాదించాను. టీచర్ అందుకు అవకాశం కల్పించారు. క్రమంగా నా హియరింగ్ ఎయిడ్ క్లాస్లో, స్కూల్ బస్లో అందరికీ అట విడుపు వస్తువుగా తయారైంది. కొందరు దాన్ని అటు ఇటుగా లాగేవారు. నాకేడుపు వచ్చేది. ఆ అసహ్యకరమైన వస్తువును నేను పెట్టుకోక తప్పదంటున్న అమ్మానాన్నలను చూసి పిచ్చి కోపం వచ్చేది. కానీ, అవి నాకెంత అవసరమో నచ్చజెప్పేవారు. దాని వల్ల కలిగే ప్రయోజనాలేమిటో ఎప్పుడూ గుర్తు చేసేవారు. అలా మెల్లగా అలవాటు చేసుకున్నాను.

**నెట్ వర్క్ ప్రాబ్లమ్....**

వినికిడి సమస్య ఉన్నవారికి ఎదుటి వ్యక్తుల పెదాల కదలికలను గమనించి విషయం అర్థం చేసుకోగల సామర్థ్యం కూడా వస్తుంది. ఈ సమస్యతో నా వ్యక్తిగత, వృత్తిగత జీవితంలోనూ పోరాడాల్సి వస్తోంది. ఉద్యోగం విషయానికి వస్తే కంప్లీట్ అటెన్షన్ తప్పనిసరి కాన్ఫరెన్స్ కాల్లోనూ, సమావేశాల్లోనూ సంభాషణలు పూర్తిగా వినడంపై దృష్టి పెట్టాలి. ఏదైనా అర్థం కాకపోతే తెలివిగా, నెట్వర్క్ ప్రాబ్లమ్ అనుకుంటా. మీ మాటలు కట్ అవుతున్నాయి. టెక్నాలజీ మీద తోసేస్తున్నాననుకోండి. ఇంట్లో అయితే వేరే వారి మాటలు ప్రయత్నపూర్వకంగా వినాల్సిన అవసరం లేదు. అర్థం కాకపోతే మళ్లీ చెప్పమని అడిగేయవచ్చు కదా! హియరింగ్ ప్రాబ్లమ్ వల్ల సొంతంగా డ్రైవింగ్ నేర్చుకోవాలన్న నా ప్రయత్నం పూర్తిగా

సఫలం కాలేదు. హియరింగ్ ఎయిడ్ ఉన్నా శబ్దం ఏ దిశ నుంచి వస్తుందో అంచనా వేయలేక పోయాను. టీనేజ్లో ఓసారి బైక్ నడుపుతుండగా చిన్న యాక్సిడెంట్ అయింది కూడా, టర్నింగ్లో హారన్ శబ్దం వినిపించినా.. అపోజిట్ డైరెక్షన్లో వస్తున్న ఎదురుగా వస్తున్న కారుదని గుర్తించలేక నేరుగా దానికే వెళ్లి ఢీకొట్టాను.

**ఒంటరి తల్లినయ్యా..**

నా పెళ్లి విషయంలో సానుభూతి వెల్లువెత్తింది. నేను ఉద్యోగం తెచ్చుకుని, నా కాళ్ల మీద నేను నిలబడినా. పెళ్లి విషయంలో నా వినికిడి సమస్యే ఎక్కువ హైలెట్ అయింది. మంచి సంబంధం ఎలా దొరుకుతుందని అన్నారంతా. మా కుటుంబానికి బాగా తెలిసిన ఓ పెళ్లిళ్ల పేరమ్మ, ఆమె స్నేహితురాలు నాకు పోలియో వికలాంగుడిని చూశారు. అన్నీ బాగున్నవాడు నిన్నెలా చేసుకుంటాడని దెప్పిపొడిచారు. అంగవైకల్యం ఉన్న వ్యక్తిని పెళ్లి చేసుకోవడంలో నాకెలాంటి అభ్యంతరం లేదు. కాని సంబంధానికి అదే ప్రాతిపదిక కాకూడదు కదా..! ఇద్దరి స్వభావాలు, అభిప్రాయాలు కలవాలి. ఆవతలి వ్యక్తి మంచివాడై ఉండాలి. నా పెళ్లి విషయంలో నేను గట్టిగా నిలబడ్డాను. నా కోసం ఓ భిన్నమైన ప్రపంచాన్ని సృష్టించుకోవాలని అనుకున్నాను. ఓ అందమైన చిన్నారి పాపను పెంచుకుంటూ ఒంటరి తల్లినయ్యాను.

**జీవితానికి 'జత'గా:**

నన్ను నేను అదృష్టవంతురాలనే అనుకుంటా, నాతో పాటు కలిసి నిలబడి పోరాడిన తల్లిదండ్రులు, సరైన సమయంలో మంచి మార్గదర్శకత్వం వహించిన డాక్టర్లు, నన్ను ఎల్లప్పుడూ ప్రోత్సహించిన నా కజిన్స్, స్నేహితులు దొరికారు. వీరంతా నేను ఓ మెరుగైన వ్యక్తి కావడానికి సహకరించిన వారే. ఇక హియరింగ్ రింగ్ పెట్టుకోవడం నా జీవితానికి శాపం కాదనుకున్నా. నిజానికి అవి నా చెవులకు జతగా తోడు చెవులుగా పని చేసి, నేనింత ఎదగడానికి ఉపయోగపడ్డాయని సగర్వంగా చెప్పగలను. ఇవే లేకుంటే నేనేమీ సాధించేదాన్ని కాదేమో.! అందుకే వీటిని నా జీవితంలో అంతర్భాగం అనుకుంటాను.

(ఆంధ్రజ్యోతి పత్రిక సౌజన్యంతో)

**కవిత**

# దిగులు వర్ణం



**రోహిణి వంజారి**
**9000594630**

ఆరంజ్ రంగంటే ప్రాణమప్పుడు
వెన్నులో వణుకిప్పుడు ప్రాణంతీస్తుందని
కాషాయపు విద్వేషాన్ని పులిమేశారు దానికి

గులాబీ పసుపు రంగుల్లో ఎంత అందముందని
చూడడానికే భయమిప్పుడు
పార్టీల అద్దు తెరని దించారు వాటిమీద

ఎంత వింతైనవర్ణమని నలుపు
దానికీ అంటగట్టారు విషాదపు మరక
చీకట్లో ఉంటేనే కదా వెలుగుకి విలువ

ప్రకృతి అంతా రంగులమయం
మనిషి ప్రవృత్తిలోనే ఉంది అవకరపు గాయం
కుతంత్రాలతో నిండి చూపున్న గుడ్డితనం

ద్వేషపు రంగులను వెదజల్లే మాయలోకం
కూర్చున్న కొమ్మను నరుక్కునే చాపల్యం
కోల్పోయిన మనుగడకోసం తీరని శోకం

మతపురాళ్ళు అడ్డు పెట్టి కట్టిన గోడలు
మనసులను దూరం చేసే విచ్చు కత్తులు
చాతుర్వర్ణ్యం మాయ సృష్టం అంటూనే
నిచ్చన మెట్ల ఆధిక్యం కోసం వర్ణయుద్ధం

మేఘం ఇచ్చిన రాగం వర్షపు జల్లులు
పులకించిన నింగి నెలకు పంచిన కానుక
సప్తవర్ణ చాపం ఇంద్రధనుస్సు

మనుషుల మనోవర్ణాలకు భయపడి
ఏ రంగుకు ఏ అవకరాన్ని అంటగడతారోనని
కనపడాలంటేనే భయపడి
దిగులుమేఘన్ని కప్పుకుందిప్పుడు

సమీక్ష

# అబ్బూరి ఛాయాదేవి కథల్లో స్త్రీ



- శాంతిశ్రీ బెనర్జీ

'తన మార్గం' అబ్బూరి ఛాయాదేవి కథా సంపుటి. 2005న కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు అందుకున్న సంపుటి ఇది. ఇందులోన మూడు కథలను – 'ధైర్యవాణి', 'తన మార్గం', 'ఆయన కీర్తి వెనుక' – మీకు పరిచయం చేసి, చర్చించి, విశ్లేషించడానికి ప్రయత్నిస్తాను.

మొదటి కథ 'ధైర్యవాణి' లో కథా నాయిక సాధన. సాధన భర్త సత్యమూర్తి. అతని మిత్రసమితి సభ్యులు తాము వెయ్యబోయే నాటకం గురించి చర్చించుకోటానకి సత్యమూర్తి ఇంటికి వస్తారు. కథ నడుస్తున్నంతసేపు, వాళ్ళ సంభాషణలు జరుగుతున్నంతసేపు సాధన ఆలోచనలు, అభిప్రాయాలు, పురుషాధిక్యత మీద విసిరిన విసుర్లు, విమర్శలు మనల్ని ఆలోచింపజేస్తాయి.

మొదటిగా ఆ మిత్రం బృందం తనని కేవలం కాఫీ, టిఫెన్లు సప్లైచేసే వ్యక్తిలాగా చూడటం, ఆమెకి కూడా తన స్వంత అభిప్రాయాలు ఉంటాయని గమనంచకపోవడం సాధనకి నచ్చని విషయం. సారా దుకాణం సీను గురించి చర్చ జరుగుతున్నప్పుడు ఆమెలో వ్యతిరేక భావాలు కలుగుతాయి. మగవాళ్ళు కష్టమొచ్చినా, సుఖమొచ్చినా సిగరెట్లకీ, తాగుడికీ బానిసలవుతారు. కష్టాలు ఆడవాళ్ళకి లేవా? కానీ వాళ్ళు వ్యసనపరులు కావడం లేదే? ఆదాయం, ఆరోగ్యం చెడే వ్యసనాలకి దాసోహమవడం లేదే! అని అనుకుంటుంది. 'కన్యాశుల్కం' నాటకం గురించి చర్చజరుగుతున్నప్పుడు, మధురవాణి పాత్రను వేస్తానని ఆమె అంటుంది. "ఛీ! నలుగురు ఏమనుకుంటారు?" అంటాడు భర్త. 'వేశ్యపాత్ర వేస్తే తను వేశ్య అయిపోతుందా? ఆ వేశ్యకి విటుడిగా సంసారి వేస్తే ఫర్వాలేదా? పెళ్ళయిన తర్వాత మగవాడేమైనా చెయ్యవచ్చు! కానీ ఆడదాని మీద ఎన్నో ఆంక్షలు పెడతారు' అని ఆమె అభిప్రాయ పడ్తుంది.

చివరికి కథకు ఇచ్చిన ముగింపు మనల్ని ఆకట్టుకుంటుంది. మధురవాణి పాత్ర తను వెయ్యడానికి సిద్ధం అని, తనకు నాటకానుభవం ఉందనీ, తనలోని ఈ ప్రతిభను చూసే సత్యమూర్తి తనని వివాహం చేసుకున్నాడని ధైర్యంగా చెబుతుంది. ఎవరేమనుకుంటారు, సమాజం ఏమనుకుంటుంది అన్న భయాన్ని, సంకోచాన్ని వదిలించుకుంటుంది.

రెండవ కథ 'తనమార్గం' పేరునే రచయిత్రి తన కథా సంపుటి శీర్షికగా పెట్టుకుంది. దీనిని బట్టి ఈ కథకు ఆమె అత్యంత ప్రాముఖ్యత ఇచ్చిందని అనిపిస్తుంది. భర్త చనిపోయిన తర్వాత వర్ధనమ్మ ఆలోచనలలో వచ్చిన మార్పు కథకి ఆయువుపట్టు! ఇన్నాళ్ళుగా భర్త, పిల్లలు, మనవలు తన వాళ్ళనుకుంటూ వచ్చింది. తనదంటూ ఏమిలేదని ఆమెకి తెలిసివచ్చింది. ఎవరి దగ్గర పడి ఉండాలన్నా ఆమెకి నచ్చడం లేదు. చివరికి కూతురు పండక్కి రమ్మన్నా వెళ్ళడానికి ఆమెకి ఇష్టంలేక పోయింది. ఇక ఈ బంధాల్లో ఇరుక్కోకుండా స్వేచ్ఛగా ఉండాలని ఆమె కోరుకుంది.

ఇల్లు తన పేరు మీద ఉందనుకోగానే ఆమెకి కొండంత బలం వచ్చినట్లనిపించింది. వెనక వాటా అద్దెకిచ్చి, వారు ఇచ్చే అద్దెతో నెట్టుకురావడానికి ఆమె సిద్ధపడింది. పిల్లలు డబ్బు పంపకపోయినా ఆమె పెద్దగా పట్టించుకోలేదు. ఇప్పటివరకూ అడ్డమైన చాకిరి చేస్తూ జీవితం గడిపింది. ఇకనుంచైనా తన జీవితాన్ని తన అదుపులోనే ఉంచుకోవాలన్న స్వతంత్ర భావాలు ఆమెలో కలిగాయి.

ఆ ఆలోచనలకు తగ్గట్టుగానే ఆమె ప్రవర్తించడం మొదలుపెట్టింది. ఇరుగుపొరుగు వారెవరూ తోడురారని తెలుసుకొని ధైర్యంగా కంసాలి దుకాణానికి వెళ్లి తెగిపోయిన తన గొలుసు బాగుచేయించుకుంది. ఇదివరకు బయటికి

వెళ్ళే అవసరం లేకుండా భర్త అన్ని వస్తువులూ ఇంట్లో తెచ్చిపడేసేవారు. ఇప్పుడు వర్ధనమ్మే బయటికి వెళ్లి కావల్సిన సరుకులు తెచ్చుకుంటుంది. సినిమాకి వెళ్లాలన్న కోరిక కలిగి సాహసంతో ఒక్కతే సినిమాకి వెళ్లింది. సినిమాలో బూజుపట్టిన సంప్రదాయాలకు విరుద్ధంగా ప్రవర్తించిన నాయికను ప్రశంసించకుండా ఉండలేకపోయింది. 'మా బాగా చేసింది' అని కూడా అనుకుంది. పొరుగంటివారి కోడలితో సినిమాను గురించి తన అభిప్రాయాలు కూడా చెప్పింది. ఇంకోరోజు పార్కుకి వెళ్లింది. ధైర్యంగా అందరినీ గమనిస్తూ గడ్డిమీద కూర్చుంది. పిడతకింద పప్పు చూసి నోరూరి కొనుక్కొచ్చుకుని తింది.

ఈ అనుభవాలన్నీ ఆమెకి బాగున్నట్లనిపించాయి. ఇన్నాళ్ళు భర్త వెనకాలే నీడలా మెదిగిన ఆమె తన పరిధిని విశాలం చేసుకుంది. భర్త చనిపోయిన ఆడవాళ్ళమీద సమాజం పెట్టే ఆంక్షలను తలదన్ని తనదైన వ్యక్తిత్వాన్ని ఋజువు పరచుకుంది. అరవై సంవత్సరాలు దాటిన ఆమె మనస్సు గాలిపటంలా ఆకాశంలోకెగిరి గంతులేసింది.

ఇక మూడవ కథ 'ఆయన కీర్తి వెనుక' గురించి. స్వాతంత్ర సమరంలో వెంకట్రామయ్య పాత్రని గురించి ఇంటర్వ్యూ చేయడానికి ఇద్దరు వ్యక్తులొస్తారు. అది పత్రికలో ప్రచురించాలని వాళ్ళు అనుకున్నారు. భర్త అరెస్టయి జైలుకి వెళ్లినప్పుడు సీతమ్మ చాలా కష్టాలనుభవించింది. తన నగలు కూడా అమ్మి ఉద్యమంలో భర్త పనిచేసేటట్లు చేసింది. పిల్లలని పెద్ద చేసి చదువు చెప్పించడంలో ఎన్నో అవరోధాలు ధైర్యంగా ఎదుర్కొంది. ఆమెకి కూడా స్వాతంత్రోద్యమంలో పాల్గొనాలని అనిపించినపుడు భర్త అడ్డుపడతాడు. నువ్వు జైలుకెళితే పిల్లలని ఎవరు చూస్తారు. నేను చచ్చిపోతే ఏం చేస్తారని అడిగితే ఇంకో పెళ్లి చేసుకుంటానని హేళనగా సమాధానమిస్తాడు. ఇంటర్వ్యూలో కూడా ఆమెకి వీసమంతైనా గుర్తింపు ఇవ్వకుండా తనని గురించే చెప్పుకుంటాడు. మీ విజయం వెనుకనున్న స్త్రీ ఎవరని అడిగితే ఆమెని గురించి చెప్పడు. పైగా ఆమెతో పాటు ఫోటో తీయించుకోడానికి ఇష్టపడడు. స్త్రీల పరిస్థితి, స్త్రీల పట్ల మగవాళ్ళ మనోభావాలు ఈ కథలో తేటతెల్లమవుతాయి. సీతమ్మ ఉద్యమంలో పాల్గొంటే తనకి కూడా కీర్తి ప్రతిష్ఠలొచ్చేవికదా అనుకుంటుంది. స్త్రీలు తాము చెయ్యాలనుకున్నవన్నీ చెయ్యలేని అస్వతంత్రులన్న నిజం తెలుసుకుంటుంది, స్వతంత్రం వచ్చి యాభై ఏళ్ళయింది. ఎవరికి వచ్చింది స్వాతంత్ర్యం, తనకి మాత్రం రాలేదన్న ఆమె మాటలలో కథను అర్థవంతంగా ముగిస్తారు రచయిత్రి. ఛాయాదేవి కథలు స్త్రీల కథలు, ముఖ్యంగా మధ్య తరగతి స్త్రీల కథలు. వారి సమస్యలను, సంఘర్షణలను, అనుభవాలను తన కథల్లో సున్నితంగా, సునిశితంగా చర్చిస్తారు. కుటుంబాలలో పురుషులు ఆధిక్యత, దాని వలన స్త్రీలు ఎదుర్కొన్న అసమానతలు, కష్టాలు మనముందుంచి మనల్ని ఆలోచింపజేస్తారు. అందుకే ఆమెను కథా సాహిత్యంలో 'నిశ్శబ్ద విప్లవం' గా పేర్కొంటారు. సమాజం మారాలంటే ముందుగా కుటుంబాలలో మార్పు రావాలని, స్త్రీ, పురుషులిరువురికి సమాన హక్కులుండాలని ఆమె అభిప్రాయపడ్డారు. ఆమె అట్టడుగునున్న స్త్రీల గురించి, దళిత మహిళల బాధల గురించి రాయలేదన్న విమర్శ ఉంది. కానీ మధ్య తరగతి స్త్రీల సమస్యలను కథావస్తువుగా తీసుకుని ఆమె న్యాయం చేకూర్చగలిగారన్న విషయంలో ఎటువంటి సందేహం లేదు!


జీవితాన్ని స్త్రీ దృష్టితో పరిశీలించి వ్యాఖ్యానించానని ఆమె చెప్పుకున్నారు. ఉద్యోగస్థులైన స్త్రీల కుటుంబాలలో భార్యా భర్తలిద్దరూ కలసి పనిచేసుకుంటే స్త్రీలకు భారం తగ్గుతుందని, పిల్లల పెంపకంలో ఇద్దరూ సమాన బాధ్యతలు తీసుకోవాలని ఆమె అన్నారు. చిన్న చిన్న విషయాలను, కొన్ని మనకి తెలుస్తున్నా పట్టించుకోని విషయాలు ఆమె స్త్రీ పాత్రల ద్వారా వివరిస్తుంటే, ఆమెకున్న పరిశీలనాశక్తి అవగతమౌతుంది. ఆమె కథలన్నీ ఉత్తమ పురుషలలో రాశారు. స్త్రీలు తమలోకి తాము తొంగి చూసుకుని మాట్లాడుతున్నట్లనిపిస్తాయి. ఛాయాదేవి స్త్రీవాది. తనదైన పద్ధతిలో, తనదైన పరిధిలో, తనదైన శైలిలో, తనదైన సున్నితత్వంతో కథలు రాసి స్త్రీవాద భావజాల ప్రగతికి దోహదం చేశారు.

(సాహితీ వేదిక, ఢిల్లీ, సమావేశంలో అబ్బూరి ఛాయాదేవి కథాసంకలనం 'తనమార్గం' జూమ్ మీటింగ్లో చర్చకు పెట్టినప్పుడు రాసిన వ్యాసం)

# పరివ్యాప్త



– జాన్ హైడ్ కనుమూరి




పరివ్యాప్త, స్త్రీ సమస్యలను ఒకచోట కూర్చిన కవిత్వ ప్రయత్న సంకలనం. ఇందులో అనేక స్త్రీ సమస్యలు వున్నాయి. భ్రూణ హత్యలు, వరకట్న సమస్యలు, వంధ్యత్వ సమస్యలు, మానసిక క్షోభ – వీటన్నిటిపై స్పందించిన 100 మంది కవులు, కవయిత్రులు వున్నారు. వీరిలో లబ్ద ప్రతిష్టుల నుండి విద్యార్థుల వరకూ వున్నారు. కొత్త, పాత కలయికలతో నాలుగు తరాల కవులున్నారు. కొత్తవారికిది ప్రోత్సాహమే అయినా సమస్యాత్మక అలోచనాధారకు కొంచెం విఘాతం కలిగే అవకాశంవుంది. ఇందులోని కొన్ని కవితలు వివిధ పత్రికలలో ముద్రింపబడినప్పటికీ మొత్తంగా చూసినప్పుడు పత్రికల్లో వచ్చినవి తక్కువే కనిపిస్తాయి.

సంపాదకురాలు వ్యయప్రయాసలకోర్చి ఒక్కచోట చేర్చడం, వాటిని సంకలనంగా తేవడం అభినందనీయం. స్త్రీ సమస్యలు అనగానే పురుష వ్యతిరేకత కాదు అని తనముందుమాటలో చెప్పుకున్నట్టు "మానవీయ స్పర్శ" తో చూడవలసిన అవసరాన్ని తెలియజేసాయి, ఇందులోని కవితలు. ఇంకా ఇందులో స్త్రీ ఔన్నత్యాన్ని చాటిచెప్పే కవితలు, అమ్మగురించి చెప్పే కవితలు, వివిధ సంఘటనలకు స్పందించిన కవితలు, వేదనలు, నిర్వచనాలు, ముందడుగు వేయటానికి స్ఫూర్తినిచ్చే కవితలూ కనిపిస్తాయి.

స్త్రీల సమస్య అనగానే నాకు కొందరు స్త్రీల జీవితాలు గుర్తుకు వచ్చాయి... నాయనమ్మ – వందయేళ్ళనాటి మాట.. మతం మార్పిడి, వెలివేత, దాడులు, వలస, వైధవ్యం, పిల్లలపోషణ, వాళ్ళచదువులు – వీటి వెనుక ఆమె కోల్పోయిన, పొందిన స్వేచ్ఛ.

అమ్మ – చదువు, వివాహం, కానుపుల వెంబడి కానుపులు, తరచుగా బదిలీలు, చాలీచాలని ఆర్థిక వెసులుబాటు – వీటి మధ్య నలిగిపోయిన మనసు స్వేచ్ఛ. అవివాహితలుగా వున్నకొందరు – ఆర్థిక అస్థిరత, ప్రేమ వంచన, సమాజపు సూటిపోటి మాటల మధ్య జీవితం వెళ్ళదీస్తున్న జీవితం గృహనిర్బంధపు జీవితం – ఇల్లు తప్ప బాహ్య ప్రపంచం తెలియకుండా నిర్బంధింపబడిన వాళ్ళు వున్నారు – వాళ్ళు కోల్పోయిన స్వేచ్ఛ.

కొన్ని వేశ్యా జీవితాలు – బలవంతంగా మార్చబడే జీవితాలు, ప్రోత్సాహకంగా మార్చబడే జీవితాలు, మోసపూరితంగా మార్చబడే జీవితాలు, సరదాగా మార్చబడే జీవితాలు, ధనార్జన కోసం మార్చబడే జీవితాలు. నాకు తెలిసిన జీవితాలు వేరొకరికి ఎలా తెలిసాయా అనేది ప్రశ్న. వ్యక్తులు, సందర్భాలు, స్థలాలు మారవచ్చుకాని

సమాజంలోవున్న పరిస్థితులు ఒకేలా వున్నాయనిపిస్తుంది. ఈ కవితల్ని చదువుతున్నప్పుడు తలెత్తే ప్రశ్నలెన్నో! రూపంలో ఎలావున్నా.., ఇంకా స్త్రీ సమస్యలకు నిర్వచనాల్ని వెదుక్కోవడం శోచనీయం.

వీటన్నిటికీ పురుషుడే కారణమా? పురుష ఆధిక్యతే కారణమా? అక్షరాస్యత లోపమా? అజ్ఞానమా? ఇంకా ఏమైనానా?? ఇలా ఎన్నో ప్రశ్నలు, ఆలోచనల్తో బుర్రవేడెక్కుతుంది. మరి అప్పుడప్పుడూ బయటపడే మానసిక వికృత ప్రవృత్తులకు ఏది కారణం? — అలోచించవలసిందే.

నాకు దక్కనిది ఎవ్వరికీ దక్కకూడదనే ప్రవృత్తి విద్య నేర్పే దామోదర్ జ్ఞానాన్ని కప్పివేసింది.

ఇదే రకమైన ప్రవృత్తి మనోహర్ వుదంతం.

వీరికి భిన్నంగా వెలుగుచూసిన వుదంతం, తిరుపతిలో ఉన్నత విద్యాసంస్థలలో బోధనచేసే (పేరు గుర్తురావటంలేదు) స్త్రీ వేశ్యా వృత్తిని ప్రోత్సహించడమే కాకుండా, కేంద్ర బిందువుగా మారటం.

ఇలాంటి పరిస్థితుల్లో స్త్రీకి విద్య ఎంతవరకూ సమస్యల్ని తీరుస్తుంది అనేది సందేహమే. కొందరు బయట పడుతుంటారు. బయటపడకుండా వేధించే వాళ్ళగురించి ఏమిటి?? ఈ విషయాలను, పరిస్థితులను చూస్తున్నప్పుడు లోపం ఎక్కడున్నదనే ప్రశ్న తలెత్తుతూ వుంటుంది. పురుషాధిక్య భావజాలం, స్త్రీ ని భోగ వస్తువుగాను, సంతాన పునరుత్పత్తి సాధనంగానూ మాత్రమే చూడటం — ఇవి ప్రధాన కారణాలు కావచ్చు.

లింగ వివక్షతను అర్థంచేసుకోవటంలోని భావజాలాన్ని మార్చుకోవలసిన అవసరంవుంది. సమాజం లో వేళ్ళూనుకుపోయిన భావ జాలాల దృష్ట్యా చూస్తే కొన్ని రకాల స్త్రీ సమస్యలకు కేవలం పురుషుడే కాదు, స్త్రీ కూడా కారణం అని తోస్తుంది. ఈ కొత్త కోణం నుండి స్త్రీ సమస్యలని పరిష్కరించే దిశగా అడుగులువేయటానికి, ఇప్పటికే నడిచివెళ్ళిన వారి అడుగుజాడలు వెతుక్కోవటానికి ఈ సంకలనం ఉపయోగపడుతుందని, ఉపయోగపడాలని అభిలషిస్తున్నాను.

లోపలిపేజీల్లోకి తొంగిచూస్తే

కలలప్రియదర్శిని (జాన్ హైడ్ కనుమూరి) 120పే "ఆదినుంచి వర్గవర్గాలుగా విభజింపబడ్డ భూమిపై నీ శ్వాస కేర్‌మన్నప్పుడే అవమానం కొండచిలువై మింగాలని ప్రయత్నిస్తోంది మింగలేనప్పుడు ఆశలపండేదో తినేటట్టుచేస్తుంది నడుస్తున్న దేహం వెనుక నీడలా వెంటాడుతుంది"

బహుశ ఈ సంకలనం సారాంశం ఇదే అనిపిస్తుంది. అయితే ఛేదించే మార్గాలు, ప్రయత్నాలు, ప్రయత్నాన్వేషణలు వ్యక్తపరచిన కొన్ని పాదాలను చూద్దాం.

సంఘటనలు: సమయసమయాలలో జరిగే సంఘటనలు కాలపరిస్థితికి, మనోభావానికి అద్దం పడుతుంటాయి. ఆ సందర్భంలో స్పందించి రాసిన కవితలు సామాన్య పాఠకులకు తీవ్రంగా అనిపించినా సమస్య యొక్క తీవ్రతను, తత్వాన్ని తెలియచేస్తాయి.

ప్రతి — ఘటన — జ్వలిత (172పే) తస్లీమాపై దాడి

"పగటి నక్షత్రంలా కవితాక్షర దేహంతో స్వేచ్ఛకోసం చేసే నాదం నీకు అతివాదమయ్యిందా" అని ప్రశ్నిస్తుంది. దుఃఖైర్లాంజి — ఎండ్లూరి సుధాకర్ (159పే) ఖైర్లాంజి సంఘటన

"పైట జారితేనే ఉలిక్కిపడి పాతివ్రత్యానికి భంగం కలిగిందనుకొనే కలనాంగలు కదా! సాటి స్త్రీ స్తనాలను గొడ్డళ్ళతో అడ్డంగా నరుకుతుంటే అడ్డుపడాల్సిందిపోయి తల్లీకూతుళ్ళని కళ్ళెదుటే మానభంగం చెయ్యమని మంత్రాలు పలికిన నోళ్ళతో మద్దతు ఎలా పలికారమ్మా" అని ప్రశ్నిస్తాడు

బాల్స్ ఓన్లీ షుడ్ బౌన్స్ — వంశీ కృష్ణ (156పే) టెన్నిస్ బ్రా మోడలింగ్ టెన్నిస్ తారల దుస్తులపై బాల్స్ బౌన్స్ అనే నినాదంపై చెలరేగిన వివాదానికి స్పందించిన వంశీ కృష్ణ తీవ్రస్వరంతోనే నిరసనను తెలియచేసారు.

"అవున్నిజమే! బంతులు మాత్రమే ఎగరాలి యవ్వనోధృతిలో గర్వపడే ఆ రెండు మాంసఖండాలు మాత్రమే ఎగరాలి .. అంటూ

ఆ రెండూ 'బ్రా'ల మార్కెట్‌ను నూరుశాతం కైవసం చేసుకొనే విక్రయ వ్యూహాలు మాత్రమే! .. అని మార్కెట్ రహస్యాని తెలియచేస్తాడు పదకొండుమంది స్త్రీలు— అరసవిల్లి కృష్ణ (136పే) గిరిజన స్త్రీలపై పోలీసుల అత్యాచారాన్ని నిరసిస్తూ రాసిన కవితయిది.

అస్తిత్వం ఒక ప్రశ్న — దేవదానం రాజు (75పే) ఉత్తర్

ప్రదేశ్ లో సంతాలీ ఆడపిల్లల్ని వేడుక జరిపి చంపేస్తారనే వార్త మిగతా కవితలలో కొన్ని ఇలావున్నాయి

కవులు తమతమ కలాలకు పదుపెట్టాల్సిన సమయం ఆసన్నమైంది ఊరికే మనసులో మధనపడకుండా!

అంటారు శ్రీగిరిరాజు విజయలక్ష్మి(100పే).

మనమిప్పుడు పచ్చినిజాల్ని నిక్కచ్చిగా మాట్లాడుకుందాం... మరింత బహిరంగంగా బరితెగించి విపరీతంగా మాట్లాడుకోవాలి ఈ సందర్భం ప్రకృతి విస్ఫోటిస్తున్న కల్లోలిత దృశ్యాలది....

అని మాట్లాడవలసిన అవసరాన్ని అనిశెట్టి రజిత గుర్తుచేస్తున్నారు.

కనురెప్పల మాటున దాచుకున్న ఉప్పెనలని ఆపి ఆపి గొంతు నరాలు తెగిపోతున్నాయి ఎప్పుడో గుండె పగిలేతీరుతుంది. అంటారు అనామిక (84పే)

ఇపుడున్న సామాన్య స్త్రీల గురించి శిలాలోలిత ఇలా అంటారు

"ఉదయం
అతడు---
ప్యాంటూ చొక్కా తొడుక్కొని వెళ్తాడు
ఆమె
ఇంటిని కూడా తొడుక్కొని వెళ్తుంది
నడుస్తున్న ఇల్లులా వుంటుంది"
...అనగనగా ఓ ఇల్లు (112పే)

ప్రపంచీకరణ నేపథ్యంలో దాంపత్యంకూడా కార్పొరేట్ అయిపోతున్న బాధను జ్వలిత ఇలా వెలిబుచ్చారు

సూర్యచంద్రుల కాపురం
— రాత్రింబవళ్ళ స్నేహం
నాకు సూర్యోదయంతో బతుకుతెరువు
నీకు చంద్రోదయంతో సుఖం కరువు
దాంపత్యానుబంధం అమావాస్య కారుచీకటి
కోరికలను కంట్రోల్‌చేసే రిమోట్ ఐదంకెల వేతనం

–కార్పొరేట్ దాంపత్యం (123 పే)

అమ్మకళ్ళు (46పే) గురించి అందంగా చెప్పిన మెహజబీన్ పదాలు

కలల శాలువాకప్పుకొని
నాన్నతో ఏడడుగులు నడిచినప్పుడు
అమ్మకళ్ళు స్వప్ననిక్షేపాలు

---

అక్షరాలు తెలిసిన అమ్మ
నిర్దాక్షిణ్యంగా గాయపడినప్పుడు
అమ్మకళ్ళు భాషకందని భావాలు.

స్త్రీని మహోన్నత శక్తిగా తనదైన శైలిలో మనముందుంచారు కె. శివారెడ్డి కాంక్షారణ్యంలో (45పే)

"పెద్దపులిలాంటి ఆమె, పుణ్య నదిలాంటి ఆమె
పొగరుమోతు పద్యంలాంటి ఆమె
ఆమె మన తహ తహ మన తపన
తనివితీరని దాహం
మనచేతగానితనాల అవతల మోగుతున్న జేగంట
రాత్రిపగలు రగులుతున్న అగ్నిగుండం
నిప్పుల జడివాన మనల్ని అల్లుకున్న పురాస్మృతి
--- అంటూ

శివుడామె ముందు కూర్చుని
తపస్సుచేస్తున్నాడు
ఒక ప్రాకృతిక జ్ఞానాన్నివ్వమని
శరీరంతో స్వర్గారోహణ
ఎలాచెయాలో చెప్పమని

"పరివ్యాప్తమవుతున్న స్త్రీవాద కవిత్వం" అంటూ కొండేపూడి నిర్మల, "నడిచేదీ నడిపించేదీ పరివ్యాప్త" అని రామాచంద్ర మౌళి సరికొత్త కవితా సంపుటి పరివ్యాప్త అంటూ చేకూరి రామారావు రాసిన పరిచయవాక్యాలు వున్నాయి. స్త్రీ సమస్యలను అర్థంచేసుకొనే నేపథ్యంలో చదవాల్సిన పుస్తకం — దొరుకుచోటు:

అన్నిపుస్తక కేంద్రాలలోను మరియు —

జ్వలిత (విజయకుమారి దెంచనాల)

గవర్నమెంటు ఉన్నత పాఠశాల,

రామవరం, కొత్తగూడెం –507 101.

సెల్ నం. +9989198943

జాన్ హైడ్ గారు రాసిన 'హృదయాంజలి' కవితాసంపుటి

మార్చి 2004 లో మునిపల్లె రాజు గారిచే ఆవిష్కరించబడింది. వీరు రాసిన 'హసీనా', గురజాడ రాసిన 'పుత్తడిబొమ్మ పూర్ణమ్మ' తర్వాత స్త్రీ సమస్యలతో వచ్చిన దీర్ఘ కవిత అని వాడ్రేవు చినవీరభద్రుడు గారి అభిప్రాయం. వీరి 'అలలపై కలలతీగ' కవితాసంపుటి ఫిబ్రవరి 2006లో విడుదలైంది. జాన్ హైడ్ గారి గురించి మరిన్ని వివరాలతో బాటు, వీరు రాసిన కవితలు కొన్ని వీరి బ్లాగులో చూడవచ్చు.

About కనుమూరి జాన్ హైడ్

జాన్‌హైడ్ కనుమూరి రాసిన 'హృదయాంజలి' కవితాసంపుటి మార్చి 2004 లో శ్రీ మునిపల్లె రాజు గారిచే ఆవిష్కరించబడింది. వీరు రాసిన 'హసీనా' గురజాడ రాసిన 'పుత్తడిబొమ్మ పూర్ణమ్మ' తర్వాత స్త్రీ సమస్యలతో వచ్చిన దీర్ఘ కవిత అని వాడ్రేవు చినవీరభద్రుడు గారి అభిప్రాయం.

(నది పత్రిక సౌజన్యంతో)

వ్యాసం

# 'ప్రపంచంలో అత్యంత అందమైన మహిళ'

**సేకరణ : జ్వలిత**



ఆమె మేరీ ఆన్ బెవన్ "ప్రపంచంలోని అత్యంత వికారమైన మహిళ" అని పిలుస్తారు, కానీ ఆమె జీవితం గురించి తెలుసుకుంటే మీరు ఆమెను "ప్రపంచంలోని అత్యంత అందమైన వ్యక్తి" అని పిలుస్తారు. మేరీ ఆన్ 'అక్రోమెగలీ'(acromegaly) అనే వ్యాధితో బాధపడింది, దాని కారణంగా అసాధారణ పెరుగుదలతో ఆమె ముఖం వికృతంగా మారింది. తన భర్త మరణం తరువాత, ఇంట్లో సంపాదించే వారు లేకపోవడంతో, తన నలుగురు పిల్లల అప్పులు చేసింది. ఆర్థిక అవసరాల కోసం, ఆమె అవమానకరమైన పోటీలో పాల్గొనాలని నిర్ణయించుకుంది. "ప్రపంచంలోని అత్యంత వికారమైన మహిళ" అనే అప్రియమైన టైటిల్‌ను గెలుచుకుంది. తరువాత ఆమెను ఒక సర్కస్ వారు ఉద్యోగిగా నియమించుకున్నారు. ప్రజలు నవ్వడానికి మరియు ఆమెను అవమానించడానికి వచ్చేవారు. ఆ విధంగా ఆమె వివిధ నగరాల్లో పర్యటించారు. ఆమె తన పిల్లలను పెంచడానికి మరియు వారికి మెరుగైన జీవితాన్ని అందించడానికి ఇతరుల ఎగతాళిని భరిస్తూ, 1933లో మరణించింది.

ఈ రోజు వరకు, సమాజం వ్యక్తులను వారి శారీరక రూపాన్ని బట్టి తీర్పు ఇస్తుంది, మన కళ్ళు శరీరాలకు బదులుగా ఆత్మలను చూడగలిగితే, మేరీ ఆన్ ప్రపంచంలోనే అత్యంత అందమైన మహిళగా గొప్పగా ఉంటుంది.

(కంగ్లీపాక్ వార్తలు సౌజన్యంతో)

# M C C

**మద్దూరి నరసింహమూర్తి,**
**Mob:9164543253**

మనసుపడి మహానగరంలో మనుగడ మొదలిడిన మధుమతి మనసు మొగ్గలేసినట్టుగా కనబడ్డ ప్రకటన ---

' మీరు ప్రవాసాంధ్రులేనా – అయితే ఈ ప్రకటన మీ కోసమే.

ఈ మహానగరంలో ఇంట్లో పనికి మనిషి దొరకడమే గగనం,

అందునా మన ప్రియతమ తెలుగు భాష మాట్లాడే మనిషి దొరకడం మరీ కష్టం కదా.

కాదు, కానే కాదు.

ఎలా అనుకుంటున్నారా.

క్రిందన ఇచ్చిన మా మొబైల్ నంబర్ కి ఇప్పుడే రింగ్ చేసి మాతో మాట్లాడితే చాలు.

మీరు కోరినప్పుడు మీ ఇంటికి వచ్చి మీతో మాట్లాడి మీ సమస్యని సమసేలా చేయడానికే మేమున్నది.

ఇంకెందుకు ఆలస్యం? మీ మొబైల్ అందుకోండి.

M C C (మెయిడ్ కన్సల్టెన్సీ సెంటర్)

మొబైల్ : 12345 67890 '

చూసిన వెంటనే సంతోషం పట్టలేక భర్త భరత్ ని పిలిచి ఆ ప్రకటన చూపించి M C C వారితో మాట్లాడి ఆ రోజే సాయంత్రం వారిని రమ్మని అహ్వానించింది మధుమతి.

సాయంత్రం వారి ఫ్లాట్ కాలింగ్ బెల్ మోగేసరికి –

మూడు పదులు దాటుతున్న ముద్దులొలికే ముదిత ముచ్చటైన షిఫాన్ చీరెకట్టుతో, వెంట నిలబడిన మరొకతనితో, కనపడేసరికి – ఎవరై ఉంటారన్న అనుమానంతో –

"హుమ్ దు యు వాంట్ మాడం ?" అని ప్రశ్నించింది, మధుమతి.

ఆమె నెమ్మదిగా "మేము M C C నుంచి" అనేసరికి మధుమతి ఆశ్చర్యంతో --

"రండి రండి" అని లోపలికి రమ్మని ఇద్దరినీ కూర్చోమని సోఫా చూపించింది.

ఆమె సోఫాలో కూర్చున్నా, ఆమెతో వచ్చినతను మాత్రం నిలబడే ఉన్నాడు.

అప్పుడు అతనికి వేరే కుర్చీ వేస్తే అందులో కూర్చున్నాడు.

మధుమతి భరత్ ఇద్దరూ మరొక సోఫాలో కూర్చున్నారు.

ఆ వచ్చినామె – "తిన్నగా విషయంలోకి వస్తున్నాను. ఈ మహానగరంలో తెలుగు మాట్లాడే పనిమనిషి మన తెలుగు వారికి అందించే సదుద్దేశంతో మా M C C సంస్థని స్థాపించి ఐదేళ్లుగా విజయవంతంగా నడుపుతున్నాం. నేను ఆ సంస్థలో

ఎగ్జిక్యూటివ్ కన్సల్టెంట్ ని. నా పేరు మనీష. ఇది నా id కార్డు. మీకు ఏ ఏ పనులకోసం పనిమనిషి కావాలి"

"అన్ని పనులు – అంటు గిన్నెలు కడగాలి, ఇల్లు ఊడ్చాలి, తడిబట్ట పెట్టి తుడవాలి, బట్టలుతకాలి, రెండు పూటలా వంట చేయాలి." అని మధుమతి తన మనసులో మాట స్పష్టంగా చెప్పింది.

"గుడ్. కానీ, ఇంటి పనులు చేసిన పనిమనిషితో వంటపని చేయించడం ఆరోగ్యకరం కాదు. అందుకే వంటకి ఒక మనిషిని తక్కిన పనులకి వేరే మనిషిని పెట్టుకోవాలి."

"మా ఆరోగ్యం కోరి మంచి సలహా ఇచ్చేరు. తప్పకుండా అలాగే చేస్తాం, ఏం భరత్"

"అంతేగా మరి" వంత పలికేడు భరత్.

"ఇద్దరూ ఏ ఏ సమయాలలో రావాలి"

"ఇంటి పనులు చేసే అమ్మాయి ఉదయం 8 గంటలు దాటకుండా రావాలి. వంట చేసే అమ్మాయి తొమ్మిది గంటలకి వచ్చి టిఫిన్ ముందుగా చేసి, తరువాత లంచ్ కి వంట చేసి వెళ్ళిపోయి, డిన్నర్ వంటకి రాత్రి 7 నుంచి 8 లోపల వస్తే చాలు"

"వంట చేసే అమ్మాయికి ఇంటి పనులు చేసే అమ్మాయికి చాయి టిఫిన్ ఇవ్వాలి. మీకు సమ్మతమేనా"

"అదొక పెద్ద సంగతా, అలాగే"

"ఇద్దరికీ నెలకు చెరో ఐదేసి రోజులు 'జీతం నష్టం లేని' సెలవు ఇవ్వాలి. ఆ సెలవు ఎప్పుడు కావాలి అన్నది ఎవరికి వారు ఏ నెలకానెల మీకు ముందు రోజు మొబైల్ లో తెలియచేస్తారు."

"దేనికి సెలవు ఇవ్వాలి"

"దేనికేమిటి మధుమతి గారూ, ఆడవారమైన మనం అర్థం చేసుకోవాలి కదా"

"ఓ అదా, సరే"

"వారిద్దరికీ ఇచ్చే నెల జీతాలు ప్రతీనెలా ఐదోతేదీ లోపల ఆన్లైన్ లో మాకే పంపించాలి. ఒక నెల జీతం మాకు అడ్వాన్స్ పేమెంట్ చేయవలసి ఉంటుంది. పనివారు ఎవరేనా అడ్వాన్స్ కావాలని అడిగితే, మీకు ఇవ్వాలనిపిస్తే, మాతో సంప్రదించి మాకే ఆన్లైన్ లో పంపించాలి. మీరిచ్చే అడ్వాన్స్ అమౌంట్ ని బట్టి అది ఎన్ని నెలల్లో సర్దుబాటు అవుతుంది అన్నది ఉంటుంది. ఆ విషయం ఎప్పటికప్పుడు మనం మాట్లాడుకొని ఒక అంగీకారంకి వచ్చిన తరువాతనే అడ్వాన్స్ ఇవ్వాలి. మాకు తెలియకుండా మా అనుమతి లేకుండా వారికి ఎటువంటి అడ్వాన్స్ మీరు నేరుగా ఇవ్వకూడదు. లేనిచో, అలా ఇచ్చే అడ్వాన్స్ కి సంబంధించి మాకు ఎటువంటి బాధ్యత ఉండదు."

"డబ్బు విషయంలో మీ పద్దతి చాలా బాగుంది, ఏం భరత్"

"అంతేగా మరి" మధుమతి మాటకి మరోసారి వంత పలికేడు భరత్.

"మీకు చెప్పడం మరచిపోయేను. ఇంట్లో ఉన్న 3 బాత్ రూమ్స్ వారంకి ఒకసారి క్లీన్ చేయాలి."

"అబ్బే కుదరదండీ" అని నిర్మొహమాటంగా చెప్పింది మనీష.

"అదేమండీ"

"బాత్రూం క్లీన్ చేసిన చేతితో వంట గిన్నెలు కడిగితే అనారోగ్యం కదండీ. మా కస్టమర్ ఆరోగ్యం మాకు చాలా ముఖ్యం"

"పనంతా చేసిన తరువాత బాత్రూం క్లీన్ చేస్తే సరిపోతుంది కదండీ"

"ఆరోజు మీ ఇంటికి సంబంధించినంతవరకూ నిజమే. కానీ అదే మనిషి తరువాత మరో ఇంటికి వెళ్లి పని చేయాలి కదా. అదేవిధంగా ఇంకో ఇంట్లో బాత్రూం క్లీన్ చేసి వచ్చి మీ ఇంట్లో వంట గిన్నెలు కడిగితే మీకెలా ఉంటుంది, ఒకసారి ఊహించుకోండి.

ఒక్కసారి ఒళ్ళంతా కంపరం వచ్చినట్టై మధుమతి "మీరు చెప్పినది నిజమే"

"అందుకే, బాత్రూం క్లీన్ చేసే పనికి వేరే మనిషిని పంపిస్తాం"

"సరే"

"మీరు సరే అంటే, మీ ఇంటి గదుల కొలతలు తీసుకుంటాడు మావాడు."

"ఎందుకండీ"

" క్లీనింగ్ విషయంలో స్క్వేర్ ఫీట్ కి ఇంత అని నిర్ణయించబడ్డ మా రేట్ ప్రకారం, ఆ కొలతల బట్టి మీరు ఎంత పే చేయాలి అన్నది ఉంటుంది"

"అలాగా, భరత్ నువ్వు అతన్ని తీసుకొని వెళ్ళు"

"తోమడానికి మీరు గాజు సామాను వేయకూడదు"

"ఏమండీ"

"గాజు సామానులు పగిలి విరిగిపోయే ఆస్కారం ఉంది కదా. అలా జరిగితే మీకెంత నష్టం. మీకు నష్టం కదా అని పనిమనిషి జీతంలో కట్ చేస్తామంటే వారికెంత కష్టం. అందుకే. పైగా, అవి విరిగి మీకు కానీ పనిమనిషికి కానీ దెబ్బలు తగిలితే ప్రమాదకరం కదా. ఏమంటారు"

"నిజమే, మీరు చెప్పినట్టే చెస్తాంలెండి"

"చలి కాలం గిన్నెలు కడగడానికి వేడి నీళ్లు ఏర్పాటు చేయవలసి ఉంటుంది"

"ఓకే"

"బట్టలు ఉతకడానికి వాషింగ్ మెషిన్ ఉంటే, పనిమనిషి మీ ఇంటికి రాగానే ముందుగా బట్టలు వాషింగ్ మెషిన్ లో వేసి, తక్కిన పనులు అయిపోయిన తరువాత బట్టలు ఆరవేసి వెళ్ళిపోతుంది. ఎంత ఫుల్ ఆటోమేటిక్ వాషింగ్ మెషిన్ అయినా బట్టలు గాలికి ఆరవేయాలికదా"

"మాకు వాషింగ్ మెషిన్ ఉంది గానీ, అది సెమి ఆటోమేటిక్"

"అలాగైతే, మీరు ఫుల్ ఆటోమేటిక్ వాషింగ్ మెషిన్ కొనుక్కోవాలి. అంతవరకూ, పనిమనిషి బట్టలు ఉతకదు."

"పనిమనిషి బట్టలు ఇస్త్రీ చేస్తుంది కదా"

"మీ బట్టలు ఇస్త్రీ కూడా చేయాలంటే వేరే ఖర్చు అవుతుంది. ఇస్త్రీ చేవలసిన బట్టల వివరాలు ఏరోజుకారోజు పనిమనిషి మాకు పెట్టే మెసేజ్ ద్వారా వాటికి మీరు ఎంత పే చేయాలో తెలియచేస్తాం. మీరు ఆన్లైన్ లో మాకు పే చేయగానే, పనిమనిషికి మేము మెసేజ్ ఇస్తాం. ఆమె ఇస్త్రీ చేసేస్తుంది."

"బాగుందండీ"

"అలాగే"

"మీ ఇంట్లో CC TV కెమెరాలున్నాయా"

"లేవండీ"

"మీరు అవి పెట్టుకున్న తరువాతనే మేము పనిమనుషులని ఏర్పాటు చేసేది"

"ఎందుకండీ అలాగ"

"ఎప్పుడేనా మీ ఇంట్లో ఏదేనా వస్తువు పోతే ముందుగా పనిమనిషిని అనుమానిస్తారు కదా. అదే CC TV కెమెరాలు ఉంటే నికార్సైన నిజం తెలిసిపోతుందికదా."

"బాగా చెప్పేరు. "మీరు చెప్పవలసినది మేము తెలుసుకోవలసినది ఇంకా ఏమేనా ఉందా"

"మా ప్రమేయం లేకుండా మీరు మన తెలుగు భాష మాట్లాడే పనిమనిషిని పెట్టుకోలేరు. ఎందుకంటే, ఇక్కడికి సుమారు 50 కిలోమీటర్ల పరిధిలో ఉన్న పనిమనిషిలందరూ మా దగ్గర రిజిస్టర్ అయినవారే. కాబట్టి వారెవరూ మీరు పిలిచినా మాకు తెలియకుండా రారు, రాలేరు."

"మీ వాడు కొలతలు తీసుకొని వచ్చినట్టున్నాడు."

"మేము మా ఆఫీస్ కి వెళ్లి మీకు మా ధరల ప్రకారం పనిమనిషికి ఎంత అవుతుందో, వంట మనిషికి ఎంత అవుతుందో, బాత్రూం క్లీన్ చేసే మనిషికి ఎంత అవుతుందో వివరాలన్నీమీ మొబైల్ కి వాట్సాప్ లో పంపిస్తాం. మీరు మా ఆఫర్ కి సరే అంటే, మాకు 'ఓకే' అని మెసేజ్ పెట్టండి. నేను వచ్చి అగ్రిమెంట్ చేసుకుని అడ్వాన్స్ పేమెంట్ తీసుకొని మరునాటి నుంచి మీకు కావలసిన పనులకి మనుషులని పంపిస్తాను. ఆ పనిమనిషుల వివరాలు id ప్రూఫ్ తో సహా మీకు వాట్సాప్ లో పంపిస్తాం. వచ్చిన పనిమనిషి id మీరు చెక్ చేసుకొని పనిలో పెట్టుకోవచ్చు"

"మీరు వెళ్లి మీ ఆఫర్ వివరాలు పంపించండి. CC TV కెమెరాలు పెట్టించి ఆటోమేటిక్ వాషింగ్ మెషిన్ కొనుక్కొని మీకు ఫోన్ చేస్తాను."

"మా ఎక్సలెంట్ సర్వీస్ కి ఉదాహరణ – ఇంతసేపూ మనమధ్య జరిగిన కన్సల్టేషన్ కి, మేము ఫీజ్ ఏమీ తీసుకోవడం లేదు. వస్తానండీ. ఎప్పుడూ మీ సేవలో M C C"

వారు కనుమరగవగానే తలుపు ధభీమని వేసిన మధుమతి

"భరత్ ఈ మహానగరంలో పనిమనిషులకే మన జీతం అంతా సరిపోయేటట్టుంది. లేదంటే ఆ పనులన్నీ నేనే చేసుకోవాలి. మరో చిన్న ఊరికి పోతే, తక్కువ ఖర్చుతో అన్ని పనులూ చేసే మనుషులు దొరక్కపోరు. మనం వెంటనే ఈ ఊరినుంచి బదిలీ చేయించుకొని వెళ్లిపోదాం. ఏమంటావు"

"అంతేగా మరి" అంటూ భరత్ ఇప్పుడు కూడా వంత పాడేడు.

వ్యాసం

# అసలేమి జరుగుతుంది

డాక్టర్ విరించి విరివింటి

మొన్న ఒక వీడియో చూశాను. మీదకు దూకబోతున్న పులిని చూసిన జింక అప్పటికప్పుడు చనిపోయినట్టు నటించడం మొదలు పెట్టింది. పులి కొద్దిగా నిరాశపడి వెనుకడుగేయగానే..ఆ జింక చప్పున లేచి పరిగెత్తి పోయింది. ఇది జంతువలలో ఉండే వివిధ రకాల protective mechanisms లో ఒకటి. అడ్రినల్ హార్మోన్ ఫ్లైట్ అండ్ ఫైట్ రెస్పాన్స్ ను కలిగించి తిరగబడటానికీ, పారిపోవడానికీ జీవికి అమిత శక్తిని కలిగిస్తుందని మనకు తెలుసు. ఐతే పోరాడలేని పారిపోలేని పరిస్థితి ఉందని తెలిసినప్పుడు జంతువులు చనిపోయినట్టు నటించి శత్రువు దృష్టి మరలించి పారిపోవడం ఒకటుంది. ఐతే నిజంగా అవి నటిస్తున్నాయని అనుకోడానికి కూడా లేదు. ఉదాహరణకు, టైగర్ షార్క్ ల గడ్డం మీద ఉండే ampullae of Lorenzini అనే సెన్స్ ఆర్గాన్స్ శత్రువు కండరాల కదలికలోని ఎలెక్ట్రిసిటీ ని గ్రహిస్తాయి. శత్రువు అటాక్ చేయబోతోందని తెలియగానే ఈ సెన్స్ ఆర్గాన్స్ activate అయ్యి షార్క్ ని వెంటనే స్థాణువులా నిలిపేస్తాయి. అంటే అది ఒక రకంగా paralyse ఐపోతుంది. దీనిని tonic immobility అంటారు. సీ డైవర్స్ షార్క్ చేపలను పట్టుకోవాలి అంటే ఈ ampullae of lorenzini ని చేతితో రుద్దడం చేస్తారు. క్షణాలలో అది కదలలేని స్థితిలోకి వెళ్ళిపోతుంది. ఆ స్థితిలో అది దాదాపు  అర్థ గంట ఉండిపోతుంది.

ఐతే మనుషుల్లో కూడా ఈ tonic immobility లేదా involuntary paralysis అనేది ఉంటుందని ఈ మధ్య స్వీడన్ లో జరిగిన ఒక పరిశోధనా పత్రం అక్కడి ఆబ్స్టెట్రిక్స్ గైనకాలజీ జర్నల్ లో పబ్లిష్ అయింది. ఈ పరిశోధన ఎందుకు చాలా ముఖ్యమైనది అంటే...ఈ పరిశోధన రేప్ విక్టిమ్ లపై జరపబడింది. కాబట్టి రేప్ అనే ఒక భయంకరమైన సన్నివేశానికి సంబంధించిన కీలకమైన అంశాలను అది వివరించడమే కాక రేప్ చుట్టూ పేరుకుని ఉన్న కొన్ని అపోహలను తొలగించింది. తద్వారా రేప్ పై ఉండే న్యాయపరమైన డెఫినిషన్ ని కూడా మరో సారి సరిచూసుకోవాల్సిన అవసరం ఉందని నొక్కి చెబుతుంది. రేప్ జరుగుతున్నప్పుడు సాధారణంగా ఉదయించే ప్రశ్నలు..1. ఆ అమ్మాయి గట్టిగా అరిచిందా? అరవడం ద్వారా ఇతరులకు తెలియజేయవచ్చు కదా?.2. తన కాళ్ళతోనో చేతులతోనో శత్రువును కొట్టి గట్టిగా ప్రతిఘటించే ప్రయత్నం చేసిందా?. 3. లొంగతీసుకోవడానికి శత్రువు దగ్గర ఆయుధం లేనప్పుడు ఆమెకు ఫైటింగ్ చేయడం వచ్చినపుడు ఎగిరి తన్నవచ్చు కదా.. ఎందుకు చేయలేకపోయింది?.


వీటన్నింటికీ సమాధానం “ లేదు “ అని వస్తుంది. అదేంటి తను అరవడం కూడా చేయలేదంటే ఆ అమ్మాయికి ఇష్టం ఉన్నట్టే కదా!? అనే అర్థం లేని లాజిక్ ఉదయిస్తుంది. కోర్టు లో రేపిస్ట్ తరపున వాదించే వాడు ఆ అమ్మాయి పెనుగులాడ లేదు..కనీసం అరవనుకూడా అరవలేదు కాబట్టి ఆమెకు ఇష్ట పూర్వకంగానే పాల్గొని తరువాత కక్ష కట్టిందని వాదించే అవకాశం ఉంది. ముఖ్యంగా శత్రువు ఆ అమ్మాయికి తెలిసిన వాడే ఐనప్పుడు ఇలాంటి వాదనలు వినిపిస్తాయి. కోర్టు విషయం పక్కన పెడితే..విక్టిమ్ ఐన అమ్మాయిలు కూడా “ ఎందుకు ఆ సమయంలో మేము ప్రతిఘటించలేదు..ఎందుకు అరవలేదు...ఎందుకింత పిచ్చి పని చేశాం...అరిచి ఉండింటేనో లేదా ప్రతిఘటించి దాఢి చేసి ఉండింటేనో నా జీవితం మరోలా ఉండేది కదా!.” అని బాధపడుతూ డిప్రెషన్ లోకి PTSD లోకి లోనవుతూ ఉంటారు.  ఈ అపోహలన్నింటికీ ఈ జర్నల్ లో పబ్లిష్ ఐన సమాచారం సమాధానం ఇస్తుంది. ఏంటి అంటే... రేప్ చేయబడుతున్నప్పుడు ఆ అమ్మాయిలు అకస్మాత్తుగా tonic immobility కి లోనౌతారని గుర్తించడం జరిగింది. దాదాపు 300 మంది రేప్ విక్టిమ్ ల మీద పరిశోధన చేసినపుడు 75 శాతం మంది ఈ tonic immobility లేదా involuntary paralysis ని అనుభూతి చెందారని తేలింది. అంటే శత్రువు రేప్ చేయడానికి బలాఢ్యుడై మీద పడుతున్నప్పుడు ఆ అమ్మాయిలు అకస్మాత్తుగా శక్తి హీనులై పోవడం, కండరాల

నిస్సత్తువ ఆవహించి చేతులు కాళ్ళు కదపలేకపోవడం, అరవడానికి గొంతు పెగలలేకపోవడం శరీరమంతా స్పర్శ లేనట్టు అనుభూతి చెందడం జరుగుతుందని రూఢీ అయింది. శత్రువు అటాక్ చేస్తున్నప్పుడు అడ్రినల్ గ్రంథి తో పాటు బ్రెయిన్ లోని కొన్ని ఒపియాయిడ్ రిసెప్టర్లు యాక్టివేట్ కావడం...తద్వారా మనిషికి అనెస్థీషియా ఇచ్చినట్టు కండరాల నిస్సత్తువ, చలనం లేని స్థితి రావడం జరుగుతుంది. ఇంతకుముందు చెప్పుకున్నట్టు జంతువులలో కనిపించే నటన కావొచ్చు..లేదా చేపలలో లోరింజినీ బుడిపెలు కావచ్చు అవి వాటికి శత్రువునుంచి రక్షణ ఇస్తున్నాయేమో కానీ భయంకర పరిస్థితికి మనిషిలో వచ్చే ఈ రియాక్షన్ మనిషికి హాని కలిగించేదిగా ఉంది. మనిషిలో ఈ రెస్పాన్స్ ఎందుకు వస్తుందనేది ఇంకా మెడికల్ సైన్సు కు అర్థం కాలేదు. ఇది పరిణామంలో ఏ కారణం చేత మనుషులలో ఇంకా నిలిచి ఉన్నదనే విషయం కూడా ప్రస్తుతానికి అర్థం కాలేదు. కానీ రేప్ సమయంలో విక్టిమ్( అమ్మాయి కావచ్చు లేదా అబ్బాయి కావచ్చు) లలో వచ్చే ఈ సడెన్ రెస్పాన్స్ వారిని ప్రతిఘటించనీయకుండా, కనీసం గొంతెత్తి సహాయం కోసం అరవనీయకుండా చేస్తున్నదని ఈ పరిశోధన వలన తేలింది.

మరో ముఖ్యమైన అంశం – అమ్మాయిల డ్రెస్సింగ్ విధానం గురించి. ముఖ్యంగా ఈ డ్రెసింగ్ కీ రేపులకూ సంబంధం లేదనో ఉందనో వాదనలు జరుగుతూ ఉంటాయి. సాంప్రదాయ వాదులు అమ్మాయిలు మంచి డ్రెస్ వేసుకుంటే రేప్ లు తగ్గుతాయని వాదిస్తే ఇతరులు దానిని ఖండిస్తూ...డ్రెస్ ఎలా వేసుకున్నా మగవాడి బుద్ధి బాగుండాలని వాదించడం చూస్తుంటాం. ఐతే ఇలాంటి వాదనలకు కూడా సైంటిఫిక్ స్టడీస్ ఉన్నాయి. ముఖ్యంగా మగవాళ్ళు ఆడవారి సెక్సువల్ ఇంటెరెస్ట్ ని ఎలా మిస్ రీడ్ చేస్తారనేది ప్రధానమైన అంశం. ఒక అమ్మాయి మామూలుగా నవ్వుతూ మాట్లాడినా గానీ దానిని సెక్సువల్ ఇంట్రెస్ట్ గా మిస్ రీడ్ చేయడం జరుగుతుందని పరిశోధన చెబుతోంది. ఈ పరిశోధనలో యువకులకు వివిధ రకాల యువతుల ఫోటోలు చూపి వీరిలో ఎవరెవరు సెక్స్ కు ఎక్కువగా సంసిద్ధత వ్యక్త పరుస్తారు...ఎవరెవరు పూర్తిగా ప్రతిఘటిస్తారో ఊహించమని అడిగారు. గ్రేడింగ్ కూడా పెట్టారు. ఎక్కువ సంసిద్ధత 10 మార్కులనుకుంటే తక్కువ సంసిద్ధతకు పదికంటే తక్కువ మార్కులు. ఎక్కువ ప్రతిఘటన కు –10 మార్కులైతే తక్కువ ప్రతిఘటనకు –10 కంటే తక్కువ మార్కులు.

ఈ అబ్బాయిలను ముందే ప్రశ్నల ద్వారా ఎవరెవరు రేప్ చేయడం తప్పు కాదు అనే ధోరణిలో ఉన్నారో అడిగి తెలుసుకున్నారు. ఐతే సమాధానాలలో రెండు రకాల ధోరణులు కనబడ్డాయి. ఒకటి affective cues రెండోది non- affective cues. అంటే అమ్మాయిలు చూసే చూపు కూర్చునే విధానమూ ఇత్యాది వాటి ఆధారంగా వాళ్ళు సెక్స్ పట్ల సుముఖతతో ఉన్నారని చెప్పడం affective cues. అలా కాకుండావాళ్ళ అందం ఆధారంగా వాళ్ళు వేసుకున్న డ్రెస్ ఆధారంగా వాళ్ళు సెక్స్ పట్ల సుముఖత కలిగి ఉన్నారని చెప్పడం non affective cues. మొదటి దానివలన ఇబ్బంది లేదు. ఎందుకంటే వాళ్ళ సుముఖతనూ లేదా విముఖతనూ వాళ్ళ ముఖ కవళికల ఆధారంగా బాడీ లాంగ్వేజ్ ఆధారంగా నిర్ధారణ జరిగింది కాబట్టి. కానీ రెండవ రకం ధోరణి వలన సెక్స్ పట్ల సుముఖత్వాన్ని ఓవర్ ఎస్టిమేట్ చేయడం జరిగింది. ఐతే ఇక్కడ ముఖ్యమైన విషయం ఏమంటే రేప్ చేయడం తప్పు కాదు అనే ఊహతో ఉన్న అబ్బాయిలే ఈ non affective cues ధోరణిని వ్యక్తపరిచారట. వారికి కొంత కౌన్సిలింగ్ ఇచ్చిన తరువాత కూడా వారి ధోరణిలో మార్పు రాలేదన్నది ఈ పరిశోధన సారాంశం. ఈ పరిశోధనలో ఎన్నో లిమిటేషన్స్ ఉన్నా...వ్యక్తుల mis reading of opposite sex ని కొంత చర్చించిందని ఒప్పుకోవాలి. ఎందుకంటే సమాజంలో అందరిలో చైతన్యం ఒకే రీతిగా ఉండదు. వారి వారి పెంపకం కావచ్చు, ఆల్కాహాల్ వంటి చెడు అలవాట్లు కావచ్చు, లేదా రేప్ చేసేటప్పటి సానుకూల పరిస్థితులు కావచ్చు( చిన్న పిల్లలు.. లేదా ఒంటరి మహిళలు..శక్తి హీనులు..రాత్రి ఎవరూ లేని సమయమూ ఇత్యాదివి) అవన్నీ కూడా non affective cues ని ప్రోది చేసి opposite sex interest ని misread చేసి శత్రువుకు బలాన్ని ఇస్తాయి. హింసను ప్రేరేపిస్తాయి. పైన స్టడీ లో చెప్పినట్టు కౌన్సిలింగ్ వంటివి ఈ ధోరణులమీద పెద్దగా ప్రభావం చూపవు కాబట్టి సమాజం ఎటుపోతుంది అని బాధపడే బదులు సమాజంలో భిన్న వ్యక్తులు వారి ఊహలు అవకాశాలు సానుకూలతలూ ఇత్యాది వాటన్నింటితో పాటు విక్టిమ్ అనుభవించే tonic immobility తో కూడా కలిపి “రేప్” అనే ఒక భయంకర సన్నివేశాన్ని భరించరాని హింసాత్మకత వైపు ప్రభావితం చేస్తాయి అని తెలుసుకోవడం అత్యవసరం.

# బాల బహుళ







Sanvi Kalitha



మా మనవరాలు ఆరాధ్య ఎండాకాలం సెలవుల్లో వేసిన ఈ చిత్రాన్ని చూసి 'ఆ గుట్టను ఎందుకు ఇలా సమానం కట్ చేసి దించినవురా' అని అడిగాను, 'మనం హనుమకొండ నుంచి వస్తుంటే గుట్టలను కట్ చేసి కనపడ్డాయి కదా తాత, ఆ గుట్టల వక్కలన్నీ లారీల్లో తీసుకుపోతున్నారు కదా అందుకే అక్కడ కనపడ్డట్టు దించిన' అన్నది. నాకు నోట్లె మాట రాలేదు. 'అగో అందుకే ఆ సూర్యుడు కొండలు తవ్వుతున్నారని ఏడుస్తున్నాడు. ఆ గుట్టల పక్క చుక్కలు కన్నీళ్లు. అయినా రెయిన్బో వస్తుంది గదా తాత' అన్నది. నేను నిజంగానే షాక్ అయిన. గ్రైనేట్ కోసం కొండలు గుట్టల విధ్వంసం కొనసాగుతుంది. నేను 2013లో రాసిన కవిత గుర్తొచ్చింది. –ప్రముఖ కవి అన్నవరం దేవేందర్



N. Aaradhya
6th Class
St Joseph School
Habsiguda,
Hyderabad

## హాయ్ ఫ్రెండ్స్ నేను శ్రేష్ఠసాయి..



నేను మీతో నా గురించి నాకు నచ్చిన మాటలు కొన్ని చెప్తాను వింటారా.. నాకు ఈ వేసవి సెలవులు అంటే 2023 మే నెలంతా స్పెషల్ గా గడిచింది. నానమ్మ తాతయ్య హైదరాబాద్ నుండి వైజాగ్ మా ఇంటికొచ్చారు. మా ఫ్రెండ్ హనీ వాళ్ళఫామిలీ, అమ్మమ్మ మేమంతా కలిసి, మొదటి రెండు వారాలు కన్యాకుమారి నుండి కోణార్క వరకు చాలా చాలా చూసొచ్చాం. దాని గురించి చాలా విషయాలు తర్వాత రాస్తాను. ఆ తర్వాత నేను నానమ్మ తాతయ్యతో హైదరాబాద్ వెళ్ళాను. మళ్ళీ అక్కడ నుండి బెంగళూరులో ఉన్న బేబత్త దగ్గరికి వెళ్ళాను. అక్కడ మా చందన్ మామ ఫినిక్స్ మాల్ కు చూపించారు. అందులో మా కజిన్స్ శ్లోక్, సాన్విలతో ఆడుకున్నా.

నేను మొదటిసారి అమ్మనాన్న తోడులేకుండా ఓ వారం గడిపాను. ఇప్పుడు నేను ఆరు నుండి ఏడవ తరగతికి వచ్చాను. స్కూలు కూడా మారాను ఈ సంవత్సరం. సెలవుల్లో కూడా తెలుగు పాఠాలు చదివించింది నానమ్మ. మొదటి పాఠం నాకు బాగా నచ్చింది అదొక కవిత. అది 'అక్షరం' అనే పాఠం రావినూతల ప్రేమకిషోర్ అనే కవి రాసింది. కవిఅందులో అక్షరాలు నేర్పిన అమ్మ గురించి చదువు గురించి బాగా చెప్పారు. చదువు లేకపోతే ఏమీ చేయలేము. చదువు అంటే డబ్బుల సంపాదన ఉద్యోగం చెయ్యడమే కాదట, నలుగురికి ఉపయోగపడేలా బతకడమట నానమ్మ చెప్పింది. అందుకే నేను కూడా బాగా చదువుకొని డాక్టర్ అవుతాను. డాక్టర్ కావాలంటే బాగా కష్టపడాలట. ఈరోజు మా నాన్న నన్ను వైజాగ్ తీసుకెళ్ళడానికి బెంగళూరుకు వస్తారు. మీమిద్దరం విమానంలో వైజాగ్ తిరుగి వెళ్తాము.

ఫ్రెండ్స్ మీరు కూడా సెలవుల్లో ఏమి చేశారో రాయండి.. మరి ఉంటాను..


మీ

శ్రేష్ఠసాయి


# కొత్త పుస్తకాలు




'బహుజన మహిళా కళాలు'
చంటి ప్రసన్న కేంద్రం ప్రచురణలు,
మే 2023.
వెల: 261/-
ప్రతులకు: zeevajata@gmail.com
+917780740694




'స్వయం సిద్ధ'
(ఒంటరి మహిళల జీవనగాథలు)
హస్మిత ప్రచురణలు,
మే 2023.
వెల: 200/-
ప్రతులకు: బండారు
విజయ:8801910908
పి. జ్యోతి:9885384740




'నల్ల సూరీడు'
రచన : రోహిణి వంజారి
వెల: 200/-
ప్రతులకు సంప్రదించవలసిన
నెంబర్:9000594630


Printed at JD Publications, Hyderabad

Price : 100/-